మంగళవారం 13-1-2026

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 293
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

అత్తవారింటికి వచ్చే కొత్త అల్లుళ్ళు,
ఇంటి ముందు అంత ఎత్తున ఎగసే
భోగి మంటలు.
బొమ్మల కొలువులు, పేరంటాలు...
సంక్రాంతి సందడి వర్ణనాతీతం.
ఇంటింటా భారీ పిండి వంటలు,
పండగ నాడు అవన్నీ పంచటాలు
అబ్బో ఊపిరి సలపనంత సందడి.
ఇక ఊరంతా ముగ్గుల తివాచీలే.
సంక్రాంతి పండుగ సందర్భంగా
ప్రముఖ రచయిత్రి
పొత్తూరి విజయలక్ష్మి
పంచుకుంటున్న జ్ఞాపకాలు.

ఏఐ చిత్రం

సంక్రాంతి సంబరాలు

పెద్ద పండగొచ్చింది

పొత్తూరి విజయలక్ష్మి

పండుగలు ఎన్ని ఉన్నా సంక్రాంతి పండుగ ప్రత్యేకతే వేరు. పెద్ద పండుగ సంక్రాంతి.

అప్పట్లో అంటే 60 ఏళ్ల కిందట సంక్రాంతి వస్తుంది అంటే అందరికీ సంబరం. ఆ రోజుల్లో అందరివీ వ్యవసాయం మీద ఆధారపడిన కుటుంబాలు. సంక్రాంతి అంటే పంట ఇంటికి వచ్చే సమయం. ఆ రోజుల్లో ప్రకృతి వైపరీత్యాలు వచ్చి చేతికి వచ్చిన పంట ఏ వర్షం వల్లనో నాశనం అయిపోవటం లేదు కాబట్టి అందరికీ వారు పడ్డ కష్టానికి శ్రమ చేతికి అందే సమయం.

అందరి చేతిలోనూ డబ్బులు ఆడే ఆ సమయంలో బుడబుక్కల వాళ్ళు, గంగిరెద్దుల వాళ్లు, హరిదాసులు వచ్చేసేవాళ్ళు. ఏదో ఒక ఊరిలో బస చేసి రెండు మూడు గ్రామాలు చుట్టపెట్టుకునేవాళ్ళు. ఒక రోజు రెండు రోజులు కాదు సుమారు నెలరోజులు వారి సంచారం ఉండేది. ప్రతి వీధిలో తెల్లవారు జాము నుంచి ముగ్గుల సందడి. ఊరి మొత్తం తివాచీ పరిచారా అన్నట్లు ప్రతి ఇంటి ముందు ముగ్గులే. వాటికి మరింత సొబగు నద్దుతూ గొబ్బిళ్ళు.

పెద్ద పండగకు పిల్లా పెద్దా అందరూ కొత్త బట్టలు కుట్టించుకోవడం ఆనవాయితీ. పల్లెటూర్లలో పదిమంది ఉన్న ఉమ్మడి కుటుంబాల వారి కొత్త బట్టల సరదా ప్రత్యేకంగా ఉండేది. అలవాటుగా బట్టలు కుట్టే దర్జీ మిషన్ తీసుకుని వచ్చి వీళ్ళ వరండాలో తిష్ట వేసేవాడు. అక్కడే బట్టలు కుట్టటం.

అత్తవారింటికి వచ్చే కొత్త అల్లుళ్ళు, వాళ్లకు భోగి పండగ రోజున నూనె అంటి స్నానం చేయించే ఇంటి పని వాళ్ళు. ఇంటి ముందు అంత ఎత్తున ఎగసే భోగి మంటలు. భోగి పండ్లు, బొమ్మల కొలువులు, పేరంటాలు. ఆ సందడి వర్ణనాతీతం. ఇంటింటా భారీ ఎత్తున తయారు చేసే పిండి వంటలు, సంక్రాంతి పండగ నాడు అవన్నీ పనివారికి పంచటాలు... అబ్బో ఊపిరి సలపనంత సందడి.

మిగిలిన అన్ని పండుగల కంటే సంక్రాంతికి మరొక ప్రత్యేకత కనుమ. పశువుల పండగ. ఏడాది పొడుగునా తమకు వ్యవసాయంలో సాయం చేసిన పశువులకు కృతజ్ఞతగా జరిపే పండుగ. పశువులను చెరువుకు తీసుకు వెళ్లి శుభ్రంగా కడిగి తీసుకువచ్చి పసుపు కుంకాలతో, గులాం రంగులతో మెడ పట్టెడలు కొమ్ములకు మువ్వలు కట్టి అలంకరించి ఎంతో ప్రేమతో చేసేవారు పశువుల పండుగ.

కాలక్రమేణ కొంత మార్పు వచ్చినా ఈనాటికి ఎంతో ప్రత్యేకత కలిగి ఉన్నది సంక్రాంతి. ఈ నాటి పద్ధతి ప్రకారం గుండు సూది మొదలుకొని కారు వరకు, అన్ని వస్తువుల మీద సంక్రాంతి సేల్. ఆకర్షణీయమైన ఆఫర్లు. ఎవరి ఇంటి ముందు వారు ముగ్గు వేసుకోవటంతో సరిపెట్టకుండా ఎంతో మంది ప్రముఖులు పెద్దపెద్ద మైదానాలలో భారీ ఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించి ఘనంగా బహుమతులు అందజేస్తున్నారు. ప్రతి ఊళ్లోనూ ప్రతి కూడలిలోనూ ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి భోగి మంటలు.

గాలిపటాలతో ఆకాశం కొత్త అందాలు సంతరించుకుంటోంది. సంప్రదాయ వంటకాలు రకరకాలు ఇక్కడ తయారై తాజాగా అమెరికా దేశంలో ఉన్న తెలుగువారి కోసం ఆకాశమార్గాన ఎగిరి పోతున్నాయి. గొప్ప వారి కోసం ప్రత్యేకంగా జరిగే కోడిపందాలలో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి.

పండగకు ముందే భాగ్యనగరం నుంచి సగం మంది సొంత ఊర్లకు ప్రయాణం కట్టడంతో పంతంగి టోల్ గేట్ దగ్గర భారీ ట్రాఫిక్ జామ్ సంక్రాంతి పండగలో ఒక భాగం అయిపోయింది. అప్పట్లో చదువులు ఇంత భారంగా ఉండేవి కాదు కాబట్టి సంక్రాంతి పండుగకు బోలెడన్ని సెలవులు ఇచ్చే వాళ్ళు. ఇప్పుడు ఆ సంఖ్య బాగా తగ్గిపోయింది. కాని నగరంలో ఇప్పటికీ కాలనీలలో గంగిరెద్దు వాళ్ళు వస్తూనే ఉన్నారు. ఇప్పుడు అన్ని లావాదేవీలు ఫోన్ ద్వారానే కాబట్టి గంగిరెద్దు మొహాన స్కానర్ తగిలించి తీసుకువస్తున్నారు. ఏళ్లు గడిచినా, తరాలు మారినా సంక్రాంతి పండుగ వైభవం మాత్రం తగ్గలేదు. ఈనాటికీ పెద్ద పండుగ సంక్రాంతి.

ఇక సంక్రాంతి పండుగ విషయంలో నాకు మాత్రమే సంబంధించిన ఒక జ్ఞాపకాన్ని మీతో పంచుకుంటాను.

అప్పుడు నేను సెకండ్ ఫామ్ అంటే ఇప్పటి ఏడవ తరగతి చదువుకుంటున్నాను. సంక్రాంతి సందర్భంగా వ్యాసం రాయమన్నారు. ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. మొదటి నుంచి నాకు కొంచెం అత్యుత్సాహం. మామూలుగా గొబ్బెమ్మలు, బొమ్మల కొలువులు అన్నీ రాసిన తరువాత ఏదైనా కొత్తగా రాయాలి అనిపించింది. 'సంక్రాంతికి శంకరుడు సంక్రమణమున ప్రవేశించును' అని రాశాను. మా తెలుగు టీచర్ గారు వేరే మతస్తులు. నేను రాసిన విషయం ఆవిడకి తెలియక మరి కొంతమంది టీచర్లని అడిగారుట. అందరూ ఏమో మాకు తెలియదు అని అన్నారుట. చివరికి అందరూ కలిసి సూర్యుడు మేషరాశి అందు ప్రవేశిస్తాడుగానీ శంకరుడు సంక్రమణమున ప్రవేశించటం ఎవరము ఎక్కడా వినలేదు అని నన్ను పిలిచి నిలదీసి అడిగారు. నేను తలవంచుకుని మెలికలు తిరిగిపోతూ ఉంటే అప్పుడు వాళ్లకు అర్థమైంది అది కేవలం నా అతి తెలివి అని. చక్కగా అక్షింతలు వేసి పంపించారు.

మరొక సంక్రాంతి వచ్చింది మన జీవితాల్లోకి. పండగనాడు చక్కగా కొత్త బట్టలు కట్టుకుని ఆనందంగా గడపండి. కాస్త మనసు అదుపు చేసుకుని పండగ నాడైనా సెల్‌ఫోన్ పక్కన పెట్టి, టీవీకి దూరంగా అందరూ కలిసి హాయిగా కబుర్లు చెప్పుకొని ఆత్మీయత పెంచుకుంటే అదే అసలైన పండగ... పదిమందితో జరుపుకునేదే పండగ. బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకొని ఆ మధురమైన అనుభూతులతో వచ్చే పండగ కోసం ఎదురు చూడటం జీవితానికి సార్థకత.

అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

బైపోలార్ డిజార్డర్ బాధితుల్లో ఒక ఎపిసోడ్ అంతా బోల్డంత సంతోషం... మరికొద్దిరోజుల తర్వాత మరో ఎపిసోడ్‌లో కొండంత విచారం. ఈ బైపోలార్ డిజార్డర్‌లో బాధితులు ఎందుకిలా ప్రవర్తిస్తుంటారో, వాళ్లకు తగిన చికిత్స ఏమిటో తెలుసుకునేందుకు ఉపయోగపడే...

ప్రత్యేక కథనం
నేడు 'సాక్షి' హెల్త్ ప్లస్ ఈపేపర్‌లో....

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జనవరి 12న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,43,610	1,44,440	1,42,150	1,44,440	1,42,900	1,43,130
బంగారం (22 క్యారెట్లు)	1,29,250	1,30,300	1,30,300	1,34,210	1,31,470	1,31,200
వెండి	2,65,000	2,64,300	2,87,000	2,64,300	2,62,000	2,87,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

శాంటోల్ పండు

శాంటోల్ (శాంటోరికం కోయెట్జాపే) పండుకు.. దానిదైన ప్రత్యేకమైన రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉష్ణమండల ప్రాంతాల్లో పండే ఈ పండ్ల చెట్టు పుట్టిల్లు ఇండోచైనా, మలేసియా ప్రాంతం. ఆగ్నేయాసియాలోనే కాకుండా ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో కూడా ప్రజాదరణ పొందుతోంది. దీన్ని లాలీ ఫ్రూట్, కాటన్ ఫ్రూట్, వైల్డ్ మాంగోస్టీన్ అని కూడా పిలుస్తారు. ఇండోనేసియా, మలేసియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం అంతటా సాగవుతోంది. దీన్ని మన దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కూడా సాగు చేస్తున్నారు. స్థానికంగా తినటానికి అనువైనది. విదేశాలకూ ఎగుమతి అవకాశాలుండటంతో శాంటోల్ పండ్ల జాతి రైతుల దృష్టిని ఆకర్షిస్తోంది.

శాంటోల్ పండ్లు.. కండగలిగినవి. తీపి–పులుపు రుచికి ప్రసిద్ధి. పండ్లను తాజాగా తినటమే కాకుండా, వాటిని జామ్‌లు, జెల్లీలు, సిరప్‌లు, చట్నీ, జ్యూస్‌లుగా కూడా మార్చి నిల్వ కోసం నిల్వ చేసుకొని తినొచ్చు. క్యాండీలుగానూ తయారు చేయవచ్చు. ఈ చెట్ల కలప కూడా విలువైనదే. పడవలు, ఫర్నిచర్, గృహోపకరణాలు, ఇతర పరికరాల తయారీకి వాడతారు. శాంటోల్ ఆకులు, బెరడు తదితరాలను సాంప్రదాయ గృహ వైద్యంలోనూ ఉపయోగపడే ఔషధ గుణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. వంద గ్రాములకు 57 కిలో కేలరీల శక్తి, 17 ఎంజీ ఫాస్ఫరస్, 328 ఎంజీ పొటాషియం, 14 ఎంజీ ఆస్కార్బిక్ ఆమ్లం, 14 ఇంటర్నేషనల్ యూనిట్ల విటమిన్ ఎ ఉంటుంది.

శాంటోల్ చెట్టు.. 40–50 మీటర్ల ఎత్తు నిటారుగా పెరుగుతుంది. మొక్క నాటిన 3–5 ఏళ్లకు కాపుకొస్తుంది. లేత పసుపు రంగు (ఎరుపు రకం కూడా ఉంది)లో గుండ్రంగా 4–6 సెం.మీ. చుట్టుకొలతతో ఉంటుంది. తొక్క గట్టిగా, లోపలి మధ్య భాగం మెత్తగా, తెల్లగా ఉంటుంది. విత్తనాలు నాటితే 5–7 ఏళ్లలో కాపు వస్తుంది. వెడ్జ్ గ్రాఫ్టింగ్, షీల్డ్, ప్యాచ్ బడ్డింగ్ ద్వారా తయారైన మొక్కలు నాటితే 3–4 ఏళ్లలో కాపు వస్తుంది. ఫిబ్రవరి–మార్చిలో పూత, జూన్–అక్టోబర్‌లో పండ్లు కోతకొస్తాయి. ఒక్కో చెట్టు ఏటా 20 వేల పండ్లు కాస్తుంది.

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె: జనవరి 23 వరకు

తక్కువ పెట్టుబడితో సత్ఫలితాలు ఇస్తున్న అగ్రి హోమియోపతిపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి

పంట ఏదైనా, చీడపీడలు, ఇతర సమస్యలేవైనా హోమియో మందులతో నియంత్రించవచ్చు

అమేయ కృషి వికాస కేంద్రం వ్యవస్థాపకుడు, ప్రముఖ రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి సూచనలు

హోమియోతో చీడపీడలకు చెక్!

వరి, మిరప వంటి పంటలతో పాటు మామిడి తదితర పండ్ల తోటల్లోనూ పురుగులు, తెగుళ్ల యాజమాన్యానికి హోమియో మందులు అత్యంత ప్రభావశీలంగా పనిచేస్తున్నాయని ఈ రంగంలో పదిహేనేళ్లుగా విశేష కృషి చేస్తున్న ప్రముఖ రైతు శాస్త్రవేత్త, అమేయ కృషి వికాస కేంద్రం వ్యవస్థాపకులు జిట్టా బాల్‌రెడ్డి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా రామకృష్ణాపురంలోని తన పరిశోధనా క్షేత్రంలో అగ్రి హోమియోపతిపై బాల్‌రెడ్డి పరిశోధనలు కొనసాగిస్తున్నారు. తొలుత తన క్షేత్రంలో వాడి, మంచి ఫలితాలు కనిపించిన తర్వాత ఆయన ఈ మందులను రైతులకు సూచిస్తున్నారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజెప్పే లక్ష్యంతో 'అమేయ కృషి వికాస కేంద్రం' పేరిట యూట్యూబ్ చానల్ ద్వారా వీడియోలను కూడా ఆయన రైతులకు అందుబాటులోకి తెస్తున్నారు. హోమియో మందులతో వ్యవసాయంపై ఆయన 'సాక్షి సాగుబడి'తో చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే..

20 లీటర్ల ట్యాంకుకు 2.5 ఎం.ఎల్. మందు చాలు

ద్రవ రూపంలో ఉండే హోమియో మందులు పంటలపై పిచికారీ చేసుకునేందుకు ప్రత్యేక పద్ధతిని పాటించటం అవసరం. ఒక లీటరు మంచినీటి సీసా తీసుకొని శుభ్రంగా కడిగి, సగానికి నీరు పోయాలి. ఎంపిక చేసుకున్న మందు 2,5 ఎంఎల్‌ను కొలిచి ఆ సీసాలోని నీటిలో కలిపి గట్టిగా మూత బిగించాలి. ఆ తర్వాత సీసాను కిందికి పైకి లెక్కపెట్టి మరీ 50 సార్లు గిలక్కొట్టినట్టు ఊపాలి. ఆ తర్వాత ఆ మిశ్రమాన్ని 20 లీటర్ల థైవాన్ స్ప్రేయర్ ట్యాంక్‌లో పోసుకొని, నీటిని నింపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎంత ఎక్కువగా ఉన్నా ట్యాంకుకు 2.5 ఎం.ఎల్. కంటే ఎక్కువ మందు వాడవద్దు. అలా చేస్తే మందు పనిచేయదు. స్ప్రేయర్‌ను పూర్తిగా శుభ్రం చేసిన తర్వాత హోమియో మందుల పిచికారీకి వాడితేనే ఫలితాలు వస్తాయి. వేడి నీటితో కడిగి పైపులు శుభ్రం చేయాలి. వేడి నీటితో శుభ్రం చేసి నీడలో పంపును, స్ప్రేయర్‌ను, బాటిళ్లను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా పెట్టుకున్నప్పుడే ఈ మందులు పనిచేస్తాయి. వీలుంటే హోమియో మందును పిచికారీ చేయడానికి ప్రత్యేకంగా ఒక స్ప్రేయర్‌ను వాడుకుంటే మంచిది. సూచించిన మందులను ఒక్కసారి (సింగిల్ డోస్) పిచికారీ చేస్తే చాలు సమస్య పరిష్కారం అవుతుంది. మరీ అవసరమైతే రెండోసారి చాలు.

పంటలకు హోమియో మందులను 30కన్నా తక్కువ పొటెన్సీలోనే వాడాలి

ద్రవ రూప హోమియో మందులు ప్రత్యేక హోమియో దుకాణాలలో లభిస్తాయి. ఒకే హోమియో మందు అనేక పొటెన్సీలలో అందుబాటులో ఉంటుంది. పంటలకు సూచించిన హోమియో మందులను 6 లేదా 12 లేదా 30 పొటెన్సీ కలిగినవి మాత్రమే వాడుకోవాలి. 6 లేదా 12 పొటెన్సీలు అందుబాటులో లేనప్పుడు 30 పొటెన్సీ హోమియో మందులు వాడుకోవటం ఉత్తమం. అంతకన్నా ఎక్కువ పొటెన్సీ గల మందులు వాడకూడదు. అవసరం కూడా లేదు. హోమియో మందులు ఏ రెంటినీ కలిపి చల్లకూడదు. దేనికి దానికే వాడుకోవాలి. మోతాదు కూడా 20 లీటర్ల ట్యాంకుకు 2.5 ఎం.ఎల్. మాత్రమే వాడాలి. అంతకు మించి వాడితే దుష్ఫలితాలు వస్తాయి. హోమియో మందుల వల్ల సాధారణంగా ఎటువంటి దుష్ఫలితాలు రావటం ఉండదు. ఇతర వివరాలకు నా యూట్యూబ్ చానల్ Ameya krishi Vikasa kendram లో వీడియోలు చూడవచ్చు. పంటలకు హోమియో మందులను కొత్తగా వాడే రైతులు ముందు ఒక ఎకరంలో వాడి చూసుకొని ముందుకు వెళ్లాలని సూచన.

– జిట్టా బాల్‌రెడ్డి, ప్రముఖ రైతు శాస్త్రవేత్త, అమేయ కృషి వికాస కేంద్రం, రామకృష్ణాపురం, యాదాద్రి భువనగిరి జిల్లా

మిరపలో చీడపీడలకు హోమియో మందులు

నల్లపేను (వెస్టర్న్ బ్లాక్ త్రిప్స్)– ఆర్నేరియా డయాడెమా 30; రింగ్ స్పాట్ వైరస్ (బొబ్బర) – నెట్రమ్ సాలిసికమ్ 30, సాలిసిక్ ఆసిడ్ 30; ఎల్లో మొజాయిక్ వైరస్– జింజింబర్ 30, వాలెరినా 30; బూడిద తెగులు, కొమ్మెండు తెగులు– కుప్రమ్ మెటాలికమ్ 30; వేరు కుళ్లు, కాయ కుళ్లు, కాండంకుళ్లు– బావిస్టా 30; తెల్లదోమ, పచ్చదోమ– కోక్సినెల్లా 30, సోరినమ్ 30; తుప్పు తెగులు, కాయ మచ్చ– బెల్లడోనా 30, కాల్కేరియాకార్బ్ 30; మెగ్నీషియం లోపం– మ్యాగ్‌ఫాస్ 30; జింక్ లోప నివారణ– జింకమ్ మేట్ 30; బోరాన్ లోప నివారణ– బోరాన్ 30; లద్దె పురుగు– నక్స్‌వామికా 30, అజారిక్టా ఇండికా 30; తెల్ల లద్దె పురుగు, జపానీస్ బీటిల్– తూజా 30; పూత రాలటం– బావిస్టా 30; పూత రాలటం, వాతావరణ మార్పు– ఫెర్రంమేట్ 30; ఎదుగుదల లోపం, గిడసబారటం– కార్బో వెజ్ 30; దెబ్బతిన్న పంట కోలుకోవడానికి– బయోవేరా డిప్యూజా 30; పూత రాలకుండా– సికిల్ కార్ 30; పూత రావడానికి– అస్పగరిస్ 30 మందులను పిచికారీ చేసుకోవాలి.

మామిడి

మామిడి పూత రావటానికి – కాలి నైట్రికం 30, పల్సటిల్ల 30; పిందె రాలిపోకుండా – బావిస్టా 30; పచ్చదోమ/తెల్లదోమ నివారణకు – కోక్సినెల్లా 30, సోరినం 30 లేదా కోక్సినెల్లా 30, సల్ఫర్ 30 లేదా సోరినం 30, సల్ఫర్ 30; కాయ పెరుగుదలకు, తీపికి – ఆక్సాలిక్ ఆసిడ్ 30; సూటి మోల్డ్– సోరినం 30; బ్యాక్టీరియా మంగు– నాట్రం సాలిసికం 30, సాలిసిక్ ఆసిడ్ 30; పిందె దశలో త్రిప్స్, మైట్స్ నియంత్రణకు– తూజ 30; కాయకు కవరు కట్టే ముందు– సల్ఫర్ 30, సోరినం 30 వేర్వేరుగా పిచికారీ చేయాలి.

నత్తల నివారణకు..

అధిక వర్షాల నేపథ్యంలో వరి, అనేక కూరగాయలు, బొప్పాయి తదితర పండ్ల తోటలకు కూడా ఆఫ్రికా నత్త బెడద ఏర్పడింది. నత్తల నివారణకు 20 లీటర్ల నీటిలో 2.5 ఎం.ఎల్. హెలిక్స్ టోస్టా 30 మందును కలిపి పిచికారీ చెయ్యాలి. ఒక స్ప్రే సరిపోతుంది. మరీ అవసరమైతే 10 రోజుల తర్వాత మరోసారి పిచికారీ చేస్తే చాలు.

కొబ్బరి

కొబ్బరిలో కాపు తెప్పించటానికి, కాయ రాలకుండా నిలబెట్టుకోవటానికి రెండు కొత్త హోమియో మందులను తయారు చేసుకొని వాడాం. పూతలో 3 వంతుల కాపును నిలబెట్టుకున్నాం. కొబ్బరి చెట్లకు రెండు రకాల మందులు వాడుకోవాలి. గెలలు రావటానికి ఒకటి, కాయలు రాలకుండా కాపాడుకోవటానికి మరొకటి వేర్వేరుగా వాడుకోవాలి. 30 లీటర్ల నీటిలో 30 ఎం.ఎల్. మందు కలిపి వాడాలి. గడ్డపారతో చెట్టు చుట్టూ 4,5 నేలలో బొరియలు చేసి, వాటిలో పోయాలి. పది రోజులకోసారి వరుసగా 3 నెలలు వాడితే మంచి ఫలితం వస్తుంది. 6 నెలల తర్వాత మళ్లీ ఇవ్వొచ్చు. ఈ రెండు మందులు బయట దొరకవు. వీటితోపాటు 15 రోజులకోసారి పేడ ద్రావణం కూడా పోస్తున్నాం. తెల్లదోమ నివారణకు కోక్సినెల్లా 30, రెండు రోజులకు సల్ఫర్ 30, వారంలోగా సెమ్సిఫోగా 30, సల్ఫర్ 30 పిచికారీ చేసుకోవాలి.

వరి

20 లీటర్ల నీటిలో 2.5 ఎం.ఎల్. శైలీషియా 30 మందును కలిపి వరి విత్తన శుద్ధి చేసుకొని ఆరబెట్టిన తర్వాత మైకోరైజా పట్టించి మండె కట్టి నారు పోసుకోవాలి. ఇనుప ధాతువు లోప నివారణకు– ఫెర్రం మెట్ 30; నారు ఎర్రబారినప్పుడు– కార్బొవెజ్ 30; నాటేసిన మొక్క నిలదొక్కుకోవటానికి కాలెండుల్లా 30; వేరుకుళ్లుకు– బావిస్ట 30; మొగి పురుగు, తెల్లకంకి నివారణకు– నాటేసిన 20 రోజులకు ఒకసారి, చిరుపొట్ట దశలో మరోసారి తూజ 30; పాముపొడ, పచ్చ పురుగు– నక్స్ వామిక 30; దోమపోటు– కోక్సినెల్ల 30 (మరీ అవసరమైతే సింసిఫ్యూగ 30, సోరినమ్ 30 వేర్వేరుగా వాడాలి); పోషకాల లోపనివారణ– పేడ ద్రావణం, డీఏపీకి బదులు– అమ్మోనియా ఫాస్ 30, యూరియాకు బదులు– యూరియా పోరిక 30; పొటాష్‌కోసం– కాలిమూర్ 30; జింక్ లోప నివారణకు– జింకం మేట్ 30; స్మట్ – తూజా 30, అగ్గితెగులు–బెల్లడోనా 30, కాల్కేరియా కార్బ్ 30 పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 293

మంగళవారం 13-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

బాంబ్రీ జోడీ శుభారంభం

ఏఎస్‌బీ క్లాసిక్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో విజయం - 10లో

బంగారం,వెండి బ్లాస్ట్

పసిడి ధర రూ. 1,44,600.. కొత్త శిఖరాలకు ధరలు - 13లో

సేవా తీర్థ్‌లోకి పీఎంఓ

ఢిల్లీలోని ప్రధాని కార్యాలయాన్ని సంక్రాంతి పండగ రోజున నూతన భవన సముదాయంలోకి మార్చనున్నారు.

వివరాలు 6లో ▸

చర్చలకు దిగొచ్చిన ఇరాన్

దాడులు తప్పవన్న తన హెచ్చరికలకు ఇరాన్ దిగొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸

1న పార్లమెంట్‌లో 'బడ్జెట్'

వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెడతారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చెప్పారు.

వివరాలు 6లో ▸



షక్స్‌గామ్ లోయ మాదే

సరిహద్దుల్లోని షక్స్‌గామ్ లోయ ప్రాంతం తమదేనంటూ చైనా సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఆధార్ సేవల టెస్టు పాస్ కాకుంటే ఇంక్రిమెంట్ కట్

ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ నిర్ధారించిన ఎన్ఎస్ఈఐటీ పరీక్షలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్‌లు ఈ ఏడాది మార్చిలోగా ఉత్తీర్ణత కాకుంటే వారికి తదుపరి వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 2లో ▸

పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగం విఫలం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి సోమవారం ఉదయం 10.17 గంటలకు ప్రయోగించిన పీఎస్ఎల్వీ–సీ62 రాకెట్ ప్రయోగం విఫలమైంది.

వివరాలు 14లో ▸

మద్యం బాటిల్‌పై రూ.10 బాదుడు

రాష్ట్రంలో మద్యం ధరలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రూ.99 మద్యం, బీరు ఉత్పత్తులపై తప్ప మిగిలిన అన్ని మద్యం బ్రాండ్లకు సంబంధించి ప్రతి బాటిల్‌పై రూ.10 పెంచింది. బార్లపై విధిస్తోన్న 'అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్ను (ఏఆర్ఈటీ)ను రద్దు చేసింది.

వివరాలు 2లో ▸

పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు, పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొంత మందిని బదిలీ చేసినప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వారికి పోస్టింగ్‌లు ఇస్తూ విడిగా ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

• బాబు సర్కారు మరో బాంబు..

రూ. 13,100 కోట్ల బాదుడు

ఆంధ్రప్రదేశ్ లాటరీ ద్వారా రూ.3,000 కోట్లు ఆర్జనకు గ్రీన్‌సిగ్నల్

ఆన్‌లైన్ గేమింగ్ పన్ను ద్వారా రూ.1,400 కోట్లు

స్థానిక సంస్థల వినోద పన్ను ద్వారా రూ.2,300 కోట్లు

రెండో, మూడో స్థాయి అమ్మకాలపై వ్యాట్ ద్వారా రూ.1,300 కోట్లు

వృత్తి పన్ను పెంపు ద్వారా రూ.400 కోట్లు

ఎస్‌జీఎస్‌టీపై ఒక శాతం సెస్‌తో రూ.4,700 కోట్ల ఆదాయంపై కన్ను



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం విక్రయాలు, సహజ వనరుల దోపిడీ, పేకాట క్లబ్బులు, విద్యుత్తు చార్జీల బాదుడుతో పాటు సంక్షేమ పథకాలు, ఎన్నికల హామీలకు తూట్లు పొడిచి ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేసిన చంద్రబాబు సర్కారు తాజాగా.. ఆదాయం కోసం ఆంధ్రప్రదేశ్ లాటరీని తీసుకురావాలని ప్రతిపాదించింది. వివిధ సెస్‌లు, పన్నుల ద్వారా రాష్ట్ర ప్రజలపై మరో రూ.13,100 కోట్ల మేర అదనపు భారం మోపాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సీఎం చంద్రబాబు మంత్రులు, ఉన్నతాధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశం సాక్షిగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

లాటరీ.. ఆన్‌లైన్ గేమింగ్ పన్నులు..

ఆంధ్రప్రదేశ్ లాటరీని తీసుకురావడం ద్వారా రూ.3,000 కోట్లు ఆర్జించాలని

మిగతా 2వ పేజీలో ▶

ఆదాయాన్ని మళ్లించి అరుపులు!

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మరో డ్రామా

- ఖజానాకు రాబడి తగ్గిందంటూ కార్యదర్శులు, కలెక్టర్లపై సీఎం చిర్రుబుర్రు
- పనితీరు మెరుగుపర్చుకోకపోతే దోషులుగా నిలబెడతానంటూ అధికారులకు బెదిరింపులు
- పొలిటికల్ గవర్నెన్స్ పేరుతో పాలనను అస్తవ్యస్థం చేసిన చంద్రబాబు
- పేరుకే ఉచిత ఇసుక.. గతంతో పోల్చితే డబుల్ రేటు.. అదంతా పచ్చ ముఠాల జేబుల్లోకే.. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా ఇసుక ద్వారా ఖజానాకు రూ.750 కోట్ల ఆదాయం
- ఇసుక నుంచి క్వార్జ్, సిలికా, లేటరైట్ లాంటి సహజ వనరులను కొల్లగొడుతున్న టీడీపీ ముఠాలు
- మద్యం షాపులు.. బెల్ట్ షాపులు టీడీపీ నేతల గుప్పిట్లోనే

- ప్రతి ఐదు బాటిళ్లలో ఒకటి నకిలీ సరుకే..
- ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తూ దోపిడీ.. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం టీడీపీ నేతల చేతుల్లోకి
- సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమల్లో చంద్రబాబు ఘోర వైఫల్యం..
- దీని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆదాయం తగ్గిందంటూ నాటకాలు ఆడుతున్నారంటున్న రాజకీయ విశ్లేషకులు

2 లో

ఆదాయం రావట్లేదు.. మీదే ఫెయిల్యూర్

కలెక్టర్లు, అధికారులపై సీఎం చంద్రబాబు కస్సుబుస్సు 2 లో

అహ్మదాబాద్‌లోని సబర్మతీ నదీ తీరాన పతంగుల పండుగను ప్రారంభించి గాలిపటాలు ఎగురవేస్తున్న భారత ప్రధాని మోదీ, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్

పతంగుల పండుగలో ప్రధాని 6 లో

పండుగనాడు పస్తులేనా?

గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాల టీచర్లకు అందని వేతనాలు 3 లో

- రెగ్యులర్ వారికి రెండు నెలలు, ఔట్‌సోర్సింగ్ వారికి ఒక నెల వేతనం ఇవ్వలేదు
- ఏకలవ్య స్కూల్స్‌లో జీతం తగ్గించినా మూడు నెలలుగా పెండింగ్.. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో రెండు నెలల వేతనాలు కట్
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై పెల్లుబుకుతున్న ఆగ్రహం

భారతే ముఖ్యం

అమెరికాతో విడదీయలేని బంధం

స్వేచ్ఛా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయ్

ఈ శతాబ్దంలోకెల్లా ప్రభావశీల భాగస్వామ్యం

నూతన రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్య

మోదీ, ట్రంప్‌ది దృఢమైన స్నేహ బంధం

బాధ్యతల స్వీకరణ అనంతరం గోర్ వెల్లడి

6లో

మా భూములు తీసుకుంటే సహించేది లేదు

- ఔటర్ రింగ్ రోడ్డు పేరిట చంద్రబాబు ప్రభుత్వం భూ దోపిడీకి పాల్పడుతోంది
- 80 ఎకరాలు అవసరం ఉంటే 650 ఎకరాలకు పైగా లాగేసుకునేందుకు కుట్ర చేస్తోంది
- సహాయం కోసం వైఎస్ జగన్‌ను కలుస్తాం
- భూములు కోల్పోతున్న గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారా కోడూరు గ్రామస్తులు

3 లో

'గ్రూప్స్' ఫలితాలపై నీలినీడలు!

- అవి మరింత ఆలస్యమవుతాయని తేల్చేసిన ఏపీపీఎస్సీ.. వెంటనే విడుదల చేయాలని అభ్యర్థుల డిమాండ్
- కమిషన్ కార్యాలయం ముట్టడికి యత్నం..అధికారుల బెదిరింపు.. గత ప్రభుత్వంలో నోటిఫికేషన్లు ఇచ్చిన మూడు నెలల్లో ప్రిలిమ్స్ పూర్తి
- చంద్రబాబు ప్రభుత్వంలో ఏడాది తర్వాత మెయిన్స్ నిర్వహణ
- ఫలితాలపై హైకోర్టు క్లియరెన్స్ ఇచ్చినా కొత్త నోటిఫికేషన్లు ఇవ్వకుండా కుట్ర

2 లో

'పెద్ద' లాబీయింగ్!

ఏపీ కోటాలో త్వరలో 4 రాజ్యసభ సీట్లు ఖాళీ

రెండు సీట్లపై బీజేపీ కన్ను.. టీడీపీ, జనసేనకు చెరొకటి

జనసేన ఖాతాలో లింగమనేని రమేష్‌కు చాన్స్

టీడీపీ సీటు మళ్లీ సానా సతీష్‌కే కేటాయించే అవకాశం

బాబు తీరుపై రగిలిపోతున్న టీడీపీ సీనియర్లు, యనమల, ఏబీఎన్ రాధాకృష్ణ

సాక్షి, అమరావతి: త్వరలో ఖాళీ కానున్న రాష్ట్రానికి చెందిన నాలుగు రాజ్యసభ స్థానాల కోసం టీడీపీ కూటమిలో భారీ లాబీయింగ్ మొదలైంది. మూడు నెలల సమయం ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఆశావహులు పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఏపీ నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున రాజ్యసభ సభ్యులుగా ఉన్న పరిమళ్ నత్వానీ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ పదవీకాలం ఈ ఏడాది జూన్‌లో ముగియనుంది. టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సానా సతీష్‌బాబు పదవీ కాలం కూడా జూన్ వరకే ఉంది. ఖాళీ కానున్న ఈ నాలుగు స్థానాల కోసం మూడు పార్టీల నుంచి

మిగతా 14వ పేజీలో ▶

▼ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ల రైతు సేవా కేంద్రం ఎదుట యూరియా కోసం పాస్‌పుస్తకాలు లైన్లో ఉంచిన రైతులు

యూరియా.. ఎక్కడయ్యా!

యూరియా కోసం అన్నదాతల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు యూరియా అందించడంలో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం రబీ సీజన్‌లో కూడా మేల్కోలేదు. ఫలితంగా రెండో పంట కింద నాట్లు వేసిన రైతులు యూరియా దొరక్క అష్టకష్టాలు పడుతున్నారు. సొసైటీలు,రైతు సేవా కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అరకొరగా యూరియా వచ్చినా టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారే పట్టుకెళ్లి పోతున్నారు. దీంతో సామాన్య రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రైతుల యూరియా కష్టాలకు సజీవ సాక్ష్యం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ల రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం క్యూలో ఉన్న పాసుపుస్తకాలే! - తిరువూరు

క్లుప్తంగా...

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే సెలవు

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు తమ క్యాజువల్ లీవ్ (సీఎల్)లను ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలంటూ ఆ శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. గ్రామ వార్డు సచివాలయాల శాఖ హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో సీఎల్ ఆన్‌లైన్ దరఖాస్తు అందుబాటులో ఉన్నట్టు పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో మినహా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి సీఎల్ వినతులను మాత్రమే అంగీకరించనున్నట్టు తెలిపింది.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసు

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కండలేరు పోలీసుస్టేషన్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసు నమోదైంది. అనుమతి లేకుండా ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించడంతో పాటు రోడ్డుపై బైఠాయించి పాదచారులకు ఇబ్బందులు కలగజేశారంటూ కొత్త కంబాలపల్లి ఇన్‌చార్జి వీఆర్వో రామయ్య ఫిర్యాదు మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, సీఈసీ సభ్యులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, వెంకటాచలం మండల జెడ్పీటీసీ మాజీ సభ్యులు వెంకటశేషయ్య యాదవ్, రావుల ఇంద్రాసేనగౌడ్‌పై కేసు నమోదు చేశారు.

ఆధార్ సేవల టెస్టు పాస్ కాకుంటే ఇంక్రిమెంట్ కట్

సాక్షి, అమరావతి: నిర్ణీత అర్హత కలిగిన వ్యక్తులే ఆధార్ సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ నిర్ధారించిన ఎన్ఎస్ఈఐటీ పరీక్ష గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ ఈ ఏడాది మార్చిలోగా ఉత్తీర్ణత కాకుంటే ఆయా డిజిటల్ అసిస్టెంట్లకు తదుపరి వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదలకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి అందించిన ఆదేశాల మేరకు ఆయా జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు తమ పరిధిలోని ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా పరీక్ష ఉత్తీర్ణత కాని వారితో పాటు అసలు పరీక్షకు హాజరు కాని వారికీ, పరీక్షకు దరఖాస్తే చేయని వారికి, పరీక్ష ఉత్తీర్ణత అయినా ఆధార్ సేవలు అందించేందుకు అయిష్టత తెలిపిన వారికీ తదుపరి వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదల చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు ఎలాంటి ఆటంకం లేకుండా కొనసాగించేందుకు గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులతో పాటు డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలు ఎన్ఎస్ఈఐటీ పరీక్ష వచ్చే మార్చిలోపు తప్పనిసరిగా పాస్ కావాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డిసెంబరు 31వ తేదీనే ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లాల్లో ఎంపీడీఓలకు జారీ చేసిన ఆదేశాల్లో కేవలం డిజిటల్ అసిస్టెంట్ల విషయంలోనే వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదల అంశం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అప్పుల కోసం మరో కొత్త కంపెనీ

- ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు
- ఆ రుణాలతో పీపీపీ విధానంలో మౌలిక వసతుల కల్పన
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: అప్పుల కోసం రాష్ట్రప్రభుత్వం మరో కొత్త కంపెనీని ఏర్పాటు చేసింది. రూ.7,500 కోట్ల రుణాల కోసం ఏపీఐఐసీ ఆస్తులతో కొత్త కంపెనీ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు తాజాగా ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఎల్ఐఎన్‌సీ) పేరిట మరో కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలపడంతో ఏపీఎల్ఐఎన్‌సీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో సరుకు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్)ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయడం కోసం ఈ కొత్త కంపెనీని ఏర్పాటు చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని రహదారులు, గిడ్డంగులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, అంతర్గత జలరవాణాకు చెందిన అన్ని ఆస్తులను ఈ కొత్త కంపెనీ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇందుకోసం ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఆర్‌డీసీ), ఏపీ మారిటైమ్ బోర్డు (ఏపీఎంబీ), ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఏడీసీఎల్), ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌డబ్ల్యూసీ), ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ(ఏపీఐడబ్ల్యూఏ)లను ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ హోల్డింగ్ కంపెనీ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ సంస్థలు ఏర్పాటు చేసిన ప్రత్యేక కంపెనీలు (ఎస్‌పీవీ)లు కూడా ఈ ఏపీఎల్ఐఎన్‌సీ పరిధిలోకే వస్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తక్కువ వడ్డీ రేటుకు దీర్ఘకాలిక రుణాలను సేకరించడం ద్వారా పీపీపీ విధానంలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తారు. ఈ విభాగాలకు చెందిన శాఖాధిపతులంతా ఏపీఎల్ఐఎన్‌సీలో సభ్యులుగా ఉంటారు.

రాష్ట్ర యువతకు చంద్రబాబు వెన్నుపోటు

- ఎన్నికల మేనిఫెస్టో హామీలను ఆయన విస్మరించారు
- బాబు పాలన యువత, రాష్ట్రాన్ని ప్రమాదంలోకి నెడుతోంది
- 8 త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదు
- రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయి
- యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి రెండేళ్లుగా లేదు
- స్వామి వివేకానంద విశ్వాసానికి భిన్నంగా.. దుర్భర పరిస్థితుల్లో రాష్ట్ర యువత
- మోసాల ద్వారా ఈ సర్కారు యువత లక్ష్యాలకు అడ్డుపడుతోంది
- జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ ధ్వజం
- కదలండి.. మేల్కొండి.. ఇకనైనా యువత లక్ష్య సాధనకు తోడ్పడండి అని డిమాండ్

సాక్షి, అమరావతి: యువత ఏకాగ్రత, లక్ష్యంతో కృషి చేస్తే దేశం బలపడుతుందని స్వామి వివేకానంద నమ్మారని, కానీ... రాష్ట్రంలో యువత అందుకు భిన్నంగా దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటోందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను విస్మరించి యువతకు సీఎం చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. ఆయన పాలన యువత, రాష్ట్ర భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొనే స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన బోధనలను గుర్తుచేస్తూ... చంద్రబాబు యువతకు చేసిన మోసాలను ప్రస్తావిస్తూ వైఎస్ జగన్ సోషల్ మీడియా 'ఎక్స్' ఖాతాలో సోమవారం పోస్ట్ పెట్టారు. చంద్రబాబు పాలనలో 8 త్రైమాసికాల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.4,900 కోట్ల విద్యా దీవెన, రూ.2,200 కోట్ల వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయని ధ్వజమెత్తారు. టీడీపీ కూటమి మేనిఫెస్టో వాగ్దానమైన యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి రెండేళ్లుగా చెల్లింపు లేదని గుర్తు చేశారు. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు నిలిపేశారని పేర్కొన్నారు. ఇలా మోసాలకు పాల్పడడం ద్వారా చంద్రబాబు సర్కారు యువత వారి లక్ష్యాలను సాధించకుండా అడ్డుపడుతోందని మండిపడ్డారు. వివేకానంద ప్రముఖ సూక్తిని ప్రస్తావిస్తూ ''ఇకనైనా కదలండి.. మేల్కొండి.. యువత వారి లక్ష్యాల సాధనకు తోడ్పడండి'' అంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు.

ఆదాయాన్ని మళ్లించి అరుపులు!

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సీఎం చంద్రబాబు మరో డ్రామా | ఖజానాకు రాబడి తగ్గిందంటూ కార్యదర్శులు, కలెక్టర్లపై సీఎం చంద్రబాబు చిర్రుబుర్రు

సాక్షి, అమరావతి: ఇసుక నుంచి మద్యం వరకూ అన్నింటా దోపిడీ.. కేవలం 19 నెలల్లోనే దేశ చరిత్రలో రికార్డు స్థాయిలో రూ.3.02 లక్షల కోట్ల అప్పులు.. అయినా సరే సూపర్ సిక్స్ సహా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లో ఆగ్రహాగ్ని పెల్లుబుకుతుండటంతో సీఎం చంద్రబాబు మరో డ్రామాకు తెరతీశారు. ఇన్నాళ్లూ ఆర్థిక వృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందంటూ కాకమ్మ కబుర్లు చెప్పిన చంద్రబాబు ఎట్టకేలకు సోమవారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో వాస్తవాలను అంగీకరించారు. ఆ నెపాన్ని అధికారులపైకి నెట్టారు. ఆదాయ ఆర్జన శాఖలు పనితీరు కనపర్చాలని.. సాకులు చెబితే కుదరదని.. అలాంటి అధికారులు, కలెక్టర్లను ప్రజల ముందు దోషులుగా నిలబెడతానంటూ హూంకరించారు. చంద్రబాబు సీఎం కాగానే ఇకపై పొలిటికల్ గవర్నెన్స్ అంటూ ప్రకటన చేయడం తెలిసిందే. ఇదే అదునుగా పచ్చ ముఠాలు ఇసుక నుంచి క్వార్ట్జ్, సిలికా, మైనింగ్, లేటరైట్ వరకూ సహజ సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్నాయి. మద్యం షాపులు, బెల్ట్‌షాపులను గుప్పిట్లో పెట్టుకుని నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నాయి. ఒకపక్క రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతూ.. మరోవైపు టీడీపీ నేతల దోపిడీని ప్రోత్సహిస్తూ.. చివరకు రాబడి తగ్గితే అధికార యంత్రాంగాన్ని బాధ్యులుగా చేస్తామని చంద్రబాబు బెదిరింపులకు దిగడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇక రెడ్ బుక్ పేరుతో టీడీపీ శ్రేణులు స్వైర విహారం చేస్తుండటంతో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని నిలదీసే ప్రతిపక్ష నేతలు, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రశ్నించే గొంతులను నులిమేందుకు బాబు సర్కారు చేయని కుట్రలు లేవు.



ఖజానాకు గండి.. పచ్చ ముఠాలకు రాబడి

కూటమి సర్కారు అవినీతి విశృంఖలంగా సాగుతుండటంతో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం టీడీపీ నేతల జేబుల్లోకి చేరుతోంది. దీనివల్లే ప్రభుత్వ ఆదాయం తగ్గుతోందన్నది బహిరంగ రహస్యం. పొలిటికల్ గవర్నెన్స్‌తో పరిపాలన పూర్తిగా అదుపు తప్పిందని.. విచ్చలవిడి అవినీతి వల్ల ప్రభుత్వానికి ఆదాయం తగ్గిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులుగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులుగా సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ చేసిన పలువురు ఐఏఎస్‌లు స్పష్టం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇసుక ద్వారా ఏటా ప్రభుత్వానికి రూ.750 కోట్ల ఆదాయం వచ్చేది. ఇప్పుడు పేరుకే ఉచిత ఇసుక.. ఇసుక ర్యాంప్‌లను తమ అధీనంలోకి తీసుకుని టీడీపీ ముఠాలు యథేచ్ఛగా తవ్వేస్తూ, అధిక ధరకు విక్రయించి దోచేస్తున్నాయి. ఫలితంగా గతంతో పోల్చితే ఇప్పుడు ఇసుక ధర డబుల్ అయ్యింది. కానీ ప్రభుత్వానికి వచ్చే ఆదాయం మాత్రం సున్నా. ఆ ఆదాయమంతా టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్తోంది. ఇక టీడీపీ సర్కార్ అధికారంలోకి రాగానే మద్యం షాపులను తమ అధీనంలోకి తీసుకుని.. ఊరూ వాడా బెల్ట్ షాపులు తెరిచారు. నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమగా మార్చేశారు. మద్యం షాపులు, బెల్ట్ షాపుల్లో అమ్మే ప్రతి ఐదు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యం బాటిలే! ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తూ, అడ్డగోలుగా దోచేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. దీంతో అవినీతి వ్యవస్థీకృతమైపోయినా, ఎవరిపైనా చర్యలు తీసుకోలేకపోతున్నామని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మోసాలుగా సూపర్ సిక్స్ హామీలు..

రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులకు భృతి కింద నెలకు రూ.3 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. గతేడాది, ఈ ఏడాదీ ఎగ్గొట్టారు. ఒక్కో నిరుద్యోగికి రూ.72 వేల చొప్పున ఎగ్గొట్టి వెన్నుపోటు పొడిచారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకూ ఏటా రూ.18 వేల చొప్పున ఇస్తామన్న హామీకి ఎగనామం పెట్టారు. ఇక 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నెలకు రూ.4 చొప్పున పెన్షన్ ఇస్తామంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఆ హామీని గతేడాది, ఈ ఏడాదీ అమలు చేయకుండా మోసం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలను బడికి పంపిస్తే అంత మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో జమ చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. యూడీఐఎస్ఈ (యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్‌యాడైస్) గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 87,41,885 మంది పిల్లలు బడుల్లో చదువుతున్నారు. రూ.15 వేల వంతున వారికి ఏడాదికి రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. కానీ.. తొలి ఏడాది ఆ మేరకు ఇవ్వకుండా ఎగ్గొట్టారు. ఇక 2025–26లో 67,27,124 మందికి రూ.10,090 కోట్లను తల్లికి వందనం కింద పంపిణీ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించినా ఇప్పటివరకూ ఇప్పటికి 66 లక్షల మందికి రూ.6,377 కోట్లను మాత్రమే.. అదీ ఒక్కొక్కరికి రూ.8 వేలు, రూ.9 వేలు.. రూ.పది వేలు చొప్పున చెల్లించి.. 21 లక్షల మందికి పూర్తిగా ఎగ్గొట్టారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ పథకంతో సంబంధం లేకుండా అన్నదాతా సుఖీభవ పథకం కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.10,716.53 కోట్లు అవసరం. కానీ.. తొలి ఏడాది వాటిని ఇవ్వకుండా ఎగ్గొట్టారు. 2025–26లో 46,85,838 మంది రైతులకు రూ.పది వేల చొప్పున రూ.4,685.54 కోట్లు మాత్రమే విదిల్చి.. 6,72,428 మంది రైతులకు పూర్తిగా ఎగనామం పెట్టి మోసం చేశారు. సూపర్ సిక్స్, సెవెన్‌సహా అన్ని హామీలదీ అదే తీరు. ఓవైపు సహజ వనరులను దోచేస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. మరోవైపు రూ.3.02 లక్షల కోట్లు అప్పు చేసి రికార్డు సృష్టించినా హామీలను చంద్రబాబు సర్కార్ అమలు చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.

అప్పుల్లో రికార్డు.. హామీలకు వెన్నుపోటు

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఐదేళ్లలో రూ.3.31 లక్షల కోట్లు అప్పులు మాత్రమే చేసింది. మరోవైపు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసింది. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో ప్రజల ఖాతాల్లో రూ.2.73 లక్షల కోట్లు నేరుగా జమ చేసి రికార్డు సృష్టించింది. ఐదేళ్లలో రూ.3.31 లక్షల కోట్లు అప్పు చేయగా, అందులో రూ.2.73 లక్షల కోట్లను సంక్షేమ పథకాల కింద పేదల ఖాతాల్లో జమ చేస్తే రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారంటూ నాడు చంద్రబాబు దుష్ప్రచారం చేశారు. దానికి ఎల్లో మీడియా తందాన పాడింది. ఇప్పుడు చంద్రబాబు సర్కార్ 19 నెలల్లోనే ఏకంగా రూ.3.02 లక్షల కోట్లు అప్పులు చేసింది. అంటే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో.. చంద్రబాబు సర్కార్ కేవలం 19 నెలల్లోనే 90.87 శాతం అప్పులు చేసింది. అయినా సరే సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు నీళ్లొదిలారు.

ఆదాయం రావట్లేదు.. మీదే ఫెయిల్యూర్

కలెక్టర్లు, అధికారులపై సీఎం చంద్రబాబు కస్సుబుస్సు



- కేంద్ర పథకాల నిధులు వ్యయం చేయట్లేదు
- ఆఖరికి డేటా కూడా అప్‌డేట్ చేయడం లేదు
- గతేడాది కంటే వృద్ధి తగ్గే పరిస్థితి
- మనకంటే ఇతర రాష్ట్రాలు మంచి వృద్ధి సాధించాయి
- అవసరమైతే కొందరికి పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెడతా
- కేంద్ర నిధులు మురిగిపోతే మంత్రులు, కార్యదర్శులదే బాధ్యత
- ప్రజల్లో సంతృప్తి పెరిగేలా వారి వద్దకు వెళ్లండి
- పీపీపీలో 290 ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో
- ఫిబ్రవరి రెండో వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు
- పోలవరంలో మిగిలిన నీళ్లు తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉందన్న బాబు..
- చంద్రబాబు వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబడుతున్న సాగునీటి నిపుణులు, రైతులు
- ఏపీ హక్కులను బాబు తాకట్టు పెట్టి అన్యాయంగా మాట్లాడుతున్నారంటూ తీవ్ర ఆగ్రహం

సాక్షి, అమరావతి: లక్ష్యం మేరకు ఆదాయం రావడం లేదని, కేంద్ర పథకాల ద్వారా వచ్చిన నిధులను వ్యయం చేసి తిరిగి తెచ్చుకోవడంలో అధికారులు, కలెక్టర్లు వైఫల్యం చెందారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయ ఆర్జన శాఖలు పనితీరు కనపర్చాలని, సాకులు చెబితే కుదరదని స్పష్టం చేశారు. జీఎస్‌డీపీ పెరిగితే ఆ మేరకు ఆదాయ వనరులు కూడా పెరగాలని, లేదంటే ఎక్కడో తేడా వస్తోందన్నారు. జీఎస్‌డీపీని కేంద్ర ఏజెన్సీ కూడా పరిశీలిస్తుందని, మనం రాసుకుంటే సరిపోదని వ్యాఖ్యానించారు. సోమవారం సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతోపాటు వర్చువల్‌గా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు పలు అంశాలను సమీక్షించారు. గతేడాది 12.05 శాతం వృద్ధి సాధిస్తే, ఈ ఏడాది అంచనాల మేరకు 11.5 శాతం మాత్రమే వృద్ధి నమోదయ్యే వీలుందన్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది తగ్గిపోతున్నామని పెదవి విరిచారు. నిజానికి ఈ ఏడాది వృద్ధి లక్ష్యం 16 శాతంగా నిర్దేశించుకున్నట్లు గుర్తు చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులు, కలెక్టర్లు, విభాధిపతులు పది సూత్రాలను సాధించేందుకు రోజువారీ, నెలవారీ క్యాలెండర్‌తో ప్రణాళికలు తయారు చేసుకుని పనితీరు కనపరచాలని, ఉపన్యాసాలు చెబితే కుదరని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఫిబ్రవరి రెండో వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలుంటాయని, దానికి ముందు కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తామని సీఎం చెప్పారు.

ఇతర రాష్ట్రాల్లో మంచి వృద్ధి..!

గతేడాది మన రాష్ట్రం కన్నా ఇతర రాష్ట్రాలు మంచి వృద్ధి సాధించాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కేంద్ర నిధులను వ్యయం చేయకపోవడంపై మంత్రులు, అధికారులు, కలెక్టర్లపై సీఎం విరుచుకుపడ్డారు. కొంత మంది కలెక్టర్లు డేటా కూడా అప్‌డేట్ చేయడం లేదని, అలాంటి వారిని ఎక్స్‌పోజ్ చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే కొంతమందికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా పక్కనపెడతానన్నారు. కలెక్టర్లు, అధికారులు పనితీరు కనపరచాలన్నారు. కేంద్ర పథకాల నిధుల్లో ఒక రూపాయి కూడా మురిగిపోకూడదని, ఆ పరిస్థితి వస్తే మంత్రులు, కార్యదర్శులు వివరణ ఇవ్వాల్సి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. చాలా శాఖలు 50 శాతం నిధులను కూడా వ్యయం చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలన్నరలో నిధులన్నీ వ్యయం చేసి మార్చి 15వ తేదీన కేంద్రం నుంచి అదనపు నిధులు తేవాలని సూచించారు. పెన్షన్ మినహా మిగతా పథకాలపై ప్రజల్లో సంతృప్తి తక్కువగా ఉందని సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు, విభాగాధిపతులు డేటా తీసుకుని క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లి ప్రభుత్వ పథకాలు, సేవలపై 80 శాతం సంతృప్త స్థాయి తేవాలని నిర్దేశించారు. ప్రజల్లో సంతృప్త స్థాయి పెరగకుంటే మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్ల వైఫల్యంగానే పరిగణిస్తామన్నారు. విభాగాధిపతులు మౌనంగా కూర్చుంటే కుదరదని, పనితీరు చూపించాక మాట్లాడాలన్నారు.

పీపీపీలో 290 ప్రాజెక్టులు..

నిధులు లేవని ప్రాజెక్టులు నిలిపి వేయకుండా పీపీపీ, హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో చేపట్టాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. పీపీపీ ప్రాజెక్టుల కోసం ఆర్థిక శాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో హైబ్రీడ్ యాన్యుటీ విధానంలో రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడాదిలోగా రోడ్ల నిర్మాణం పూర్తి కావాలన్నారు. ఎస్ఐపీబీలో ఆమోదించిన ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలన్నారు. పీపీపీ విధానంలో రూ.1.15 లక్షల కోట్ల విలువైన 290 ప్రాజెక్టులు పైప్‌లైన్‌లో ఉన్నట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ర తెలిపారు.

తెలంగాణ ప్రాజెక్టులు కడితే నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు...

తెలంగాణలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరంలో మిగిలిన నీళ్లు తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. నల్లమల సాగర్ ద్వారా రాయలసీమ, ప్రకాశం ప్రాంతాలకు నీరిచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. పుష్కరాల్లోగా పోలవరం నిర్మించి జాతికి అంకితం చేస్తామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు కూడా త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. కాగా తెలంగాణ సర్కారు కృష్ణా నదిపై అనుమతులు లేకుండా ప్రాజెక్టులు కడుతున్నా ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా చంద్రబాబు ఏపీ హక్కులను తాకట్టు పెట్టారని సాగునీటి నిపుణులు, రైతులు మండిపడుతున్నారు. జన్మభూమికి ద్రోహం తలపెట్టి రాయలసీమ ఎత్తిపోతలను నిలిపివేసిన చంద్రబాబు ఇంత అన్యాయంగా, బాహాటంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి చంద్రబాబు బడాయి మాటలు చెబుతున్నారని నీటి పారుదల నిపుణులు మండిపడుతున్నారు.

బాబు సర్కారు మరో బాంబు.. రూ.13,100 కోట్ల బాదుడు

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు సర్కారు ప్రతిపాదించింది. ఆన్‌లైన్ గేమింగ్ పన్ను ద్వారా రూ.1,400 కోట్లు ఆర్జించాలని నిర్దేశించుకుంది. ఎస్‌జీఎస్‌లపై ఒక శాతం సెస్ విధించడం ద్వారా రూ.4,700 కోట్లను ఆర్జించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల వినోద పన్ను ద్వారా రూ.2,300 కోట్లు ఆర్జించాలని ప్రతిపాదించారు. అలాగే రెండో, మూడో స్థాయి అమ్మకాలపై వ్యాట్ విధించడం ద్వారా రూ.1,300 కోట్లు ఆర్జించాలని ప్రతిపాదన చేశారు. వృత్తి పన్ను పెంపు ద్వారా రూ.400 కోట్లు, విజయవాడ, విశాఖపట్టణం మున్సిపల్ పరిధిలో వృత్తి పన్ను వసూళ్లను బదిలీ ద్వారా రూ.110 కోట్లు ఆర్జించాలని ప్రతిపాదించారు.వసూళ్ల పెంపు కోసం పన్ను ఆధార విస్తరణ, బకాయిల వసూళ్లు, ఐటీ ఆధారిత పర్యవేక్షణ, కొత్త ఆదాయ వనరుల అన్వేషణపై దృష్టి పెట్టడం ద్వారా 2025–26లో రాష్ట్రం స్వంత ఆదాయ వృద్ధి లక్ష్యాలను అధిగమించనున్నారు. ఈమేరకు ఆదాయ విభాగాల లక్ష్యాలు, సాధనపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఈ సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. బడ్జెట్ లక్ష్యాలకు తగినట్లు ఆదాయం రావడం లేదన్నారు. రెవెన్యూ రాబడులు రూ.1.34 లక్షల కోట్లు లక్ష్యం కాగా డిసెంబర్ వరకు కేవలం రూ.7,400 కోట్లు మాత్రమే వచ్చినట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిల్‌పై రూ.10 బాదుడు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మద్యం ధరలను పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.99 మద్యం, బీరు ఉత్పత్తులు తప్ప మిగిలిన అన్ని రకాల మద్యం బ్రాండ్లపై ప్రతి బాటిల్‌కు రూ.10 పెంచింది. ఇక బార్లపై విధిస్తున్న 'అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్ను(ఏఆర్ఈటీ)ను రద్దు చేసింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తూ ఎక్సైజ్ శాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

'గ్రూప్స్' ఫలితాలపై నీలినీడలు!

సాక్షి, అమరావతి: గ్రూప్–1, గ్రూప్–2 అభ్యర్థులతో అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చెలగాటమాడుతున్నాయి. తాము రేయింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాసినా ఫలితాలు ఇచ్చేందుకు చంద్రబాబు సర్కారు మొగ్గు చూపకపోవడం.. ఫలితాలిస్తామని ఏపీపీఎస్సీ పైకి చెబుతున్నప్పటికీ అది ఎప్పుడో తెలీక అభ్యర్థులు రెండింటి మధ్య నలిగిపోతున్నారు. ఎందుకంటే.. ఫలితాలు ప్రకటించుకోవచ్చని న్యాయస్థానం చెప్పినా మరికొంత సమయం పడుతుందని ఏపీపీఎస్సీ ప్రకటించడంతో అభ్యర్థుల్లో కలవరం మొదలైంది.

గత ప్రభుత్వం 2023 డిసెంబరులో ఇచ్చిన గ్రూప్–2 నోటిఫికేషన్‌కు మూడునెలల్లో ప్రిలిమ్స్ పూర్తిచేసి మేలో మెయిన్స్ నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. అయితే, సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పరీక్షలు నిర్వహించొద్దని నాటి ప్రతిపక్ష నేతలు హైకోర్టులో కేసులు వేయించారు. అనంతరం 2024 జూన్‌లో రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ, గత ప్రభుత్వంపై కక్షగట్టి హైకోర్టులో పిటిషన్లు వేయించిన ప్రస్తుత అధికార పక్షం.. ఇప్పుడు కూడా అదే పంథాను అనుసరించడం చూస్తుంటే 2026లో కూడా గ్రూప్–2 ఫలితాలు వస్తాయన్న ఆశలేదని అభ్యర్థులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పోర్ట్సు కోటాతో ఫలితాలను ముడిపెట్టి అడ్డుపడుతోందని వారు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీపీఎస్సీ కార్యాలయం వద్ద నిరసనకు యత్నించిన అభ్యర్థులను కార్యాలయానికి రాకుండానే బెదిరించి వెనక్కి పంపేసినట్లు తెలిసింది.

మూడు నెలల్లో ప్రిలిమ్స్.. ఏడాది తర్వాత మెయిన్స్..

నిజానికి.. గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో 2023 డిసెంబరులో 905 పోస్టులతో గ్రూప్–2 నోటిఫికేషన్ ఇచ్చి ప్రిలిమ్స్ 2024 ఫిబ్రవరి 25న నిర్వహించింది. మెయిన్స్ అదే ఏడాది మే/జూన్‌లో జరుగుతాయని ఏపీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. అయితే, ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహించి నెలరోజుల్లో ఫలితాలు ప్రకటించారు. అనంతరం 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసి మేలో మెయిన్స్‌కు ఏర్పాట్లుచేశారు. అలాగే, గ్రూప్–1కి కూడా 2023 డిసెంబరులోనే దాదాపు 90 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి మార్చిలో ప్రిలిమ్స్ నిర్వహించారు. ఈ క్రమంలో వైఎస్ జగన్ ప్రభుత్వానికి పేరు వస్తుందన్న అక్కసుతో కొందరు టీడీపీ నాయకులు అభ్యర్థులతో హైకోర్టులో పిటిషన్లు వేయించారు. ముఖ్యంగా గ్రూప్–1పై ఈ కేసులు వేయడంతో పాటు గ్రూప్–2పైనా అదనపు పిటిషన్లు వేయించారు. దీంతో 2024 మే, జూన్‌లో జరగాల్సిన మెయిన్స్‌కు బ్రేకులు పడ్డాయి. అనంతరం చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో అడ్డంకులు తొలగిపోతాయని అభ్యర్థులు ఆశించారు. కానీ, కూటమి ప్రభుత్వం రాగానే ఏపీపీఎస్సీని అస్తవ్యస్థం చేసింది. అనేక రకాల డ్రామాల నడుమ 2025 ఫిబ్రవరి 23న గ్రూప్–2 మెయిన్స్.. నిర్వహించి గతనెలలో సర్టిఫికెట్ల పరిశీలన, కంప్యూటర్ నైపుణ్య పరీక్షలు పూర్తిచేశారు. అదే ఏడాది మేలో గ్రూప్–1 మెయిన్స్ నిర్వహించారు.

ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షల తీరిదీ..

నోటిఫికేషన్	: 2023 డిసెంబరు
మొత్తం పోస్టులు	: 905
ప్రిలిమ్స్	: 2024 ఫిబ్రవరి 25
మెయిన్స్	: 2025 ఫిబ్రవరి 23
తుది ఫలితాలు	: ?

హైకోర్టు అడ్డంకులు తొలగినా సరే..

ఇక గ్రూప్–1, 2 ఫలితాల విడుదలకు హైకోర్టులో అడ్డంకులు తొలగినప్పటికీ ప్రభుత్వం, ఏపీపీఎస్సీ రెండూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా స్పోర్ట్సు కోటా పోస్టులను పక్కనబెట్టి, మిగిలిన పోస్టులకు ఫలితాలు ప్రకటించుకోవచ్చని హైకోర్టు స్పష్టతనిచ్చింది. అయితే, ఫలితాలు మరింత ఆలస్యమవుతాయని ఏపీపీఎస్సీ ఇటీవల ప్రకటించడం అభ్యర్థుల్లో ఆందోళనను రెట్టింపు చేసింది. ఇప్పుడు ఫలితాలు ప్రకటించకపోతే మెయిన్స్ రాసి సీపీటీకి ఎంపికగాని అభ్యర్థులు మళ్లీ డివిజనల్ బెంచ్, సుప్రీంకోర్టుకు వెళ్తే ఈ నోటిఫికేషన్ పూర్తికావడానికి ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. ఈ నోటిఫికేషన్ పూర్తికాకుండా కొత్త జాబ్ కేలండర్ ఇవ్వడం కుదరదని ప్రభుత్వం పరోక్షంగా చెబుతోంది. దీంతో ఎంపికగాని అభ్యర్థులు మరోసారి డివిజనల్ బెంచ్‌కు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

జగన్ పాలనలో దేశంలోనే నం.1గా ఏపీపీఎస్సీ..

ఇదిలా ఉంటే.. వైఎస్ జగన్ హయాంలో కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల సర్వీస్ కమిషన్ల పనితీరుపై విడుదల చేసిన నివేదికలో దేశంలోని 15 రాష్ట్రాల సర్వీస్ కమిషన్లు వివాదాల్లో చిక్కుకోగా.. వివాదరహిత కమిషన్‌గా ఏపీపీఎస్సీ ప్రథమ స్థానంలో నిలిచింది. కానీ, ఇప్పుడు చంద్రబాబు సర్కారు ఏపీపీఎస్సీని తిరిగి వివాదాల్లోకి నెట్టి నిరుద్యోగ యువత ఆశలను ఛిద్రం చేస్తోంది. 2018 డిసెంబరులో నాటి టీడీపీ ప్రభుత్వం 32 నోటిఫికేషన్లు ఇచ్చి ఒక్కదానికి కూడా పరీక్షలు నిర్వహించలేదు. ఇప్పుడు కూడా చంద్రబాబు ప్రభుత్వంలో 2018 నాటి పరిస్థితే కనిపిస్తుండడం యువతను ఆందోళనకు గురిచేస్తోంది.

క్లుప్తంగా...

రెడ్‌బుక్ రాజ్యాంగంతో రక్తపాతం

ప్రభుత్వంపై ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఆగ్రహం

అర్చకుడు సీతారామశర్మను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం/తాళ్లరేవు: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ టీడీపీ నాయకులు రక్తపాతం సృష్టిస్తున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో భగవంతుడి సేవలో ఉన్న పూజారిపై టీడీపీ నాయకుడి కుమారుడు వేట కొడవలితో కిరాతకంగా దాడికి పాల్పడడం దారుణమన్నారు. గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అర్చకుడు ఇంద్రగంటి సుందర సీతారామశర్మను పొన్నాడ సతీష్ సోమవారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు పాలనలో నిత్యం దాడులు, దారుణాలతో రాష్ట్రం అట్టుడుకుతోందని మండిపడ్డారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జార్జిపేటలోని రామాలయ అర్చకుడు సీతారామశర్మపై శనివారం టీడీపీ గ్రామ నాయకుడి కుమారుడు కొండమూరి శివయ్య వేట కొడవలితో దాడి చేశాడని చెప్పారు. శివయ్యపై మానసిక రోగి అని ముద్ర వేసి శిక్ష పడకుండా తప్పించే ప్రయత్నాలు చేయడం దారుణమని విమర్శించారు. ఆలయాల్లో నిత్యం చోటు చేసుకుంటున్న అవాంఛనీయ ఘటనలు ప్రభుత్వ వైఫల్యాన్ని తేటతెల్లం చేస్తున్నాయని విమర్శించారు. తిరుపతి, సింహాచలం, శ్రీకాకుళం ఘటనలతోపాటు తాళ్లరేవులోని తాజా దాడిపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన శివయ్యకు టీడీపీ నేతలు కొమ్ము కాయడం సిగ్గుచేటన్నారు. క్షతగాత్రుడు సీతారామశర్మకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శివయ్యను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నారావారిపల్లెకు చేరుకున్న సీఎం చంద్రబాబు

అర్జీలు స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

చంద్రగిరి: ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు స్వగ్రామం తిరుపతి జిల్లా నారావారిపల్లెకు చేరుకున్నారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నేతలతో కలిసి బుధవారం సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. 15వ తేదీన తమ గ్రామ దేవత నాగాలమ్మ అమ్మవారిని సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా దర్శించుకుంటారు. అదే రోజున నారావారిపల్లె నుంచి అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ మృతి

సూర్యనారాయణ (ఫైల్)

శ్రీకాకుళం: శ్రీకాకుళం టీడీపీ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ (77) సోమవారం మృతి చెందారు. ఆదివారం శ్రీకాకుళంలోని తన ఇంట్లో ప్రమాదవశాత్తు కిందపడ్డారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయనను చేర్చారు. అక్కడ సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయన భౌతిక కాయాన్ని అరసవల్లిలోని స్వగృహానికి తరలించారు. కుమారులు అమెరికా నుంచి సోమవారం అర్ధరాత్రి రానున్నారు. మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన మృతిపై మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సంతాపం వ్యక్తం చేశారు.

వక్ఫ్ భూములేగా..

ఉఫ్ మనిపిద్దాం

ఆగని చంద్రబాబు ప్రభుత్వ కుట్రలు

రూ.వందల కోట్ల విలువైన భూములపై పచ్చగద్దల కన్ను

- టైటిల్ మార్పు కుదరదన్న వక్ఫ్‌బోర్డు తీర్మానం సైతం బేఖాతర్
- ముస్లిం సమాజం నిరసిస్తున్నా బాబు సర్కారు పన్నాగాలు
- వక్ఫ్ చట్టానికి విరుద్ధంగా ఏపీఐఐసీకి బదలాయించే ఎత్తులు
- ఏపీఐఐసీ నుంచి ఇండస్ట్రియల్ పార్కుల పేరుతో ఫలహారం
- చినకాకానిలో అంజుమన్ ఎ ఇస్లామియాకు చెందిన 71.57 ఎకరాలకు నోటిఫికేషన్
- అభ్యంతరాలకు 60 రోజుల గడువిచ్చిన కలెక్టర్
- ఆపై గుంటూరు జామియా మసీదుకు చెందిన మల్లాయపాలెం భూమి 238.18 ఎకరాలు..
- తాడికొండ మసీదు భూమి వంద ఎకరాలు.. కొండపల్లి ఖాజీ మాన్యం 50 ఎకరాలపైనా కన్ను

గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న అంజుమన్ ఎ ఇస్లామియా కమిటీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: వక్ఫ్ భూములా..! ఉఫ్ మనిపించేద్దాం అన్నవిధంగా ఉంది చంద్రబాబు ప్రభుత్వ ధోరణి. రూ.వందల కోట్ల విలువైన భూములను పచ్చ గద్దలు కాజేసేందుకు పెద్ద స్కెచ్ వేసింది. గత ఏడాది మొదలైన ఈ ప్రయత్నాలకు వక్ఫ్‌బోర్డు తీర్మానంతో తాత్కాలిక బ్రేక్ పడినా ఇప్పుడు మళ్లీ ఊపందుకుంది. వక్ఫ్ చట్టానికి విరుద్ధం అంటూ న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నా... లీజుకైతే ఓకే, వక్ఫ్ ఆస్తుల టైటిల్ మార్పునకు వీల్లేదు.. అని బోర్డు చెబుతున్నా భూములను కాజేసే కుట్రలు ఆగడం లేదు. విలువైన ఆస్తులను పరులపాలు చేసి, దాతల ఆశయాన్ని దెబ్బతీయొద్దని ముస్లిం సమాజం ఎన్ని విధాలుగా కోరుతున్నా చంద్రబాబు ప్రభుత్వానికి చెవికెక్కడం లేదు. తన దారుణమైన కుయుక్తులను కొనసాగిస్తూనే ఉంది.

➤ గుంటూరు షాహీ జామియా మసీదుకు చెందిన మల్లాయపాలెంలోని 233.18 ఎకరాలు, గుంటూరులోని అంజుమన్ ఎ ఇస్లామియా సంస్థకు చెందిన మంగళగిరి మండలం చినకాకానిలోని 71.57 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో ఏపీఐఐసీకి భూ సేకరణ ద్వారా బదలాయించేందుకు చంద్రబాబు ప్రభుత్వం ఏడాది నుంచి ఎడతెగని ప్రయత్నాలు చేస్తోంది. మల్లాయపాలెంలోని భూములను ఏపీఐఐసీకి భూ సేకరణ పేరుతో అప్పగించేందుకు గత ఏడాది మార్చిలో తెనాలి సబ్ కలెక్టర్ ఏపీఐఐసీ అధికారులకు లేఖ రాయడాన్ని 'సాక్షి' బయటపెట్టింది. రూ.వందల కోట్ల విలువైన వక్ఫ్ భూములను పచ్చ నేతలకు అప్పగించేందుకు చేసిన ఆ ప్రయత్నాలను ముస్లిం సమాజం కూడా తీవ్రంగా తప్పుబట్టింది.

టైటిల్ మార్చడానికి కుదరదన్నా...

మల్లాయపాలెం వక్ఫ్ భూములను ఏపీఐఐసీకి అప్పగించే ప్రధాన అంశంపై ఏకాభిప్రాయం సాధించలేమని భావించిన వక్ఫ్‌బోర్డు గతంలో రెండుసార్లు సమావేశాలను వాయిదా వేసింది. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ సొంత జిల్లా నెల్లూరులో నిరుడు జూలైలో నిర్వహించిన సమావేశం వక్ఫ్ టైటిల్‌ను మార్చడాన్ని (పూర్తిగా అన్యాక్రాంతం) తిరస్కరించింది. భూములను లీజు, పీపీపీ పద్ధతిలో మాత్రమే ఇస్తామని తీర్మానించింది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికీ నివేదించింది. ఏపీ భూ సేకరణ చట్టం–2018లోని సెక్షన్ 22ని అనుసరించి అతి తక్కువ ధరకు ఏపీఐఐసీకి అప్పగించాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రతిపాదన చేయగా... కుదరదని తేల్చిచెప్పింది. లీజు, పీపీపీలో అభివృద్ధి ఏది కావాలో ఎంచుకోమని సూచించడం గమనార్హం. అయితే, ప్రభుత్వానికి వక్ఫ్ బోర్డు చేసిన లీజు, పీపీపీ రెండు ప్రతిపాదనలను కొందరు బోర్డు సభ్యులు, ముస్లిం సంఘాల ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వక్ఫ్ భూములను లీజు, విక్రయం, బహుమతి (గిఫ్ట్)గా ఇవ్వడం కుదరదని వక్ఫ్ చట్టం–1995లోని సెక్షన్–51 స్పష్టం చేస్తోందని చెబుతున్నారు.

మళ్లీ నోటిఫికేషన్‌తో కలకలం

తాజాగా గుంటూరు అంజుమన్ ఎ ఇస్లామియా సంస్థకు చెందిన మంగళగిరి మండలం చినకాకానిలోని 71.57 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో ఏపీఐఐసీకి అప్పగించేందుకు నోటిఫికేషన్ జారీ చేయడం కలకలం రేపుతోంది. భూ సేకరణ ద్వారా తీసుకుంటున్నామని, అభ్యంతరాలు ఉంటే 60రోజుల్లో తెలపాలని జిల్లా కలెక్టర్ డిసెంబరు 19న నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో వక్ఫ్ భూముల సేకరణకు ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్టైంది. మల్లాయపాలెంలోని 233.18 ఎకరాలను కూడా మలేసియా కంపెనీలకు ఇండస్ట్రియల్ పార్కు పేరుతో ధారాదత్తం చేసేందుకు చర్చలు జరిగాయి. ఆ సంస్థ ప్రతినిధులు భూములను పరిశీలించినట్టు విశ్వసనీయ సమాచారం. తాడికొండ జామియా మసీదుకు చెందిన వంద ఎకరాలు, కొండపల్లి ఖాజీ మాన్యం 50 ఎకరాలను కూడా భూ సేకరణ పేరుతో తీసుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు ఊపందుకున్నట్టు సమాచారం.



... Empowerment, Efficiency and Development Act, 1995 As amended by the Waqf (Amenoment) Act, 2025 and the rules therein.

Subsequently, the Board resolved to request the Government, to work out the possible remedies without transfer of the Title for the subject project which are feasible through PPP Mode or on long lease or any other scheme, which will be beneficial both to the Waqf institution for fulfillment of its object of Waqf as well as for the cause of establishment of the project i.e. industrial park initiated by the Government."

మల్లాయపాలెం భూములను ఏపీఐఐసీకి టైటిల్ బదలాయించడం కుదరదని తేల్చి చెబుతూ గతేడాది జూలైలో వక్ఫ్‌బోర్డు చేసిన తీర్మానం

న్యాయ పోరాటం చేస్తాం

ముస్లిం సమాజంలోని పేదల అభివృద్ధి, సంక్షేమం, పిల్లల విద్యను కాంక్షిస్తూ దాతలు మహోన్నత ఆశయంతో భూములు ఇచ్చారు. దానిని నీరుగార్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తే న్యాయ పోరాటం చేస్తాం. వక్ఫ్ భూములను ఇతర శాఖలు, వ్యక్తులకు అన్యాక్రాంతం చేయడం సరికాదు. ఏపీఐఐసీకి అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వానికి వక్ఫ్‌బోర్డు ఆస్తుల టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ బదిలీ చేయడం సాధ్యం కాదు. లీజు, పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేసి వక్ఫ్‌బోర్డుకు ఆదాయం పెంచి ముస్లింల సంక్షేమం, విద్యకు ఉపయోగించాలి.

– షేక్ నాగుల్‌మీరా,
ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు

చినకాకాని వక్ఫ్ భూముల భూ సేకరణ నిలిపేయాలి

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని చినకాకాని గ్రామంలో ఉన్న వక్ఫ్ భూముల సేకరణ ప్రక్రియను తక్షణమే నిలిపేయాలని అంజుమన్ ఎ ఇస్లామియా కమిటీ డిమాండ్ చేసింది. ఈ విషయమై అంజుమన్ ఎ ఇస్లామియా కమిటీ కార్యదర్శి షేక్ సైదా నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించింది. పారిశ్రామిక పార్కు పేరుతో 71.57 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ భూములు వక్ఫ్ చట్టం –1995 ప్రకారం నమోదైన వక్ఫ్ ఆస్తులని, వాటిని రాష్ట్ర వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా సేకరించడం చట్టవిరుద్ధమని, ఈ భూ సేకరణ చర్యలు చెల్లుబాటు కావని చెప్పారు. వక్ఫ్ భూముల భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

పండుగనాడు పస్తులేనా?

గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాల టీచర్లకు అందని వేతనాలు

సాక్షి, అమరావతి: అసలే భద్రతలేని ఉద్యోగాలు.. ఆపై ఇచ్చే అరకొర జీతాలు నెలల తరబడి చెల్లించరు.. ఇలా అయితే ఎలా.. పండుగనాడు పస్తులేనా.. అంటూ గిరిజన, ఏకలవ్య, సాంఘిక సంక్షేమ గురుకులాల టీచర్లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సంక్రాంతి వచ్చినా తమకు వేతనాలు అందకపోవడంతో చంద్రబాబు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అడవి బిడ్డలకు, అట్టడుగు వర్గాల పిల్లలకు అక్షరాలు దిద్దించే తమకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులపాలవుతున్నామని బాధపడుతున్నారు. రాష్ట్రంలోని 199 గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేసే సుమారు 1,600 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులకు రెండు నెలల (నవంబర్, డిసెంబర్) జీతాలు ఇవ్వలేదు. వారిలో గతం నుంచి పనిచేస్తున్న వారితోపాటు డీఎస్సీ–2025 ద్వారా భర్తీ అయిన రెగ్యులర్ టీచర్లు కూడా ఉన్నారు. వారితోపాటు అవే గురుకులాల్లో పనిచేస్తున్న 1,659 మంది ఔట్‌సోర్సింగ్ టీచర్లకు డిసెంబర్ నెల వేతనం ఇవ్వలేదు. రెగ్యులర్ టీచర్లతో పోస్టులు భర్తీ కావడంతో అవుట్‌సోర్సింగ్ వారిని సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కాలయాపన చేయడంతోపాటు ఆరునెలలుగా సకాలంలో వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఏకలవ్య గెస్ట్ టీచర్లను దగా చేశారు

రాష్ట్రంలో 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో (గురుకులాల్లో) పనిచేస్తున్న 200 మంది గెస్ట్ టీచర్లను కూడా చంద్రబాబు ప్రభుత్వం దగా చేసింది. వారికి ఇచ్చే జీతానికి సైతం ఈ ఏడాది జూన్ నుంచి దారుణంగా కోతపెట్టింది. ఆ తగ్గించిన జీతాన్ని కూడా సకాలంలో ఇవ్వడం లేదు. ఏకలవ్య గురుకులాల్లో పనిచేసే టీచర్లలో నెలకు రూ.45 వేలు ఉన్న జీతాన్ని రూ.35 వేలకు, రూ.42 వేలు ఉన్న జీతాన్ని రూ.33 వేలకు తగ్గించారు. తగ్గించిన జీతాలను కూడా రెండు నెలలుగా ఇవ్వలేదు.

అంబేడ్కర్ గురుకులాల్లోనూ వేతన వెతలే..

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో (గురుకులాల్లో) పనిచేసే సుమారు 2,300 మందికీ వేతన వెతలు తప్పలేదు. మూడునెలలుగా జీతాలు రాక వీరు పడుతున్న అవస్థలను గతేడాది నవంబర్‌లో సాక్షి వెలుగులోకి తెచ్చింది. దీంతో అప్పటికప్పుడు రెండునెలల వేతనాలిచ్చిన ప్రభుత్వం తరువాత పట్టించుకోలేదు. వీరికి గత నవంబర్, డిసెంబర్ నెలల జీతాలు ఇంకా ఇవ్వలేదు. ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న సుమారు 800 కాంట్రాక్ట్ టీచర్లు (సీఆర్‌టీలు), 1,700 మంది పార్ట్ టైమ్, అడ్‌హాక్, ఔట్‌సోర్సింగ్ టీచర్లకు రెండునెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుకులాల్లో పూర్తి బాధ్యతలు నిర్వర్తిస్తూ పేరుకు పార్ట్‌టైమ్ అని చిన్న జీతాలు పొందుతున్న టీచర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర విమర్శనీయంగా ఉంది. చంద్రబాబు ప్రభుత్వం రాకముందు సక్రమంగా జీతాలు వచ్చేవని, ఇప్పుడు నెలల తరబడి పెండింగ్ పెడుతున్నారని ఆయా టీచర్లు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

మా భూములు తీసుకుంటే సహించేది లేదు

గుంటూరు కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న నారా కోడూరు రైతులు

- సహాయం కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తాం
- భూములు కోల్పోతున్న చేబ్రోలు మండలం నారా కోడూరు గ్రామస్తులు

గుంటూరు వెస్ట్: ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో చిన్న, సన్నకారు రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందుల పాల్జేస్తోందని, ఖరీదైన పొలాలు రింగ్ రోడ్డులో పోతే తమ జీవితాలు రోడ్డున పడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారా కోడూరు ప్రాంత రైతులు సుమారు 150 మంది సోమవారం గుంటూరులోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు తమ గోడు వెళ్లబోసుకుని చంద్రబాబు సర్కారుపై ఫిర్యాదు చేశారు. నారా కోడూరు ప్రాంతంలో ఔటర్‌రింగ్ రోడ్డు పేరిట సుమారు 650 ఎకరాల పచ్చని పొలాలను అక్రమంగా తీసుకుంటున్నారని వారు వాపోయారు. ఈ రోడ్డుకు సుమారు 80 ఎకరాలు అవసరం అవుతుందని, అంతవరకు ఇవ్వడానికి తమకు ఇబ్బంది లేదని చెబుతున్నారు. అయితే అవసరం లేకపోయినా పచ్చని పొలాలను తీసుకుంటే సహించేది లేదంటున్నారు. 2014–19 కాలంలో రాజధాని పేరిట సుమారు 35 వేల ఎకరాలు రైతుల నుంచి తీసుకుని వారిని ఇప్పటికీ వేధింపులకు గురిచేస్తున్న పరిస్థితిని చూస్తున్నామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా రైతులను ఇబ్బందులు పెట్టలేదని.. జగనన్న కాలనీల కోసం తీసుకున్న భూములకు క్రమం తప్పకుండా డబ్బులు కూడా చెల్లించారని గుర్తు చేసుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌తో పాటు ఇతర నాయకులను కలిసి తమ పరిస్థితిని వివరించి సహాయం కోరుతామని చెబుతున్నారు.

రాజకీయ క్రీడ ఆడుతున్నారా ?

ఇటీవల కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర నారా కోడూరు ప్రాంత రైతులను కలిసి వివరాలు అడిగారని రాంబాబు అనే రైతు తెలిపాడు. రైతుల తరపున పోరాటం చేస్తామన్నారని.. అయితే వారికి తెలియకుండానే భూములకు మార్కింగ్ జరిగిందా? అని నిలదీస్తున్నారు. తమతో రాజకీయ క్రీడలు ఆడితే భవిష్యత్ గల్లంతేనని హెచ్చరిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులపై ప్రభుత్వం ఎందుకు కక్ష కడుతుందో అర్థం కావడం లేదంటున్నారు. గ్రామసభ కూడా నిర్వహించకుండా, రైతులకు చెప్పకుండా భూములు తీసుకుంటామనడం దారుణమన్నారు. రైతుల ఉసురు తగిలితే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని రైతులంతా చెబుతున్నారు.

ఇది ఉద్యోగులను ముంచే ప్రభుత్వం

- 20 నెలలైనా పీఆర్సీ, ఐఆర్‌పై స్పందన లేదు
- గత సంక్రాంతికి పోలీసులకు రెండు సరెండర్ లీవ్‌లు ఇస్తానన్నారు
- మళ్లీ సంక్రాంతి వచ్చినా ఇవ్వలేదు
- 10–11 తేదీలొచ్చినా జీతం రావట్లేదు
- ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి

సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వానికి ఉద్యోగులంటే లెక్కలేనితనం స్పష్టంగా కనపడుతోందని,. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అవుతున్నా ఇంతవరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్సీ, ఐఆర్‌పై కనీసం స్పందించడం లేదని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినా చేయలేదని, పీఆర్సీ వేయలేదని విమర్శించారు. గత సంక్రాంతికి ఇస్తారని చూసినా ఉద్యోగులకు నిరాశే మిగిలిందని, మళ్లీ సంక్రాంతి వచ్చినా ప్రభుత్వంలో చలనం లేదని, ఇది మంచి ప్రభుత్వం కాదని ఉద్యోగులను ముంచే ప్రభుత్వమని వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. గత సంక్రాంతికి పోలీసులకు 2 సరెండర్ లీవ్‌ల బిల్లులు చెల్లిస్తామని స్వయంగా ఆర్థిక మంత్రి హామీ ఇచ్చారని, మళ్లీ సంక్రాంతి వచ్చినా అవి పూర్తిగా చెల్లించలేదని విమర్శించారు. దీపావళి సందర్భంగా సీఎం ఉద్యోగ సంఘాల నాయకులందరి సమక్షంలో పోలీసులకు ఒక సరెండర్ లీవ్ బిల్లు రూ.210 కోట్ల రూపాయలను సగం సగం చేసి రెండు విడతలుగా నవంబర్, డిసెంబర్ నెలలలో చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇంతవరకు సగం చెల్లించలేదని దుయ్యబట్టారు. ఉద్యోగులకు రూ.35 వేల కోట్ల బకాయిలు ఉంటే అందులో రూ.210 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చి అవి కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు.

ఉద్యోగులంటే ఇంత నిర్లక్ష్యమా?

పోలీసులకు రికార్డు స్థాయిలో 6 సరెండర్ లీవ్‌ల బిల్లులు పెండింగ్ పెట్టిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కిందని వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. రిటైరయిన వారికి 18 నెలలుగా గ్రాట్యుటీ చెల్లించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఉద్యోగులకు 9 హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి 20 నెలలవుతున్నా ఇంతవరకు ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. సీపీఎస్, జీపీఎస్‌ను సమీక్షించి అందరికీ ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానం తీసుకొస్తామని చెప్పిన చంద్రబాబు సర్కారు అధికారంలోకి రాగానే హడావుడిగా గత ప్రభుత్వం తెచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిందని, 20 నెలలు అవుతున్నా ఇంతవరకు సీపీఎస్ గురించి మాట్లాడటం లేదని ధ్వజమెత్తారు. ఇక ఒకటో తేదీన జీతం ఇస్తామన్న హామీకి తిలోదకాలు వదిలిందని, గతంలో 4 – 5 తేదీల్లో జీతం వచ్చేదని, ఇపుడు కొన్ని నెలల్లో ఉద్యోగులకు 10, 11 తేదీలొచ్చినా జీతాలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పైగా ఉద్యోగులను ఈ సర్కారు తీవ్రంగా వేధిస్తోందని విమర్శించారు. సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచే స్థాయికి కూటమి సర్కారు దిగజార్చిందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని, ఈ సంక్రాంతికైనా పీఆర్సీ వేయడంతోపాటు ఐఆర్ ఇవ్వాలని వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు.

ఒక నాయకుడి నిజమైన సంపద ప్రజల నమ్మకం. ఆ నాయకుడు కూడబెట్టుకునే ఆస్తి కాదు.
- ని. అమృతా మీనన్

సాక్షి

మంగళవారం, 13 జనవరి 2026

అష్టదిగ్బంధంలో ఇరాన్!

సమస్యలున్నచోట నిప్పురాజేయటం సులభం. నిన్న మొన్నటివరకూ అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులతో ఊపిరాడని ఇరాన్ ఇప్పుడు నిరసనలతో అట్టుడుకుతోంది. భవనాలు, బస్సులు, దుకాణాలు తగలబడుతున్నాయి. రాజధాని తెహ్రాన్ నగరం యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తోంది. అదొక్కటే కాదు...దేశంలోని 31 ప్రావిన్సుల్లో ఉన్న 180 నగరాలు, పట్టణాలు ఇప్పుడు ఆగ్రహావేశాలతో రగులుతున్నాయి. ద్రవ్యోల్బణం చుక్కలనంటుతూ, కరెన్సీ విలువ పడిపోతూ దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటున్న జనం గత రెండువారాలుగా రోడ్లపై వెల్లువెత్తుతుండగా, ఇంతవరకూ సైన్యం, పోలీసులు జరిపిన కాల్పుల్లో 538 మంది మరణించారు. పదివేలమందిని జైళ్లలోపెట్టారు. మొత్తానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెనిజులాలో సాధించలేనిది ఇరాన్‌లో సునాయాసంగా చేయగలిగారు. వెనిజులాలో ఇదే మాదిరి ప్రేరేపించి, ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందన్న సాకుతో అధ్యక్షుడు నికోలస్ మదురోను గద్దె దించాలని ట్రంప్ ఏడాదిగా ప్రయత్నించారు. అది అసాధ్యం కావటంతో నేరుగా సైన్యాన్ని పంపి మదురో దంపతుల్ని అపహరించారు. ప్రస్తుతం ఇరాన్‌పై దాడులు చేయటానికి అమెరికా సంసిద్ధమవుతోంది.

దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అమెరికా, పాశ్చాత్యదేశాలు పగబట్టి అమలు చేస్తున్న ఆర్థిక ఆంక్షలతో ఇరాన్ తీవ్రంగా దెబ్బతింది. నిత్యావసరాలు దొరక్క ప్రజలు సతమతమవుతున్నారు. ప్రాణావసర ఔషధాల కొరత వేధిస్తోంది. తగిన వైద్య సదుపాయాలు కరవై రోగాల బారిన పడిన చిన్నపిల్లలు కన్నుమూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఆగ్రహావేశాలు పెల్లుబకటం, నిరసనలు వెల్లువెత్తడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఇటీవల ఆందోళనకారుల నుంచి స్వాధీనం చేసుకున్న ఐఫోన్‌లో విదేశీ మహిళగా భావిస్తున్న ఒకామె అరెస్టయినప్పుడు ఏం చేయాలో, ఎలాంటి ప్రకటనలివ్వాలో చెప్పే వీడియో బయటికొచ్చింది. తమ వెనుక ఎవరూ లేరని... దుర్భర పరిస్థితుల్ని తట్టుకోలేక నిరసనల్లో పాలుపంచుకుంటున్నట్టు చెప్పాలన్న హితబోధ ఉంది.

ఇరాన్‌కు ఇలాంటి నిరసనలు కొత్తగాదు. 1979లో ఇరాన్ షా మహమ్మద్ రెజా పెహ్లావీని గద్దెదించిన ఇస్లామిక్ విప్లవం అనంతరం పాశ్చాత్య దేశాలు సమయం కోసం కాచుక్కూర్చున్నాయి. 2022లో మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం, ఉనికి కోసం అంటూ సాగిన ఉద్యమాన్ని ప్రభుత్వం అణిచేయగలిగింది. ఇక అడపా దడపా ఏదో ఒక వంకతో ఇరాన్‌పై క్షిపణుల్ని ప్రయోగించటం, దేశ సైన్యంలో కీలకపాత్ర పోషిస్తున్న వారిని, అణు శాస్త్రవేత్తలనూ హత్యలు చేయించటం ఇజ్రాయెల్‌కు రివాజు. ఇలా జరిగిన ప్రతిసారీ ద్రోహుల్ని పట్టుకున్నామని ప్రభుత్వం ప్రకటించి, బహిరంగంగా ఉరిశిక్షలు అమలు చేస్తోంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి ఆందోళనల తీవ్రత ఎక్కువుంది. దిగువ తరగతి ప్రజలతో పాటు మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు కూడా ఈ నిరసనల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి.

నిరసనలు చల్లార్చటానికి ప్రభుత్వం ప్రయత్నించకపోలేదు. దుకాణదారుల డిమాండ్లకు స్పందనగా సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చారు. ప్రతి ఇంటికీ నెలకు ఏడు డాలర్ల మొత్తం ఇచ్చేందుకు అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అంగీకరించారు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ఉద్యమకారులు వెనక్కి తగ్గేది లేదన్నారు. సాధారణ ప్రజానీకం సమస్యల్ని పరిష్కరిస్తానని, ప్రభుత్వ జోక్యాన్ని తగ్గిస్తానని అధికారం లోకొచ్చిన మసూద్ పూర్తిగా విఫలమయ్యారు. ప్రభుత్వంలో పెచ్చరిల్లిన అవినీతిని అరికట్టలేక పోయారు. ప్రజల్లో అసంతృప్తి కనబడుతున్నా నాయకత్వం నిస్తేజంగా ఉండిపోయింది. పైపెచ్చు నిరసనల్లో పాల్గొంటున్న వారిని 'దేవుడికి వ్యతిరేకంగా యుద్ధం సాగిస్తున్నార'ంటూ కేసులు పెట్టడం, అరెస్టులు చేయటం ప్రజల్ని మరింత రెచ్చగొట్టింది. ఈ నేరారోపణ కింద ఉరిశిక్షతో సహా కఠినమైన శిక్షలు విధించటానికి ప్రభుత్వానికి అధికారం లభిస్తుంది. అమెరికాలో స్థిరపడిన ఒకప్పటి నియంత ఇరాన్ షా కుమారుడు రెజా పెహ్లావి తానొచ్చి దేశాన్ని ఉద్ధరిస్తానంటున్నారు. ఛాందసవాద ధోరణుల్ని తగ్గించుకుని ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పితే తప్ప బలప్రయోగంతో నిరసనలు అణిచేయటం అసాధ్యమని ఇరాన్ పాలకులు గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.దశమి ప.3.57 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** విశాఖ రా.1.01 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** తె.5.27 నుండి 7.15 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.35 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.46 వరకు, **అమృత ఘడియలు:** ప.3.21 నుండి 5.07 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

నాణ్యత

నీ మనసు నిన్ను బాధ పెట్టినంతగా ప్రపంచంలో ఏదీ నిన్ను బాధ పెట్టదు. ఇతరులు నిన్ను బాధపెడుతున్నట్లు అనిపిస్తుంది కానీ, నిజానికి నిన్ను బాధ పెట్టేది నీ మనసు. మన జీవితాల నాణ్యత మన మనస్సుల నాణ్యతలపై ఆధారపడి ఉంటుంది.

– శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక గురువు

కుటుంబం

అంతరిక్షంలోకి వెళ్లే వారెవరైనా ముందుగా తమ సొంత దేశాన్ని చూడటానికి ప్రయత్నిస్తారు. అయితే, ఆ వెంటనే వారికి అర్థమైపోతుంది, దేశాల మధ్య సరిహద్దులు కనిపించేది భూమి మీదే కానీ, అంతరిక్షంలోంచి కనిపించేది 'ప్రపంచం' అనే కుటుంబం మాత్రమేనని!

– రాకేశ్ శర్మ, భారత తొలి వ్యోమగామి

కొనలేనివి

కొన్నిసార్లు గాఢ నిద్ర కూడా ఏమిచ్చినా దక్కని 'విలాసం' కావచ్చు. మన దగ్గర ఎంత డబ్బుండీ దానిని కొనలేము. డబ్బుతో కొనలేనివి ఇంకా చాలానే ఉన్నాయి. ప్రజల ఆప్యాయత, ప్రేమ, గౌరవం, కుటుంబం, స్నేహితులతో చిరస్మరణీయ క్షణాలు, పెద్దల ఆశీస్సులు!

– గజ్ సింగ్, జోధ్‌పుర్ మహారాజు

జనరేషన్

ఐక్యతలో 'మనం', 'వారు' అనే భావనలకు తావు లేదు. ఉన్నది 'మనం' అన్నదొక్కటే. ఒకలా ఆలోచించేవారంతా కలిసి సామాజిక పురోగతి కోసం పాటు పడాలి. కొత్త జనరేషన్‌కు తలరాతల్ని మార్చే శక్తి ఉంది. వారితో కలిసి నడవటమే ఇప్పుడు ఎవరైనా చేయాల్సింది.

– ఫరా పండిత్, మాజీ దౌత్యవేత్త

ఉత్తమం

అద్భుతమైన కోర్సులను మర్చిపోండి. అసలంటూ మీకు ఆసక్తి లేకుంటే ఆ కోర్సులు మీకు బోధించేదేమీ ఉండదు. వెళ్లండి. వెళ్లి, మీకు నచ్చిన పనిలో దిగిపోండి. మీ హృదయాన్ని, ఆత్మను అందులో పెట్టండి. అప్పుడు మీరేం చేసినా అందులో ఉత్తమంగా ఉంటారు.

– కల్యాణ్ వర్మ, వన్యప్రాణి చిత్ర నిర్మాత

రాబడి



నువ్వు ఎంత సంపాదిస్తున్నావన్నది కాదు, అందులోంచి ఎంత దాచిపెడుతున్నావో అది ముఖ్యం. 10 శాతంతో జీవించి, మిగిలిన మొత్తాన్ని నీలో, నీ నైపుణ్యాలలో పెట్టుబడి పెట్టు. జ్ఞానం మాత్రమే 1,000 రెట్ల రాబడిని అందించే ఏకైక ఇన్వెస్ట్‌మెంట్.

– డాన్ మార్టెల్, ఏంజెల్ ఇన్వెస్టర్

బురద రాజకీయాలు మానాలి!

అభిప్రాయం

మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

'రాయలసీమ ఎత్తిపోతల పథకం'పై బురద చల్లే కార్యక్రమాన్ని ఆపి సీమను ఆదుకునే పనిపై సంబంధిత పక్షాలన్నీ దృష్టి పెట్టాలి. ఈ పథకంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం తూతూ మంత్రంగా తప్పు పట్టడం, ఆ పథకం ప్రాధాన్యాన్ని తక్కువ చేసి మాట్లాడటం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం దీనికి ప్రత్యామ్నాయం అన్నట్లు మాట్లాడటం సరికాదు. కొంత మంది రాయలసీమ ఎత్తిపోతల పథకం అవసరం లేదనీ, 800 అడుగుల నుంచి నీరు తీసుకుంటే నీళ్లు కాదు బురద వస్తుందనీ మాట్లాడటం అభ్యంతరకరం. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ప్రత్యామ్నాయం కాదు. అసలు రెండు ప్రాజెక్టులకు పోటీ పెట్టి మాట్లాడటమే పొరపాటు. రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా రాయలసీమకు నీటిని గరిష్ఠ స్థాయిలో ఎలా తీసుకోవాలి అనే విషయంపై ప్రభుత్వం ఆలోచన చేయాలి.

ముచ్చుమర్రి ఎలా ప్రత్యామ్నాయం?

ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ప్రత్యామ్నాయంగా మాట్లాడుతున్నారు. శ్రీశైలంలో నీటిమట్టం 798 అడుగులు ఉన్నపుడు కూడా నీటిని తోడే అవకాశం ముచ్చుమర్రి ద్వారా సాధ్యం అవుతుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనలకు ప్రతిరూపమే ముచ్చుమర్రి. 2007లో వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు 90 కోట్ల రూపాయల ఖర్చుతో పాలనాపరమైన, ఆర్థిక పరమైన అనుమతులు ఇవ్వడంతో పాటు దాదాపు 50 శాతం పనులు పూర్తి చేశారు. అయితే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ముచ్చుమర్రి వలన ప్రయోజనాలు, పరిమితులను నిజాయతీగా విశ్లేషించుకోవాలి.

ఈ పథకం ద్వారా కేసీ కెనాల్‌కు 1,000 క్యూసెక్కులు, హంద్రీ–నీవా ప్రాజెక్టుకు 3,000 క్యూసెక్కుల నీటిని రెండు మార్గాల ద్వారా లిఫ్ట్ చేస్తున్నారు. మల్యాల నుంచి మరో 3,000 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేయడం ద్వారా హంద్రీ–నీవాకు సరఫరా చేస్తున్నారు. అయితే మల్యాల నుంచి లిఫ్ట్ చేయాలంటే శ్రీశైలంలో 834 అడుగులు నీరు ఉంటేనే సాధ్యం.

◆ కొందరు ఏకంగా శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నీరు లిఫ్ట్ చేస్తే బురద వస్తుందనడం అభ్యంతరకరం. తెలంగాణ ప్రభుత్వం 800 అడుగుల కింద నుంచే నీటిని లిఫ్ట్ చేస్తోంది. అక్కడెక్కడా రాని బురద రాయలసీమ ఎత్తిపోతల పథకంలో మాత్రమే వస్తుందనడం న్యాయమా?

ముచ్చుమర్రి దగ్గర కృష్ణానది నుంచి సిద్ధేశ్వరం దాకా 7 కి.మీ. మేరకు కాలువ తవ్వడం వలన నీటిని ఎత్తిపోతల ద్వారా హంద్రీ–నీవా, కేసీ కెనాల్‌లకు పరిమిత స్థాయిలో సరఫరా చేయవచ్చు. 11,574 క్యూసెక్కులు నిరాటంకంగా తోడితే ఒక టీఎమ్‌సీ నీటిని తోడవచ్చు. ఒక్క హంద్రీ–నీవాకే 40 టీఎమ్‌సీలు అవసరం. 2017లో ప్రారంభమైన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా గడిచిన 7, 8 సంవత్సరాలలో ఏడాదికి 7 నుంచి 9 టీఎమ్‌సీల నీటిని మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారు. హంద్రీ–నీవాకు 40 టీఎమ్‌సీలూ, కేసీ కెనాల్‌కు పూర్తి స్థాయి అవసరాలకూ అనుగుణంగా నీరు సరఫరా సాధ్యం కావడం లేదు. అలాంటి పరిస్థితిలో అదనంగా పోతిరెడ్డిపాడు ద్వారా నీరు విడుదల చేయాల్సిన ఎస్ఆర్‌బీసీ, జీఎన్ఎస్ఎస్, కేసీ కెనాల్, తెలుగుగంగ, నెల్లూరు జిల్లా సోమశిల వంటి వాటికి ముచ్చుమర్రి ద్వారా నీరు ఇవ్వడం ఎలా సాధ్యం అవుతుంది?

పోతిరెడ్డిపాడు కింద ఎస్ఆర్ఎమ్‌సీ వద్ద రోజుకు మూడు టీఎమ్‌సీల నీటిని సరఫరా చేసే అవకాశం రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా లభిస్తుంది. కానీ, ప్రభుత్వం మాత్రం ముచ్చుమర్రి ద్వారా మొత్తం సమస్యకు పరిష్కారం లభిస్తుంది అన్నట్లు మాట్లాడటం సరికాదు. ముచ్చుమర్రి ద్వారా వచ్చే పరిమిత ప్రయోజనాలను కొనసాగిస్తూ అదనపు ప్రయోజనాలకు అనుగుణంగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి.

అవగాహన లేని వ్యాఖ్యలు

కొందరు ఏకంగా శ్రీశైలంలో 800 అడుగులు నుంచే నీరు లిఫ్ట్ చేస్తే బురద వస్తుందనడం అభ్యంతరకరం. మరి అంతకన్నా కొన్ని అడుగుల క్రింద నుంచే గడిచిన ఏడెనిమిది సంవత్సరాలుగా ముచ్చుమర్రి ద్వారా నీటిని లిఫ్ట్ చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం 800 అడుగుల కింద నుంచే నీటిని లిఫ్ట్ చేస్తోంది. అక్కడెక్కడా రాని బురద రాయలసీమ ఎత్తిపోతల పథకంలో మాత్రమే వస్తుందనడం న్యాయమా? కొందరు మంత్రులు ఏకంగా ముచ్చుమర్రి నుంచే పోతిరెడ్డిపాడుకు నీరు లిఫ్ట్ చేసుకుందాం అంటూ ప్రకటనలు చేస్తున్నారు. ముచ్చుమర్రి, మల్యాల నుంచి హంద్రీ–నీవా అవసరాలకు 40 టీఎమ్‌సీల నీరు అవసరం అయితే, అందులో సగం నీరు కూడా తీసుకోలేని దుఃస్థితిలో ఉంటే... అదనంగా పోతిరెడ్డిపాడుకు కూడా ముచ్చుమర్రి నుంచే నీరు లిఫ్ట్ చేసుకుందాం అనడం దారుణం.

రాయలసీమ ప్రాజెక్టులకు ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లతో నికర జలాలు సగం కూడా తీసుకోలేక పోతున్నాము. ఇంక వరద జలాలపై ఆధారపడిన గాలేరు–నగరి, హంద్రీ–నీవా, వెలుగొండ, సోమశిలలకు నీరు ఎలా తీసుకుంటాం? బాధ్యత గల ప్రభుత్వాలు శ్రీశైలం నుంచి అవకాశం ఉన్న మేరకు గరిష్ఠ స్థాయిలో నీటిని తీసుకునేందుకు మార్గాలను అన్వేషించాలి. సింహ భాగం పూర్తి అయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వ్యతిరేకిస్తే నష్టపోయేది రాయలసీమ ప్రజలే!

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

చెంతన ఉన్నది చేజార్చుకుంటారా?

విశ్లేషణ



జాన్‌సన్ చోరగుడి

డిసెంబర్ 2న 'షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' కొత్తగా 200కు పైగా 'మర్చెంట్ షిప్స్' కొంటున్నట్లు ప్రకటించింది. ఉన్నట్టుండి మోదీ ప్రభుత్వ ప్రాధాన్యాలు ఇలా మారడం 'మీడియా'ను సైతం విస్మయపర్చింది. గత వైభవం తర్వాత కనుమరుగైన ఈ 'మినీ రత్న' సంస్థ గురించి ఓ ఆంగ్ల పత్రిక వెంటనే ఒక 'బైలైన్ స్టోరీ' కూడా రాసింది. నిజానికి ఈ రంగం గత ఐదేళ్లుగా ప్రైవేట్ చేతుల్లోకి మారుతుండగా, అకస్మాత్తుగా మారిన కేంద్రం వైఖరి ఇది. ఈ కొత్త నౌకల కొనుగోళ్లను ప్రభుత్వమే చేయబోతున్నది.

''ఇటీవల ప్రపంచంలో జరుగుతున్న 'జియో–పాలిటిక్స్' పరిణామాలు మనకు కూడా 'నేషనల్ షిప్పింగ్ సర్వీసెస్' ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేశాయి. దేశ ఆర్థిక భద్రత కోసం 'మర్చెంట్ నేవీ' ప్రాధాన్యం ఏమిటో ఇన్నాళ్ళకు ప్రభుత్వం గుర్తించింది'' అని 'నేషనల్ షిప్ ఓనర్స్ అసోషియేషన్' సీఈఓ అనిల్ దేవళి అన్నట్టు ఆ వ్యాసంలో రాశారు. మారుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యాలు ఇలా ఉంటే, డిసెంబర్ 24న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు– 'క్వాంటమ్ టాక్ బై సీబీన్' కార్యక్రమంలో– ''రెండేళ్లలో అమరావతిలోనే కంప్యూటర్లు తయారుచేసి, వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తాము'' అన్నారు.

మన పక్కన వెయ్యి కిలోమీటర్ల మేర సముద్రం ఉన్నప్పుడు, ముందు 'మెరైన్ ఎకానమీ'లో మన వృద్ధి 'రికార్డు' అయితే పెరిగే ఉపాధితో ప్రజల కొనుగోలు శక్తి పెరిగి 'మార్కెట్'లో ఇక్కడి ఉత్పత్తుల 'డిమాండ్' పెరుగుతుంది. సముద్రం ఎండేది కాదు కనుక పెరిగే నౌకా వాణిజ్యంతో ఏపీ 'బ్లూ ఎకానమీ' స్టేట్ అవుతుంది. ఆ తర్వాత దశలో 'క్వాంటమ్ వ్యాలీ' వంటి మొదటి శ్రేణి సాంకేతికత గురించి కూడా మాట్లాడవచ్చు. అయినా వేసవి ఎండల తీవ్రతకు 'బ్లేజ్ వాడ' అని పిలవబడే ప్రాంతానికి 'వ్యాలీ' అని పేరు పెడితే దానికి 'వ్యాలీ' క్లైమేట్ వస్తుందా? భౌగోళిక శాస్త్ర ప్రమాణాల ప్రకారం ఒక ప్రాంతం సముద్ర మట్టానికి 1,850 మీటర్ల ఎత్తున ఉంటే, దాని శీతోష్ణ స్థితుల కారణంగా 'వ్యాలీ' అంటారు. మరి సముద్ర మట్టానికి 24 మీటర్ల ఎత్తులో ఉన్న అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ' అంటే, అది కేవలం 'మార్కెటింగ్' వ్యూహం కావొచ్చు.

◆ వేసవి ఎండల తీవ్రతకు 'బ్లేజ్ వాడ' అని పిలవబడే ప్రాంతానికి 'క్వాంటమ్ వ్యాలీ' అని పేరు పెడితే దానికి 'వ్యాలీ' క్లైమేట్ వస్తుందా?

మన ఆలోచనలు అక్కడ ఉంటే, విశ్వకర్మ జయంతి సందర్భంగా గత సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ భావనగర్ – 'సముద్ర్ సే సమృద్ధి' సభలో మాట్లాడుతూ – ''ఒకప్పుడు స్వదేశీ నిర్మిత నౌకల ద్వారా మన రవాణా 40 శాతం సాగేది. మన నౌకానిర్మాణ రంగాన్ని బలోపేతం చేయకుండా, విదేశీ నౌకలకు అద్దె చెల్లించడం మీద మనం శ్రద్ధ పెట్టాము. దాంతో, మన నౌకా వాణిజ్యం రెవెన్యూ 40 నుంచి 5 శాతానికి పడిపోయింది. ఒక 'రీసెర్చ్' ప్రకారం 'షిప్ బిల్డింగ్' రంగంపై మనం ఒక రూపాయి ఖర్చు పెడితే, అది రెండింతలై మనకు తిరిగివస్తుంది. 'షిప్ యార్డు'లో ఒక ఉద్యోగం మనం సృష్టిస్తే, బయట 'సప్లై చైన్' మార్కెట్లో ఆరేడు కొత్త ఉద్యోగాలు పుడతాయి. అంటే, వంద ఉద్యోగాలు ఇక్కడ వస్తే, బయట ఆరు వందల మందికి వేర్వేరు రంగాల్లో పని దొరుకుతుంది'' అన్నారు.

''నౌకా వాణిజ్యంతో నావికుల ('సీ ఫేరర్స్') అవసరం పెరుగుతుంది. పదేళ్ళ క్రితం మన దేశంలో వీళ్ళు 1 లక్ష 25 వేలు ఉంటే, ఈ రోజున అది మూడు లక్షలు దాటింది. ప్రపంచ దేశాలకు వీరిని సరఫరా చేసే మూడు దేశాల్లో మనం ఉన్నాము. రాబోయే రోజుల్లో యువతకు ఈ రంగం వల్ల విశేషమైన ఉపాధి దొరుకుతుంది...'' ఇలా ప్రధాని ప్రసంగం సాగింది. ఒక వారం తర్వాత 'కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ' రీసెర్చ్ స్కాలర్ సంగమూన్ హన్సింగ్ ఒక ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో ''ఇండియా ఎగుమతుల ఎకానమీ అంతా కొన్ని చోట్ల కేంద్రీకృతమై ఉంది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక 70 శాతం నౌకా వాణిజ్యం చేస్తుంటే, అందులో గుజరాత్ వాటా 33 శాతంగా ఉంది. రాజకీయంగా అన్నింటా ముందుండే ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌లో అది 5 శాతం మాత్రమే'' అని రాశారు. ఏపీ ప్రభుత్వాలతో బీజేపీకి 'వర్కింగ్ రిలేషన్స్' ఉన్నప్పటికీ, మోదీ ప్రసంగంలో పదేళ్లనాడు ఏర్పడిన తీర ప్రాంత రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్ ప్రస్తావన లేదు. పోనీ ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్ళే బాబుకు మోదీ సలహా ఇచ్చారా? అంటే, 'ఎన్డీఏ' కూటమి 'మీకు మీరే మాకు మేమే' తీరుతో చివరికి రాష్ట్రం బలవుతున్నది. ఏపీ 'మెరైన్' రంగంలో ఈ పదేళ్ళలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి మొదలైన పూనిక అంటూ ఏదైనా ఉందంటే, అది 'కోవిడ్' రోజుల్లో కూడా వైసీపీ పాలనలోనే కనిపిస్తున్నది.

వ్యాసకర్త అభివృద్ధి–సామాజిక అంశాల వ్యాఖ్యాత

మరువరాని పర్యావరణవేత్త

ఇన్ బాక్స్

'మాధవ్ గాడ్గిల్' (1942–2026) అనే పేరు వినగానే చాలా మందికి పశ్చిమ కనుమలు గుర్తుకు వస్తాయి. అక్కడి జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో ఆయన ఎనలేని కృషి చేశారు. 'సెంటర్ ఫర్ ఎకలాజికల్ సైన్సెస్' పేరుతో పరిశోధనా యూనిట్‌ను ప్రారంభించారు. పర్యావరణ కృషిలో అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఈ 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత తన 83వ ఏట జనవరి 7న కన్నుమూశారు.

కొంతకాలం కిందట కేరళలో తరచూ వరదలు వచ్చేవి. ఒక పర్యావరణవేత్తగా ఆయన ఈ వరదలపై అధ్యయనం చేసి 2010లో కేరళ ప్రభుత్వానికి ఒక నివేదికను అందచేశారు. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే, భవిష్యత్తులో కేరళ మునిగిపోయే ప్రమాదం కూడా ఉందని ఆయన పాలకులను హెచ్చరించారు. అంతేకాదు, జరగబోయే ప్రమాదానికి మానవ తప్పిదాలే కారణమవుతాయని కుండబద్దలు కొట్టారు.



మాధవ్ గాడ్గిల్

స్థూలంగా అప్పట్లో ఆయన చెప్పిన కారణాలు చూద్దాం. కేరళలో దాదాపు 40 నదీ నదాలున్నాయి. వీటన్నింటిపైనా ఆనకట్టలు కట్టి నీరు నిల్వచేశారు. వీటిలో ఇడుక్కి వంటి అతి పెద్ద డ్యాములు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గాడ్గిల్ ప్రస్తావించిన మొదటి అంశం ఆనకట్టల పేరుతో కేరళ క్వారీల్లో పెద్ద ఎత్తున మైనింగులు జరగడం. ఈ మైనింగ్ కార్యకలాపాల వల్ల పర్యావరణం దెబ్బతింటుందన్నది ఆయన పేర్కొన్న ప్రధాన అంశం. అలాగే కొండ చరియల్లో రిసార్టుల నిర్మాణాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. కేరళలోని అనేక కొండ చరియలలో పర్యాటకులను ఆకట్టుకోవడానికి పెద్ద ఎత్తున రిసార్టులు నిర్మించారు. ఇలా నిర్మించిన రిసార్టులు ఆ తరువాతి కాలంలో పర్యావరణ విధ్వంసకారకంగా మారుతున్నాయన్నది మాధవ్ గాడ్గిల్ ప్రస్తావించిన చివరి అంశం. అయితే ఆయన నివేదికను పాలకులు పట్టించుకోలేదు. దీనికి 2018లో కేరళ భారీ మూల్యం చెల్లించుకోవలసివచ్చింది. ఆ ఏడాది కేరళను మరోసారి వరదలు ముంచెత్తాయి.

ఇప్పటికైనా పర్యావరణంపై పాలకుల వైఖరి మారాలి. వరదలు, ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి. మాధవ గాడ్గిల్ నివేదికలోని అంశాలపై తగిన నిర్ణయాలు తీసుకోవాలి. అంతే కాదు పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడుకోవడానికి నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. వాటిని అమలు చేయాలి. లేకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవు.

– ఎస్. అబ్దుల్ ఖాలిక్ | సీనియర్ జర్నలిస్ట్
(జనవరి 7న మాధవ్ గాడ్గిల్ మరణించారు.)

డీలాపడ్డ జాబ్ ఓపెనింగ్స్

2026 జనవరి నాటికి దేశంలో యాక్టివ్ టెక్ జాబ్ ఓపెనింగ్స్ సంఖ్య... గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 24 శాతం తగ్గిపోయింది.

డేటా పాయింట్



ఆధారం: స్టాఫింగ్ సొల్యూషన్స్ సంస్థ 'ఎక్స్‌ఫెనో'

సమయం లేదు మిత్రమా!

జ్యోతిర్మయం

ఒకరోజు ఒక వ్యక్తి బుద్ధుడిని 'మనం జీవితంలో చేసే అతి పెద్ద తప్పు ఏమిటి?' అని అడిగాడు. బుద్ధుడు ప్రశాంతమైన కళ్ళతో అతని వైపు చూసి... 'అతి పెద్ద తప్పు ఏమిటంటే, మీకు మీరు బోలెడంత సమయం ఉందని అనుకోవడమే! జీవితం క్షణక్షణం మీ చేతి నుంచి జారిపోతుంటుంది. దయను చూపడానికి సరైన సమయం కోసం నిరీక్షిస్తూ ఉంటారు. క్షమించడానికి సరైన రోజు, ప్రేమించడానికి తదుపరి అవకాశం అంటూ చూస్తుంటారు. కానీ కాలం ఎవరి కోసమూ వేచి ఉండదు. రేపటి రోజులు ఎన్నో ఉన్నట్లుగా జీవించకు. రేపు అనే రోజు మన జీవితంలోకి వస్తుందో రాదో అప్రస్తుతం' అన్నారు.

ఆ సమయానికి కొండల వెనుకకు సూర్యుడు అస్తమించడం ప్రారంభించాడు. ఆకాశం బంగారు వర్ణానికి మారింది. 'సమయం అనేది తక్కువ కాదు. భూత భవిష్యత్తుల మాటెలా ఉన్నా వర్తమానంలో ఉన్నది గ్రహించడంలో ఆలస్యం చెయ్యకూడదు' అన్నారు బుద్ధ భగవానుడు తన మాటలు కొనసాగిస్తూ.

అనంతరం ఆ వ్యక్తి అక్కడి నుంచి నెమ్మదిగా ముందుకెళ్ళిపోయాడు. అతని నీడ తరిగిపోతున్న కాంతితో కలిసిపోయింది. ప్రశాంతమైన ఆ సంధ్యా సమయంలో బుద్ధుని మాటల ఆంతర్యం బోధపడింది. 'జ్ఞానోదయం శాశ్వతత్వం గురించి కాదు, ఈ క్షణం గురించి' అని అతడికి అర్థమయ్యింది. శాంతిస్థాపన కోసం జ్ఞానాన్ని ఉపయోగించాలి. అంతే తప్ప చింతించడానికి కాదు అని గ్రహించాడు. వేచి ఉండటానికి కాక జీవించడానికి జ్ఞానాన్ని ఉపయోగించాలనుకున్నాడు. సమయం సాగిపోతూ ఉంటుంది. కానీ అది తెలియక మనం ముఖ్యమైన పనులను సైతం వాయిదా వేస్తూనే ఉంటాం. ఇంతలో చేయవలసిన పని ప్రాసంగికత ముగిసిపోతుంది. మాటలు మంచికి ఉపయోగించాలి. దయ ప్రాధాన్యం తెలుసుకోవాలి. క్షమించడంలో జాప్యం తగదు. లోతుగా ప్రేమించాలి. ప్రస్తుతంలో జీవించాలి. ఎందుకంటే 'తరువాత చూద్దాంలే' అనే మాట ఎప్పటికీ హామీ లేనిదే!

– యామిజాల జగదీశ్

కోర్టు వద్దన్నా.. బరితెగింపే

'పుంజు'కుంటున్న కోడి పందేల బరులు

జర్మన్ షెడ్లు.. ఫ్లడ్ లైట్లు వెలుగులు.. ఇతర సెట్టింగ్‌లతో ఏర్పాట్లు

అనేక ప్రాంతాల్లో ఇప్పటికే సిద్ధమైన బరులు

పందేల మాటున కోతాట, గుండాట వంటి జూద శిబిరాలకు వేలం పూర్తి

బరుల్లోనే మద్యం ఏటీఎం కౌంటర్లు

దండుకుంటున్న కూటమి నేతలు

గోదావరి జిల్లాలు సహా రాష్ట్రవ్యాప్తంగా వేలాది బరుల్ని సిద్ధం చేసిన 'పచ్చ'బ్యాచ్

సాక్షి నెట్‌వర్క్: సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, జూదాలను నిర్వహిస్తే సహించేది లేదని.. ఎట్టిపరిస్థితుల్లో వాటిని అడ్డుకుని తీరాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఇటు ప్రభుత్వానికి, అటు అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. పందేలు, జూదాలకు అడ్డుకట్ట వేయాలని.. ఇందుకోసం ఎక్కడికక్కడ వివిధ శాఖల అధికారులతో కమిటీలు వేయడంతోపాటు ఆయా కమిటీల ఆధ్వర్యంలో తనిఖీలు, దాడులు జరపాలని మార్గదర్శకాలు జారీ చేసింది. పైకి మాత్రం హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నట్టు నటిస్తూ.. పందేలు, జూదాలను చూసీచూడనట్టు వదిలేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు జారీ కావడంతో ఎక్కడికక్కడ ఏర్పాట్లు పుంజుకున్నాయి. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే బరులు సిద్ధం కాగా.. పందేల మాటున కోతాట, గుండాట వంటి జూద శిబిరాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే వీటికి సంబంధించిన వేలం పాటలు సైతం పూర్తయ్యాయి. మరోవైపు బరుల్లోనే ఎనీటైమ్ మద్యం కౌంటర్లు తెరిచి అక్కడే తాగించి.. తూలించేలా ఏర్పాట్లు చేశారు. కూటమి నాయకులు, పోలీసులు, ప్రభుత్వ అధికారులకు కోట్లాది రూపాయల్ని వాటాలు ఇచ్చేలా ఒప్పందాలు కుదిరాయి.

పశ్చిమాన వందకు పైనే బరులు

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో వందకు పైనే కోడిపందేల బరులను కూటమి నేతలు సిద్ధం చేశారు. భీమవరం పరిసరాల్లోని డేగాపురం, పెద అమిరం, సీసలి, మహదేవపట్నం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం ప్రాంతాల్లో 30 వరకు పెద్ద బరులు సిద్ధమయ్యాయి. పందేలకు పేరొందిన భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో గ్రామానికి రెండు, మూడు చొప్పున 70కి పైగా చిన్న బరులు సిద్ధం చేశారు. వీఐపీ, వీవీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్లు, గుండాట, పేకాట, కోతాట, ఇతర జూదాలు నిర్వహించేందుకు వీలుగా జర్మన్ షెడ్లు, ఫ్లడ్ లైట్లు, ఇతర సెట్టింగ్‌లతో సిద్ధం చేస్తున్న కొన్ని బరులకు ఒక్కో దానికి రూ.30 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. బరి ప్రత్యేకత, అక్కడికి వచ్చే జనం రద్దీని బట్టి రూ.25 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు ఇచ్చేలా నిర్వాహకులు జూదాలు ఏర్పాటు చేసుకునే వారితో ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నట్టు తెలుస్తోంది.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో సిద్ధమవుతున్న కోడి పందేల బరి

తూర్పున క్యాసినో డీలర్ల సాయంతో

తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, సీతానగరం, చినకొండేపూడి, సింగవరం తదితర ప్రాంతాల్లో క్రికెట్ స్టేడియాన్ని తలపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాత్రి, పగలు అన్న తేడా లేకుండా పందేలు, జూద క్రీడల నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నారు. వాటర్ ప్రూఫ్ టెంట్లు, సోఫాలు, కుర్చీలు సిద్ధం చేస్తున్నారు. ఫ్లడ్‌లైట్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పెద్దఎత్తున జనరేటర్లు అందుబాటులో పెడుతున్నారు. బరుల వారీగా మద్యం అమ్మకాలకు, నెంబర్లాట, గుండాట, పేకాట నిర్వాహకులకు సైతం వేలం నిర్వహించారు. ఒక్కో బరికి రూ.లక్షలు చేతులు మారుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఓ బరిని రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తే అందులో ఆ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి రూ.5 లక్షలు, పోలీసులకు రూ.3 లక్షలు, మిగిలిన సొమ్మును స్థానిక కూటమి నేతలు పంచుకునేలా వ్యూహాలు రచిస్తున్నారు. బరి స్థాయిని బట్టి ఈ మొత్తం మరింత పెరగనుంది. సీతానగరం మండలం చినకొండేపూడిలో పేకాట, కోడిపందేలు, గుండాటలతోపాటు పెద్దఎత్తున క్యాసినో పెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గోవా, నేపాల్ నుంచి క్యాసినో డీలర్లను రప్పిస్తున్నట్టు సమాచారం. త్రీకాట్స్, ప్లాన్, ఫుల్‌గేమ్, లోన బయట, గుండాట, పోకల్, కోతముక్క వంటి జూద క్రీడలు నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది.

కోనసీమ జిల్లాలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోడిపందేలు, గుండాటలు, పేకాటల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు అనధికార మద్యం షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు రూ.లక్షల్లో వేలం పాటలు నిర్వహిస్తున్నారు. వీఐపీల కోసం కూలర్‌లు, సోఫా సెట్‌లు, ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. భోగి పండుగ నుంచి మూడు రోజులపాటు అర్ధరాత్రి వరకు పందేలు నిర్వహించేందుకు వీలుగా ఫ్లడ్‌లైట్‌లు ఏర్పాటు చేశారు. కీలక నేతల వత్తాసుతో బరులు ఏర్పాటు చేసుకుంటున్నారు. టీడీపీ, జనసేన చోటామోటా నాయకులు సైతం పందేల నిర్వహణకు సై అంటున్నారు.

మంత్రి అండతో బాపట్ల జిల్లాలోనూ..

బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకాలో పెద్దఎత్తున కోడిపందేలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెరుకుపల్లి మండలంలో 50 ఎకరాల విస్తీర్ణంలో కోడిపందాలు, పేకాట కోసం బరి సిద్ధం చేశారు. ఇందులో ఒకటి పెద్ద బరికాగా.. మిగిలిన పది బరులు చిన్నవి. పెద్ద బరిలో రూ.లక్ష నుంచి రెండు లక్షల పందాలు జరగనుండగా చిన్న బరుల్లో రూ.10 వేల నుంచి లక్ష వరకు జరగనున్నాయి. ఇక్కడ పెద్ద ఎత్తున పేకాట నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన వారికి ఐదు రోజులపాటు పేకాట ఆడుకునేందుకు రూ.60 లక్షలకు కాంట్రాక్ట్ ఇచ్చినట్టు సమాచారం. వేమూరు నియోజకవర్గంలో ఐదు బరులు ఏర్పాటు చేస్తున్నారు. వేమూరు మార్కెట్ సమీపంలో టీడీపీ నేత పది ఎకరాల్లో ఒక బరి సిద్ధం చేయగా.. చావలి–కోడిపర్రు మధ్యన జనసేన నేత పది ఎకరాల్లో మరో బరి నెలకొల్పారు. కొల్లూరు సమీపంలో క్రాప వద్ద ఒక బరి, అనంతవరం వద్ద మరొక బరిని టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. చుండూరు మండలం వేటపాలెం వద్ద బరి సిద్ధం చేశారు. పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం వద్ద టీడీపీ నేతలు భారీ బరి ఏర్పాటు చేశారు.

ఎంట్రీ టికెట్లు పెట్టిమరీ..

ప్రకాశం జిల్లా కందుకూరు మండలం బక్కరాముల కుంటలో కోడి పందేల బరులు సిద్ధమయ్యాయి. పత్తిపాటివారిపాలెం–కొండికందుకూరుకు వెళ్లే తారు రోడ్డులో నుంచి పందేల స్థావరం వరకు ప్రత్యేకంగా రోడ్డు కూడా వేశారు. ఎంట్రీ టికెట్లు పెట్టి రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. పలుకూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి కృష్ణాలో..

కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో భారీ హంగులతో బరి ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం బరి నిర్వాహకులు నియోజకవర్గ ప్రజా ప్రతినిధికి రూ.2 కోట్లతో బేరం కుదుర్చుకున్నట్టు ప్రచారం సాగుతోంది. పెనమలూరు నియోజకవర్గంలోని ఉప్పులూరుతో పాటు కంకిపాడు మండలంలోని 8 పెద్ద బరులు ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం నియోజకవర్గ ప్రజా ప్రతినిధికి రూ.3 కోట్ల వరకు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్టు ప్రచారం. విజయవాడ సమీపంలోని నున్న, రామవరప్పాడు, అంబాపురం, కొత్తూరు తాడేపల్లి, గొల్లపూడి తదితర ప్రాంతాల్లో బరులు ఏర్పాటు చేస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో కోతముక్క, గుండాటకు అధికార పార్టీ నాయకులు బరులు సిద్ధం చేస్తున్నారు. మల్లాయపాలెం పరిధిలోని టిడ్కో కాలనీలో భారీ బరిని ఏర్పాటు చేసి కోడిపందాలు, కోతముక్క, గుండాటకు సర్వం సిద్ధం చేస్తున్నారు. గుడ్లవల్లేరు, వేమవరం, కూరాడ, అంగలూరు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు భారీగా బరులు ఏర్పాటుచేస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం, రంగాపురం, మొర్సుమల్లి, పొందుగల, వెల్వడం, చంద్రగూడెం, గణపవరం, కీర్తిరాయినిగూడెం, మైలవరం, జి.కొండూరు మండల పరిధిలో కోడూరు, వెల్లటూరు, కందులపాడు, కవులూరు, చెరువు మాధవరం, మునగపాడు, గంగినేని, కట్టుబడిపాలెం, కుంటముక్కల, ఇబ్రహీంపట్నం మండలంలో జూపూడి చిన్నలంక, మూలపాడు, కొండపల్లి, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, తుమ్మలపాలెం, చిలుకూరు, విజయవాడ రూరల్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లిలో బరులు సిద్ధమవుతున్నాయి. పేకాట అనేక రకాల జూద క్రీడలు, ఫుడ్ స్టాళ్లు, మద్యం స్టాళ్ల ఏర్పాటుకు మూడు రోజులకు అద్దె రూపంలో భారీఎత్తున వేలం పాటలు ఖరారయ్యాయి.

కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో భారీ చోరీ

వజ్రపుకొత్తూరు రూరల్: శ్రీకాకుళం జిల్లా పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చిన తిరుపతిగా పిలుచుకునే వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులతోపాటు మూడు హుండీలను దొంగిలించారు. సుమారు రూ.80 లక్షల విలువైన ఆభరణాలు, నగదు అపహరించినట్లు ఆలయ ధర్మకర్త హరి ముకుంద పండా పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హరిముకుంద పండా తన సొంత ఖర్చులతో తిరుమల కలియుగ దైవాన్ని పోలిన విగ్రహాలతో కాశీబుగ్గలో భారీ ఆలయాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఈ ఆలయానికి గత ఏడాది నవంబర్ 1న కార్తీక ఏకాదశి పర్వదినాన అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో జరిగిన తొక్కిసలాటలో 9 మంది మృతి చెందారు. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయాన్ని మూసి ఉంచారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. కాశీబుగ్గ డీఎస్పీ షేక్ షెహబాజ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మూసి ఉన్న ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు ముందుగా సీసీ కెమెరాల వైర్లను తొలగించి... మెయిన్ ద్వారం వెంబడి లోపలకు చొరబడి ప్రధాన విగ్రహానికి ఉన్న విలువైన ఆభరణాలు అపహరించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

చంద్రబాబు కోడిపందేల లీగ్

పండుగ పేరుతో దోపిడీ!

ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే భారీ బరులు, క్యాసినోలు, పేకాట

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ ధ్వజం

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు కోడిపందేలు లీగ్(కేపీఎల్) పేరుతో జూదశిబిరాలు యథేచ్ఛగా నిర్వహిస్తూ దోపిడీ సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కోడి పందేలు, క్యాసినోలు, పేకాటలను ప్రోత్సహిస్తూ కుటుంబాలను నాశనం చేసే విష సంస్కృతిని చంద్రబాబు ప్రభుత్వం పెంచిపోషిస్తోందని మండిపడ్డారు. సంప్రదాయం ముసుగులో జూదాన్ని ప్రోత్సహిస్తూ అధికారపార్టీ కమీషన్ల పేరుతో రూ. వందల కోట్లు దోచుకుంటోందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే కోడి పందేల బరులు, క్యాసినోలు, పేకాట శిబిరాలను నిర్వహిస్తున్నారని కైలే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో బహిరంగంగా కూటమి నేతలు బరితెగించారని మండిపడ్డారు. ఒక్కో కోడిపందేల బరి నుంచి కూటమి నేతలు రూ.3కోట్ల మేర కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. బరుల కోసం టీడీపీ నేతలు పోలీసులు, ఎక్సైజ్ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని, ఈ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని, ఇవే సర్కారు అసమర్థతకు నిదర్శనమని కైలే అనిల్‌కుమార్ దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలు కేక్ కట్‌చేశారని, మాంసాహార భోజనాలు పెట్టారని కేసులు పెట్టి నడిరోడ్డుపై నడిపించిన పోలీసులు ఇప్పుడు కూటమి నేతలు కోళ్లకు కత్తిగట్టి యథేచ్ఛగా పందేలు ఆడిస్తున్నా.. ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

కుటుంబాలు ఛిన్నాభిన్నం

'సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, పవన్ కళ్యాణ్‌లలో ఏ1, ఏ2, ఏ3లు ఎవరు? కేసరపల్లి వద్ద భారీ బరి ఏర్పాటు చేసి ముడుపులు తీసుకొని జూదం నిర్వహిస్తున్నా ఎందుకు పట్టడం లేదు? అక్కడ టీడీపీ నేతల జేబుల్లోకి రూ.2 కోట్ల వరకు వెళ్లినట్లు కూటమి నేతలే చెబుతున్నారు. పేకాట శిబిరాల వద్ద మద్యం విచ్చలవిడిగా అమ్ముతూ, అధిక ధరలకు సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది గోవా, నేపాల్ నుంచి క్యాసినో డీలర్లను తీసుకువచ్చి ప్రజల డబ్బును దోచుకుంటున్నారు. జూద శిబిరాల వద్ద మద్యం సరఫరా, డ్యాన్స్‌లు, పేకాట క్లబ్‌లు ఏర్పాటు చేసి ప్రజలను దోచుకుంటున్నారు. ఈ మూడు రోజుల్లో ఎన్నో కుటుంబాలు అప్పుల పాలై చివరకు పుస్తెలు కూడా తాకట్టు పెట్టే దుస్థితి వచ్చేలా ఉంది. కాపురాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను చంద్రబాబు సర్కారు బేఖాతరు చేస్తోంది. విషసంస్కృతిని పెంచి పోషిస్తోంది.' అని అనిల్ అన్నారు.

వరుస అపచారాలపై బాబు, పవన్ నోరు మెదపరే?

దేవదాయ ఆస్తుల దోపిడీకి కూటమి సర్కారు కుట్ర

దుర్గమ్మకు వైఎస్సార్‌సీపీ నేతలు వెలంపల్లి, మల్లాది ప్రత్యేక పూజలు

మాట్లాడుతున్న వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కూటమి ప్రభుత్వ వైఫల్యాల వల్ల రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో వరుసగా అపచారాలు చోటు చేసుకుంటున్నాయని, సనాతన ధర్మం ముసుగులో దేవస్థానాల ఆస్తులను దోచుకునేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు విమర్శించారు. రాష్ట్రంలోని పలు ఆలయాలతోపాటు విజయవాడ దుర్గమ్మ గుడిలో చోటు చేసుకుంటున్న వరుస అపచారాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు దుర్గమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలో రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలు, దుర్గగుడిలో చోటు చేసుకున్న అపచారాలను వెలంపల్లి, మల్లాది గుర్తు చేశారు. నిత్యం దుర్గగుడిలో ఏదో ఒక ఘటన జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తిరుపతి లడ్డూలో కల్తీ కలిసిందో లేదో తెలియకుండానే సనాతన ధర్మం అంటూ దుర్గగుడికి వచ్చి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో వివాదాలు జరుగుతుంటే అంగప్రదక్షిణ చేస్తారా అని వెలంపల్లి, మల్లాది ప్రశ్నించారు. ద్రాక్షారామలో శివలింగాన్ని ధ్వంసం చేస్తే ఎందుకు కిమ్మనకుండా ఉన్నారని నిలదీశారు. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు పగ్గాలుచేపట్టాక తిరుమలలో అనేక అపచారాలు జరుగుతున్నాయని విమర్శించారు. బాబు అరాచక పాలనలో దేవుళ్లకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

జగన్ హయాంలో దుర్గగుడి అభివృద్ధికి రూ.70 కోట్లు

దుర్గగుడి అభివృద్ధికి రూ.70 కోట్లు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదేనని వెలంపల్లి, మల్లాది చెప్పారు. రాష్ట్రంలోని అనేక దేవాలయాలకు వైఎస్ జగన్ నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. జీఓ నంబర్ 15ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాశీబుగ్గ ఆలయంలో చోరీ జరగడం దారుణమని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకున్న పోలీసులు

తొలుత దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయానికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ముఖ్య నేతలను మాత్రమే అనుమతించారు. దీంతో వారు వెళ్లి కామధేను అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో బెజవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత పుణ్యశీల, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పురాణాలు, కథల్లో ఆంధ్రా ప్యారిస్‌కి ఎనలేని కీర్తి

మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి

తెనాలి టౌన్: పురాణాలు, కథల్లో ఆంధ్రాప్యారిస్ తెనాలికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలున్నాయని మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి చెప్పారు. తెనాలి సమీపంలోని పెదరావూరులో నాలుగు ఎకరాల స్థలంలో హనుమాన్ ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. గుంటూరు జిల్లా పెదరావూరులో శ్రీ దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామిజీ సభావేదికపై నుంచి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దాతల సహకారంతో పెదరావూరులో నాలుగు ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక చింతన, ఉచిత వైద్య సేవలు ఈ ప్రాంతంలో అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. 'శ్రీ సంక్రాంతి రాగ సాగరం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అందరూ శాంతి, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలి

ప్రభుత్వం ప్రైస్ పాలసీ ప్రకటించాలి

రాష్ట్ర కోకో బోర్డు, కేంద్ర కోకో పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలి

ఏలూరు కలెక్టరేట్ ముందు కోకో రైతుల ధర్నా

ధర్నా చేస్తున్న కోకో రైతులు, సంఘం నేతలు

ఏలూరు (టూటౌన్): కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలని, ప్రైస్ పాలసీ ప్రకటించాలని, రాష్ట్ర కోకో బోర్డు, కేంద్ర కోకో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ ముందు రైతులు ధర్నా చేశారు. వారంతా సామూహిక రాయబార కార్యక్రమం చేపట్టి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రాలు అందజేశారు. ధర్నా సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్.గోపాలకృష్ణ, అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కోకో రైతులకు కంపెనీలు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వడం లేదని చెప్పారు. కోకో గింజలకు ప్రైస్ పాలసీ లేకపోవడం వల్ల కంపెనీలు ఇష్టా రాజ్యంగా కొనుగోలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధరలు వచ్చేలా ఫార్ములా రూపొందించి ధర ప్రకటిస్తామని గత ఏడాది ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత సీజన్‌కు అమలు చేయాల్సి ఉందన్నారు. ఇంతవరకు ఫార్ములా ప్రకటించకపోవడంతో కంపెనీలు పాత పద్ధతుల్లోనే సిండికేట్‌గా మారి కోకో రైతులను మోసగించే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.550కి పైగా ధర ఉంటే కంపెనీలు రూ.400 మాత్రమే ఇస్తున్నాయని చెప్పారు. ప్రపంచంలో అత్యధికంగా కోకో గింజలు ఉత్పత్తి చేసే ఘనా, ఐవరీ కోస్ట్ వంటి ఆఫ్రికా దేశాల్లో ప్రస్తుతం కోకో పంటకు అన్ సీజన్ అని ఆ ధరలనే అంతర్జాతీయ మార్కెట్లో చూపిస్తున్నారని, వారికి సీజన్‌లో వచ్చిన రేట్లను ఇక్కడ అమలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విదేశీ కోకో గింజలు, కోకో ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు పెంచాలని కోరారు. ప్రభుత్వాలు స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు పానుగంటి సుధాకర్, పి.నరేష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ నిర్వాహకుడిపై టీడీపీ ఎమ్మెల్యే అనుచరుల దాడి

ఇరవై లక్షలు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపు

నేరుగా రంగంలోకి దిగిన టీడీపీ ఎమ్మెల్యే అనుంగు అనుచరుడు గంగారాం

దాడిలో పాల్గొన్న ఎమ్మెల్యే గన్‌మెన్ షెక్షావలి

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు

ఫకృద్దీన్

అనంతపురం సెంట్రల్: 'ఎమ్మెల్యే వద్దకు వచ్చి సెటిల్ చేసుకో. లేదంటే ఇబ్బంది పడతావ్. గతేడాదికి సంబంధించి రూ.10 లక్షలు.. ఈ ఏడాది రూ.10 లక్షలు ఇవ్వాల్సిందే. లేదంటే నిన్ను, నీ కుమారుణ్ని లేపేస్తాం'' అంటూ అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనుచరులు ఓ ఎగ్జిబిషన్ నిర్వాహకుడిని బెదిరించి, అతనిపై దాడి చేశారు. దీంతో బాధితుడు సోమవారం జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించాడు. బాధితుడి వివరాల మేరకు... అనంతపురానికి చెందిన ఫకృద్దీన్ స్థానిక రుద్రంపేటలో 'నయాగరా' పేరిట ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు పది మంది పుల్లుగా మద్యం సేవించి ఎగ్జిబిషన్‌లోకి చొరబడి దౌర్జన్యం చేశారు. అడ్డుకోబోయిన ఫకృద్దీన్ కుమారులు, ఎగ్జిబిషన్ సిబ్బందిపై దాడి చేశారు. 'రేయ్ ఏమనుకుంటున్నావ్?! మేం ఎమ్మెల్యే దగ్గుపాటి మనుషులం. మమ్మల్నే అడ్డుకుంటారా' అంటూ బెదిరించారు. వారిలో ఒకరు ఎమ్మెల్యే అనుచరుడు కోనంకి గంగారాంకు ఫోన్ చేసి ఫకృద్దీన్‌తో మాట్లాడించాడు. 'అన్నా.. మీ వాళ్లు దౌర్జన్యం చేస్తున్నారు. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు' అని ఫకృద్దీన్ తెలపగా.. 'అవును రా మాట్లాడతారు.. అయితే ఏంటి? నేను అక్కడికి వస్తే ఎగ్జిబిషన్ పగిలిపోద్ది. నీకు బాగా ఎక్కువైంది. భద్రంగా ఉండు' అంటూ గంగారాం దుర్భాషలాడాడు. తర్వాత హరి, సాంబ, ఎమ్మెల్యే దగ్గుపాటి గన్‌మెన్ షెక్షావలితో పాటు మరో పది మంది ఎగ్జిబిషన్‌లో అర్ధరాత్రి వరకు దౌర్జన్యం సాగించారు. చివరకు నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఎమ్మెల్యే అనుచరులను పంపేశారు. కాగా ఎమ్మెల్యే సెటిల్‌మెంట్లలో స్వయంగా గన్‌మెన్ షెక్షావలి పాల్గొనడంపై పోలీసు వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే రక్షణ కోసమా? లేదంటే సెటిల్‌మెంట్ల కోసం పనిచేస్తున్నాడా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సొంత పార్టీ అయినా వదల్లేదు

నేను ఎన్నో ఏళ్లు టీడీపీలో పనిచేశా. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ తరఫున 24వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేశా. ఏడుసార్లు మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశా. అలాంటి నన్నే బెదిరిస్తున్నారు. ఎమ్మెల్యే వద్దకు వచ్చి సెటిల్ చేసుకోమంటూ సోమవారం కూడా బెదిరించారు. గతంలోలా ప్రస్తుతం పరిస్థితులు లేవు

– ఫకృద్దీన్, ఎగ్జిబిషన్ నిర్వాహకుడు

గోదావరి జలాల వివాదంలో కీలక మలుపు

సివిల్ సూట్ దాఖలుకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్

ఆర్టికల్ 32 కింద విచారణ సాధ్యం కాదన్న సీజేఐ ధర్మాసనం

ఏపీ ప్రాజెక్టులపై రిట్ పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న గోదావరి జలాల వివాదంలో కీలక మలుపు చోటుచేసుకుంది. నదీ జలాల వినియోగం, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ చేపట్టిన ప్రాజెక్టులపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాలను ఆర్టికల్ 32 (రిట్ పిటిషన్) కింద విచారించలేమని తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరపాలంటే.. అన్ని సాక్ష్యాధారాలతో కూడిన 'సివిల్ సూట్' దాఖలు చేసుకోవాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ మేరకు కొత్తగా దావా వేసుకునేందుకు స్వేచ్ఛనిస్తూ.. ప్రస్తుత పిటిషన్‌ను ముగించింది. దీంతో తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. సోమవారం ఈ కేసును భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సింఘ్వీ, ఏపీ తరఫున జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా హాజరయ్యారు.

సార్లంకలో 40 పూరిళ్లు దగ్ధం

రౌతులపూడి: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సబ్ ప్లాన్ ఏజెన్సీ పరిధిలోని రాఘవపట్నం శివారు సార్లంకలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సంక్రాంతి సందర్భంగా గ్రామంలోని గిరిజనులంతా దుస్తులు, కిరాణా తదితర సామగ్రి కొనుగోలు చేసుకునేందుకు మండల కేంద్రమైన రౌతులపూడి వెళ్లారు. గ్రామంలో ఎవరూ లేరు. సాయంత్రం 5 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చల్లా నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో మంటలు వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సుమారు 40 పూరి గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. వీటిలో నివసిస్తున్న 50కి పైగా గిరిజన కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ప్రమాదంలో రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

హోరాహోరీగా డ్రాగన్ బోట్ పోటీలు

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక–లొల్ల లాకుల మధ్య ప్రధాన పంట కాలువలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ 2026 సంక్రాంతి పడవ పోటీల్లో భాగంగా రెండోరోజు సోమవారం డ్రాగన్ పడవల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర ప్రాంతాల బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఉచ్చిలి నుంచి తాడిపూడి వంతెన వరకు 1,000 మీటర్ల దూరం సాగిన ఈ పడవల పోటీల్లో సమయం ఆధారంగా విజేతలను నిర్ణయించారు. మొత్తం 22 జట్లు పోటీపడగా వాటిలో బండారు, కోనసీమ, పల్నాడు, కర్నూలు, ఎర్రకాలువ, కేరళ (అలెప్పి) జట్లు సెమీ ఫైనల్స్‌కు ఎంపికయ్యాయి. మంగళవారం సెమీ ఫైనల్స్, ఫైనల్ జరుగుతాయి.

ఉత్సాహంగా గండికోట ఉత్సవాలు

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్: వైఎస్సార్ కడప జిల్లాలో గండికోట వారసత్వ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గండికోట చరిత్ర, వైభవం, రాయల కాలం నాటి ధైర్యసాహసాలు, యుద్ధ పటిమ, పాలనా దక్షత, గజపతి రాజులతో బంధుత్వం తదితర అంశాలపై లేజర్‌షో ప్రదర్శించారు. మిరియాల రామ్ తన పాటలతో అలరించారు. ఉత్సవాలను పురస్కరించుకుని వాలీబాల్, కబడ్డీ, తాడులాగే ఆట వంటి పోటీలను జమ్మలమడుగు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పోటీలలో దాదాపు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో కడప డీఎస్‌ఏ జట్టు విజేతగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సుమారు రూ. 106.00 లక్షల విలువ గల 6 (ఆరు పనులకు) షార్ట్ నిట్ నెం. 63 నుండి 68/EE/R&B/GNT/2025-26, తేది : 06.01.2026 ద్వారా టెండర్లు ఆహ్వానింపబడుచున్నవి. తదుపరి వివరాలకు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 17.01.2026న సా.4.00 గం. వరకు.
సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, (ర.భ.) డివిజన్, గుంటూరు
DIPR RO No. 18759/CL/Advt/1/1/2021-22, Dt : 12.01.2026

తిరుమల తిరుపతి దేవస్థానములు : తిరుపతి
చీఫ్ ఇంజనీర్ ఆఫీస్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV No.59/D3/CE/TTD/2025-26 Dt: 11-01-2026
TTD ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో యాభై (50) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి: SE-I: NIT నం.80 నుండి 83/SE-I/2025-26 (4 పనులు), SE-II: NIT నం.936 నుండి 953/SE-II/2025-26 (18 పనులు), SE-III: NIT నం.48/SE-III/2025-26 (1 పని), SE(Elec): NIT నం.32 నుండి 33/SE(Elec)/2025-26 (2 పనులు), EE-II: NIT నం.98/EE-II/2025-26 (1 పని), EE-V: NIT నం.107 నుండి 108/EE-V/2025-26 (2 పనులు), EE-VI: NIT నం.154 నుండి 157/EE-VI/2025-26 (4 పనులు), EE-XI: NIT నం.115 నుండి 116/EE-XI/2025-26 (2 పనులు), EE-XV: NIT నం.53/EE-XV/2025-26 (1 పని), DE(Elec)-I: NIT నం.286/DE(Elec)-I/2025-26 (1 పని), DE(Elec)-II: NIT నం.495 నుండి 504/DE(Elec)-II/2025-26 (10 పనులు), DE(Elec)-TML: NIT నం.381 నుండి 384/DE(Elec)-TML/2025-26 (4 పనులు). వివరాల కోసం www.tirumala.org కి లాగిన్ చేయండి మరియు పని వివరాల కోసం https://tender.apeprocurement.gov.in కు లాగిన్ చేయండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.360) Dt: 12-01-2026 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తిరుమల తిరుపతి దేవస్థానములు :: తిరుపతి
టీటీడీ ట్రాన్స్‌పోర్ట్, తిరుపతి
Roc No. TA2/45021(108)/91/2025, తేది: 08.01.2026
ఇ-టెండరు ప్రకటన
NIT No. 01/GM(T)/TTD/2026, టెండరు ఐడి నం. 886616
ఈ టెండరులో బిడ్ వేయుటకు తయారీ కంపెనీ (లేదా) అధీకృత డిస్ట్రిబ్యూటర్/ డీలర్ నుండి TTD వాహనాల మెయింటనెన్స్ కోసం కొత్త టైర్లు, కొత్త ట్యూబ్స్ మరియు ఫ్లాప్స్ సరఫరా కోసం ఇ-టెండర్లు కోరబడుతున్నవి. టెండరు డాక్యుమెంట్స్‌ను https://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాల కొరకు కార్యాలయం పని రోజులలో 0877-2264346, 4356పై సంప్రదించండి.
TTD-40021/10/2025-PRO SEC (Adv. No. 355), Dt: 09.01.2026 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

భారతే ముఖ్యం

అమెరికాతో విడదీయలేని బంధం

- ఈ శతాబ్దంలోకెల్లా ప్రభావశీల భాగస్వామ్యం
- నూతన రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్య
- మోదీ, ట్రంప్‌ది దృఢమైన స్నేహ బంధం
- విభేదాలున్నా వాటికి చర్చలతో పరిష్కారం
- స్వేచ్ఛా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయ్
- బాధ్యతల స్వీకరణ అనంతరం గోర్ వెల్లడి
- 'ఖనిజ, ఏఐ' కూటమిలోకి భారత్‌కు ఆహ్వానం

న్యూఢిల్లీ: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన యంత్రాంగంలోని పలువురు సలహాదారుల నోటి దురుసు కారణంగా భారత్‌తో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణపై అమెరికా గట్టిగా దృష్టి సారించింది. భారత్‌లో అమెరికా నూతన రాయబారి సెర్గియో గోర్ ఈ దిశగా తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఏ కోణంలో చూసినా అమెరికాకు భారత్ అంతటి ముఖ్యమైన దేశం మరొకటి లేదని స్పష్టం చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం అమెరికా దౌత్య కార్యాలయ సిబ్బంది, మీడియాను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దిశగా ఇరు దేశాల మధ్య చర్చలు నిలిచిపోయాయన్నది నిజం కాదని గోర్ స్పష్టం చేశారు. ఈ దిశగా ఇరు దేశాల ప్రతినిధుల నడుమ మంగళవారం తర్వాతి దశ చర్చలు జరుగనున్నట్టు వెల్లడించారు. అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధ సంబంధించిన అమెరికా సారథ్యంలో రూపొందుతున్న వ్యూహాత్మక కూటమిలో భారత్ భాగస్వామి కావాలని అభిలషించారు. ఈ మేరకు ట్రంప్ తరఫున భారత్‌ను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ''భారత్ ప్రపంచంలోకెల్లా అతి పెద్ద దేశం. భారత్, అమెరికా నడుమ ఉన్నది కేవలం సారూప్య ప్రయోజనాలు మాత్రమే కాదు. విడదీయలేని అత్యున్నత బంధం కూడా'' అని అన్నారు. ''భారత్ ఓ అద్భుత దేశం. దాన్నిన్ని ప్రపంచానికే ఆదర్శప్రాయ రీతిలో పునర్ నిర్వచించే సువర్ణావకాశం ప్రస్తుతం ఇరుదేశాల ముందుంది. భారత్, అమెరికా మైత్రి ఈ శతాబ్దంలోకెల్లా అత్యంత ప్రభావశీల భాగస్వామ్యంగా రూపుదిద్దుకోగలదు'' అని 38 ఏళ్ల గోర్ అభిప్రాయపడ్డారు. ''భారత్ కంటే ఆవశ్యకమైన భాగస్వామి అమెరికాకు ఇంకెవరూ లేరు. రాయబారిగా భారత్‌తో బంధం విషయంలో వచ్చే కొన్నేళ్లకు సంబంధించి ఓ భారీ ఎజెండాయే నా ముందుంది. వ్యూహాత్మక భాగస్వామ్యం, శక్తి సామర్థ్యాలతో పాటు పరస్పర గౌరవాదరాలు, నాయకత్వ పటిమే పునాదులుగా అన్ని అంశాలపైనా లోతుగా చర్చించుకుందాం'' అని పిలుపునిచ్చారు. ట్రంప్, ప్రధాని మోదీ మధ్య నిజమైన, దృఢమైన స్నేహముందని గోర్ అన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు గత రెండు దశాబ్దాల్లోకెల్లా అత్యల్ప స్థాయికి చేరేందుకు కారణమైన విభేదాల పరిష్కారానికి వారి స్నేహబంధం కచ్చితంగా తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. ''నిజమైన మిత్రులు పరస్పరం విభేదించవచ్చేమో. కానీ అంతిమంగా తమ భేదాభిప్రాయాలను పరిష్కరించుకుంటారు'' అని అమెరికా–భారత్ నడుమ బంధానికి బీటలు పడ్డట్టు గోర్ పరోక్షంగా అంగీకరించారు. ''ఇరు దేశాల బంధం విషయంలో వాణిజ్యం చాలా ముఖ్యమైన అంశమే. దానితో పాటు భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, ఇంధనం, టెక్నాలజీ, విద్య, వైద్యం వంటి పలు కీలక రంగాల అంశాల్లో ఇరు దేశాలూ అత్యంత సన్నిహితంగా కలిసి పని చేయనున్నాయి'' అని గోర్ వివరించారు.

ఢిల్లీలోని అమెరికా ఎంబసీలో మాట్లాడుతున్న గోర్

బంధానికి బీటలు..

ఇటీవలి కాలంలో భారత్, అమెరికా బంధం ఒడిదుడుకుల్లో పడటం తెలిసిందే. రష్యా నుంచి భారత్ చమురు కొనడంపై తాను సంతోషంగా లేనని ట్రంప్ అనడం, టారిఫ్‌లను భారీగా పెంచుతానని హెచ్చరించడం, అందుకు తగ్గట్టే భారత్, చైనాలపై ఏకంగా 500 శాతం టారిఫ్‌ల విధింపుకు అమెరికా బిల్లు సిద్ధం చేస్తుండటం ఉద్రిక్తతల్ని మరింత పెంచింది. దాంతో ఇరు దేశాల సంబంధాలు కొంతకాలంగా నేలచూపులు చూస్తూ వస్తున్నాయి. పైగా మోదీ స్వయంగా ట్రంప్‌కు ఫోన్ చేసి మాట్లాడని కారణంగానే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నిలిచిపోయిందని అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ బాహాటంగా వ్యాఖ్యలు చేయడంతో పరిస్థితి మరింత దిగజారింది. వీటికి తోడు భారతీయులను ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని హెచ్‌– 1బీ వీసాలపై అమెరికా నానాటికీ ఆంక్షల చట్రాన్ని బిగిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ సన్నిహిత బృందంలో కీలక సభ్యుడైన గోర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భారత్‌తో సంబంధాలను తిరిగి మెరుగు పరుచుకునే ప్రయత్నాల్లో అవి భాగమేనని భావిస్తున్నారు. గోర్ ప్రస్తావించిన పిక్స్ సిలికా కూటమిలో జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్, ఇజ్రాయెల్ ఇప్పటికే చేరాయి.

మోదీకి ట్రంప్ శుభాకాంక్షలు

''భారత్ బయల్దేరే ముందే ట్రంప్‌తో మాట్లాడా. ఈ అద్భుత దేశం పౌరులకు, ముఖ్యంగా ప్రియ మిత్రుడు మోదీకి శుభాకాంక్షలు అందించాల్సిందిగా ఆయన నాకు చెప్పారు'' అని గోర్ తెలిపారు. ''రెండు వారాల క్రితం ట్రంప్‌తో మాట్లాడా. ఆయన భారత్ సందర్శన తాలూకు అద్భుత అనుభవాలను నాతో పంచుకున్నారు. ఒకట్రెండేళ్లలో మరోసారి భారత్‌లో పర్యటించాలని కూడా ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు'' అని వివరించారు. ''రాయబారిగా మొట్టమొదటే భారత్ వంటి ప్రపంచంలోకెల్లా అతిపెద్ద, అతిపురాతన దేశంలో పని చేసే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. మన రెండు అతి గొప్ప దేశాల బాగస్వామ్యాన్ని సమున్నత స్థాయికి తీసుకెళ్లడమే నా ముందున్న లక్ష్యం'' అని గోర్ ప్రకటించారు.

వ్యూహాత్మక సుస్థిరత సాధిద్దాం

భారత్, జర్మనీ ఉమ్మడి నిర్ణయం ● ద్వైపాక్షిక చర్చలు జరిపిన భారత ప్రధాని మోదీ, జర్మనీ చాన్స్‌లర్ మెర్జ్

అహ్మదాబాద్/న్యూఢిల్లీ: మారుతున్న అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అంశాలు, యుద్ధాలు, ఉద్రిక్తత పరిస్థితుల నడుమ ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్, జర్మనీ ఉమ్మడిగా నిర్ణయించాయి. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనేలా పరస్పరం వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఇరుదేశాలు ఉమ్మడిగా నిర్ణయించుకున్నాయి. ఈ మేరకు ప్రధాని మోదీ, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్‌లు విస్తృతస్థాయిలో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. తర్వాత సోమవారం ఢిల్లీలో ఇరుదేశాధినేతలు సంయుక్త ప్రకటన విడుదలచేశారు. రక్షణ, వాణిజ్యం,భూ అయస్కాంత లోహాలు, సెమీకండక్టర్ల సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై అగ్రనేతలిద్దరూ చర్చించారు. అంతర్జాతీయ సమస్యలకు ఉమ్మడిగా పరిష్కారాలను సూచించే స్థాయికి ద్వైపాక్షిక బంధాలను దృఢపర్చుకోవాలని నేతలు నిర్ణయించుకున్నారు. రక్షణ పారిశ్రామిక సహకారం, ఉన్నత విద్యారంగంలో మరింత మెరుగైన సహకారం సహా 19 అంశాలపై రెండు దేశాల మధ్య అవగాహన ఒప్పందాలు కుదిరాయి. పూర్తిస్థాయిలో వాణిజ్యానికి బాటలుపడేలా భారత్–యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా సాకారం చేసుకోవాలని మోదీ, మెర్జ్‌లు అభిలషించారు. విదేశాలకు విమానాల్లో ప్రయాణించే భారతీయులు జర్మనీ మీదుగా వెళ్తున్నప్పుడు అవసరమయ్యే ట్రాన్సిట్ వీసాతో పనిలేకుండా వీసా రహిత ప్రయాణాలకు అనుమతించాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. దీంతో భారతీయుల అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం కానున్నాయి.

పెరిగిన సహకారమే పరస్పర విశ్వాసానికి ప్రతీక

సంయుక్త ప్రకటన వేళ మోదీ మాట్లాడారు. ''రక్షణ, భద్రత రంగాల్లో ఏటికేడు పెరుగుతున్న సహకారమే ఇరుదేశాల మధ్య పరస్పర విశ్వాసం, ఐక్య దార్శనికతకు ప్రబల నిదర్శనం. వాణిజ్య ఒప్పందం సాఫీగా సాగేలా పూర్తిస్థాయి సహాయసహకారాలు అందిస్తున్న చాన్స్‌లర్ మెర్జ్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇరు దేశాల రక్షణ పరిశ్రమల మధ్య సహకారం బలపడేలా మార్గసూచీ కోసం కలిసి పనిచేద్దాం. దీంతో సహఅభివృద్ధి, సహ ఉత్పత్తిలో కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి''అని మోదీ అన్నారు. ''పారదర్శకమైన, స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్ వాణిజ్యానికి కట్టుబడి ఉన్నాం. సముద్ర చట్టాలపై ఐక్యరాజ్యసమితి తీర్మానాలను గౌరవిస్తాం. నూతన ద్వైపాక్షిక ఇండో–పసిఫిక్ సంప్రదింపుల వ్యవస్థను ప్రారంభిస్తున్నాం. ఇండియా–పశ్చిమాసియా–యూరప్ ఆర్థిక నడువాకు మా మద్దతు కొనసాగుతుంది''అని ఇరునేతలు సంయుక్త ప్రకటనలో స్పష్టంచేశారు. ఇండో–పసిఫిక్ సముద్రజలాల్లో చైనా ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత్, జర్మనీ ఈ నిర్ణయానికొచ్చాయి.

నైపుణ్య కార్మికులకెంతో డిమాండ్

ఈ సందర్భంగా చాన్స్‌లర్ మెర్జ్ మాట్లాడారు. ''ఇరు దేశాల ప్రజల మధ్య సత్సంబంధాలు బలపడుతున్నాయి. భారత్ నుంచి ఏటా నైపుణ్య కార్మికులు, సహాయకులు, నర్సుల డిమాండ్ పెరుగుతోంది. భారత్‌లోని ఆరోగ్య సంరక్షణ వృత్తినిపుణులకు జర్మనీలో ఎంతో గిరాకీ ఉంది. అయితే సరఫరా వ్యవస్థలు, ముడి పదార్థాల తరలింపులో బడా శక్తుల జోక్యం పెరిగిపోయింది. దీనిని భారత్, జర్మనీ ఉమ్మడిగా ఎదుర్కోనున్నాయి''అని మెర్జ్ పరోక్షంగా చైనా, అమెరికాలను విమర్శించారు. ''జర్మనీ విశ్వవిద్యాలయాలకు ఇదే నా స్వాగతం. భారత్‌లోకి అడుగుపెట్టి మీ వర్సిటీల క్యాంపస్‌లను ఆరంభించండి. ప్రతిభావంతులైన భారతీయ యువత మీ జర్మనీ ఆర్థికవ్యవస్థ అభివృద్ధికి కృషిచేస్తోంది. సమగ్ర మార్గసూచీ అనేది విద్యారంగంలో భాగస్వామ్యాన్ని సమున్నత శిఖరాలకు చేర్చుతుంది'అని మోదీ అన్నారు.

సబర్మతీ తీరాన గాలి పటం ఎగరేస్తున్న మెర్జ్, మోదీ

పతంగుల పండుగలో మోదీ, మెర్జ్

అహ్మదాబాద్: ద్వైపాక్షిక చర్చల కోసం భారత్‌కు విచ్చేసిన జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్‌కు అహ్మదాబాద్‌లో భారత ప్రధాని మోదీతోపాటు వినువీధిలో సప్తవర్ణాల పతంగుల సాదరస్వాగతం పలికాయి. అహ్మదాబాద్‌లోని సబర్మతీ నదీతీర ప్రాంతం ఇందుకు వేదికైంది. అహ్మదాబాద్‌లో అంతర్జాతీయ పతంగుల పండుగ–2026ను ఇరుదేశాల అగ్రనేతలు అధికారికంగా సోమవారం ప్రారంభించారు. 108 మంది సంగీతకళాకారులు తమ వాద్య పరికరాలతో చక్కటి సంగీతాన్ని వినిపిస్తూ మోదీ, మెర్జ్‌లను బీచ్‌లో కార్యక్రమ ప్రాంగణానికి ఆహ్వానించారు. గాలిపటాల పట్ల భారతీయుల ప్రేమ, తయారీలో ఆసక్తి, చారిత్రక అంశాలను మెర్జ్‌కు మోదీ స్వయంగా వివరించారు. పతంగుల తయారీ మెళకువలను ఇరునేతలు అక్కడి కళాకారులను అడిగి తెల్సుకున్నారు. ఇంతలోపు ఒక అధికారి ప్రధాని ముఖచిత్రం ముద్రించిన ఒక పతంగిని తీసుకొచ్చి ఎగిరేయాలని ప్రధాని మోదీకి అందజేశారు. దానికి ప్రధాని ఎగరేశారు. వేలాది మంది ఔత్సాహికులకు తోడు ప్రధాని మోదీ, చాన్స్‌లర్ మెర్జ్ సైతం ఓపెన్ టాప్ వాహనం పైకి ఎక్కి పతంగులను పోటీపోటీగా ఎగరేశారు. గగనవీధిలో గాలిపటాల సందడితో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా కోలా హలంగా మారింది. విభిన్న ఆకృతుల పతంగులతో పాటు ఎన్నెన్నో వినూత్న సందేశాలున్న గాలిపటాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా, ఇటలీ, జపాన్, తుర్కియే సహా 50 దేశాలకు చెందిన 135 మంది అంతర్జాతీయ పతంగుల నిపుణులు పాల్గొన్నారు.

గాంధీజీకి నేతల నివాళులు

అంతకుముందు సోమవారం ఉదయమే సబర్మతీ ఆశ్రమాన్ని మోదీ, మెర్జ్‌లు సందర్శించారు. అక్కడి రాట్నంతో మెర్జ్ కొద్దిసేపు నూలు వడికారు. స్వాతంత్య్రోద్యమ కాలంలో గాంధీజీ, ఆయన భార్య కస్తూర్బా నివసించిన హృదయ్ కుంజ్‌లో కొద్దిసేపు గడిపారు. తర్వాత గాంధీజీ విగ్రహం వద్ద ఇరు నేతలు నివాళుల ర్పించారు. ఈసందర్భంగా మెర్జ్‌కు మోదీ గాంధీజీ జ్ఞాపికను అందజేశారు.

సీబీఐ ఎదుటకు విజయ్

ఆరు గంటల పాటు విచారణ ● మళ్లీ నోటీసు ఇచ్చే అవకాశం

సాక్షి, చెన్నై: కరూర్ తొక్కిసలాట ఘటన కేసులోసినీ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధినేత విజయ్ సోమవారం ఢిల్లీలో సీబీఐ కార్యాలయంలో జరిగిన విచారణకు హాజరయ్యారు. అధికారులు ఆయన్ను దాదాపు ఆరుగంటలపాటు ప్రశ్నించారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున మరోసారి ఆయన్ను పిలిపించే అవకాశముందని సీబీఐ వర్గాలు తెలిపాయి. మంగళవారం కూడా రావాలని ఆయన్ను కోరగా, పొంగల్ పండుగ ఉన్నందున మరో రోజుకు విచారణను వాయిదా వేయాలని కోరారు. దీంతో, మరో రోజు ఆయన్ను పిలిపిస్తామని సీబీఐ వర్గాలు వెల్లడించాయి. చార్టెర్డ్ విమానంలో చెన్నై నుంచి ఢిల్లీకి చేరుకున్న విజయ్.. ఉదయం 11.29 గంటల సమయంలో రేంజ్ రోవర్ కారులో సీబీఐ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సీబీఐ కార్యాలయంతోపాటు పరిసరప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులతోపాటు కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. అధికార ప్రక్రియలు ముగిశాక దర్యాప్తు అధికారుల బృందం ఆయన్ను లోపలికి తీసుకెళ్లింది. దాదాపు ఆరు గంటల పాటు ప్రశ్నించిన అనంతరం విజయ్ 6.15 గంటలకు బయటకు వచ్చారు. గతేడాది సెప్టెంబర్ 27వ తేదీన విజయ్ కరూర్‌లో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావడం తొక్కిసలాటకు దారితీసింది. ఘటనలో 41 మంది చనిపోగా, 60మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే.

వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని నేనే

ట్రంప్ సంచలన ప్రకటన

న్యూయార్క్: ధర్మాత్ముడినని చెప్పుకుంటూ అధర్మ యుద్ధాలుచేసే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడిని ఇక తానేనని మరో వివాదాస్పద ప్రకటన చేశారు. ఇందుకు తన సొంత సామాజిక మాధ్యమ 'ట్రూత్ సోషల్'ను వేదికగా చేసుకున్నారు. సోమవారం ఒక ఫొటోను తన ఖాతాలో ట్రంప్ పోస్ట్‌చేశారు. అందులో ఫొటో కింది 'వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షుడు'అని రాసి ఉంది. దాని కింద '2026 జనవరి నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు'అని రాసి ఉంది. దాని కింద 'అమెరికాకు 45వ, 47వ అధ్యక్షుడు'అని మరో వాక్యం రాసి ఉంది. 2025 జనవరి 20వ తేదీన అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టినట్లుగా ఆ ఫొటోలో వాక్యం ఉంది. ఇది చూడ్డానికి అచ్చం వికీపీడియా వెబ్‌సైట్ డిజైన్‌లో ఉంది. కానీ ఇది ఎడిట్‌చేసిన ఫొటో అని చూడగానే తెలుస్తోంది. మాదకద్రవ్యాల ఉగ్రవాదానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలపై మదురో దంపతులను అమెరికా సేనలు బంధించి పట్టితెచ్చి న్యూయార్క్ కారాగారంలో పడేశారు. ఆ తర్వాతి రోజు వెనెజువెలాను సమర్థవంతమైన ప్రభుత్వం చేతుల్లో పెట్టేదాకా ఆ దేశాన్ని తామే పరిపాలిస్తామని ట్రంప్ ప్రకటించారు. కానీ విదేశాన్ని ఎలా పరోక్షంగా, సుదూరాల నుంచి పరిపాలించబోతున్నారో ట్రంప్ విడమర్చి చెప్పలేదు. ట్రంప్ వ్యాఖ్యలను ఆనాడే వెనెజువెలా నాటి ఉపాధ్యక్షురాలు, ప్రస్తుత తాత్కాలిక అధ్యక్షురాలు అయిన డెల్సీ రోడ్రిగ్స్ తోసిపుచ్చారు.

1న పార్లమెంట్‌లో బడ్జెట్

మొట్టమొదటిసారిగా ఆదివారం ప్రవేశపెట్టనున్న మంత్రి నిర్మల

న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీన పార్లమెంట్‌లో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇదే మొట్టమొదటిసారని ఆయన వివరించారు. కాగా, ఇది మంత్రి నిర్మల 9వ బడ్జెట్ అని చెప్పారు. గతంలో, పది పర్యాయాలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరుతో ఉందన్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 28వ తేదీన లోక్‌సభలో ఉభయ సభల సంయుక్త సమావేశంలో చేసే ప్రసంగంతో బడ్జెట్ సెషన్ ప్రారంభం కానుంది. అనంతరం, మంత్రి నిర్మల బడ్జెట్ సర్వేను ప్రవేశపెడతారు. పార్లమెంట్ సెషన్ జనవరి 28– ఏప్రిల్ 2వ తేదీ మధ్య రెండు విడతలుగా కొనసాగనుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించడం తెల్సిందే.

మకర సంక్రాంతి రోజున సేవా తీర్థ్‌లోకి పీఎంఓ

న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఢిల్లీలోని సౌత్‌బ్లాక్ భవనంలో కొనసాగుతున్న ప్రధానమంత్రి కార్యాలయాన్ని జనవరి 14వ తేదీన అంటే మకర సంక్రాంతి పండగ రోజున నూతన భవనసముదాయంలోకి మార్చనున్నారు. రైసినా హిల్స్ సమీపంలో అత్యాధునిక హంగులు, సకల సౌకర్యాలతో నిర్మించిన సేవాతీర్థ్–1 భవంతిలోకి ప్రధాని కార్యాలయం(పీఎంఓ)ను మార్చేస్తారని సోమవారం విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మకర సంక్రాంతి రోజున కొత్త భవనంలో ప్రధాని మోదీ అడుగుపెడతారని తెలుస్తోంది. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ కీలక కార్యాలయాల కోసం ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్ కాంప్లెక్స్(సేవా తీర్థ్)ల పేరిట కొత్త భవనాలను నిర్మిస్తున్న విషయం విదితమే. డల్హౌసీ రోడ్(దారా షికో రోడ్)లో సేవా తీర్థ్–1 భవనాన్ని కట్టారు. ప్రధాని కార్యాలయాన్ని ఈ కొత్త భవనంలోకి మార్చనున్నారు. ఇన్నాళ్లూ రాష్ట్రపతిభవన్ సమీపం భవనంలో సేవలందించిన కేబినెట్ సెక్రటేరియట్ విభాగం కొత్తగా కట్టిన సేవాతీర్థ్ పార్ట్–2 భవనంలోకి ఇప్పటికే మారిపోయింది. పార్లమెంట్ స్ట్రీట్‌లోని సర్దార్ పటేల్ భవన్‌లో భారత జాతీయ భద్రతా మండలి సచివాలయం(ఎన్ఎస్‌సీఎ) ఉండేది. సేవా తీర్థ్–3 భవనంలోకి ఎన్ఎస్‌సీఎస్ కార్యాలయం మారిపోనుంది. సెంట్రల్ విస్టాలో భాగంగా కడు తున్న నూతన ప్రధాని అధికారిక నివాసం ఇంకా నిర్మాణ దశలో ఉంది. కేంద్ర ప్రజాపనుల విభాగం నుంచి 2022లో కాంట్రాక్ట్ సంపాదించిన లార్సెన్ అండ్ టూబ్రో కంపెనీ రూ.1,189 కోట్ల వ్యయంతో 2,26,203 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనాలను నిర్మిస్తోంది. నాటి బ్రిటిష్‌పాలకులు 1920, 1930 దశకాల్లో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకోసం రాష్ట్రపతిభవన్‌కు వెళ్లేదారిలో సౌత్ బ్లాక్, నార్త్ బ్లాక్ పేరిట ఎర్రని ఇసుక రాళ్లతో అద్భుతమైన భవనాలను నిర్మించారు. ఈ సౌత్ బ్లాక్‌లోనే నాటి నెహ్రూ హయాం నుంచి ప్రధాని కార్యాలయం పని చేస్తోంది. దశాబ్దాల తర్వాత ఎట్టకేలకు ఈ ఆఫీస్ కొత్త భవనంలోకి తరలిపోతోంది. సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీస్‌లు ఖాళీ చేశాక ఈ భవనాలను మోదీ సర్కార్ 'యుగే యుగేన్ భారత్ సంగ్రహాలయ' జాతీయ మ్యూజియంగా రూపురేఖలు మార్చేయనుంది. మ్యూజియం ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక తోడ్పాటును ఫ్రాన్స్ మ్యూజియం డెవలప్‌మెంట్ ఏజెన్సీ అందించనుంది. ఆ తర్వాత సాధారణ ప్రజలను సందర్శనలకు అనుమతిస్తారు.

షక్స్‌గామ్ లోయ మాదే

- భారత్ అభ్యంతరం నడుమ చైనా ప్రకటన
- చైనా–పాక్‌ల సరిహద్దు ఒప్పందం చెల్లదంటున్న భారత్

బీజింగ్: సరిహద్దుల్లోని షక్స్‌గామ్ లోయ ప్రాంతం తమదేనంటూ చైనా మళ్లీ ప్రకటించుకుంది. భారత్ అభ్యంతరం తెలపడంతో ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన చేసింది. లోయలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు అభ్యంతరాలకు తావులేకుండా నిర్మిస్తున్నవని తెలిపింది. షక్స్‌గామ్‌లోయలో చైనా ఆధ్వర్యంలో మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులపై భారత్ శుక్రవారం అభ్యంతరం తెలిపింది. భారత దేశ ప్రాదేశిక సమగ్రతకు, ప్రయోజనాలకు భంగం కలిగిన పక్షంలో తగు చర్యలు తీసుకునే హక్కు తమకుందని స్పష్టం చేసింది. పాకిస్తాన్ ఆక్రమించుకున్న జమ్మూకశ్మీర్‌లోని భాగమే షక్స్‌లోయ. సుమారు 5,180 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణమున్న ఈ లోయను పాక్ ప్రభుత్వం 1963లో చైనాకు అప్పగించి, సరిహద్దు ఒప్పందం కుదుర్చుకుంది. 'షక్స్‌గామ్ లోయ భారత్‌లోనిదే. 1963లో చైనా–పాకిస్తాన్ కుదుర్చుకున్న సరిహద్దు ఒప్పందాన్ని మేం ఎన్నడూ గుర్తించలేదు. ఈ ఒప్పందం చట్టవిరుద్ధం, చెల్లుబాటు కాదని పలుమార్లు తెలిపాం'అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. అదేవిధంగా, బలవంతంగా ఆక్రమించుకున్న భారత భూభాగం మీదుగా వెళ్లే చైనా–పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్(సీపెక్)ను కూడా భారత్ గుర్తించడం లేదని ఆయన స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లలోని పూర్తి ప్రాంతం భారత్‌లో విడదీయరాని భాగమని చెప్పారు. ఇదే అంశాన్ని చైనా, పాక్ అధికారులు పలు మార్లు తెలిపామని జైశ్వాల్ వెల్లడించారు. జైశ్వాల్ ప్రకటనపై చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ సోమవారం మీడియా సమక్షంలో స్పందించారు. భారత్ పేర్కొన్న భూభాగం చైనాదేనన్నారు. చైనా తన భూభాగంలోనే మౌలిక వసతుల నిర్మాణాలను చేపట్టింది. 1960ల్లో చైనా, పాకిస్తాన్‌లు సరిహద్దు ఒప్పందం కుదుర్చుకున్నాయి. తమ ఉమ్మడి సరిహద్దును అంగీకరించాయి'అని తెలిపారు. సీపెక్‌పై మావో నింగ్ మాట్లాడుతూ..ఇది దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని, సామాజికార్థిక అభివృద్ధికి ఉద్దేశించిన ప్రాజెక్టని చెప్పారు. సీపెక్, సరిహద్దు ఒప్పందాలతో కశ్మీర్ విషయంలో తమ వైఖరి మారబోదన్నారు. ఈ వివాదాన్ని ఐరాస, మండలి తీర్మానాలకు లోబడి పరిష్కరించుకోవాలన్నదే తమ అభిమతమన్నారు. ఇలాఉండగా, కశ్మీర్ వివాదం పరిష్కారమయ్యాక అధికారికంగా ఒప్పందంపై సంతకాలు చేద్దామంటూ 1963నాటి ఒప్పందంలో చైనా–పాక్‌లు పేర్కొనడం గమనార్హం.

చర్చలకు దిగొచ్చిన ఇరాన్

- త్వరలో చర్చలు మొదలవుతాయి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- 'చర్య'లకూ ఆస్కారముందని వ్యాఖ్యలు
- టెహ్రాన్‌లో ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు
- 599కు పెరిగిన నిరసన మృతుల సంఖ్య

దుబాయ్: దాడులు తప్పవన్న తన హెచ్చరికలకు ఇరాన్ దిగొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సామరస్యంగా చర్చించుకుందామని ప్రతిపాదించినట్టు ఆయన చెప్పుకొచ్చారు. ఆదివారం రాత్రి ఎయిర్‌ఫోర్స్‌వన్ విమానంలో ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. ఇరాన్ అభ్యర్థన మేరకు ఆ దేశ నాయకత్వంతో చర్చల కోసం ఏర్పాట్లు జరుగుతున్నట్టు వెల్లడించారు. అయితే నిరసనకారుల మరణాల సంఖ్య ఇలాగే పెరిగితే మాత్రం తాను చర్చలకు బదులు 'చర్యలు' తీసుకోవాల్సి రావచ్చని ట్రంప్ హెచ్చరించారు. ''మా సైన్యం పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. గట్టి ఆప్షన్లనే పరిశీలిస్తున్నాం'' అని వెల్లడించారు. అమెరికా దాడికి దిగితే దీటుగా తిప్పికొడతామన్న ఇరాన్ ప్రకటనను మీడియా ప్రస్తావించగా, 'వారు అదే చేస్తే కనీవినీ ఎరగని రీతిలో వారిపై విరుచుకుపడతాం' అని ట్రంప్ అన్నారు. ట్రంప్ చర్చల ప్రకటనపై ఇరాన్ ధ్రువీకరించలేదు. అయితే అమెరికాతో చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాచీ చెప్పారు. అయితే అవి ఏకపక్షంగా ఉంటే అంగీకరించబోమన్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ మాత్రం నిరసనల్లో చోటుచేసుకుంటున్న హింసాకాండ, రక్తపాతాల ఏకైక ఉద్దేశం తమపై దాడికి అమెరికాకు అవసరమైన సాకు కల్పించడమేనని దుయ్యబట్టడం విశేషం. మరోవైపు మూడో వారానికి చేరిన ఇరాన్ ఆందోళనల్లో మృతుల సంఖ్య599కు చేరుకున్నట్టు అమెరికాకు చెందిన మానవ హక్కుల సంస్థ తాజాగా వెల్లడించింది. వీరిలో 525 మంది దాకా నిరసనకారులు కాగా మిగతా మృతులు పోలీసు, భద్రతా సిబ్బంది అని పేర్కొంది. క్షతగాత్రుల సంఖ్య 11 వేలు దాటినట్టు తెలిపింది.

ప్రదర్శనల్లో అధ్యక్షుడు..

నిరసనలు నింగినంటుతున్న వేళ ఇరాన్‌లో మరో పరిణామం చోటుచేసుకుంది. వాటికి ప్రతిగా ప్రభుత్వ అనుకూలంగా ఉన్న వేలాది మందితో ఇరాన్ సర్కారు రాజధాని టెహ్రాన్‌లో భారీ ప్రదర్శనలకు దిగింది. అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో పాటు విదేశాంగ మంత్రి తదితరులు వీటిలో పాల్గొనడం విశేషం. అమెరికా, ఇజ్రాయెల్ ప్రాయోజిత ఉగ్రవాదంపై ప్రజాగ్రహంగా ఇరాన్ వీటిని అభివర్ణించింది. కెర్మన్, రష్త్ తదితర పట్టణాల్లోనూ ఈ ప్రదర్శనలు కొనసాగాయి. మరోవైపు, ఇరాన్‌లో సుస్థిరత నెలకొనాలని చైనా ఆకాంక్షించింది. ఈ విషయంలో బయటి శక్తుల ప్రమేయానికి తావుండరాదని స్పష్టం చేసింది. సొంత ప్రజల మీదే ఇరాన్ యంత్రాంగం ఇంత దారుణంగా దమనకాండకు దిగడం దారుణమని జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ విమర్శించారు. నిరసనకారుల ధైర్యసాహసాలకు హ్యాట్సాఫ్ అని పేర్కొన్నారు.

స్టార్ లింక్ సేవలు కట్

మిన్నంటుతున్న ప్రభుత్వ వ్యతిరేక నిరసనలను కట్టడి చేసే యత్నాల్లో భాగంగా ఇరాన్‌లో స్టార్ లింక్ ఉపగ్రహ సేవలను ఖమేనీ యంత్రాంగం నిలిపేసింది. ఇందుకోసం మిలిటరీ గ్రేడ్ 'కిల్ స్విచ్'ను యాక్టివేట్ చేసినట్టు సమాచారం. ఈ అత్యాధునిక జామింగ్ పరిజ్ఞానాన్ని ఇరాన్‌కు రష్యా లేదా చైనా అందించి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇరాన్‌వ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను కొద్దిరోజుల క్రితమే నిలిపేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ నెట్‌వర్క్ ద్వారానే అక్కడి సమాచారం అంతో ఇంతో బయటి ప్రపంచానికి తెలుస్తూ వస్తోంది. తాజాగా ఆ లింకును ఇరాన్ తెంచేసింది.

ఏమిటీ కిల్ స్విచ్?

స్టార్‌లింక్ ఉపగ్రహాలను జామ్ చేసేందుకు ఇరాన్ యంత్రాంగం వాడిన కిల్ స్విచ్ ఇప్పుడు ట్రెండింగ్‌లో నిలిచింది. ఇది అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మిలిటరీ గ్రేడ్‌జామింగ్ ఎక్విప్‌మెంట్. దీని ఖరీదు 15.6 లక్షల డాలర్లని సమాచారం. స్టార్‌లింక్ రిసీవర్లు తమ యూజర్లను లొకేట్ చేసి వారితో కనెక్టయ్యేందుకు జీపీఎస్‌ను వాడతాయి. మిలిటరీ గ్రేడ్ జామర్లు ఆ లింకును తెంపేస్తాయి. అందుకోసం సదరు ఉపగ్రహం తాలూకు ఫ్రీక్వెన్సీలోనే అత్యంత శక్తిమంతమైన రేడియో సిగ్నళ్లను విడుదల చేస్తాయి. మొత్తం వ్యవస్థను కలిపి కిల్ స్విచ్‌గా పేర్కొంటారు. 2014 నుంచీ రష్యా ఈ టెక్నాలజీని వాడుతోంది.

మన జెన్ జెడ్‌లో పుష్కలంగా సృజన

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో ప్రధాని వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారతీయ జెన్ జెడ్ యువతరంలో సృజనాత్మకత పుష్కలంగా ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. 2047 ఏడాదికల్లా భారత్‌ను అభివృద్ధిచెందిన దేశంగా వికసిత్ భారత్‌గా అవతరింపజేసుకునేందుకు యువత తమ వంతుగా అందించే వినూత్న, సృజనాత్మక ఆలోచనల వేదికగా వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్(బీవీవైఎల్‌డీ)ను మోదీ ప్రభుత్వం తీర్చిదిద్దింది. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా జనవరి 12వ తేదీన బీవీవైఎల్‌డీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం ఢిల్లీలో వీబీఐఎల్‌డీ ముగింపు కార్యక్రమంలో మోదీ పాల్గొని ప్రసంగించారు. '' ఏటా స్వామి వివేకానంద గౌరవార్థం జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆయన స్ఫూర్తితో వీబీవైఎల్‌డీని స్థాపించాం. యువతను దృష్టిలో ఉంచుకుని పలు కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకొచ్చాం. అంకురసంస్థల విప్లవాన్ని ఆశిస్తున్నాం. ఇప్పుడు సృజనాత్మక ఆలోచనలు, శక్తి, సదుద్దేశాలతో మన యువశక్తి ఇప్పుడు దేశ నిర్మాణంలో ముందు వరసలో నిలబడింది. సృజనాత్మక ఆలోచనలు, సమాచారం, సంస్కృతిలతో ఆరెంజ్ ఎకానమీ గణనీయమైన వృద్ధిపథంలో పయనిస్తోంది. గత దశాబ్దకాలంగా చేపట్టిన పలు సంస్కరణలతో ఇప్పుడు ఏకంగా సంస్కరణ ఎక్స్‌ప్రెస్ దూసుకుపోతోంది. ఈ సంస్కరణల కేంద్ర బిందువు మన యువతలోనే దాగి ఉంది'' అని మోదీ అన్నారు. జనవరి 9వ నుంచి 12వ తేదీదాకా బీవీవైఎల్‌డీ కొనసాగింది. దేశవ్యాప్తంగా పలు స్థాయిల్లో 50 లక్షల మందికిపైగా యువత ఈ కార్యక్రమంలో పాల్గొంది.

సాక్షి
గుంటూరు
మంగళవారం । 13 । జనవరి । 2026

అమ్మవారికి సారె సమర్పణ

పొన్నూరు:ధనుర్మాసం సందర్భంగా సోమవారం సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడంలేదు. దిగువకు 3400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 38.9797 టీఎంసీలు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

నరసరావుపేట: పదవ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం కలెక్టరేట్‌లో ప్రారంభించారు.

న్యూస్‌రీల్

రామావతారం అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో గల అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం శ్రీవారికి రామావతారం అలంకరణ చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు చిత్రకవి శ్యాము ఆచార్యులు ప్రత్యేక పూజలు, గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పాశురాలను పఠించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కోలాట ప్రదర్శన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులు సమర్పించిన వస్త్రాల వేలం

మంగళగిరి టౌన్: మంగళగిరిలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ఎగువ, దిగువ సన్నిధిల్లో శ్రీ స్వామివారికి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 14, 15వ తేదీలలో ఉదయం 9 గంటల నుంచి దిగువ సన్నిధిలోని ఆలయంలో వేలం నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని పేర్కొన్నారు.

స్వదేశీ నినాదాన్ని చాటిన మహనీయుడు వివేకానంద

మంగళగిరి టౌన్ : స్వదేశీ నినాదాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని స్వామి వివేకానంద స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వర్శిటీ పరిపాలనా భవనంలో జరిగిన కార్యక్రమంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తిని నాటడంలో వివేకానంద చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య శివరామ్ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, వర్శిటీ ఆర్ట్స్, కామర్స్ లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సురేష్‌కుమార్, పలువురు ఆచార్యులు లింగరాజు, తేజామూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 556.00 అడుగులకు చేరింది. ఇది 223.1910 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,800, ఎడమ కాలువకు 7,272, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 26,704, ఎస్‌ఎల్‌బీసీకి 1,650, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది.జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 45,726 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 33,098 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి

నగరంపాలెం(గుంటూరువెస్ట్):గుంటూరుబృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సంయుక్త ఆధ్వర్యంలో విశ్వశాంతి, లోక కల్యాణాలను కాంక్షిస్తూ సోమవారం చండీహోమం మహా పూర్ణాహుతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో కోడిపందాల కోసం వచ్చే వీఐపీలకు సిద్ధమవుతున్న వేదిక

సంక్రాంతి కోడి పందాలకు సై..

బరి తెగింపు

- చెరుకుపల్లి వద్ద 50 ఎకరాల్లో పెద్ద బరి
- వేమూరు, కొల్లూరు మండలాల్లో రెండేసి బరులు
- పిట్టలవానిపాలెం మండలంలో ఓ భారీ బరి
- పర్చూరు, చీరాల ప్రాంతాల్లోనూ కోడి పందేల జోరు
- సంప్రదాయ క్రీడ మాటున జూదం.. అక్కడే మద్యం దుకాణాల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సంక్రాంతి నాడు సంప్రదాయ క్రీడగా ఆడుకొనే కోడి పందేలను జూద క్రీడగా మార్చి కోట్లు కొల్లగొట్టేందుకు కొందరు అధికారపార్టీ నేతలు సిద్ధమయ్యారు. ఇందుకోసం పండుగకు వారం ముందే బరులు సిద్ధం చేశారు. ఐదు రోజులపాటు పందాలు, పేకాట జోరుగా సాగనుంది. అంతకు మించి పై పందాలు ఉండనున్నాయి. వందల కోట్లలో వ్యాపారం ఉంటుందని అంచనా వేస్తున్నారు. బరుల వద్ద పలురకాల వ్యాపారాలను లాభసాటిగా మార్చేందుకు టీడీపీ, జనసేన నేతలు సిద్ధమయ్యారు. కూల్‌డ్రింక్ షాపులు మొదలు చిరుతిళ్ల దుకాణాలు నెలకొల్పుతున్నారు. బరులవద్ద అనధికార మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో కోడిపందేల కోసం సిద్ధమైన బరి

వేమూరు నియోజకవర్గంలో..

ఈ ప్రాంతంలో ఐదు బరులు ఏర్పాటు చేస్తున్నారు. వేమూరు మండలం కేంద్రం మార్కెట్ సమీపంలో టీడీపీ నేత పది ఎకరాల్లో ఒక బరి సిద్ధం చేయగా..ఇదే మండలంలోని చావలి–కోడిపర్రు మధ్యన జనసేన నేత పది ఎకరాల్లో మరో బరి నెలకొల్పారు. కొల్లూరు మండలం కేంద్రం సమీపంలో క్రాప వద్ద ఒక బరి, ఇదే మండలంలోని అనంతవరం వద్ద మరొక బరిని టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. చుండూరు మండలం వేటపాలెం వద్ద బరి సిద్ధం చేశారు.

బాపట్ల నియోజకవర్గంలో...

పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెం వద్ద టీడీపీ నేతలు బారీ బరి ఏర్పాటు చేశారు. ఈ బరులన్నింటిలో రూ.25 వేలు మొదలు రెండు లక్షల వరకు పందాలు సాగనున్నాయి. పెద్ద ఎత్తున పేకాట కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇవి కాకుండా పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం పెద గంజాంతోపాటు నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామాల్లో కోడి పందేలు జరగనున్నాయి. చీరాల, బాపట్ల నియోజకవర్గాల్లోని గ్రామాల్లో కోడిపందాలు, పేకాట నిర్వహించనున్నారు. జిల్లాలో జరిగే కోడిపందాలు, పేకాటలకు జిల్లా నలుమూల నుంచే కాక అటు ప్రకాశం, నెల్లూరు, జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి రానున్నారు.

మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇలాకాలో ..

రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలంలో 50 ఎకరాల విస్తీర్ణంలో కోడిపందేలు, పేకాట కోసం బరి సిద్ధం చేశారు. ఇందులో ఒకటి పెద్ద బరికాగా.. మిగిలిన పది బరులు చిన్నవి. పెద్ద బరిలో రూ.లక్ష నుంచి రెండు లక్షల పందేలు జరగనుండగా చిన్న బరుల్లో రూ.10 వేల నుంచి లక్ష వరకు జరగనున్నాయి. ఇక్కడ పెద్ద ఎత్తున పేకాట నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన వారికి ఐదు రోజులపాటు పేకాట ఆడుకునేందుకు రూ. 60 లక్షలకు కాంట్రాక్ట్ ఇచ్చినట్లు సమాచారం. బరులవద్ద పార్కింగ్, మద్యం దుకాణాల ఏర్పాటుకు నిర్వాహకులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు.

తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా బదిలీ

తెనాలిరూరల్: తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా బదిలీ అయ్యారు. ఆమెను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2022 బ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన సంజనా సింహా ఐఐటీ, ఖరగ్‌పూర్‌లో బీటెక్ చేశారు. సివిల్స్ పరీక్షల్లో మూడో పర్యాయం 201 ర్యాంకుతో ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. నాలుగో ప్రయత్నంలో 37వ ర్యాంకు సాధించి తాను కలలుగన్న ఐఏఎస్‌ను అందుకున్నారు. నెల్లూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తిచేసుకున్నాక, ఆమె ను విద్యుత్ శాఖలో కార్యదర్శిగా నియ మించారు. 2024 ఆగస్ట్ 25న తెనాలి సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి సమర్థంగా పని చేస్తూ వచ్చారు.తెనాలి శాలిపేట లో దశాబ్దాలుగా నిర్వహిస్తున్న వ్యభిచార గృహాన్ని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ హోదాలో ఐటీపీ సెక్షన్ 18 కింద సీజ్ చేయాలని ఆదేశాలు జారీచేశారు. తెనాలి ప్రాంతంలో వ్యభిచార గృహాన్ని ఏడాదిపాటు సీజ్ చేయించిన తొలి అధికారిగా పేరు తెచ్చుకున్నారు.

గుంటూరు నగర కమిషనర్‌గా మయూర్ అశోక్

నెహ్రూనగర్:గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కె మయూర్ అశోక్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా గుంటూరు నగర కమిషనర్‌గా పనిచేస్తున్న పులి శ్రీనివాసులును మార్కాపురం జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె మయూర్ అశోక్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సంక్రాంతి తరువాత నూతన కమిషనర్ విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్‌లు

- జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ
- 360 అర్జీలు స్వీకరణ

గుంటూరు వెస్ట్: రెవెన్యూ అంశాలకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే రెవెన్యూ క్లినిక్‌లు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో జేసీ మాట్లాడుతూ అధికారులు రెవెన్యూ క్లినిక్‌ల ప్రాధాన్యతను అర్థం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. సమస్యలు పరిష్కారం కాకుండా అయిపోయినట్లు చూపవద్దని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అనంతరం అందిన 360 అర్జీలను జేసీతో పాటు తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, చంద్రముని పరిశీలించారు.

అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

పశ్చిమ తహసీల్దార్ పట్టించుకోవడంలేదు

పొత్తూరు వీఆర్వోకు అదనంగా మరో మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఏ సమస్యను పట్టించుకోవడంలేదు. ఇదే విషయాన్ని పలుమార్లు పశ్చిమ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సమస్యను పరిష్కరించండి. –పొత్తూరు గ్రామస్తులు

ఉపాధి లేకుండా చేస్తారా..

గత ప్రభుత్వ హయాంలో ఫిష్ ఆంధ్ర మినీలో భాగంగా నల్లకుంట మెయిన్ అర్చీ పక్కన దుకాణం ఏర్పాటు చేశాను. రోడ్డు విస్తరణ పేరుతో దుకాణం పక్కకు జరపమన్నారు. జరిపి వ్యాపారం చేసుకుంటున్నాను. సెలవు రోజున నాకు చెప్పకుండా బంక్‌ను పూర్తిగా తొలగించారు. అందులో సామాగ్రి కూడా లేకుండా చేశారు. గత ప్రభుత్వం దుకాణం పెట్టుకోమంటే ఈ ప్రభుత్వం చెప్పకుండా తొలగించింది. మాపై ఎందుకీ వివక్ష. న్యాయం చేయండి. –చుక్కా వెంకట సుబ్బారావు

ఎమ్మెల్యే ధూళిపాళ్ల అండతో నా కుమార్తెకు చిత్రహింసలు

- జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఫ్లెక్సీతో ఓ తల్లి ఆవేదన

నగరంపాలెం: ''నా కుమార్తె వారం రోజులుగా కనిపించడం లేదు..అసలు బతికే ఉందో..చనిపోయిందో తెలియడం లేదు...అల్లుడిని అడిగితే బెదిరిస్తున్నాడు..నా బిడ్డ ప్రాణాలతో కావాలంటూ'' ఓ తల్లి సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. కుమార్తెను చిత్రహింసలకు గురిచేస్తున్న ఆమె భర్త చెర నుంచి విడిపించాలని వేడుకుంది. నా బిడ్డ నాకు కావాలి, ప్రాణాలతో కావాలి అంటూ ఫ్లెక్సీ చేతపట్టుకుని జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేసింది. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరిగిన పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడింది. వివరాలు ఇలా... బాపట్ల జిల్లా కూనపద్మావతినగర్ జగన్ కాలనీకి చెందిన నంబూరు లక్ష్మి కుమార్తె వెంకటేశ్వరమ్మ, పొలురాజు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన దగ్గర్నుంచి భార్యను అనుమానంతో వేధింపులకు గురిచేసేవాడు. ఐదు సవర్ల బంగారు గొలుసు తీసుకుని బ్యాంక్‌లో తనఖా పెట్టాడు. ఇటీవల మరో ఎకరం పొలం రాసివ్వాలంటూ భార్యపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నాడు. వారం రోజులుగా భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. అప్పటి నుంచి ఆమె కనిపించడంలేదు. నా బిడ్డ బతికే ఉందో.. చనిపోయిందో తెలియడంలేదని లక్ష్మి వాపోయింది. కుమార్తె విషయమై అల్లుడ్ని అడిగితే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరిస్తున్నాడని తెలిపింది. భర్త చిత్రహింసలు భరించలేక గతంలో కుమార్తె పలుమార్లు జిల్లా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేసింది. పొలురాజుకు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మద్దతు ఉందని, ఆయన అండదండలతోనే తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించింది.

ఫ్లెక్సీ చేతపట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న లక్ష్మి

సంక్రాంతి నేతి అరిసెలు

సిద్ధంగా ఉన్న చక్కలు

బెల్లం గవ్వలు

సంక్రాంతి ఘుమ ఘుమలు

ఊరంతా పిండి వంటల సందడి

నేతి అరిసెలు.. కొబ్బరి బూరెలు.. కజ్జికాయలు.. కరకరలాడే చక్రాలు.. చక్కలు, బూందీ లడ్డూలు, బెల్లం గవ్వలు.. ఇలా చెప్పుకుంటూ పోతే నోరూరించే పిండి వంటకాలెన్నో.. ఎన్నెన్నో.. తెలుగునాట పెద్ద పండుగగా జరుపుకునే సంక్రాంతి వేడుకల్లో పిండి వంటలది ప్రథమ స్థానం. అందులోనూ అరిసెలది అందెవేసిన చెయ్యి. సంక్రాంతికి సమ్‌థింగ్ స్పెషల్ వంటకమూ ఇదే.. తెలుగింటి ముంగిట మరో 24 గంటల్లో సంక్రాంతి సందడి ప్రారంభం కానుండడంతో పల్లెల్లో ఎక్కడ చూసినా పిండివంటల ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి. నేతి అరిసెల సువాసనలు వీధులను చుట్టేస్తున్నాయి. గ్రామాలలో చుట్టుపక్కల నివాసాల వారు, బంధుమిత్రులంతా ఒక చోటకు చేరి కలిసికట్టుగా సంక్రాంతి వంటకాల తయారీలో నిమగ్నమై కనిపిస్తున్నారు.

– ప్రత్తిపాడు

పెదగొట్టిపాడులో బంధుమిత్రులతో కలిసి పిండివంటలు

కరకరలాడే చక్రాలు

కోడి పందెం, పేకాట నిర్వహణ చట్టరీత్యా నేరం

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: జిల్లాలో కోడి పందేలు, పేకాట, గుండాట, మట్కా వంటి జూద క్రీడలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంప్రదాయం ముసుగులో జీవ హింసకు పాల్పడితే సహించేదిలేదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తరహా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐతోపాటు రెవెన్యూ అధికారులు, మూగ జీవాల సంక్షేమ బోర్డు సభ్యులు, ఎన్‌జీవో సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కోడి పందేలు, ఇతర త్రా జంతువుల తో పోటీలు నిర్వహిస్తూ జీవ హింసకు పాల్పడటం సరికాదని అన్నారు. జిల్లాలో ఇటువంటివి జరగకుండా పోలీస్ శాఖ నుంచి పటిష్టమైన నిఘా ఉందన్నారు. జూదం, మట్కా వంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాల వల్ల సులభంగా నగదు సంపాదించవచ్చనే ఆశతో కొందరు ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇటువంటి అనధికార వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాలతో గతంలో కోడి పందేలు, పేకాట, మట్కా నిర్వహించిన ప్రదేశాలు, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. జిల్లాలో ఎవరైనా కోడి పందేల నిర్వహణ కోసం బరులు ఏర్పాటు చేసినా, స్థలం లేదా పొలాలు కేటాయించినా, పందేల నిర్వహణకు సహకరించినా, పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	61,356
అమ్మకాలు	57,064
నిల్వ	13,183

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–19,000
నంబరు-5	13,500–18,000
341	14,000–20,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	12,000–18,500
నంబరు-5	13,000–18,000
341	13,000–19,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,500 – 15,500
బాడిగ–355	13,000 – 18,000
దేవనూరు డీలక్స్	13,500 – 20,500
ఆర్మూర్	12,000 – 14,000
తాలుకాయలు	5,500 – 8,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000–15000
బాడిగ – 355	12,000–17,500
తాలు	5,500 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

మైనర్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన
పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట అప్పాపురం గ్రామస్తుల నిరసన
- పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న అప్పాపురం గ్రామస్తులు, మాలమహానాడు, మాల మహాసభ నాయకులు

నగరంపాలెం: మైనర్ విద్యార్థులపై దాడికి పాల్పడిన ఎస్ఐ, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలంటూ కాకుమాను, అప్పాపురం గ్రామస్తులు, మాలమహానాడు, మాల మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని నినదించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్లు చేసి, ఆయా అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులను వేగంగా, చట్టబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), బెల్లం శ్రీనివాసరావు (ట్రాఫిక్), అబ్దుల్‌అజీజ్ (గుంటూరు తూర్పు) పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

విద్యార్థులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..
ఇటీవల కాకుమాను మండలం అప్పాపురం గ్రామం మాలపల్లిలో జరిగిన అమానుష ఘటనను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు వాలీబాల్ నెట్ కట్టే క్రమంలో టెలిఫోన్ స్తంభాన్ని తొలగించారని అన్నారు. దీనిపై ఓ మహిళా కాకుమాను పీఎస్‌లో ఫేక్ ఫిర్యాదు చేసిందని, దాన్ని ఆధారంగా చేసుకుని ఎస్ఐ ఏక్‌నాథ్, కానిస్టేబుల్ శ్రీకాంత్‌తో కలిసి నలుగురు విద్యార్థులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని వాపోయారు. విద్యార్థులను దుర్భాషలాడుతూ, తాము తలుచుకుంటే గ్రామాన్ని ఖాళీ చేయిస్తామని వ్యాఖ్యానించారన్నారు. వారిపై విచక్షణరహితంగా దాడి చేయడమేగాక రౌడీషీటర్ల వలే రోడ్డుపై నడిపించారని ఆరోపించారు. ఇప్పటివరకు ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం శోచనీయమన్నారు. ఎస్ఐ ఏక్‌నాథ్, పీసీ శ్రీకాంత్‌ను తక్షణమే సస్పెండ్ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌పాల్, ఎస్.వెంకటరమణ, మల్లెల వెంకట్రావు, బాధితులు, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వివేకానంద జీవితం యువతకు మార్గదర్శకం

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

గుంటూరు వెస్ట్: స్వామి వివేకానంద జీవితం యువతకు మార్గదర్శకమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత ఆధ్యాత్మిక, తాత్విక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడన్నారు. యువతకు శక్తి, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని అందించిన మహోన్నత ఆలోచనావేత్త అని పేర్కొన్నారు. 'మేలుకో .. లక్ష్యాన్ని సాధించే వరకు ఆగవద్దు'' అనే వివేకానందుని సూక్తి నేటి యువతకు మార్గదర్శకమని కొనియాడారు. స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం, ఆయన యువతపై చూపిన ప్రభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో షేక్ ఖాజావలి, జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ కె.కళ్యాణ చక్రవర్తి, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్రబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రతో అక్షరాస్యత పెంచాలి
ఆధునిక సమాజంలో విద్య ఎంతో కీలకమని దాని ప్రాముఖ్యతను వివరించి అక్షరాస్యతా శాతాన్ని పెంచే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉల్లాస్ – అక్షర ఆంధ్ర కార్యక్రమం నిర్దేశిత లక్ష్యాలను అందుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఆంజనేయులు, డీఈఓ షేక్ సలీం బాషా, డీపీఓ నాగసాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయింపు

- ఎస్టీ కులానికి చెందిన గోవిందనాయక్‌పై అక్రమంగా కేసు నమోదు
- చంద్రబాబు ప్రభుత్వంపై రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకత
- వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారని పార్టీ పీఏసీ సభ్యులు, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆరోపించారు. గుంటూరు జిల్లా జైల్లో ఉన్న జీడీసీసీ మాజీ డైరెక్టర్ గోవిందనాయక్‌ను సోమవారం ములాఖత్ ద్వారా బ్రహ్మనాయుడు పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసేది అధికారులని అన్నారు. రుణాలకు సంబంధించి డబ్బు చెల్లించాల్సింది రైతులని పేర్కొన్నారు. ఈ క్రమంలో సంతకం చేసిన గోవిందనాయక్‌పై అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేయడం దారుణమని మండిపడ్డారు. ఒక ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేయడం వెనుక చంద్రబాబు ప్రభుత్వం కుట్ర దాగి ఉందని ఆరోపించారు. సొసైటీ ద్వారా వంద కోట్లు రుణాలు తీసుకుంటే రూ.80 కోట్లు చెల్లించారని, మిగతా రూ.20 కోట్లను చెల్లిస్తున్నారని చెప్పారు. ఒకవైపు రైతులు రుణాలు చెల్లిస్తున్నా, అధికారులు తప్పు చేసినా కూడా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలే చేశారని వారిని అరెస్టులు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన డైరెక్టర్లు ఉన్నారని, గతంలో వారు సంతకాలు చేశారని అయినప్పటికీ వారిని అరెస్ట్ చేయలేదన్నారు. ఇప్పటికైనా రెడ్ బుక్ రాజ్యాంగం ఆపాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకు తీవ్ర వ్యతిరేకత వస్తోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. బొల్లాపల్లి మండలం జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణనాయక్, పార్టీ బొల్లాపల్లి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, వినుకొండ టౌన్ కన్వీనర్ కొత్తమాసు శివ, వినుకొండ రూరల్ మండలం కన్వీనర్ దండు చెన్నయ్య, తుప్పిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వచ్చి.. నగదు బ్యాగు లాక్కెళ్లి ..

ప్రత్తిపాడు యూనియన్ బ్యాంకు ఎదుట ఘటన

ప్రత్తిపాడు: బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు బ్యాంకు నుంచి నగదు డ్రా చేసుకుని బయటకు వచ్చిన వ్యక్తి వద్ద ఉన్న నగదు బ్యాగును లాక్కుని ఉడాయించిన ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రత్తిపాడు మండలం కొత్తమల్లాయపాలేనికి చెందిన వజ్రాల శ్రీనివాసరెడ్డి సోమవారం ఉదయం ప్రత్తిపాడులోని యూనియన్ బ్యాంక్‌లో రూ.1.94 లక్షలు విత్‌డ్రా చేసుకున్నాడు. ఆ నగదును బ్యాగులో పెట్టుకుని తన ద్విచక్ర వాహనంలో పెట్టుకునేందుకు వస్తున్న సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న ఆగంతకులు ఉన్న పళంగా అతని వద్దకు వచ్చి శ్రీనివాసరెడ్డిని ఏమార్చి బైక్ వద్దనున్న డబ్బు బ్యాగును లాక్కెళ్లిపోయారు. గమనించిన స్థానికులు ఆగంతకుల వెంట పడినా ఫలితం లేకపోయింది. కోయవారిపాలెం పరిసర ప్రాంతాల వరకు స్థానికులు బైక్‌లపై వెంబడించినా స్థానికుల కళ్లుగప్పి పారిపోయారు. బ్యాగులో రూ.రెండు లక్షలు ఉన్నాయని బాధితుడు చెప్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోనికి దిగి వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.నరహరి తెలిపారు.

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పోస్టర్లు ఆవిష్క రిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఈనెల 29, 30, 31, ఫిబ్రవరి 1న గుంటూరులోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. గుంటూరు అరండల్ పేటలోని ఓ హోటల్ లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో లక్ష్మణరావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డి, సుందరయ్య కళా నిలయం అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబులు మాట్లాడారు. గుంటూరు టీటీడీ కళ్యాణ మండపంలో ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి, ఢిల్లీ రైతు ఉద్యమంతో సహా వివిధ రైతాంగ ఉద్యమాలలో పాల్గొన్న 300 మంది రైతునాయకులు వస్తున్నారన్నారు. అదేవిధంగా ఆయా రోజుల్లో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వ్యవసాయ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ టి.రత్నారావు, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్, కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుణాళ్లకు వచ్చిన వ్యక్తి దుర్మరణం

దుర్గి: మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో శ్రీ చిరుమామిళ్ళ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన మహోత్సవానికి వచ్చిన భక్తుడు ప్రమాదంలో మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలం, అమ్మలూరు గ్రామానికి చెందిన కుమ్మరపల్లి బ్రహ్మయ్య (30)ను గుర్తు తెలియని వాహనం ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

SHRIRAM శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ కొరకు - నెం.3-6-478, 4వ అంతస్తు, ఆనంద ఎస్టేట్, లిబర్టీ రోడ్డు, హిమాయత్ నగర్, హైదరాబాద్-5000029. website: www.shriramfinance.in బ్రాంచి ఆఫీస్: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నెం. 26-2-7, 2వ అంతస్తు, పద్మావతి ప్లాజా, సిండికేట్ బ్యాంక్ పక్కన, ఎ.కె. నగర్, నెల్లూరు.

(రూల్ 8 (1) ప్రకారం) భౌతిక స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

[illegible]

తేది: 09.01.2026 ప్రదేశం : నెల్లూరు-2

అధీకృత అధికారి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ముగిసిన భాష్యం ఒలంపస్ క్రీడా పోటీలు

క్రికెట్ విజేతగా నిలిచిన వైజాగ్ విక్టర్స్ టీంతో భాష్యం రామకృష్ణ

- దృఢ సంకల్పంతో ముందుకు సాగితే విజయం సొంతం
- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ కేజీవీ సరిత

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్య సాధన కోసం దృఢ సంకల్పంతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ కేజీవీ సరిత అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గుంటూరు వికాస్‌నగర్‌లోని భాష్యం స్పోర్ట్స్ ఎరీనా గ్రౌండ్‌లో భాష్యం ఒలంపస్ పేరిట జరుగుతున్న భాష్యం సెంట్రల్ లెవల్ ఒలంపస్ క్రీడా పోటీల కార్యక్రమం సోమవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సరిత మాట్లాడుతూ 60 వేలకు మందికి పైగా విద్యార్థులు ఈ భాష్యం ఒలంపస్‌లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన ఇవ్వడం నిజమైన క్రీడా స్ఫూర్తిని తెలియజేస్తుందన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ బృందం ఓపెన్ పరేడ్‌లో ప్రదర్శించిన క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పోలీస్ అధికారిగా గర్వపడేలా చేశాయన్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంత రావు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గెలుపొందిన జట్ల వివరాలు..

- క్రికెట్‌లో వరుసగా విన్నర్స్, రన్నర్స్‌గా వైజాగ్ విక్టర్స్, తూర్పుగోదావరి గోదావరి ఎలైట్స్.
- కబడ్డీలో ప్రకాశం పాంథర్స్, కృష్ణా నైట్స్,
- ఖో–ఖోలో నరసరావుపేట నింజాస్, రాయలసీమ రాయల్స్.
- త్రో బాల్‌లో గుంటూరు గ్లాడియేటర్స్ పశ్చిమగోదావరి వారియర్స్.
- రిలే రేస్ బాలుర విభాగంలో గుంటూరు గ్లాడియేటర్స్, నరసరావుపేట నింజాస్, ఈస్ట్ గోదావరి ఎంపరర్స్, హైదరాబాద్ హైలాండర్స్.
- రిలే రేస్ బాలికల విభాగంలో రాయలసీమ రాయల్స్, వైజాగ్ విక్టర్స్, కృష్ణా నైట్స్, తిరుపతి టైటాన్స్.
- క్యారమ్స్ బాలికల విభాగంలో ప్రకాశం పాంథర్స్ తూర్పుగోదావరి.
- ఈగల్స్ బాలుర విభాగంలో గుంటూరు గ్లాడియేటర్స్ తూర్పు గోదావరి ఈగల్స్.
- చెస్ బాలుర విభాగంలో హైదరాబాద్ హైలాండర్స్, రాయలసీమ రాయల్స్.
- బాలికల విభాగంలో కృష్ణా నైట్స్, వైజాగ్ విక్టర్స్ నిలిచారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీగా వెంకట రమణప్ప

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వెంకట రమణప్ప గుంటూరులోని ఆ శాఖ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ శాఖకు ఇప్పటి వరకు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న దుర్గాభాయి ఇన్‌చార్జి ఏడీగా పనిచేశారు. దుర్గాభాయిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆమెపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని విభిన్న ప్రతిభావంతుల స్టేట్ డైరెక్టర్ బి. రవిప్రకాష్‌రెడ్డి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆదేశిస్తూ గత కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆమె స్థానంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న వెంకట రమణప్పను నియమించారు.

క్రీడల్లో బాపట్ల జిల్లాకు ప్రాధాన్యం పెరగాలి



బాపట్ల: రాష్ట్ర స్థాయిలో ఒలింపిక్ గేమ్స్‌లో సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో బాపట్ల జిల్లా, యద్దనపూడి మండలానికి చెందిన ఎ.భార్గవ్ శ్రీరామ్, ఎం.రత్న కుమార్ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో మొదటి, మూడవ స్థానంలో విజేతలుగా నిలిచారు. రేపల్లె మండలం, ప్రభుత్వ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎస్.కె.అహ్మద్ జోనల్ లెవెల్‌లో బాపట్ల జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు క్రీడల్లో ప్రాధాన్యం పెరగాలని ఆకాంక్షించారు.

సహాయక పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వాలు దివ్యాంగులకు అందజేస్తున్న సహాయక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువార్త అన్నారు. పర్చూరు జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం దివ్యాంగులకు సహాయక పరికరాల నమోదు శిబిరం నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నిట్ నెం :65/జె.టి.ఓ/2025-26 ఆర్.ఓ.సి నెం: 9419/2025/ఇ1 ది.10.01.2026

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధుల క్రింద ఈ దిగువ ఉదహరించిన పనులకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు: 09 అంచనా వ్యయము: రూ. 64.40 లక్షలు

పని నెం: 01 నుండి 09 వరకు:

1. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది: ది.13.01.2026 ఉదయము గం. 11.00ని. ల నుండి

పని నెం: 02, 03, 08 మరియు 09 లకు:

2. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది:ది.20.01.2026 ఉదయము గం.11.00ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేదీ : ది.20.01.2026 మధ్యాహ్నము గం.02.00ని. లకు

పని నెం : 01, 04 నుండి 07 లకు:

4. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది : ది.27.01.2026 ఉదయము గం. 11.00 ల వరకు
5. ప్రైస్ బిడ్ తెరుచు తేది : ది.27.01.2026 మధ్యాహ్నము గం.02.00ని. లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్ సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

సం/- కమీషనర్, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

కవయిత్రి విశ్వైక పావని దంపతులకు సన్మానం

సత్తెనపల్లి: సామాజిక కవయిత్రి విశ్వైక కలం నుంచి వెలువడిన 'తొలి సంతకం' కవితా సంకలనం పుస్తక పరిచయం పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ కవిత్వం ఆత్మ భాషయని, భావోద్వేగాలను పదాలుగా నేయగలవాడు 'కవి' అన్నారు. ఈ 'తొలి సంతకం ' కవితా మాలిక కవయిత్రి పావని కాగా ఆమె కలంపేరు 'విశ్వైక.' ఇటీవల హైదరాబాద్ నగరంలో ప్రారంభావిష్కరణ జరుపుకోగా సత్తెనపల్లిలో పుస్తక సమీక్ష 'తొలి సంతకం' కవితా మాలిక ప్రతిష్టను సంతరించుకొన్నదన్నారు. సభలో ప్రముఖ కవి కొరబండి ఆంథోనీ, యూటీఎఫ్ నాయకులు రిటైర్డ్ ఉపాధ్యాయులు కె.పోతులూరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ సీపీఎం పట్టణ కార్యదర్శి డి విమల, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కార్యదర్శి జి ఉమాశ్రీలు మాట్లాడారు. అనంతరం 'తొలి సంతకం' కవితా సంపుటి పుస్తకాన్ని సభికులు ప్రారంభించి సభకు పరిచయం చేశారు. విశ్వైక కుమారులు కార్తీక్ దీపక్‌లు ఈ పుస్తకానికి సాంకేతిక వర్గంగా వ్యవహరించారు. అనంతరం కవయిత్రి విశ్వైక, ఆమెను ప్రోత్సహించిన భర్త విశ్వరూపాచారి, ఆమె తండ్రి రొంపిచర్ల పురుషోత్తంలను పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ఉషోదయ కళాపరిషత్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కవయిత్రి విశ్వైక, విశ్వరూపాచారి దంపతులు పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంకు రూ.50 వేలు విరాళంగా బ్యాంక్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బత్తినేని లక్ష్మయ్య, ఈవీ ప్రసాద్, మాతంగి సాంబశివరావు, నాగేశ్వరరావు, రమాదేవి, జొన్నలగడ్డ రత్నరాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

- మన సత్తెనపల్లిలో CRDA, Rera అప్రూవ్డ్ తో స్పాట్ రిజిస్ట్రేషన్ 80% బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్స్ కలవు. తీయటి భూగర్భజలం కలదు. మీ సత్యం, సంప్రదించండి. ఫోన్ నెంబర్: 95532 77778
- గుంటూరు - సత్తెనపల్లి 4లైన్ల రహదారికి అనుకొని, అమరావతి ORRకు అతి చేరువలో 25 ఎకరాలలో తక్షణ గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్స్ కలవు. 7995533679, 9844777888

PLOT FOR SALE

- గుంటూరు సిటీలో రెసిడెన్షియల్ ప్లాట్లు, లలిత సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్, అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్, ప్రముఖ కాలేజీలకు దగ్గరలో చ.గ.14వేలకే. సంప్ర॥ 9618889846
- తార్ రోడ్‌ని అనుకుని 30 అ. రోడ్డుతో వెంచర్ 100 చ.గ. రూ. 1 లక్ష మాత్రమే. ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న దొనకొండలో స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 83175 28192

SERVICES

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
- Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

- గుంటూరు మంగళగిరిరోడ్ లోని ప్రముఖ ఎక్స్‌పోర్ట్ కంపెనీ వారి గుంటూరు, చినకొండ్రుపాడు, చిలకలూరిపేట పరిసర ప్రాంతాలలోని బ్రాంచెస్ నందు పనిచేయుటకు MS ఆఫీస్‌లో నాలెడ్జ్ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్స్, అకౌంట్స్ డేటా ఎంట్రీ ఆపరేటర్స్, వెహికల్ ఇన్‌చార్జ్, IT Admin / IT మేనేజర్, HR డేటా ఎంట్రీఆపరేటర్స్ కావలెను. అర్హత, అనుభవం బట్టి జీతం ఇవ్వబడును. ఆసక్తి గల అభ్యర్థులు మీ పూర్తి బయోడేటాను 15 రోజులలో psshr.recruit@gmail.com మెయిల్‌కు పంపగలరు.
- ప్రముఖ సంస్థలో Warehouse Manager, Accountant గా పనిచేయుటకు Stock (in-out), అకౌంట్స్ మెయింటెనెన్స్ చేయగల XL, Tally లో 2 సం॥ అనుభవం గల B.Com/ MBA అభ్యర్థులు కావలెను. ఫోన్ : 78937 32377
- ఏరిస్ అగ్రో లిమిటెడ్, చెన్నకేశవ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (Exp/Fresher) అర్హత ఏదైనా డిగ్రీ / BSC Agri/ అగ్రి డిప్లొమా. ప్రదేశం : తెనాలి, మంగళగిరి, బాపట్ల, పొన్నూరు, రేపల్లె ఈ గ్రామాల వారికి ప్రాధాన్యత. 9963111817, 9908266391
- శ్రీ శాంతి హోమ్ కేర్ తెనాలి, గుంటూరు, రేపల్లె పనిచేయుటకు కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు (M/F) కావలెను. జీతం: 18వేలు. 7995123705, 7893145549
- ప్రముఖ కంపెనీకి సంబంధించి జోనల్ ఎగ్జిక్యూటివ్‌లు మరియు కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేయుటకు కావలెను. జీతం: ఎగ్జిక్యూటివ్‌లకు రూ.25,000/- ఆపరేటర్లకు రూ.17,000/- ఇవ్వబడును. సంప్రదించండి: 8520001558
- ప్రముఖ సిటీలో పెద్దవారిదగ్గర కేర్‌టేకర్స్ ఆడ, మగ వెంటనే కావలెను. వంట చేయడానికి ఆడమనిషి కావలెను. రూమ్+ భోజనం ఫ్రీ. ఆకర్షణీయమైన జీతం. ఫోన్ 78931 20480
- Wanted Marketing Managers Those Who Are Serious Can Only. Please Call: Salary-32,000/- At NGO Benj Circle,Vijayawada.Ph:6304328479
- సత్య ఎంటర్‌ప్రైజెస్‌లో టెలికాలర్ & డేటా ఆపరేటర్‌గా పనిచేయుటకు యువతి/యువకులు కావలెను. అర్హత 10th పైన వర్క్ ఫ్రం హోమ్ కలదు. సంప్ర: 9573841953.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
[illegible]

క్లుప్తంగా

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌

తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, బీటీ రోడ్డు మధ్య మ్యాన్‌హోల్‌ ప్రమాదకరంగా మారింది. 2024లో వరదలు వచ్చిన సమయంలో మహానాడు పూర్తిగా నీట మునిగింది. వరద తగ్గిన సమయంలో కల్వర్ట్‌ కింద చెత్తాచెదారం అడ్డంపడి వరదనీరు, మురుగు వెళ్లకపోవడంతో కార్పొరేషన్‌ అధికారులు రెండు రోడ్లను కలుపుతూ ఏర్పాటు చేసిన కల్వర్ట్‌ మధ్యమార్గంలో గల మ్యాన్‌హోల్‌ను తొలగించారు. అప్పటి నుంచి ఆ మ్యాన్‌హోల్‌ అలానే ఉండడంతో ఆ రహదారిలో ప్రయాణించే వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోల్‌ను యథావిధిగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కోడి పందేల బరులు ధ్వంసం

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు నుంచి గుండాలపాడు వెళ్లే దారిలో కోడి పందేల బరులు ఏర్పాటు చేశారనే సమాచారం రావడంతో పోలీసులు సోమవారం దాడి చేశారు. పందేలు నిర్వహించే బరులను ధ్వంసం చేసి చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ తీగను తొలగించినట్లు సీఐ శివరామకృష్ణ తెలిపారు. బరులు నిర్వహించే వారిని అదుపులోకి తీసుకుని వారికి కౌన్సిలింగ్‌ ఇచ్చామని.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఐ సురేష్‌, రైటర్‌ దాసు, సిబ్బంది ఉన్నారు.

మహనీయుడు స్వామి వివేకానంద

దుగ్గిరాల: మన దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోషియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం దుగ్గిరాల శివాలయం సెంటర్‌లో మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలరాజు, ఎన్‌.వెంకటేశ్వరరావు, నాగయ్యా, గణేష్‌, జోగేంద్ర, షేక్‌.సుభాని, శ్రీధర్‌బాబు, కరీముల్లా, శ్రీనివాసరావు, వెంకట్రావు పాల్గొన్నారు. ఈమని గ్రామంలోని విష్ణు ఆలయం వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరగాని ప్రకాష్‌, వైస్‌ ఎంపీపీ పసుపులేటి సాయి చైతన్య, వెంకటలక్ష్మీ, శ్రీనివాసరావు, కృష్ణ, అశోక్‌, శ్రీరామ్‌మూర్తి, సాంబశివరావు, రమేష్‌, కిరణ్‌, పూర్ణచంద్రరావు, శ్రీకాంత్‌, పుల్లారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్‌ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై మంత్రి నారా లోకేష్‌ స్పందించాలని యూనియన్‌ నాయకులు కూరపాటి స్టీవెన్‌ అన్నారు. సోమవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 405వ రోజుకు చేరుకోగా దీక్షా శిబిరాన్ని నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. కార్మిక వర్గ సమస్యను ప్రభుత్వం పట్టించుకుని పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని నాయకులు అన్నారు. సుభాని, సాంబశివరావు, నాగేశ్వరరావు, మాణిక్యరావు, ఆశీర్వాదం, అంకయ్యా, హగ్గయ్యా, సూర్యప్రకాష్‌లు పాల్గొనగా దీక్షల్లో మహిళలు ఇమాంబి, సువర్ణకుమారి, శారద, రిబ్కా, శారమ్మలు కూర్చున్నారు.

లోక రక్షకుడు క్రీస్తు

దుగ్గిరాల: జనుల రక్షణ కోసం క్రీస్తు జన్మించారని.. ప్రభువు విశ్వాసుల వాగ్దానాలను నెరవేరుస్తారని గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తుని భాగ్యయ్య అన్నారు. సోమవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో 32వ ముగ్గురు రాజుల పండుగను ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విశ్వాసులు క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించగా విచారణ గురువులు దైవ వ్యాఖ్యోపదేశం చేశారు. పలు గ్రామాల విచారణ గురువులు, కన్యాస్త్రీలు, ఉపదేశకులు, విశ్వాసులు, సంఘపెద్దలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రెవరెండు ఫాదర్‌ జాన్‌ సురేష్‌ యామర్తి చిలువూరు విచారణ గురువు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వెబ్‌ ఎక్స్‌పై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ఫిరంగిపురం: మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్‌ కమిషనర్‌, పీఆర్‌డీ ఆధ్వర్యంలో వెబ్‌ ఎక్స్‌ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు విష్ణు, వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు

మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

- వచ్చే ఎన్నికల్లో వైఎస్‌ జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్సీ మురుగుడు, సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి టౌన్‌: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్‌ చిల్లపల్లి మోహనరావులు పిలుపునిచ్చారు. మంగళగిరి ఆత్మకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌ సీపీ మంగళగిరి పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురుగుడు, వేమారెడ్డి, చిల్లపల్లి మాట్లాడుతూ.. పార్టీని వార్డు స్థాయి నుంచి బలపడేలా

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు తీసుకున్నవారందరూ పదవి అలంకరణకు కాకుండా కష్టపడి పనిచేసి 2029లో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు.

బాబు అబద్ధపు హామీలను వివరించాలి..

చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన అబద్ధపు హామీలను ప్రతి ఒక్కరికి వివరించి చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలియపరచాలని హనుమంతరావు అన్నారు. పదవి అనేది ఒక ఆయుధమని, పదవి పొందిన ప్రతి ఒక్కరూ పార్టీకి అండగా నిలబడి ధైర్యంగా ముందుకు సాగాలని వేమారెడ్డి పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని మోహనరావు స్పష్టం చేశారు. అనంతరం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి వెలువడిన పార్టీ కార్యాచరణను దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్‌, పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడ్డగోలుగా ప్లాట్ల అభివృద్ధికి మట్టి తవ్వకాలు

భవిష్యత్తులో రైతులకు తప్పని తిప్పలు

తాడేపల్లి రూరల్‌: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు తమ ఇష్టానుసారం గతంలో వెంచర్లు వేసి కొన్ని పంట పొలాలను ప్లాట్లుగా మార్చారు. మార్చిన ప్లాట్లలో అడ్డగోలుగా మట్టి తవ్వకాలు నిర్వహించి వర్షపు నీరు, మురుగు పారే పంట కాలువలు మూసివేయడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని గ్రామాలు రాజధానిలోకి వెళ్లగా, కొన్ని గ్రామాల్లో రైతులు రియల్‌ ఎస్టేట్‌ వెంచర్ల మధ్య వ్యవసాయం చేసుకుంటున్నారు. ప్లాట్లుగా మారిన వ్యవసాయ భూముల్లో సంబంధిత యజమానులు మట్టితో మెరక ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆ వెంచర్‌కు అనుసంధానంగా ఉన్న వర్షపునీరు, మురుగు పారేందుకు ఉన్న కాలువలను ఆక్రమించి దానిని మట్టితో పూడ్చివేయడంతో రైతులకు తిప్పలు తప్పడంలేదు. ఇదే తరహాలో కుంచనపల్లి, గుండిమెడ, ప్రాతూరు, తాడేపల్లి, నూతక్కి, రామచంద్రాపురం గ్రామాల్లోని పంటపొలాల్లో సహజ సిద్ధంగా ఉన్న డ్రైనేజీలు మూసివేయడంతో అధిక వర్షాలు కురిసిన

ఐవోసీ ఎదుట బీటీ రోడ్‌కు ఆనుకుని ప్లాట్లకు మట్టి తోలిస్తున్న ప్లాట్‌ యజమాని

సమయంలో రైతులకు నష్టం తప్పడంలేదు. అధిక వర్షాలు పడిన సమయంలో మురుగు వెళ్లేందుకు ఐవోసీ నుంచి డ్రైనేజీ ఉంది. ఆ డ్రైనేజీలోకి నీరు వెళ్లకుండా పలువురు రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు మూసివేయడంతో రైతులు ఏటా నష్టపోతున్నారు. తాజాగా మరో ప్లాటు యజమాని రాత్రి సమయంలో రాజధాని నుంచి అక్రమంగా మట్టిని తోలుకు వచ్చి నల్లమట్టితో కందకాలను పూడ్చివేస్తున్నారు. కార్పొరేషన్‌ అధికారులు పరిశీలించి పంటపొలాల్లో వర్షపునీరు, మురుగు బయటకు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శంకర కంటి వైద్యశాల(నంబూరు), చికాగో ఆంధ్రా ఫౌండేషన్‌, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 87 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 44 మంది కాటరాక్ట్‌(కంటిముత్యం)తో బాధపడుతున్నారని.. శస్త్ర చికిత్స కోసం వారిని ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. వీరికి ఈనెల 14న కంటి శస్త్ర చికిత్స చేస్తామని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు కె.రవిబాబు, శ్వేత, అడ్మినిస్ట్రేటివ్‌, డిప్యూటీ ఎంపీడీవోలు విష్ణు, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను అణచివేయలేరు

తాడేపల్లి రూరల్‌: ప్రజా ఉద్యమాలను అణచివేయలేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాయకులు వై.నేతాజీ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రకాష్‌ నగర్‌ వరకు నిస్వార్థ ప్రజా సేవకుడు అప్పలరాజు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనకాపల్లికి చెందిన అప్పలరాజును అక్రమంగా అరెస్ట్‌ చేసి జైలులో పెట్టి, పీడీ యాక్ట్‌ ప్రయోగించడం దారుణమని అన్నారు. ప్రజా ఉద్యమాలను అణచివేయాలనుకోవడం అవివేకమని, అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. కార్మికుల ఉద్యమాన్ని అణచివేడం ద్వారా సాధించేది ఏమీ ఉండదని, దానికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని

నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు

పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వెంగమ్మ, కొండయ్య, రేణుక, సూర్యప్రకాష్‌, ప్రభాకరరావు, దుర్గారావు, మేరీ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి సేవా భావాన్ని అలవరుచుకోవాలి

మంగళగిరి టౌన్‌: యువత శారీరక, మానసిక, నైతిక వికాసంతో పాటు సేవా భావాన్ని అలవరుచుకుంటేనే దేశం అభివృద్ధి సాధిస్తుందని నిర్మల కాలేజ్‌ ఆఫ్‌ ఫార్మసీ డీన్‌(అకడమిక్స్‌) డాక్టర్‌ యు.స్పందన పేర్కొన్నారు. నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పందన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్‌ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సామాజిక బాధ్యతను గుర్తించి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో యువజన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రేఖా

నివాళులర్పిస్తున్న డీన్‌ డాక్టర్‌ స్పందన

నరేష్‌బాబు, కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ సిస్టర్‌ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్‌ డాక్టర్‌ డి.పాముల రెడ్డి, అధ్యాపకులు తేజస్మృతి, ప్రియా ప్రశాంతి, ఎన్‌ఎస్‌ఎస్‌ సమన్వయకర్తలు నాగేశ్వరరావు, స్ఫూర్తి, కీర్తి, ఆస్మా, కరుణాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

16 వరకు శాంతి సువార్త పండుగలు

మంగళగిరి టౌన్‌: ప్రపంచ శాంతి లక్ష్యంగా జీసస్‌ గాస్పల్‌ స్థాపించారని అసోసియేషన్‌ అధ్యక్షులు రెవ.బిషప్‌ రావూరి మోషేబాబు పేర్కొన్నారు. మంగళగిరి తెనాలి ఫ్లైఓవర్‌ వద్ద సోమవారం శాంతి సువార్త పండుగల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రావూరి మాట్లాడుతూ.. జీసస్‌ గాస్పల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 16 వరకు శాంతి సువార్త పండుగలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ పండుగలు జరుగుతాయని తెలిపారు. 5 రోజుల పాటు జరిగే ఈ పండుగలకు క్రైస్తవులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సువార్త పండుగలు మంగళగిరి తెనాలి బైపాస్‌ ఫ్లైఓవర్‌

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దైవజనులు

దిగువ భాగాన గల అందే చంటి ప్లాట్స్‌ నందు జరుగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో జీసస్‌ గాస్పల్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ వసంతరావు, దైవసేవకులు దేవపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి పట్టణ పరిధిలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, డాన్స్‌ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గౌడ నాయకులు మాట్లాడుతూ.. ఆచార, వ్యవహారాల సమ్మేళనాల్లో భాగమైన పండుగలే మనుషులు, సమాజానికి మధ్య అనుబంధాల వారధులు అని పేర్కొన్నారు. భిన్నత్వంలోని ఏకత్వానికి అద్దం పడుతూ ఆయా కాలాలు, ప్రాంతాలు, ప్రజల ఆచార సంప్రదాయాలకు పండుగలు ప్రతిబింబంగా నిలుస్తాయన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామ్‌ హాస్పిటల్‌ అధినేత డాక్టర్‌ పలగాని శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ సంఘం ముఖ్య

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

సలహాదారు జోగి నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్‌ ప్రెసిడెంట్‌ వాకా రామ్‌గోపాల్‌, నాయకులు వేముల వెంకటాచలం, కంచర్ల కాశయ్య, లచ్చి తులసీదాస్‌, పలగాని శ్రీకాంత్‌, రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

దుగ్గిరాల: మన సంస్కృతీ సంప్రదాయాలే పండుగలని.. సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశామని ఫ్రెండ్స్‌ అసోషియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయి రామస్వామి యాదవ్‌ అన్నారు. సోమవారం దుగ్గిరాలలోని 5 ప్రాంతాల్లో ఫ్రెండ్స్‌ అసోసియేషన్‌, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీపీఎం మండల వ్యవసాయ కార్మిక అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. ముగ్గుల పోటీల్లో 40 మంది మహిళలు పాల్గొన్నారని అన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు 5 ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు. కార్యక్రమంలో గణేష్‌, శంకర్‌, చిన్న, ఆంజనేయులు, కృష్ణనాయక్‌, మల్లీశ్వరి, మాలతీ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం చేస్తున్న రామస్వామి యాదవ్‌

అక్రమంగా మట్టి తరలింపు

పట్టించుకోని ఆయా శాఖల అధికారులు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్‌ గ్రామశివారులో అక్రమంగా మట్టి తవ్వకాలు రెండు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో పలు లారీల్లో మట్టి తరలిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సర్వే నంబరు 245–25లో అక్రమంగా జేసీబీతో మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ వందల సంఖ్యలో లారీల్లో మట్టిని తరలిస్తున్నారు. కాగా ఒక్కో లారీ సుమారు రూ.10 వేల వరకు అమ్ముతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మట్టి కొరత ఉండటం ఎర్రమట్టి కొండమట్టి కావడంతో ఈ మట్టికి డిమాండ్‌ ఎక్కువగా ఉంది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వం, మైనింగ్‌, రెవెన్యూ శాఖల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో తవ్విన మట్టి

తవ్వకాలు చేస్తున్న ప్రదేశంలో జేసీబీ

టీడీపీ నాయకుల ఇష్టారాజ్యం..

గుంటూరుకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉంటూ అధికారులను తమ కనుసన్నల్లో ఉంచుకుని ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఇదే నాయకులు మట్టి తవ్వకాలు నిర్వహించడంతో మైనింగ్‌ విజిలెన్స్‌ అధికారులు వచ్చి అక్రమంగా మట్టి తవ్వుతున్నారంటూ పెనాల్టీలు కూడా వేశారు. నెల గడవక ముందే మరలా అదే భూమిలో తవ్వకాలు నిర్వహిస్తుండటం గమనార్హం. గుంటూరుకు చెందిన టీడీపీ నాయకుడు ప్రభుత్వభూమికి సమీపంలో 2010లో భూమిని కొనుగోలు చేసి దానిలో మట్టి తవ్వకాలు నిర్వహించేవారు. కాగా ఆ భూమి చుట్టూ ఉన్న వారు తమ పంటలపై దుమ్ము, ధూళి పడుతుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా ఆ నాయకుడు మరలా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారని అంటున్నారు. కాగా మట్టి తవ్వకాలు కట్టడి చేయాలని కోరుతూ కొందరు గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. తరువాత మైనింగ్‌ విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోనూ వినతిపత్రం అందించారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..

రేయింబవళ్లు అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దోపిడీ రాజ్యంగా మారిపోయింది. ప్రభుత్వ భూములను వదలడంలేదు. రైతుల పొలాల్లో నుంచి లారీలు వెళుతుండడంతో పంటలు నాశనమవుతున్నాయి.

– సయ్యద్‌ హబీబుల్లా, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు

మట్టి తవ్వకాలు నిలిపివేయాలి..

గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొందరు మట్టి తవ్వి తరలిస్తున్నారు. అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న వారిపై కొరడా ఝుళిపించాలి. దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు. తగిన చర్యలు తీసుకోవాలి. రైతుల పంటలను సైతం కాపాడాలి.

– కె.ఆనంద్‌, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్‌

పుట్టిన ఊరిని మరువకూడదు

గజల్‌ శ్రీనివాస్‌

ఫిరంగిపురం: కన్నతల్లిని, పుట్టిన ఊరిని మరిచిపోకుండా అభినయ శ్రీనివాస్‌ నాటకరంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు గజల్‌ శ్రీనివాస్‌ అన్నారు. మండలంలోని పొనుగుపాడు గ్రామంలో అభినయ నాటక పరిషత్‌ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన నాటకోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు గజల్‌ శ్రీనివాస్‌ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నాటక రంగ కళాకారులను ఆదుకోవాలని కోరారు. అనంతరం గజల్‌ శ్రీనివాస్‌, భీమవరం చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్‌ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్‌లను నిర్వాహకులు శ్రీనివాస్‌, సురేష్‌బాబులు అభినయ రంగస్థల పురస్కారంతో సత్కరించారు. వెలకట్టలేని బంధాల విలువ మర్చిపోయి ఒకరినొకరు చంపుకొనేందుకు వెనకడుగు వేయని మనుషుల మనస్తత్వం తెలిపే కళాంజలి(హైదరాబాద్‌)వారి 'కొత్తభూతం' నాటికను ప్రదర్శించారు. అనంతరం కళానికేతన్‌(బాపట్ల జిల్లా, వీరన్నపాలెం)ఆధ్వర్యంలో 'దీపం కింద చీకటి' నాటికను ప్రదర్శించారు.

మాట్లాడుతున్న గజల్‌ శ్రీనివాస్‌

3 నెలల జీతాలు చెల్లించాలని వినతి

తాడికొండ: తాడికొండ గ్రామ పంచాయతీలో పనిచేస్తూ టెండర్‌ పద్ధతిన కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మికులు, తాగునీటి సరఫరా, ఎలక్ట్రికల్‌ సిబ్బందికి రావాల్సిన 3 నెలల బకాయిలు చెల్లించాలని అధికారులను పలువురు సిబ్బంది వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఈవోఆర్డీ రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు గానూ జీతం ఇప్పటి వరకు చెల్లించని కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అప్పులు చేసి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే జీతం చెల్లింపులు ఎప్పుడు వస్తాయో తమకు తెలియదని చెబుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో తాము మంగళవారం నుంచి విధులకు హాజరు కాలేమని స్పష్టం చేశారు.

ఈవోఆర్డీ రమణయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఇష్టానుసారం మద్యం విక్రయం

దుగ్గిరాల: ప్రభుత్వం నుంచి మద్యం ధరలు పెంచుతున్నట్లు ఎటువంటి ప్రకటన లేకపోయినా దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల మద్యం దుకాణాదారులు ఇష్టానుసారం మద్యం ధరలను పెంచి విక్రయిస్తున్నారు. చిలువూరు గ్రామంలోని మద్యం దుకాణంలో ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.10 నుంచి 20 అధికంగా వసూలు చేస్తున్నారని పలువురు వాపోయారు. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు

దుగ్గిరాల: ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సోమవారం దుగ్గిరాల ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి దోమల నివారణకు మలేరియా శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సహాయంతో దోమల నివారణకు మలాథియాన్‌ మందును పిచికారీ చేశారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా పండుగ సెలవుల్లో కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. డాక్టరు రెహమాన్‌, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఎంలో సంక్రాంతి సంబరాలు

మంగళగిరి టౌన్‌: ఏపీఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రొఫెసర్లు సంబరాల్లో పాల్గొన్నారు. యూనివర్సిటీ హెచ్‌ఆర్‌ విభాగం ఆధ్వర్యంలో జరిగిన పలు క్రీడా పోటీల్లో ఉద్యోగులు పాల్గొన్నారు. ఉట్టికొట్టడం, పెన్సిల్‌ గేమ్‌, స్టెప్‌ రైటింగ్‌, చెరుకుగడల విన్యాసపు పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వైస్‌ చాన్సలర్‌ ఆచార్య సతీష్‌కుమార్‌, రిజిస్ట్రార్‌ ప్రేమ్‌కుమార్‌ ఉద్యోగులు, విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్‌ మేనేజర్‌ వేణుగోపాల్‌, హెచ్‌ఆర్‌ విభాగ డైరెక్టర్‌ ఐజాక్‌ జిరార్డ్‌, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ శివరంగన్‌ తదితరులు పాల్గొన్నారు.



స్టెప్‌ రైటింగ్‌ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

యూకీ బాంబ్రీ జోడీ శుభారంభం

ఆక్లాండ్: కొత్త ఏడాదిలో భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ తొలి విజయాన్ని అందుకున్నాడు. న్యూజిలాండ్‌లో సోమవారం మొదలైన ఏఎస్‌బీ క్లాసిక్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-ఆండ్రీ గొరాన్‌సన్ (స్వీడన్) జోడీ శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ యూకీ-గొరాన్‌సన్ ద్వయం 6-3, 6-2తో అజీత్ రాయ్ (న్యూజిలాండ్)-జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 66 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-స్వీడిష్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తొలి సర్వీస్‌లో 32 పాయింట్లకుగాను 27 పాయింట్లు... రెండో సర్వీస్‌లో 16 పాయింట్లకుగాను 8 పాయింట్లు స్కోరు చేసింది. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. యూకీ-గొరాన్‌సన్ ద్వయం బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీతో కొత్త సీజన్‌ను ప్రారంభించింది. ఆ టోర్నీలో తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన ఈ జంట 5-7, 4-6తో ఒర్లాండో లుజ్-మటోస్ (బ్రెజిల్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

ఆయుశ్ బదోనికి తొలి పిలుపు

గాయంతో వన్డే సిరీస్‌కు సుందర్ దూరం

న్యూఢిల్లీ: భారత్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ న్యూజిలాండ్‌తో జరిగే తర్వాతి రెండు వన్డేలకు దూరమయ్యాడు. పక్కటెముకల గాయంతో బాధపడుతుండటంతో సుందర్ తప్పుకోవాల్సి వచ్చింది. 'తొలి వన్డేలో బౌలింగ్ చేసే సమయంలో సుందర్ తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొన్నాడు. అతడికి పరీక్షలు నిర్వహించి గాయం తీవ్రతను బోర్డు వైద్యులు పర్యవేక్షిస్తారు' అని బీసీసీఐ ప్రకటించింది. కివీస్ ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లలో 27 పరుగులిచ్చిన అనంతరం మైదానం నుంచి అర్ధాంతరంగా తప్పుకున్న సుందర్ మళ్లీ ఫీల్డింగ్ కోసం రాలేదు. అయితే ఛేదనలో భారత జట్టు ఆరు వికెట్లు కోల్పోయిన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చి రాహుల్‌కు చివరి వరకు అండగా నిలిచాడు. సుందర్ స్థానంలో ఢిల్లీ ఆటగాడు ఆయుశ్ బదోనిని భారత జట్టులోకి ఎంపిక చేసినట్లు సెలక్టర్లు ప్రకటించారు. బదోనికి టీమిండియాలో చోటు దక్కడం ఇదే మొదటిసారి. బుధవారం జరిగే రెండో వన్డే వేదిక రాజ్‌కోట్‌లో అతను భారత బృందంతో చేరతాడు. టీమిండియాకు ఆయుశ్ ఎంపిక కావడం విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ టీమ్‌ను బలహీనంగా మార్చింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విదర్భతో ఢిల్లీ ఆడనుండగా ...ఈ మ్యాచ్‌కు బదోని దూరమయ్యాడు.

ఐపీఎల్‌తో గుర్తింపు...

26 ఏళ్ల బదోని ప్రధానంగా మిడిలార్డర్ బ్యాటర్. అయితే ఆఫ్ స్పిన్ బౌలింగ్ కూడా చేయగలడు. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తరపున అతనికి మంచి గుర్తింపు లభించింది. దేశవాళీ క్రికెట్‌లో అతను ఢిల్లీకి కెప్టెన్‌గా కూడా వ్యవహరించాడు. గత 12 ఏళ్లుగా బదోని బౌలింగ్‌లో ఎంతో మెరుగయ్యాడని ఢిల్లీ కోచ్ శరణ్‌దీప్ సింగ్ వెల్లడించాడు. కెరీర్‌లో 27 లిస్ట్-ఎ మ్యాచ్‌లలో అతను 36.47 సగటుతో 693 పరుగులు చేశాడు. ఇందులో 1 సెంచరీ, 5 అర్ధసెంచరీలు ఉన్నాయి. బౌలింగ్‌లో 29.72 సగటుతో 18 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో లక్నో తరపున ఆడిన 4 సీజన్లలో కలిపి 56 మ్యాచ్‌లలో 138.56 స్ట్రయిక్ రేట్‌తో 963 పరుగులు చేయడంతో పాటు 4 వికెట్లు తీశాడు.

గ్రేస్ హారిస్

వహ్వా హారిస్...

40 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్స్‌లతో 85

బెంగళూరుకు వరుసగా రెండో విజయం ● 9 వికెట్లతో యూపీ వారియర్స్ చిత్తు

ముంబై: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మాజీ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వరుసగా రెండో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ముందుగా చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన జట్టు... ఆ తర్వాత మెరుపు బ్యాటింగ్‌తో మరో 47 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన ఈ పోరులో ఆర్‌సీబీ 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసింది. దీప్తి శర్మ (35 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), డియాండ్రా డాటిన్ (37 బంతుల్లో 40 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 72 బంతుల్లో అభేద్యంగా 93 పరుగులు జోడించారు. అనంతరం బెంగళూరు 12.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్రేస్ హారిస్ (40 బంతుల్లో 85; 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా...కెప్టెన్ స్మృతి మంధాన (32 బంతుల్లో 47 నాటౌట్; 9 ఫోర్లు) రాణించింది. వీరిద్దరు తొలి వికెట్‌కు 71 బంతుల్లోనే 137 పరుగులు జోడించి జట్టు విజయాన్ని సులువు చేశారు. యూపీ జట్టుకు ఇది వరుసగా రెండో ఓటమి. నేడు జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

కీలక భాగస్వామ్యం...

యూపీకి ఓపెనర్లు మెగ్ లానింగ్ (14), హర్లీన్ డియోల్ (11) శుభారంభం అందించలేకపోయారు. పరుగులు చేయలేకపోవడంతో పాటు వీరిద్దరు నెమ్మదిగా ఆడి బంతులను కూడా వృథా చేశారు. ఆ తర్వాత బరిలోకి దిగిన బ్యాటర్లూ కూడా పూర్తిగా తడబడ్డారు. దాంతో ఒకే స్కోరు వద్ద జట్టు 3 వికెట్లు కోల్పోయింది. లిచ్‌ఫీల్డ్ (11 బంతుల్లో 20; 3 ఫోర్లు, 1 సిక్స్), కిరణ్ నవ్‌గిరే (5), శ్వేత సెహ్రావత్ (0)లను ఆర్‌సీబీ బౌలర్లు వెనక్కి పంపించారు. ఫలితంగా 50/5తో యూపీ కష్టాల్లో పడింది. ఈ దశలో దీప్తి, డాటిన్ కలిసి జట్టును ఆదుకున్నారు. 10 ఓవర్లు ముగిసే సరికి జట్టు స్కోరు 56 పరుగులకు చేరింది. తర్వాతి పది ఓవర్లలో మరో వికెట్ కోల్పోకుండా దీప్తి, డాటిన్ పరుగులు జోడించారు. శ్రేయాంక ఓవర్లో డాటిన్ వరుసగా 4, 6 కొట్టగా, డిక్లెర్క్ బౌలింగ్‌లో దీప్తి భారీ సిక్స్ బాదింది. శ్రేయాంక వేసిన ఆఖరి ఓవర్లోనూ వీరిద్దరు మూడు ఫోర్లు కొట్టడంతో మొత్తం 15 పరుగులు వచ్చాయి.

డాటిన్ ఓవర్లో 32 పరుగులు!

యూపీ బౌలర్ డియాండ్రా డాటిన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో ఆర్‌సీబీ ఓపెనర్ గ్రేస్ హారిస్ మెరుపులా చెలరేగిపోయింది. ఈ ఓవర్లో ఆమె వరుసగా 4, 6, 4, 6, 6 బాదింది. వీటిలో తొలి బంతి నోబాల్ కూడా కావడంతో స్కోరు బోర్డులో అదనపు పరుగు చేరింది. అనంతరం డాటిన్ వైడ్ కూడా వేసి మరో పరుగు ఇచ్చింది. తర్వాతి బంతిని హారిస్ మళ్లీ బౌండరీకి తరలించింది. ఎట్టకేలకు చివరి బంతికి పరుగు రాకుండా నిరోధించడంతో డాటిన్ సఫలమైంది. మొత్తంగా హారిస్ 30 పరుగులు కొట్టగా, అదనపు పరుగులు కలిపి ఓవర్లో 32 పరుగులు లభించాయి. ఈ క్రమంలో 22 బంతుల్లోనే హారిస్ అర్ధ సెంచరీ పూర్తయింది.

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి) రాధ (బి) శ్రేయాంక 14; హర్లీన్ (సి) స్మృతి (బి) బెల్ 11; లిచ్‌ఫీల్డ్ (సి) స్మృతి (బి) శ్రేయాంక 20; కిరణ్ (సి) స్మిత్ (బి) డిక్లెర్క్ 5; దీప్తి (నాటౌట్) 45; శ్వేత (సి) అరుంధతి (బి) డిక్లెర్క్ 0; డాటిన్ (నాటౌట్) 40; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 143.** **వికెట్ల పతనం:** 1-21, 2-39, 3-50, 4-50, 5-50. **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-16-1, లిన్సీ స్మిత్ 4-0-30-0, శ్రేయాంక పాటిల్ 4-0-50-2, అరుంధతి రెడ్డి 4-0-18-0, నదైన్ డిక్లెర్క్ 4-0-28-2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) లానింగ్ (బి) శిఖా 85; స్మృతి (నాటౌట్) 47; రిచా (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (12.1 ఓవర్లలో వికెట్ నష్టానికి) 145. వికెట్ల పతనం:** 1-137. **బౌలింగ్:** దీప్తి శర్మ 3.1-0-25-0, క్రాంతి గౌడ్ 2-0-18-0, శిఖా పాండే 3-0-28-1, డియాండ్రా డాటిన్ 1-0-32-0, సోఫీ ఎకెల్‌స్టోన్ 2-0-20-0, శోభన 1-0-17-0.

ఓపెనర్ల దూకుడు...

ఛేదనలో ఆర్‌సీబీ అలవోకగా దూసుకుపోయింది. దీప్తి వేసిన తొలి ఓవర్లోనే హారిస్ రెండు ఫోర్లు కొట్టగా, శిఖా ఓవర్లో స్మృతి రెండు ఫోర్లు సాధించింది. ఆ తర్వాత క్రాంతి ఓవర్లో వీరిద్దరు 3 ఫోర్లతో 13 పరుగులు రాబట్టారు. ఈ దశలో డాటిన్ ఓవర్‌తో మ్యాచ్ పూర్తిగా ఆర్‌సీబీ వైపు మళ్లింది. శోభన ఓవర్లోనూ హారిస్ వరుసగా 6, 4 బాదింది. 10 ఓవర్లలోనే 121 పరుగులు సాధించిన బెంగళూరుకు ఆటను ముగించేందుకు మరో 13 బంతులు సరిపోయాయి.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై ఇండియన్స్ X గుజరాత్ జెయింట్స్
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

హైదరాబాద్ వేదికగా...

● మార్చిలో మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీ
● తెలంగాణ ప్రభుత్వంతో అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: పలు ప్రతిష్టాత్మక క్రీడా ఈవెంట్లకు వేదికగా నిలిచిన హైదరాబాద్ మరో పెద్ద టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనుంది. మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భాగంగా జరిగే క్వాలిఫయింగ్ టోర్నీని ఇక్కడి గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తారు. మార్చి 8 నుంచి 14 వరకు ఈ పోటీలు జరుగుతాయి. మొత్తం ఎనిమిది జట్లు ఇందులో పాల్గొంటాయి. టాప్-3లో నిలిచిన టీమ్‌లు నేరుగా వరల్డ్ కప్‌కు అర్హత సాధిస్తాయి. భారత్‌తోపాటు ఇంగ్లండ్, స్కాట్లాండ్, దక్షిణ కొరియా, ఇటలీ, ఉరుగ్వే, వేల్స్, ఆస్ట్రియా జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. ఈ నేపథ్యంలో అర్హత టోర్నీ నిర్వహణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ఒప్పందం చేసుకుంది. ఎఫ్ఐహెచ్ అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రామ్ ఇందులో పాల్గొని టోర్నీ నిర్వహణపై ముఖ్యమంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని పునరుద్ఘాటించారు. హాకీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ నిర్వహించడం తమకు గర్వకారణమని... ముమ్ముందు నగరాన్ని అత్యుత్తమ స్థాయి క్రీడా కేంద్రంగా మార్చే క్రమంలో ఇది మరో ముందడుగు అని ఆయన అన్నారు. టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారత హాకీ సమాఖ్య (హెచ్ఐ) అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్ తిర్కీ, భోలానాథ్ సింగ్‌తో పాటు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సలహాదారు జితేందర్ రెడ్డి, క్రీడా కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో హాకీ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు భోలానాథ్ సింగ్, దిలీప్ తిర్కీ, తదితరులు

సాక్షి సినిమా

● ఎన్టీఆర్, రక్షిత

ఆంధ్రావాలా వస్తున్నాడు

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఈ మధ్య కాలంలో రీ రిలీజ్ ట్రెండ్ నడుస్తోంది. స్టార్ హీరోల సినిమాలను మరోసారి రీ రిలీజ్ చేసేందుకు మేకర్స్ అమితాసక్తి చూపుతున్నారు. కొన్ని సినిమాలు రీ రిలీజ్‌లోనూ ప్రేక్షకులను, అభిమానులను ఆకట్టుకోవడంతో పాటు మంచి వసూళ్లతో సత్తా చాటుతుండటం విశేషం. ఈ క్రమంలోనే ఇప్పుడు ఎన్టీఆర్ హీరోగా నటించిన 'ఆంధ్రావాలా' సినిమా రీ రిలీజ్‌కు ముస్తాబవుతోంది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన చిత్రం 'ఆంధ్రావాలా'. రక్షిత హీరోయిన్. భారతి సమర్పణలో గిరి నిర్మించిన ఈ సినిమా 2004 జనవరి 1న విడుదలైంది. ఈ చిత్రం విడుదలై 22 ఏళ్లు దాటింది. ఈ సందర్భంగా ఈ నెల 26న రీ రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నారు నిర్మాత గిరి. ఇదిలా ఉంటే... ఎన్టీఆర్ ప్రస్తుం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) షూట్‌లో పాల్గొంటున్నారు.

● ప్రభాస్

బిజీ బిజీ

హీరో ప్రభాస్ ఫుల్ బిజీ బిజీ కాబోతున్నారు. ఆయన హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ అండ్ మైథాలజీ సినిమా 'కల్కి 2898 ఏడీ'. 2024 జూన్ 27న విడుదలైన ఈ సినిమా దాదాపు రూ.1000 కోట్లకు పైగా కలెక్షన్స్‌ను రాబట్టింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కల్కి 2'ను ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ని ఫిబ్రవరి నుంచి ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారట నాగ్ అశ్విన్. ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు ప్రభాస్. వచ్చే నెలలో ఆయన ఇండియాకు తిరిగి వచ్చినవెంటనే 'కల్కి 2898 ఏడీ' చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ షెడ్యూల్‌లో కమల్‌హాసన్ కూడా పాల్గొనే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇక ఈ సినిమాతో పాటుగా 'ఫౌజి', 'స్పిరిట్' చిత్రాలు కూడా చేస్తున్నారు ప్రభాస్. ఈ సినిమాల చిత్రీకరణలను ఈ ఏడాదిలోనే పూర్తి చేయాలనుకుంటున్నారట. ఇలా బ్రేక్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత వరుస సినిమాలతో ప్రభాస్ ఫుల్ బిజీగా ఉంటారని ఊహించవచ్చు. ఈ సంగతి ఇలా ఉంచితే.. ప్రభాస్ హీరోగా నటించిన 'ది రాజాసాబ్' ఈ నెల 9న విడుదలైంది. ఈ సినిమాకు మూడు రోజుల్లోనే రూ.183 కోట్లు వచ్చాయని చిత్ర యూనిట్ పేర్కొంది.

● వీకే నరేష్, సంయుక్త, అనిల్ సుంకర, సాక్షీ వైద్య, రామ్ అబ్బరాజు

మా నమ్మకం ఏంటో తెలిసింది - అనిల్ సుంకర

''శర్వానంద్ నటించిన 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'శతమానం భవతి' చిత్రాలు సంక్రాంతి సందర్భంగా జనవరి 14నే విడుదలై, సూపర్‌హిట్స్ సాధించాయి. ఈ జనవరి 14న రిలీజవుతున్న 'నారీ నారీ నడుమ మురారి' సినిమా కూడా హిట్ అవుతుంది. ఇది శర్వా కెరీర్‌లో మూడో సంక్రాంతి అవుతుంది'' అని నిర్మాత అనిల్ సుంకర చెప్పారు. శర్వానంద్ హీరోగా, సాక్షీ వైద్య, సంయుక్త హీరోయిన్లుగా నటించారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా మీట్‌లో అనిల్ సుంకర మాట్లాడుతూ–''మా మూవీ ట్రైలర్ రిలీజైన తర్వాత, మా నమ్మకం ఏంటో అందరికీ తెలిసింది. మా సినిమా రెగ్యులర్ టికెట్ ధరలతోనే అందుబాటులో ఉంటుంది'' అని పేర్కొన్నారు. ''పండక్కి ఫ్యామిలీ అంతా కలిసి చూడదగ్గ చిత్రం ఇది'' అని చెప్పారు రామ్ అబ్బరాజు. ''మా సినిమాని చూసి ఎంజాయ్ చేయండి'' అని పేర్కొన్నారు సంయుక్త, సాక్షీ వైద్య. ''వచ్చే సంక్రాంతి వరకు ఆడియన్స్ మాట్లాడుకునే సినిమా ఇది'' అన్నారు వీకే నరేష్.

మేము అనుకున్నట్టే కుదిరింది - కిషోర్ తిరుమల

కిషోర్ తిరుమల

''భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాన్ని ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా చేయాలనుకున్నాను. మేము అనుకున్నట్టే కథ అద్భుతంగా కుదిరింది. సంక్రాంతి సమయంలో వినోదాత్మక చిత్రాలకు చాలా మంచి అవకాశం ఉంటుంది. మా మూవీ ఔట్‌పుట్ పట్ల యూనిట్ అంతా సంతోషంగా ఉన్నాం. ఆడియన్స్ కూడా ఎంజాయ్ చేస్తారని పూర్తి నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ కిషోర్ తిరుమల తెలిపారు. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు కిషోర్ తిరుమల విలేకరులతో పంచుకున్న విశేషాలు...

● రవితేజగారితో సినిమా చేద్దామనుకున్న తర్వాతే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కథని డెవలప్ చేశాను. రామ సత్యనారాయణ పాత్రని ఎలా రాశానో దాన్ని ఫాలో అయ్యారాయన. ఒక భర్త ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? తన అనుభవం వల్ల మిగతా భర్తలకి ఏం చెబుతున్నాడు? అనేది కథలోని ప్రధాన అంశం. ఈ కథని ఇల్లాలు, ప్రియురాలు కోణంలో కాకుండా చాలా డిఫరెంట్‌గా ట్రీట్ చేశాను. ఈ మూవీలో ఇద్దరు అమ్మాయిలు అడిగిన ప్రశ్న పెళ్లయిన వాళ్లందరూ ఎప్పుడో ఒక సమయంలో ఎదుర్కొన్నదే. దానికి సమాధానం మా సినిమాలో దొరుకుతుంది.

● ఈ మూవీలో సత్య, 'వెన్నెల' కిషోర్ ట్రాక్స్ హిలేరియస్‌గా ఉంటాయి. అలాగే సునీల్ పాత్ర పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. 'పెళ్ళాం ఊరెళితే, దుబాయ్ శీను' సినిమాల్లాంటి ఫన్ ఉంటుంది. మా సినిమా ప్రమోషన్స్ కోసం అని కాదు కానీ, పాటల్లో జోష్‌కి నేను కూడా సంతోషంగా డ్యాన్స్ చేశాను. ఈ సినిమాలో సత్య నటించిన ఒక బిట్ సాంగ్‌కి కొరియోగ్రఫీ కూడా చేశాను. ఇప్పటి వరకు మా సినిమా చూసిన వారికి చాలా అద్భుతంగా నచ్చింది. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో మా సినిమా చూస్తే చాలా మంచి సంతోషాన్ని ఎక్స్‌పీరియన్స్ చేస్తారు.

● 'రంగబలి' మూవీ డైరెక్టర్ పవన్ మా మూవీ స్క్రిప్ట్‌కి పని చేశారు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' టైటిల్ ఆలోచన ఆయనదే. ఆషికా, డింపుల్ పాత్రల్లో నటనకు అవకాశం ఉంది. సుధాకర్‌గారు ఎక్కడా రాజీ పడకుండా సినిమాని నిర్మించారు. డైరెక్టర్ కార్తీక్ వల్లే 'మిరాయ్' సినిమాలో నటించాను. ఆ సినిమా పార్ట్ 2లో కూడా నేను ఉండే అవకాశం ఉంది. నా కొత్త ప్రాజెక్ట్స్ కోసం రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి. వాటిలో డివోషనల్ మైథాలజీ నేపథ్యంలో ఒక స్క్రిప్టు, మున్నాభాయ్‌లాంటి సోషల్ సెటైర్ కథతో మరో కథ ఉంది. అయితే ఏది ముందుగా చేస్తాను అనే విషయాన్ని త్వరలోనే తెలియజేస్తాను.



● శోభిత

స్వాగతం

శోభిత ధూళిపాళ్ల, విశ్వదేవ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'చీకటిలో..'. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో డి.సురేష్ బాబు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న ప్రైమ్ వీడియో ఓటీటీలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలో సంధ్య అనే పాత్రలో నటించారు శోభిత. ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. ''జాబ్ నచ్చలేదు.. మానేశావ్.. దానికెందుకు అంత ఆలోచిస్తావ్', 'పాడ్‌కాస్ట్ స్టార్ట్ చేద్దామనుకుంటున్నాను', 'వెల్ కమ్ టు చీకటిలో..', 'గోదావరి జిల్లాల్లో లాస్ట్ 20 ఇయర్స్‌లో జరిగిన రేప్ కేసెస్, వాటి రిపోర్ట్ ఫైల్స్ కావాలి'.. వంటి డైలాగ్స్ ఈ సినిమా ట్రైలర్‌లో ఉన్నాయి. ''హైదరాబాద్ నేపథ్యంతో ఈ సినిమా కథనం సాగుతుంది. స్వతంత్రంగా ఆలోచించే సంధ్య పాత్రలో నేను నటించడం ఓ నటిగా సంతృప్తిని ఇచ్చింది'' అని పేర్కొన్నారు శోభిత ధూళిపాళ్ల.

● ప్రియాంకా చోప్రా

పవర్‌ఫుల్ పాత్రలో...

బాలీవుడ్ బ్యూటీ ప్రియాంకా చోప్రా లీడ్ రోల్‌లో నటించిన హాలీవుడ్ చిత్రం 'ది బ్లఫ్'. ఫ్రాంక్ ఇ.ఫ్లవర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కార్ల్ అర్బన్, ఇస్మాయిల్ క్రజ్ కోర్డోవా సఫియా ఓక్లీ-గ్రీన్, టెమ్యూరా మారిసన్ ఇతర పాత్రలు పోషించారు. ఏజీబీవో, సినీస్టార్ పిక్చర్స్, బిగ్ ఇండీ పిక్చర్స్, పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌పై జో రుస్సో, ఆంటోనీ రుస్సో, ఏంజెలా రుస్సో-ఓట్స్టాట్, మైఖేల్ డిస్కో, ప్రియాంకా చోప్రా, సిలీ సల్దానా, మరియల్ సల్దానా నిర్మించారు. ప్రియాంకా చోప్రా పవర్‌ఫుల్ పాత్ర పోషించిన ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఫిబ్రవరి 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మూవీ టీజర్‌ని సోమవారం విడుదల చేసింది చిత్రబృందం. ఈ మూవీ టీజర్‌ను ప్రియాంకా చోప్రా షేర్ చేశారు. ఇదిలా ఉంటే... లాస్‌ఏంజిల్స్‌లోని బెవర్లీ హిల్టన్ వేదికగా 83వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ వేడుక వైభవంగా జరిగింది. ఈ వేడుకకి భర్త నిక్ జోనస్‌తో కలిసి రెడ్ కార్పెట్‌పై గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చారు ప్రియాంక. ప్రస్తుతం ఈ వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

వేసవిలో

● హవీష్

హవీష్ హీరోగా నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నేను రెడీ'. కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీపై నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''నేను రెడీ..', 'మేము రెడీ', 'ముప్పై వేల జీతానికి ఇలాంటి దరిద్రపుగొట్టు జాబ్ ఏవడైనా చేస్తాడా?', 'నువ్వు చేస్తున్నావ్ కదమ్మా..' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేసే మధ్య తరగతి ఆంధ్రా యువకుడికి, ఒక మధ్య తరగతి తెలంగాణ అమ్మాయితో నిశ్చితార్థం జరుగుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నది మా సినిమాలో చూడాలి'' అని యూనిట్ పేర్కొంది.

● నవీన్ పొలిశెట్టి, శాన్వీ మేఘన

ఆంధ్ర టు తెలంగాణ!

నవీన్ పొలిశెట్టి హీరోగా నటించిన సినిమా 'అనగనగా ఒక రాజు'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. మారి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా రేపు(బుధవారం) విడుదలఅవుతోంది. మిక్కీ జె.మేయర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఆంధ్ర టు తెలంగాణ..' అంటూ సాగే పాటని వరంగల్‌లో రిలీజ్ చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటని ధనుంజయ్ సీపాన, సమీర భరద్వాజ్ పాడగా, భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటలో నవీన్ పొలిశెట్టి, నటి శాన్వీ మేఘన హుషారైన స్టెప్పులు వేశారు.

Water can give life and also take life

Social

CHAPTER 2

Forest and wildlife resources

KEYPOINTS

- Lepchas believe in a god named Narak.
- The Lepcha tribe lives mainly in West Bengal.
- We share the earth with millions of living beings.
- Our environment has very rich biodiversity.
- Plants, animals and tiny organisms keep air, water and soil clean.
- Forests are very important for the ecological balance.
- Biodiversity means many different plants and animals living together.
- India has one of the richest biodiversities in the world.
- Plants and animals are under stress because people harm nature.
- Conservation protects our air, water, soil and living beings.
- In the 1960s and 1970s, people asked for wildlife protection.
- India passed the Wildlife Protection Act in 1972.
- Animals like tigers, rhinos, hangul and gharials are in danger.
- Elephants, blackbucks and snow leopards are protected by law.
- The tiger is a very important animal in the food chain.
- By 1973, tiger numbers fell to only 1,827.
- Hunting for skin and bones almost wiped out tigers.
- India and Nepal have most of the world's tigers.
- Project Tiger started in 1973 to save tigers.
- In 1980 & 1986, many insects were added to the protected list.
- In 1991, some plants were also given protection.
- The Chipko movement stopped tree cutting.
- Corbett National Park is in Uttarakhand.
- Sundarbans National Park is in West Bengal.
- Bandhavgarh National Park is in Madhya Pradesh.
- Sariska Wildlife Sanctuary is in Rajasthan.
- Manas Tiger Reserve is in Assam.
- Periyar Tiger Reserve is in Kerala.
- Most forest land in India is reserved forest.
- Protected forests cover about one-third of India's forest area.
- Unclassed forests are owned by government, private people or communities.
- Madhya Pradesh has the largest area of permanent forests.
- Many states have a large part of their forests marked as reserved forests.
- States like Bihar, Haryana and Rajasthan have more protected forests.
- North-eastern states and parts of Gujarat have many unclassed forests.

4 MARKS

1. What is Bio-diversity? Why do Bio-diversity is important for human lives?

1. Biodiversity is the variety of all living things and their interactions.
2. It maintains the ecological balance.
3. It helps in the healthy existence of humans.
4. It helps to maintain the ecosystem.
5. It helps in high productivity and human wellness.
6. Biodiversity provides humans with valuable genetic diversity.

2. What are the types and Distribution of Forest and Wildlife Resources. / Difference between reserve and protected forests.

(i) **Reserved Forests:** More than half of the total forest land has been declared reserved forests.

(ii) **Protected Forests:** One-third of the total forest area is protected forest, as declared by the Forest Department.

(iii) **Unclassed Forests:** These are other forests and wastelands belonging to both government and private individuals and communities.

3. Write about the Conservation of Forest and Wildlife in India.

1. Conservation preserves the ecological diversity.
2. It preserves our life support systems - water, air and soil.
3. It also preserves the genetic diversity of plants and animals.
4. It supports better growth of species and breeding.
5. In the 1960s and 1970s, conservationists demanded a national wildlife protection programme.
6. The central government announced several projects for protecting specific animals.

4. Write about the Indian Wildlife (Protection) Act of 1972.

1. The Indian Wildlife (Protection) Act was implemented in 1972.
2. An all-India list of protected species was also published.
3. It protected the remaining population of endangered species.
4. It banned hunting.
5. It protected to the habitats, restricted trade in wildlife.
6. Subsequently, governments established national parks and wildlife sanctuaries.

5. Name the gravely threatened animals.

1. The tiger.
2. The one horned rhinoceros.
3. The Kashmir stag or hangul.
4. Fresh water crocodile, saltwater crocodile and the Gharial.
5. The Asiatic lion.
6. The Indian elephant.
7. Black buck (chinkara).
8. The great Indian bustard.
9. The snow leopard.

6. Write about Project Tiger.

1. Tiger is one of the key wildlife species in the faunal web.
2. In 1973, the tiger population had dwindled to 1,827.
3. The major threats to tiger population are numerous.
4. India and Nepal became prime targets for illegal trading.
5. "Project Tiger" was launched in 1973.
6. Tiger conservation has been viewed as an effort to save an endangered species.

7. Describe how communities have conserved and protected forests and wildlife in India?

1. Indian forests are home to different communities.
2. They have good relationship with the forests.
3. Mundas and Santhal worship Mahua and Kadamba trees.
4. In Orissa and Bihar tribals worship the mango, tamarind trees.
5. The Bishnois of Rajasthan conserve the antelopes in reverence.
6. Villagers near Sariska Reserve have opposed mining activities.

8. Write about the Community and Conservation of forests.

1. People near the Sariska Tiger Reserve in Rajasthan have protected their forests from mining.
2. Five villages in Alwar district declared 1,200 hectares of forest as the Bhairodev Dakav "Sonchuri."
3. They made their own rules to protect the forest.
4. Hunting is not allowed, and they stop outsiders from harming wildlife.
5. The Chipko movement also fought against cutting down trees.
6. Groups like Beej Bachao Andolan and Navdanya showed that farmers can grow many crops without using chemicals.

9. Write a note on good practices towards conserving forest and wildlife.

1. Avoid clearing forest areas for agricultural and industrial use.
2. Prevent hunting and poaching of animals.
3. Reforestation helps to rebuild the natural ecosystem.
4. Minimise the environmental pollution.
5. Prevent forest fires.
6. Involve local communities in conservation efforts.
7. Social Forestry.
8. Reserved, protected forests.
9. Prohibit hunting in the forests.
10. Prohibit cutting trees in the forests.

10. Why is it necessary to increase forest area in India?

1. Forests give us oxygen.
2. They stop soil erosion.

Continued on next page..

3. They bring more rainfall.
4. They protect wildlife.
5. They reduce pollution.
6. They help control climate change.

11. What is biodiversity? Why is biodiversity important for human lives?
1. Biodiversity is the variety of life on Earth.
2. It includes animals, plants, and microorganisms, at all levels.
3. Biodiversity is important for human lives.
4. It provides clean air, water, food, and medicine.

12. How have human activities affected the depletion of flora and fauna? Explain.
1. Hunting of animals has led to the extinction of some species.
2. Deforestation contributed to the depletion of flora and fauna.
3. Dam construction has led to a decline in forest cover.

4. Forest fires has led to the depletion of forest and wildlife.
5. Shifting cultivation has led to the depletion of flora and fauna.

CHAPTER 3
WATER RESOURCES

KEYPOINTS
- Water can give life and also take life.
- Early humans lived near rivers and lakes.
- Three-fourths of the earth is covered with water.
- Water is a renewable resource.
- By 2025, about 2 billion people may face water scarcity.
- Women in Rajasthan use earthen pots to carry water.
- Freshwater comes from rain, rivers, and groundwater.
- Agriculture uses the most water.
- Israel gets only 25 cm of rainfall each year.
- Israel still has no water shortage.
- India gets about 114 cm of rainfall yearly.
- Too many tube-wells can lower groundwater levels.
- MNC means Multinational Corporation.
- Much of India's energy comes from hydropower.
- Hydroelectric power gives about 22% of India's energy.
- Water pollution is caused by wastes, chemicals, farming and population growth.
- JJM means Jal Jeevan Mission.
- JJM aims to give safe piped water to every rural home.
- Many small rivers in India have turned toxic.
- The Ganga and Yamuna are also not clean.
- Sringaverapura had an old, smart water harvesting system.
- In Mauryan times, many dams and lakes were built.
- Ancient irrigation systems existed in Odisha, Andhra Pradesh, Karnataka and Maharashtra.
- Bhopal Lake was built in the 11th century.
- Iltutmish built the Hauz Khas tank in Delhi.
- Dams store river and rainwater.
- The Hirakud dam controls floods and saves water.
- Nehru called dams the "temples of modern India."
- A dam is a barrier built across a river.
- A spillway allows extra water to flow out safely.
- Dams can be grouped by structure, purpose or height.
- Timber, embankment and masonry are three types of dams.
- Dams can be major, medium or low based on height.
- Big projects led to movements like Narmada Bachao Andolan and Tehri Andolan.
- Narmada Bachao Andolan protested against the Sardar Sarovar Dam.

8 MARKS

1. Why should we conserve water resources?
1. To conserve and manage our water resources
2. To safeguard ourselves from health hazards
3. To ensure food security
4. To continue of our livelihoods and productive activities
5. To prevent degradation of our natural ecosystems.

2. Write about Jal Jeevan Mission.
1. Government gives high priority to improving the quality of life in rural areas.
2. So, Indian government announced the Jal Jeevan Mission.
3. The Goal of JJM is to enable every rural household to get assured supply of potable piped water.
4. It provides 55 litres per capita per day regularly on long-term basis.

3. What are the causes for water pollution?
1. Domestic and industrial wastes.
2. Industrialisation.
3. Chemicals.
4. Agricultural modernization.
5. Pesticides and fertilisers used in agriculture.
6. Population growth.
7. Urbanisation.

4. Discuss how rainwater harvesting in semi-arid regions of Rajasthan is carried out.
1. In semi-arid regions of Rajasthan every house has tanks.
2. The tankas means large and deep underground water tanks.
3. They store the rainwater in the tankas.
4. The tankas would build inside the house or the courtyard.
5. The tankas would be linked to the roof of the houses.
6. Rainwater falling on roofs would run down through the pipe.
7. The collected rainwater would be stored in the tankas.
8. These tankas would be helped to beat the summer heat also.
9. The palar pani (rainwater) is considered the purest water form.

5. What are the advantages of dams?
1. Dams were built to impound rivers and rainwater.
2. Stored water could be used later to irrigate agricultural fields.
3. Dams are now referred to as multi-purpose projects.

Advantages of dams:
1. For irrigation.
2. For electricity generation.
3. Water supply for domestic and industrial uses.
4. Flood control.
5. Recreation.
6. Inland navigation.
7. Fish breeding.

6. What are the disadvantages of dams?
1. Irrigation has changed the cropping pattern.
2. Farmers shifted to water intensive and commercial crops.
3. It increased the salinisation of the soil.
4. It has transformed the social landscape.
5. It increased the gap between the landowners and the landless.
6. It created conflicts between people wanting water resources.
7. In Gujarat, the Sabarmati-basin farmers were agitated.
8. They almost caused a riot.
9. Inter-state water disputes are also becoming common.

7. Write about the Rainwater harvesting in India.
1. Rainwater harvesting was common in ancient India.
2. People made many smart structures to save water.
3. In the Western Himalayas, they built small water channels called guls or kuls.
4. These channels helped farmers get water for their fields.
5. In Rajasthan, people used rooftop rainwater harvesting to collect drinking water.
6. In Bengal, people made channels to use floodwater for farming.
7. Some fields were shaped to store rainwater for a long time.
8. Examples of these are khadins in Jaisalmer and johads in other places.

Prepared by
K. Suresh, Subject Expert

Daily Quiz 13

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. The bulk of the annual rainfall in India is received from
A) South west monsoons
B) South east monsoons
C) North west monsoons
D) North east monsoons

2. India is divided into almost two equal parts by the
A) Equator B) Tropic of Cancer
C) Tropic of Capricorn D) Arctic cirle

3. Retreating monsoons gives more rainfall to
A) Utkal coast B) Coromandal coast
C) Konkan coast D) Canara coast

4. Find the more powerful gas than carbon dioxide as a greenhouse gas
A) Nitrogen B) Helium
C) Methane D) Oxygen

5. The Inter governmental Panel on climate change 2015 Paris summit came to an agreement
A) To reduce 4°C of global average temperature
B) To increase 4°C of global average temperature
C) To reduce 2°C of global average temperature
D) To increase 2°C of global average temperature

సాక్షి బిజినెస్
మంగళవారం
13-1-2026

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
303	107
83,878	25,790

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,750	▲	79
డోజోన్స్	49,441	▽	63
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,140	▽	16
డాక్స్	25,474	▲	213
హాంగ్‌సెంగ్	4,165	▲	45
నికాయ్ (మంగళవారం ముగింపు)	51,940	▲	823

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.65	90.67
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.60	122.59
€	యూరో	ఎస్‌బీఐ	103.70	106.46
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.69	58.08
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	57.95	61.80
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.80	71.50
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.15	24.65
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.66	24.92
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.05	13.87

ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ. 18.38 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి జనవరి 11 వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు నికరంగా రూ. 18.38 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 8.82 శాతం పెరిగాయి. కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు పెరగడం, పన్నుల రిఫండ్‌లు నెమ్మదించడం ఇందుకు కారణం. ఆదాయ పన్ను శాఖ సోమవారం విడుదల చేసిన డేటా ప్రకారం కార్పొరేట్ ట్యాక్స్‌ల వసూళ్లు నికరంగా 12.4 శాతం పెరిగి రూ. 8.63 లక్షల కోట్లకు చేరగా, వ్యక్తుల–హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), కార్పొరేట్‌యేతర వర్గాల నుంచి వసూళ్లు 6.39 శాతం పెరిగి రూ. 9.30 లక్షల కోట్లకు చేరాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను వసూళ్లు ఫ్లాట్‌గా రూ. 44,867 కోట్లుగా ఉన్నాయి. ట్యాక్స్ రిఫండ్‌లు 17 శాతం క్షీణించి రూ. 3.12 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. మరోవైపు, సమీక్షాకాలంలో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 4.14 శాతం పెరిగి రూ. 21.50 లక్షల కోట్లకు చేరాయి.

ఐవోసీ బంకుల్లో మారుతీ సర్వీసులు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తమ సర్వీస్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ)తో చేతులు కలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న పలు ఐవోసీ బంకుల్లో మారుతీ వాహనాల సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ఇది ఉపయోగపడనుంది. వీటిలో రొటీన్ మెయింటెనెన్స్, మైనర్ రిపేర్లతో పాటు కొన్ని మేజర్ సర్వీసులు కూడా వీటిలో లభిస్తాయని మారుతీ తెలిపింది.

● టీసీఎస్ రిజల్ట్స్

లాభాల్లోనే లాస్ బలంగానే బిజినెస్

క్యూ3లో రూ. 10,657 కోట్లు
- ఆదాయం రూ. 67,087 కోట్లు
- 11,151 మందికి ఉద్వాసన
- రూ. 46 ప్రత్యేక డివిడెండ్

ముంబై: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. త్రైమాసికవారీగా అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 14 శాతం క్షీణించి రూ. 10,657 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా కొత్త కార్మిక చట్ట నిబంధనల అమలు ప్రభావం చూపినట్లు టీసీఎస్ పేర్కొంది. ఇందుకు రూ. 2,128 కోట్లు(వన్‌టైమ్) కేటాయించింది. లేదంటే నికర లాభం 8.5 శాతం ఎగసి రూ. 13,438 కోట్లకు చేరేదని తెలియజేసింది. ఈ ఏడాది క్యూ2లో రూ. 12,075 కోట్లు ఆర్జించింది. కాగా.. మొత్తం ఆదాయం 5 శాతం పుంజుకుని రూ. 67,087 కోట్లకు చేరింది. క్యూ2లో రూ. 63,973 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఆర్డర్లు గుడ్

తాజా సమీక్షా కాలంలో టీసీఎస్ 9.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకుంది. వాటాదారులకు రూ. 11 మధ్యంతర డివిడెండ్‌తో పాటు షేరుకి రూ. 46 చొప్పున ప్రత్యేక డివిడెండ్‌ను సైతం బోర్డు సిఫారసు చేసింది. వెరసి ఒక్కో షేరుకీ రూ. 57 చొప్పున చెల్లించనుంది.

మార్జిన్లు ఓకే

తాజా త్రైమాసికంలో టీసీఎస్ నిర్వహణ మార్జిన్లు క్యూ2తో పోలిస్తే నిలకడగా 25.2 శాతంగా నమోదయ్యాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో 24.5 శాతం మార్జిన్లు సాధించింది. క్యూ2 బాటలో రానున్న త్రైమాసికంలోనూ ఆదాయం వృద్ధి కొనసాగనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ కె.కృతివాసన్ తెలియజేశారు. ఏఐ ఆదాయం 17 శాతం జంప్‌చేసినట్లు వెల్లడించారు. ఆదాయంలో ఉత్తర అమెరికా వాటా 1.3 శాతం పుంజుకోగా.. యూకే 3.2 శాతం నీరసించింది. దేశీ ఆదాయం 34 శాతం క్షీణించింది. క్యూ3లో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య 11,151 తగ్గి 2025 డిసెంబర్ 31 కల్లా 5,82,163కు పరిమితమైంది. ఇందులో, పునర్వ్యవస్థీకరణ ప్రణాళికల్లో భాగంగా 1,800 మంది నిష్క్రమించినట్లు సంస్థ తెలిపింది.

ఫలితాల నేపథ్యంలో టీసీఎస్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 3,236 వద్ద ముగిసింది.

ధర దడ..

3 నెలల గరిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో 2025 డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం 1.33 శాతం పెరిగింది. మూడు నెలల గరిష్టానికి ఎగిసింది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం గతేడాది నవంబర్‌లో 0.71 శాతంగా, 2024 డిసెంబర్‌లో 5.22 శాతంగా నమోదైంది. తాజాగా ఇది పెరిగినప్పటికీ వరుసగా నాలుగో నెలలోనూ, రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న కనిష్ఠ పరిమితి రెండు శాతం లోపే ఉండటం గమనార్హం. వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, కూరగాయలు, మాంసం–చేపలు, గుడ్లు, మసాలా దినుసులు, పప్పులు మొదలైన వాటి ధరల పెరుగుదల కారణంగా ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం, రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగినట్లు సీపీఐ డేటాను విడుదల చేసిన సందర్భంగా జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) తెలిపింది. గ్రామీణ ప్రాంతాలతో (0.76 శాతం) పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం అధికంగా 2.03 శాతం స్థాయిలో నమోదైంది. ద్రవ్యోల్బణం అత్యధికంగా నమోదైన టాప్ అయిదు పెద్ద రాష్ట్రాల్లో కేరళ (9.49 శాతం), కర్ణాటక (2.99 శాతం), ఆంధ్రప్రదేశ్ (2.71 శాతం) ఉన్నాయి. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (రెండు శాతం అటూ ఇటుగా) కట్టడి చేసే బాధ్యతను రిజర్వ్ బ్యాంక్‌కి కేంద్రం అప్పగించిన సంగతి తెలిసిందే.

బంగారం, వెండి బ్లాస్ట్

- కొత్త శిఖరాలకు ధరలు
- వెండి రూ. 15,000 ర్యాలీ; కేజీ రూ. 2,65,000కు
- బంగారం @ రూ. 1,44,600

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలకు అనుగుణంగా సోమవారం దేశీయంగా పసిడి, వెండి ధరలు ర్యాలీ చేశాయి. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో వెండి రేటు కిలోకి ఏకంగా రూ. 15,000 పెరిగి జీవితకాల గరిష్ఠం రూ. 2,65,000కు ఎగిసింది. బంగారం కూడా అదే బాటలో సరికొత్త రికార్డుకి చేరింది. 99.9 శాతం స్వచ్ఛత గల పసిడి 10 గ్రాముల ధర రూ. 2,900 ఎగిసి రూ. 1,44,600కు పెరిగింది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో ఔన్సు (31.1 గ్రాములు) బంగారం ధర తొలిసారిగా 4,600 డాలర్ల స్థాయిని దాటింది. 90.72 డాలర్లు పెరిగి కొత్త రికార్డు 4,601.69 డాలర్లను తాకింది. ఔన్సు సిల్వర్ రేటు 4.3 డాలర్లు పెరిగి 84.61 డాలర్ల రికార్డు స్థాయిని తాకింది. భౌగోళిక– రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండటం, కీలక వడ్డీ రేట్లను తగ్గించాలంటూ అమెరికా ఫెడరల్ రిజర్వ్‌పై ఒత్తిళ్లు పెరగొచ్చనే అంచనాలతో వెండి కొత్త రికార్డు స్థాయికి ఎగిసిందని ఆగ్మంట్ హెడ్ (రీసెర్చ్) రెనిషా చైనాని తెలిపారు. గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లలో ఒడిదుడుకులు పెరుగుతుండటం, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, పెట్టుబడులకు సురక్షిత సాధనాలుగా డిమాండ్ నెలకొనడం తదితర అంశాల కారణంగా పసిడి, వెండి పరుగు కొనసాగుతుందని లెమన్ మార్కెట్స్ డెస్క్ రీసెర్చ్ అనలిస్ట్ గౌరవ్ గర్గ్ పేర్కొన్నారు.

మార్కెట్ హిట్ బ్యాక్

- కనిష్ఠం నుంచి సెన్సెక్స్ 1,018 పాయింట్లు రికవరీ
- 15న మార్కెట్లకు సెలవు

ముంబై: అమెరికా భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశలతో దేశీయ స్టాక్ మార్కెట్ అయిదు రోజుల నష్టాలకు సోమవారం బ్రేక్‌పడింది. ట్రేడింగ్‌లో 715 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 303 పాయింట్ల లాభంతో 83,878 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 107 పాయింట్లు పెరిగి 25,790 వద్ద నిలిచింది. భౌగోళిక ఉద్రిక్తతలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల నేపథ్యంలో ఉదయం సూచీలు బలహీనంగా మొదలయ్యాయి. ప్రథమార్ధమంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 715 పాయింట్లు పతనమై 82,861 వద్ద, నిఫ్టీ 201 పాయింట్లు కోల్పోయి 25,473 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. అమెరికా–భారత్‌ల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరో స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామంటూ యూఎస్ నూతన రాయబారి సెర్జియో గోర్ వ్యాఖ్యలతో మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మెరుగుపడింది. గత అయిదు ట్రేడింగ్ సెషన్లలో కనిష్టస్థాయిలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు నష్టాలను భర్తీ చేసుకోవడమే కాకుండా.., లాభాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. ఆసియాలో దక్షిణ కొరియా, చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో ట్రేడవుతున్నాయి.

→ బీఎస్ఈ ఇండెక్సుల్లో రంగాల వారీగా మెటల్ 2%, కమోడిటీస్, ఇంధన 1%, పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఎఫ్ఎంసీజీ ఇండెక్సులు అరశాతం రాణించాయి. రియల్టీ 1.13%, క్యాపిటల్ గూడ్స్ 0.82%, ఇండస్ట్రియల్స్ 0.67%, టెలికమ్యూనికేషన్స్ 0.46%, విద్యుత్ 0.36% నష్టపోయాయి.

→ మహారాష్ట్రలో మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జనవరి 15న(గురువారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. ఈక్విటీ, డెరివేటివ్స్, కమోడిటీ, ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ కార్యకలాపాలు పనిచేయవని ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు ప్రకటించాయి.

పీపీపీ జీవోలు భోగి మంటల్లో వేయండి: సీపీఐ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తూ (పీపీపీ) చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 590, 847లను ఈ నెల 14న భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలపాలని ప్రజలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వైద్య సేవలు, వైద్య విద్య ప్రైవేటీకరణ విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలని నిలదీశారు. వైద్య కళాశాలల నిర్మాణ, నిర్వహణ ఖర్చు ప్రభుత్వానిది, లాభం ప్రైవేటు వ్యక్తులదా అని మండిపడ్డారు.

తిరుమలలో యువతి మృతి



తిరుమల: తిరుమలలో ఆదివారం ఓ యువతి మృతి చెందింది. తిరుమల తిరుమలలోని అఖిలాండం వద్ద సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువతి అనారోగ్యంతో శనివారం రాత్రి బాధపడుతూ ఉంటే స్థానికంగా ఉన్నవారు గుర్తించి 108 ద్వారా ఆమెను అశ్విని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆమె మరణించింది. అయితే ఆమె ఎవరనే వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని తిరుమలలోని అశ్విని ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఆమెకు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తిరుమలలోని 9440796769 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

హైవే నిర్మాణంలో ప్రపంచ రికార్డులు గర్వకారణం: సీఎం

సాక్షి, అమరావతి: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో రహదారుల నిర్మాణంలో ప్రపంచ స్థాయి రికార్డులను సాధించటం గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. బెంగళూరు – విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో నాలుగు గిన్నిస్ రికార్డులు సాధించడంపై సోమవారం సత్యసాయి జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వర్చువల్‌గా పాల్గొన్నారు. అత్యంత పొడవైన బిట్‌మిన్‌తో కూడిన 6 లేన్ల జాతీయ రహదారిని వేగంగా నిర్మించి గిన్నిస్ రికార్డు సాధించినట్లు సీఎం చెప్పారు. జనవరి 6 నుంచి 11వ తేదీ వరకూ ఏకబిగిన 52 కి.మీ. మేర 6 లేన్ రోడ్డు నిర్మించారన్నారు. భగవాన్ సత్యసాయి ఆశీర్వాదంతో బెంగళూరు–విజయవాడ రోడ్డు కారిడార్ నిర్మాణంలో ప్రపంచ రికార్డులను సాధించగలిగామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

జిల్లాల్లో ఒక్క షెల్టర్ హోం లేదా?

కొత్తవాటి ఏర్పాటుపై స్పందించరా?

- రాష్ట్ర ప్రభుత్వం మీద హైకోర్టు అసంతృప్తి
- నిరాశ్రయులపట్ల అమానవీయంగా వ్యవహరించొద్దు
- జిల్లాకు 2 చొప్పున రాష్ట్రమంతా ఏర్పాటు చేయండి
- తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా



సాక్షి, అమరావతి: ఫుట్‌పాత్‌లపై నిద్రించే నిరాశ్రయులకు షెల్టర్ హోంలు ఏర్పాటు చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. విజయవాడ మినహా జిల్లాల్లో ఒక్క షెల్టర్ హోం కూడా లేదన్న విషయాన్ని నమ్మలేకపోతున్నట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో కనీసం 2 షెల్టర్ హోంలను తక్షణమే ఏర్పాటు చేయాలని, అందులో ఒకటి మహిళలకు ప్రత్యేకించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ తరచూ సమావేశమై, షెల్టర్ హోమ్స్ ఏర్పాటును పర్యవేక్షించేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. విజయవాడ కృష్ణా బ్యారేజీకి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై చాలామంది నిరాశ్రయులు రాత్రివేళ నిద్రిస్తున్నారని, పట్టణ నిరాశ్రయుల పథకం 'నివాసం' కింద వీరికి రక్షణ ఉన్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ హైకోర్టు న్యాయవాది ఎస్.ఆదిరామకృష్ణుడు ఇటీవల ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం మరోసారి విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేసింది. ''ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాల్లో నివసిస్తున్నవారిని షెల్టర్ హోంలకు తరలించేటప్పుడు అమానవీయంగా ప్రవర్తించొద్దు. కౌన్సెలింగ్ ఇచ్చి, వారి గౌరవానికి భంగం కలగకుండా వారి మంచి కోసమే చేస్తున్నామని చెప్పండి'' అని సూచించింది. నిరాశ్రయులు పగటి వేళ పనికి వెళ్లి, రాత్రి తిరిగి రావడానికి వీలుగా షెల్టర్ హోంలు అనువైన ప్రాంతాల్లో ఉండాలని స్పష్టం చేసింది. ఆశ్రయం పొందుతున్నవారికి వైద్య సదుపాయాలు కల్పించాలని, ఈ ఆదేశాల అమలుపై మూడు వారాల్లో స్థాయీ నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

''విజయవాడలో 4 షెల్టర్ హోమ్స్ ఉన్నాయని, ఒకదానిని మహిళలకు ప్రత్యేకించామని అధికారులు మా దృష్టికి తెచ్చారు. 750 మంది నిరాశ్రయ పురుషులు మూడు హోమ్స్‌లో ఉంటున్నారు. ఇవన్నీ కిక్కిరిసి ఉన్నట్లు మేం ఫొటోల్లో చూశాం. తక్షణమే కనీసం 6 కొత్త షెల్టర్ హోమ్స్ నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలి'' అని హైకోర్టు తెలిపింది. ''షెల్టర్ హోమ్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నామని అధికారులు చెబుతున్నారు. దీనికి సంవత్సరాలు పడుతుంది. కానీ, ఇది వెంటనే పరిష్కరించాల్సిన సమస్య. కమిషనర్ వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలి'' అని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ భవనాలు లేకపోతే ప్రైవేట్ ప్రాంగణాలను అద్దెకు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను 28వ తేదీకి వాయిదా వేసింది. అప్పటికి నివేదిక సమర్పించాలని సూచించింది.

విద్యుత్ విచారణకు 41 మందే!

- ఈ నెల 20 నుంచి ఏఆర్ఆర్‌లపై ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ
- నాలుగురోజుల్లో 41 మందికే అవకాశం
- ఇప్పటికే రూ.18 వేలకోట్ల విద్యుత్ భారాలు మోపిన చంద్రబాబు సర్కారు
- దీనిపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే మొక్కుబడిగా విచారణ

సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) నిర్వహించనున్న బహిరంగ విచారణను మొక్కుబడిగా ముగించనున్నట్లు తేలిపోయింది. ఇప్పటికే ఏపీఈఆర్సీ చైర్మన్, సభ్యుడు లేకుండా కేవలం ఒకే ఒక సభ్యుడితో విచారణకు సిద్ధమైన ప్రభుత్వం.. విచారణలో పాల్గొనేవారి సంఖ్య కూడా దారుణంగా తగ్గేలా చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని మూడు డిస్కంలు సమర్పించిన ఆదాయ, అవసరాల నివేదిక (అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్–ఏఆర్ఆర్)లపై ఈ నెల 20, 22, 23, 27 తేదీల్లో ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించనుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నేరుగా, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వీడియో కాన్ఫరెన్స్ (ఆన్‌లైన్) ద్వారా ఈ విచారణ జరగనుంది. 20వ తేదీ తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోను, 22, 23 తేదీల్లో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోను, 27న కర్నూలులోని ఏపీఈఆర్సీ కార్యాలయంలోను ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను తీసుకుంటామని ఇప్పటికే ఏపీఈఆర్సీ ప్రకటించింది. అయితే ఈ విచారణలో పాల్గొని అభిప్రాయాలు తెలపాలనుకునేవారు తప్పనిసరిగా ముందు పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పింది. అలా నమోదు చేసుకున్నవారి వివరాలను సోమవారం వెల్లడించింది. ఆ వివరాల ప్రకారం .. మొదటిరోజు నేరుగా ఏడుగురు, ఆన్‌లైన్‌లో ముగ్గురు అభిప్రాయాలు తెలుపుతారు. రెండోరోజు నేరుగా ఎనిమిదిమంది, ఆన్‌లైన్‌లో ఆరుగురు, మూడోరోజు నేరుగా తొమ్మిదిమంది, ఆన్‌లైన్‌లో ఆరుగురు, చివరిరోజు నేరుగా ఇద్దరు మాత్రమే అభిప్రాయాలు తెలియజేస్తారు. మొత్తం నాలుగురోజుల బహిరంగ విచారణలో 41 మంది మాత్రమే అభిప్రాయాలు తెలుపుతారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత పెంచిన దాదాపు రూ.18 వేలకోట్ల విద్యుత్ భారాల గురించి ప్రజలు నిలదీస్తారనే భయంతోనే బహిరంగ విచారణకు వచ్చేవారిని ఈ విధంగా తగ్గించేశారనే ఆరోపణలున్నాయి.

అబద్ధాల బాబు.. క్రెడిట్ చోరీతో డాబు

- విశాఖ స్టీల్, భోగాపురం ఎయిర్‌పోర్ట్ విషయంలోనూ పచ్చి అబద్ధాలే
- మాజీ మంత్రి అంబటి ఆగ్రహం

సాక్షి, అమరావతి: నిత్యం అబద్ధాలు చెప్పే చంద్రబాబు.. క్రెడిట్ చోరీతో డాబు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖ స్టీల్‌ప్లాంట్ అంశాలపై ఉన్నతాధికారుల సమావేశంలో సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారని ఎద్దేవా చేశారు. '18 నెలల పాలనలో తాను చేసిందేమీ లేక ఇప్పటికీ వైఎస్సార్‌సీపీని, వైఎస్ జగన్‌ను దూషిస్తూ బురద జల్లడం బాబుకి పరిపాటిగా మారింది. కనీసం భూసేకరణ, కోర్టు కేసులు కూడా పరిష్కరించలేని చంద్రబాబు భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మించానని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయించానని క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ పేరుతో 15 వేల ఎకరాల భూదోపిడీకి ప్లాన్ చేసిన చంద్రబాబుకు ప్రజా ఉద్యమంతో తోకముడిచిన విషయం గుర్తు లేదా? వైఎస్ జగన్ హయాంలో ఎయిర్‌పోర్ట్, ఏరోసిటీ నిర్మాణం కోసం కేవలం 2,703 ఎకరాలు మాత్రమే సేకరించి.. విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన విషయాన్ని చంద్రబాబు గుర్తు చేసుకోవాలి'అని అంబటి అన్నారు.

రాష్ట్రం ఇప్పుడు శ్రీలంక కావడం లేదా?

'అప్పుల విషయంలోనూ చంద్రబాబు ప్రభుత్వం సిగ్గు లేకుండా ప్రవర్తిస్తోంది. కేవలం ఏడాదిన్నరలోనే చంద్రబాబు ప్రభుత్వం రూ.3.02 లక్షల కోట్లు అప్పులు చేసింది. ఇప్పుడు రాష్ట్రం శ్రీలంక కావడం లేదా? పెట్టుబడుల విషయంలోనూ చంద్రబాబు పచ్చి అబద్ధాలే చెబుతున్నారు. దేశంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని కోతలు కోస్తున్నారు. 2014–19 మధ్య చంద్రబాబు హయాంలో పరిశ్రమలకు రూ.50,708 కోట్ల పెట్టుబడులు, తద్వారా 84,333 ఉద్యోగాలు వచ్చాయి. 2019–2024 మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో రెండేళ్లు కోవిడ్ వంటి విషమ పరిస్థితులు ఉన్నప్పటికీ.. రూ.69,799 కోట్ల పెట్టుబడులు, 90,230 ఉద్యోగాలు వచ్చాయి. ఎవరిది గొప్ప ప్రభుత్వం? ఈ రెండు విషయాలు సమాచార హక్కు చట్టం ద్వారా బయటపడ్డాయి. ఇంత గొప్పగా 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ పాలన చేస్తే.. చంద్రబాబు అనుకూల మీడియా డబ్బాలు కొట్టడం మాత్రం ఆపడం లేదు. రూ.12 వేల కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని చంద్రబాబు చెబుతున్నారు. నిజానికి రూ.12 వేల కోట్లను స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు ధారాదత్తం చేయడానికే వాడుతున్నారు' అని అంబటి స్పష్టం చేశారు.

మెప్పు కోసం 'పయ్యావుల' పాకులాట

- రాయలసీమ ప్రయోజనాలు దెబ్బతీసేలా చంద్రబాబు వైఖరి
- తన కేసుల కోసం బడా లాయర్లను పెట్టుకున్న ఆయన.. సీమ లిఫ్టుపై ఎందుకు పెట్టలేదు?
- వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం

అనంతపురం : ఏపీ–తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిల మెప్పు కోసం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాకులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. అందులో భాగంగానే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును థెఫ్ట్ ప్రాజెక్టు అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడుతూ, ఈ ప్రాంత ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. అసలు పనులే మొదలుకాలేదన్న టీడీపీ నాయకులు.. ప్రాజెక్టు వీడియోలు, ఫొటోలను వైఎస్సార్‌సీపీ విడుదల చేశాక మాటమార్చి కొత్త పల్లవి అందుకున్నారని విమర్శించారు. తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తనపై ఉన్న కేసులను ఎత్తివేయించుకోవడానికి పెద్దపెద్ద లాయర్లను నియమించుకుని రూ.వందల కోట్ల బిల్లులు చెల్లిస్తున్న చంద్రబాబు.. రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు మీద వాదనలు వినిపించడానికి ఎందుకు లాయర్లను నియమించలేదని ప్రశ్నించారు. విశ్వేశ్వరరెడ్డి ఇంకా ఏమన్నారంటే..

రాయలసీమ అంటే వివక్ష..

సీమ ప్రాంత ప్రయోజనాలను దెబ్బతీసేలా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు మరోసారి రుజువు చేశాయి. తన స్వార్థ ప్రయోజనాల కోసం రాయలసీమ అభివృద్ధిని పణంగా పెట్టడానికి కూడా చంద్రబాబు వెనుకాడటంలేదు. పయ్యావుల కేశవ్ మరో అడుగుముందుకేసి 'థెఫ్ట్ ఇరిగేషన్' అని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. థెఫ్ట్‌కి అలవాటుపడిన మంత్రి కాబట్టే ఇలా మాట్లాడుతున్నారు. రాయలసీమకు చెందిన మంత్రి అయ్యుండి బాధ్యతగా వ్యవహరించాల్సిందిపోయి.. సీమ ప్రయోజనాలను తీర్చే సంజీవని లాంటి ఎత్తిపోతల గురించి నోటికొచ్చినట్లు మాట్లాడటం దౌర్భాగ్యం. ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వంతో సంబంధం లేకుండా రూ.900 కోట్ల బిల్లులు చెల్లించారని చెబుతున్న పయ్యావుల.. ఆర్థికమంత్రిగా ఎలా పనిచేస్తున్నారో అర్థంకావడంలేదు. ప్రభుత్వంతో సంబంధంలేకుండా బిల్లులు చెల్లించడం సాధ్యమేనా? వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే అక్కసుతోనే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిలిపివేశారు. చంద్రబాబుకు అమరావతి ధ్యాస తప్ప మరో ప్రాంతం అభివృద్ధి పట్టడంలేదు.

జగన్ దార్శనికతకు నిదర్శనం..

ఇక సీమకు జీవనాడి అయిన 'రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్' మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు నిదర్శనం. శ్రీశైలం జలాశయంలో 880 అడుగుల నీటి మట్టం ఉంటే తప్ప రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ఒక్కటే సీమ సాగునీటి అవసరాలు తీర్చలేదని గుర్తించిన వైఎస్ జగన్.. శ్రీశైలం జలాశయంలో 800 అడుగులకు నీటిమట్టం చేరుకోగానే షోర్ నుంచే రోజుకు మూడు టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోసుకునేందుకు వీలుగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయితే, వైఎస్ జగన్ ప్రభుత్వం మారాక తెలంగాణ ఒత్తిళ్లకు చంద్రబాబు తలొగ్గి ఎత్తిపోతల పనులు ఆపేయడం దుర్మార్గం.

క్లుప్తంగా...

మెడికల్ పీజీ అభ్యర్థులకు ఫ్రీ ఎగ్జిట్ అవకాశం

సాక్షి, అమరావతి: మెడికల్ పీజీ కోర్సుల్లో కన్వీనర్, యాజమాన్య కోటా కింద 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఫ్రీ–ఎగ్జిట్‌కు ఆరోగ్య విశ్వవిద్యాలయం అవకాశం కల్పించింది. రెండు విడతల కౌన్సెలింగ్‌లో సీట్లు దక్కించుకున్న విద్యార్థులు బుధవారం సాయంత్రం నాలుగు గంటల్లోపు ఫ్రీ–ఎగ్జిట్ కావొచ్చని సోమవారం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ప్రకటించారు. అభ్యర్థులు గడువులో ఫ్రీ ఎగ్జిట్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

టీడీపీ నేతకు ఐదేళ్ల జైలుశిక్ష

పలాస: టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి, ప్రముఖ జీడిపప్పు, రైస్‌మిల్లు వ్యాపారి శాసనపురి మురళీకృష్ణకు పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఒక కేసులో మూడేళ్లు, మరో కేసులో రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. 2016లో ఆయన పలాస మండలం బ్రాహ్మణతర్లా, వజ్రపుకొత్తూరు పీఏసీఎస్‌ల ద్వారా ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. నిబంధనల ప్రకారం మిల్లింగ్ చేసి తిరిగి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలి. అయితే సుమారు రూ.3 కోట్లు ప్రభుత్వానికి టోకరా పెట్టడంతో కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి వాదనలు ముగియడంతో కోర్టు తీర్పు వెలువరించింది. మురళీకృష్ణకు అటు గౌతు, కింజరాపు కుటుంబాలతో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈయన పలాస టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీషకు అనుచరుడు.

మాజీ సీఎం రోశయ్య సతీమణి శివలక్ష్మి కన్నుమూత

శివలక్ష్మి(ఫైల్)

సనత్‌నగర్ (హైదరాబాద్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి (86) సోమవారం కన్నుమూశారు. వయోభారంతో గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె అమీర్‌పేట్ ధరంకరం రోడ్డులోని నివాసంలో తెల్లవారుజామున 5 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమెకు కేఎస్ సుబ్బారావు, కె.త్రివిక్రమరావు, కేఎస్ఎస్ మూర్తి కుమారులు, కుమార్తె రమాదేవి ఉన్నారు. గతేడాది డిసెంబర్ 20వ తేదీన అనారోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరిన ఆమె కొన్నిరోజులు చికిత్స పొంది కోలుకున్నారు. తిరిగి ఆరోగ్యం క్షీణించి సోమవారం ఉదయం మృతి చెందారు. మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం కొంపల్లి సమీపంలోని దేవరయాంజల్ వ్యవసాయ క్షేత్రంలో శివలక్ష్మి అంత్యక్రియలు నిర్వహించారు.

రామ్‌జెట్‌తో సూపర్ బుల్లెట్

రామ్ జెట్ ఆర్టిలరీ షెల్స్ ప్రయోగం

ఐఐటీ మద్రాస్‌లో రామ్ జెట్ గోళీల అభివృద్ధి

ఆయుధ శక్తి తగ్గకుండా దూర లక్ష్యాలపై దాడికి దోహదం

సాక్షి, చెన్నై: దేశీయ రక్షణ పరిశోధనలో ఐఐటీ మద్రాస్ మరో కీలక ముందడుగు వేసింది. తుపాకుల కాల్పుల పరిధిని సుమారు 50% వరకు పెంచే రామ్ జెట్ సాంకేతికతతో కూడిన ఆర్టిలరీ గోళీలను ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు విజయవంతంగా అభివృద్ధి చేశారు. ఈ కొత్త గోళీలతో ఆయుధ ఘాతుక శక్తి ఏమాత్రం తగ్గకుండా ఎక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించవచ్చని పరిశోధకులు తెలిపారు. ఈ వివరాలను సోమవారం ఐఐటీ మద్రాస్ ప్రకటించింది. 155 ఎంఎం ఆర్టిలరీ గోళీలో సంప్రదాయ బేస్–బ్లీడ్ యూనిట్ స్థానంలో రామ్‌జెట్ ఇంజిన్‌ను అమర్చడం ఈ పరిశోధన ప్రత్యేకతగా పేర్కొన్నారు. తుపాకీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఈ గోళీకి నిరంతర థ్రస్ట్ లభించడంతో కాల్పుల పరిధి గణనీయంగా పెరుగుతోందని వివరించారు.

తుపాకుల పరిధి ఇలా..

బోఫోర్స్, యూఎల్‌హెచ్ 24 కి.మీ నుంచి 43 కి.మీ, ధనుష్ 30 కి.మీ నుంచి 55 కి.మీ, వజ్ర 36 కి.మీ నుంచి 62 కి.మీ, ఆటాగ్స్ 40 కి.మీ నుంచి 70 కి.మీ దూరంగా ఉన్న లక్ష్యాలను ఛేదించేందుకు వీలుంటుందని పరిశోధన బృందంలోని ఐఐటీ మద్రాస్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ పీఏ రామకృష్ణ తెలిపారు. ఈ సాంకేతికత అమలులోకి వస్తే కొత్త తుపాకులు లేదా ఖరీదైన క్షిపణుల అవసరం లేకుండానే భారతీయ ఆర్టిలరీ దళాలకు ఎక్కువ దూరం దాడి చేసే సామర్థ్యం లభిస్తుందని వివరించారు. ఇది ఆత్మనిర్భర్ భారత్ దిశగా మరో ముందడుగు అని చెప్పారు.

విజయవంతమైన పరీక్షలు

భారత సైన్యంతో కలిసి 2020లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ పలు దశల పరీక్షలను పూర్తిచేసింది. 2025 సెప్టెంబర్‌లో డియోలాలి ఆర్టిలరీ పాఠశాలలో, డిసెంబర్‌లో పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన ప్రయోగాల్లో గోళీ సాఫీగా తుపాకీ నుంచి బయటకురావడం, స్థిరంగా ప్రయాణించడం, రామ్‌జెట్ ఇగ్నిషన్ పరీక్షలు విజయవంతమైనట్లు ప్రకటించారు. దేశీయ పరిశోధనతో ఉన్న ఆయుధ వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేయవచ్చని ఈ ప్రాజెక్ట్ నిరూపించిందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారన్నారు.

పెద్ద లాబీయింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

పోటీ పడుతున్నారు. ఏడాది క్రితం రాష్ట్రం నుంచి రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడంతో టీడీపీ, బీజేపీ చెరొకటి పంచుకున్నాయి. జనసేనకు మొండిచెయ్యి చూపించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబుకి ఎమ్మెల్సీ పదవి ఇచ్చినా మంత్రివర్గంలోకి మాత్రం తీసుకోలేదు. టీడీపీ తరఫున రాజ్యసభ సీటు మరోసారి సానా సతీష్‌బాబుకే కేటాయించే అవకాశం ఉందన్న సంకేతాలు అందడంతో టీడీపీ సీనియర్లు యనమల తదితరులతోపాటు పెద్దల సభకు వెళ్లే యోచనలో ఉన్న ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ సీఎం చంద్రబాబుపై ఆగ్రహంతో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది.

జనసేన కోటాలో లింగమనేని

త్వరలో ఖాళీ అయ్యే నాలుగు రాజ్యసభ స్థానాల్లో ఒకటి జనసేనకు ఇచ్చే అవకాశం ఎక్కువగా ఉందని కూటమి నేతల్లో చర్చ జరుగుతోంది. గతంలో రాజ్యసభ స్థానాన్ని వదులుకున్న నేపథ్యంలో ఈసారి తప్పనిసరిగా జనసేనకు ఒక స్థానం కేటాయించకతప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ స్థానాన్ని అటు సీఎం చంద్రబాబు ఇటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి సన్నిహితుడైన లింగమనేని రమేష్‌కి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈమేరకు ఒక అంగీకారం జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

రెండు సీట్లకు బీజేపీ పట్టు

ఏపీ కోటాలో ఈసారి తమకు రెండు రాజ్యసభ స్థానాలు కేటాయించాలని బీజేపీ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని బీజేపీ అధిష్టానం సూచించిన వారికి, రెండో సీటు రాష్ట్ర పార్టీ నేతల్లో ఒకరికి ఇప్పించుకోవాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. రాజ్యసభలో తమకు సంఖ్యా బలం కీలకం కాబట్టి ఏపీ కోటాలో ఇవ్వాల్సిందేనని బీజేపీ తేల్చి చెబుతోంది. గతంలో నేరుగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జోక్యం చేసుకోవడంతో చంద్రబాబుకు మరోమాటకు తావు లేకుండా ఒక సీటు కమలనాథులకు ఇచ్చేశారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని బీజేపీ నేతలు చెబుతున్నారు.

సానాకే మరోసారి చాన్స్..!

రెండు బీజేపీకి, ఒకటి జనసేనకు ఇస్తే ఇక టీడీపీకి మిగిలేది ఒకే ఒక స్థానం. దాన్ని సిట్టింగ్ రాజ్యసభ సభ్యుడి సానా సతీష్‌బాబుకి రెన్యువల్ చేయడం ఖాయమని ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. నారా లోకేష్‌కి అత్యంత సన్నిహితుడు కావడంతోపాటు చినబాబు వ్యవహారాలన్నీ చక్కబెడుతుండడంతో ఆ సీటు ఇతరులకు దక్కే ఛాన్స్ లేదని చెబుతున్నారు. మరోవైపు సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తనను రాజ్యసభకు పంపాలని చంద్రబాబును కలిసినప్పుడల్లా అడుగుతున్నారు. ఢిల్లీలో చంద్రబాబు తరఫున వ్యవహారాలు నడిపే మరో సీనియర్ నేత కంభంపాటి రామ్మోహనరావు కూడా తనకు అవకాశం ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు నిత్యం టీడీపీ సేవలో తరించే ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ కూడా తనకు రాజ్యసభకు వెళ్లే అవకాశం ఇవ్వాలని చంద్రబాబుపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అయితే,ఈసారి కూడా సానాకే అవకాశం ఇస్తారని తెలిసి వీరంతా ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది.

పీఎస్ఎల్‌వి–సీ62 ప్రయోగం విఫలం

- నాలుగోదశ మొదలవగానే.. ఉపగ్రహాలున్న రాకెట్ భాగం పల్టీ
- గ్రౌండ్‌స్టేషన్‌కి ఆగిపోయిన సిగ్నళ్లు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి సోమవారం ఉదయం 10.17 గంటలకు ప్రయోగించిన పీఎస్ఎల్వీ–సీ62 రాకెట్ ప్రయోగం విఫలమైంది. మనదేశ రక్షణ రంగానికి ఉపయోగపడే ఈవోఎస్–ఎన్1 ఉపగ్రహంతో పాటు స్వదేశీ, విదేశాలకు చెందిన 15 చిన్న ఉపగ్రహాలతో బయలుదేరిన రాకెట్ మూడుదశల ప్రయాణం సజావుగా సాగినప్పటికీ నాలుగోదశ మొదలైన కొన్ని సెకన్లలోనే తలకిందులైంది. ప్రయోగం ప్రారంభమైన తొమ్మిది నిమిషాల్లోనే అంతా అయిపోయింది. నాలుగోదశ ప్రారంభమైన తరువాత ఉపగ్రహాలతో ఉన్న రాకెట్ భాగం ఒక్కసారిగా రౌండ్లు తిరిగి పల్టీలు కొట్టి ఉండవచ్చని, దీంతో గ్రౌండ్ స్టేషన్‌కి సిగ్నళ్లు ఆగిపోయాయని భావిస్తున్నారు. 12 నిమిషాల తరువాత ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ రాకెట్ ప్రయోగంలో నాలుగోదశ మాత్రమే విఫలమైందన్నారు.

రక్షణ ఉపగ్రహాల ప్రయోగంలో వరుసగా రెండోసారి విఫలం

పీఎస్ఎల్వీ రాకెట్ అంటేనే ఇస్రో విజయాశ్వమనే పేరుంది. అటువంటి పీఎస్ఎల్వీ వరుసగా రెండోసారి విఫలమవడం, ఈ రెండింటిలోనూ దేశరక్షణకు ఉపయోగించే ఉపగ్రహాలు ఉండడం చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ–సీ61 మూడోదశలోనే విఫలమైంది. ఇప్పుడు ఈ ఏడాది చేపట్టిన మొదటి ప్రయోగం పీఎస్ఎల్వీ–సీ62 నాలుగోదశలో విఫలమైంది. గతేడాది దేశరక్షణ కోసం ఉపయోగించే ఈవోఎస్–9, ఈవోఎస్–ఎన్1 ఉపగ్రహాల ప్రయోగంలోనూ అంతరిక్షంలో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఈ రెండు ప్రయోగాలు విఫలమవడం కొన్ని అనుమానాలకు తావిస్తోంది. ఇస్రో ఇప్పటివరకు చేసిన పీఎస్ఎల్వీ సీరిస్‌లో 64 ప్రయోగాల్లో 4 ప్రయోగాలు.. 1993లో, 2017లో, 2025లో, ఇప్పుడు మరొకటి విఫలమయ్యాయి.

హార్సిలీహిల్స్‌లో 'మంజుమ్మల్ బాయ్స్'

లోయలో పడిపోయిన విద్యార్థి పురుషోత్తంను జోలెలో పైకి తెస్తున్న స్థానికులు

బి.కొత్తకోట: మంజుమ్మల్ బాయ్స్ సినిమా తరహాలో సెల్ఫీ పిచ్చి ఓ విద్యార్థి ప్రాణాల మీదకు తెచ్చింది. 300 అడుగులు పైబడిన లోయలో చెట్లు, బండరాళ్లపై దొర్లుతూ పడిన అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన సోమవారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై జరిగింది. తోటి విద్యార్థులు, స్థానికుల సహకారంతో బాధితుడిని లోయలోంచి పైకి తీసుకొచ్చారు. వివరాలివీ..చిత్తూరు జిల్లా గంగవరం మండలం నల్లసానిపల్లెకు చెందిన బి.పురుషోత్తం (19) తిరుపతి సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతను మిత్రులైన శ్యామ్‌సుందర్ (20), వెంకటేష్ (19), రెడ్డెయ్య (20), ధనుష్ (19), సాయిప్రతాప్ (20)తో కలిసి ఆదివారం రాత్రి వీరంతా కారులో మదనపల్లెకు వచ్చి సోమవారం తెల్లవారుజాము నాలుగు గంటలకు హార్సిలీ హిల్స్ చేరుకున్నారు. ఉదయం 7.30 ప్రాంతంలో జమునా బిల్డింగ్ సమీపంలో ప్రకృతి అందాలను తిలకిస్తూ సరదాగా సెల్ఫీలు తీసుకుంటుండగా పురుషోత్తం కాలుజారి దట్టమైన వృక్షాలు, బండరాళ్లపై నుంచి దొర్లుకుంటూ పడిపోయాడు. దీంతో తోటి స్నేహితులు, స్థానికులు బి.కొత్తకోట పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు లోయలో ఘటనా స్థలికి చేరుకున్నారు. స్థానికులు పురుషోత్తంను గుర్తించి కర్రకు దుప్పటి కట్టి అందులో అతికష్టమ్మీద పైకి తీసుకొచ్చారు. బాధితునికి ప్రాథమిక చికిత్స అందించి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పురుషోత్తంకు ప్రాణపాయం తప్పడంతో స్నేహితులు ఊపిరి పీల్చుకున్నారు.

SHOWROOM: ANDHRA PRADESH: RENAULT GUNTUR Ph: 8860086167.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

వాట్సప్‌లో వైద్య మండలి సమాచారం

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య మండలిలో వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ సేవల సమాచారాన్ని ఇకపై వైద్యులు వాట్సప్ ద్వారా తెలుసుకోవచ్చునని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. వాట్సప్‌లో 9030999616 నెంబర్ ద్వారా వైద్యులు సమాచారం తెలుసుకునే విధానాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.

పేద, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి

సాక్షి, అమరావతి : పేద, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు – 2026 క్యాలెండర్‌ను మంత్రి సోమవారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా ముస్తాబు కార్యక్రమం ద్వారా హాస్టల్ విద్యార్థుల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు.

విజయనగరం డీఎఫ్‌వో కొండలరావుకు పదోన్నతి

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) ఆర్. కొండలరావుకు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారిగా పదోన్నతి లభించింది. 2011 సెలక్షన్ లిస్ట్ ద్వారా ఈ నియామకం జరిగినట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఆయన అదే స్థానంలోనే కొనసాగుతారని పేర్కొంది.

వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి అనంతరం రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు చర్లపల్లి–కాకినాడ (07480/07481) స్పెషల్ ట్రైన్ ఈ నెల 19న ఉదయం చర్లపల్లి నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి కాకినాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19న రాత్రి కాకినాడ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.45కు చర్లపల్లికి వస్తుంది. చర్లపల్లి–తిరుపతి (07482/07483) రైలు ఈ నెల 18న ఉదయం 4 గంటలకు బయలుదేరి సాయంత్రం తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 18న రాత్రి 9.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం చర్లపల్లికి చేరుకుంటుంది.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కర్నూలు డీఐజీగా కిరణ్

సాక్షి, అమరావతి: కుటుంబ వ్యవహారాల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ వి. కిరణ్‌కుమార్‌ను ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకుంది. సస్పెన్షన్ ఎత్తివేస్తూ గతేడాది డిసెంబర్ 30న ఉత్తర్వులివ్వగా ఇప్పుడు ఆయన్ను కర్నూలు డీఐజీగా నియమించింది.

19 నుంచి పశు వైద్య శిబిరాలు

సాక్షి, అమరావతి: ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను సోమవారం విజయవాడలో ఆయన ఆవిష్కరించారు.

ఉద్యోగులు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఉద్యోగుల బకాయిలతో పాటు కాంట్రాక్టర్లకు రూ.2,653 కోట్లు విడుదల చేసినట్లు ఆర్థిక మంత్రి పి.కేశవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఒక డీఏ, డీఆర్ ఎరియర్స్ నిమిత్తం రూ. 1100 కోట్లు, నీరుచెట్టు బిల్లుల నిమిత్తం సుమారు రూ. 40 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవుల్లో రూ. 110 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈఏపీ, నాబార్డు, సాస్కీ, సీఆర్ఐఎఫ్ పనుల నిమిత్తం రూ.1243 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు.

మళ్లీ భూసేకరణ దుర్మార్గం

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, అమరావతి: రాజధాని కోసం ఇప్పటికే భూములిచ్చిన రైతులకు చంద్రబాబు ప్రభుత్వం గతంలో చెప్పిన విధంగా ప్లాట్లు ఇవ్వకపోగా, మరోసారి భూసేకరణకు సిద్ధం కావడం దుర్మార్గమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కొందరు మంత్రులు రాజధాని ప్రాంతంలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. కానీ భూములిచ్చిన రైతులు ఇళ్లు కట్టుకునేందుకు మాత్రం స్థలాలు చూపడం లేదని మండిపడ్డారు. పదేళ్ల తర్వాత కూడా రైతులకు ప్లాట్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు.

హిల్ రిసార్ట్స్ నిర్మాణానికి 15 ఎకరాలు

సాక్షి, అమరావతి : విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం కొత్తవలసలో హిల్ రిసార్ట్స్ నిర్మాణానికి పర్యాటక శాఖకు ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులిచ్చింది. కొత్తవలస గ్రామంలోని సర్వే నంబర్ 102, 103లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ.54.45 కోట్లు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ భూమిని బుక్ అడ్జస్ట్‌మెంట్ ప్రాతిపదికన కేటాయిస్తున్నట్లు తెలిపారు. సముద్ర తీరానికి ఆనుకుని కొండపై ఉన్న ఈ ప్రాంతంలో అత్యాధునిక హిల్ రిసార్ట్స్, లేదా ఇతర పర్యాటక ప్రాజెక్టులను నిర్మించాల్సి వుంటుందని తెలిపారు.

బాల్యం.. తెరమరుగు

నానాటికీ రెట్టింపవుతున్న స్క్రీన్ టైమ్

స్క్రీన్‌కు బానిసై, కంటి సమస్యలతో బాధ పడుతున్న బాలుడి కళ్లను పరీక్షిస్తున్న జీజీహెచ్ వైద్యుడు

- భారీగా గ్యాడ్జెట్ల వినియోగం
- పిల్లల్లో అధికమవుతున్న మానసిక, ఆరోగ్య సమస్యలు
- కొరవడుతున్న తల్లిదండ్రుల పర్యవేక్షణ

కాకినాడ క్రైం: అప్పుడే రెక్కలు విచ్చుకున్న సీతాకోక చిలుకల్లా.. ఆటపాటల్లో ఆనందంగా గడవాల్సిన బాల్యం 'తెర' చాటున మగ్గిపోతోంది. పుట్టినప్పుడు.. పెరుగుతున్నప్పుడు.. చదువుకోవడానికి, పరీక్షలకు సిద్ధమవడానికి.. ఆనందానికి, ఆటవిడుపునకు.. వ్యాయామానికి.. ఏం తినాలి, ఏది తినకూడదు.. ఎలా బతకాలి.. ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదో చెప్పేందుకు.. ఆరోగ్య చిట్కాలకు, అనారోగ్యం వస్తే చికిత్సకు.. చివరకు ప్రాణం పోయినప్పుడు.. ఇలా అన్నింటికీ 'తెర' చూపులే గతి అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. మొబైల్ ఫోన్ వంటి గ్యాడ్జెట్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత తరుణంలో నేటి తరం 'స్క్రీన్ టైమ్' కాటుకు బలైపోతోంది. ఈ 'తెర'చాటు జీవనానికి బాల్యం నుంచే బీజం పడుతోంది. డిజిటలైజేషన్ పేరుతో మారుతున్న లోకం పోకడ దీనికి ప్రధాన కారణమైతే, తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం కూడా బాల్యానికి శాపంగా పరిణమిస్తోంది. ఫలితంగా స్క్రీన్ టైమ్‌పై నియంత్రణ లేక పిల్లల్లో ఎన్నో మానసిక, శారీరక అనర్థాలు వేళ్లూనుకుంటున్నాయి.

ఎన్నో అనర్థాలు

- ➡ స్క్రీన్ టైమ్ పెరగడంతో పిల్లల్లో మానసికంగా తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- ➡ ముఖ్యంగా ఏకాగ్రత లోపించి, జ్ఞాపక శక్తి తగ్గుతోంది. కోపం, చిరాకు, ఆత్రుత పెరుగుతున్నాయి.
- ➡ ఆందోళన, డిప్రెషన్, స్క్రీన్ అడిక్షన్ డిజార్డర్, అసహనం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి.
- ➡ స్క్రీన్‌కు బానిసలవుతూండటంతో జీవన శైలిలో మార్పులు సంభవించి, చిన్న వయసులోనే స్థూలకాయ, మధుమేహం, రక్తపోటు వంటి వాటి బారిన పడుతున్నారు.
- ➡ విపరీతంగా మాట్లాడే సమస్య ఎక్కువవుతోందని చంటిపిల్లల వైద్య నిపుణులు ఆందోళన చెందుతున్నారు.
- ➡ త్వరగా మాటలు రాకపోవడం (స్పీచ్ డిలే), సామాజిక నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ లోపాల వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.
- ➡ తప్పుడు శరీర భంగిమల వల్ల మెడ, వెన్ను, భుజాల నొప్పులు తలెత్తుతున్నాయని జీజీహెచ్ ఆర్థోపెడిక్ నిపుణులు చెబుతున్నారు.
- ➡ చిన్న వయసులో నిద్ర లేమి సమస్యలు, డిజిటల్ ఐ స్ట్రెయిన్, డ్రై ఐ సిండ్రోమ్, కళ్ల ఎర్రదనం, నీరు కారడం, మయోపియా (దూర వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడం) వంటి ఆరోగ్య సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

129 మంది బాధిత బాలలు

గ్యాడ్జెట్లకు బానిసలు కావడం వల్ల స్క్రీన్ టైమ్ పెరిగి, గడచిన మూడు నెలల్లో కాకినాడ జిల్లావ్యాప్తంగా 129 మంది 18 ఏళ్లలోపు బాలలు 'డిజిటల్ ఐ స్ట్రెయిన్' బారిన పడ్డారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అలాగే, స్క్రీన్ టైమ్ పెరగడం వలన వచ్చిన కంటి సమస్యలతో అక్టోబర్‌లో 81 మంది, నవంబర్‌లో 67 మంది, గత నెలలో 90 మంది కలిపి మొత్తం 248 మంది చిన్నారులు కాకినాడ జీజీహెచ్ సహా పలు ప్రైవేటు కంటి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఎక్కువ మంది సంపన్నుల పిల్లలు కావడం గమనార్హం. ఇలా చేరుతున్న వారి సంఖ్య నానాటికీ అధికమవుతోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డబ్ల్యూహెచ్ఓ మార్గదర్శకాలివీ..

మితిమీరిన స్క్రీన్ టైం ఎంతటి ప్రమాదకరమో గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆ వినియోగాన్ని పూర్తిగా తగ్గించలేమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో స్క్రీన్ వినియోగంపై పరిమితులు విధిస్తూ మార్గదర్శకాలు నిర్దేశించింది.

- రెండేళ్ల లోపు వయసు బాలలకు స్క్రీన్ టైమ్ పూర్తిగా నిషేధం. ఈ వయసు పిల్లలకు వీడియో కాల్స్ అలవాటు చేయడం వల్ల భవిష్యత్తులో గాడ్జెట్లకు బానిసయ్యేందుకు బీజం పడుతుంది.
- రెండు నుంచి ఐదేళ్ల మధ్య రోజుకు గరిష్ఠంగా గంట మాత్రమే స్క్రీన్ టైమ్‌కు అనుమతి. విద్యాపరమైన అంశాలు, వీడియో కాల్స్, కార్టూన్ల వంటి వాటిని మాత్రమే అనుమతించాలి.
- ఆరు నుంచి పదేళ్ల మధ్య వయసు బాలలకు ప్రతి రోజూ ఒకటి రెండు గంటలు మాత్రమే గాడ్జెట్ల వినియోగానికి అనుమతించవచ్చు. ఇందులో చదువు, విజ్ఞాన అంశాలు మాత్రమే ఉండాలి. హింసాత్మక గేమ్స్, రీల్స్ నిషేధించాలి.
- 11 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు బాలలను గరిష్ఠంగా రెండు గంటల పాటు మాత్రమే స్క్రీన్ టైమ్‌కు అనుమతించాలి. సామాజిక మాధ్యమాలు, అశ్లీల కంటెంట్‌పై మొగ్గు చూపే వయసు, కాబట్టి సోషల్ మీడియా వినియోగంపై తల్లిదండ్రుల నిఘా అవసరం.
- సోషల్ మీడియాలో కొత్త పరిచయాలు, లైంగిక చర్యలపై మొగ్గు మొదలయ్యేది 16 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు. వీరిని గరిష్ఠంగా రెండు మూడు గంటలు మాత్రమే స్క్రీన్ టైమ్‌కు అనుమతించాలి. చదువుకు సంబంధించిన అంశాలకు ఇందులో మినహాయింపు. చదువు, వినోదం మధ్య సమతుల్యత అవసరం.

తింటూ టీవీ చూడనివ్వొద్దు

స్క్రీన్ టైమ్ ఎక్కువయితే పిల్లల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మొబైల్ ఇవ్వకపోతే క్రూరంగా ప్రవర్తించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తింటూ టీవీ సహా ఎటువంటి గాడ్జెట్లూ చూడనివ్వొద్దు. ఈ విధానం స్థూలకాయం సహా అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. తీవ్ర కోపం, కళ్ల నొప్పి, ఏకాగ్రత లోపం, రాత్రి వేళల్లో నిద్ర పట్టకపోవడం వంటి లక్షణాలు గమనిస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. నిద్ర పోవడానికి గంట ముందు గ్యాడ్జెట్లను తల్లిదండ్రులు అనుమతించవద్దు. స్క్రీన్ టైమ్‌పై డబ్ల్యూహెచ్ఓ మార్గనిర్దేశాలను అనుసరించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

– మాచవరం వెంకటేశ్వర్లు,
చంటి పిల్లల వైద్య నిపుణుడు,
జీజీహెచ్, కాకినాడ

బుజ్జగించే సహనం లేక

పిల్లల్ని బుజ్జగించే సహనం లేక, ఆటలు ఆడించేందుకు సమయం కేటాయించక చాలా కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల చేతికి మొబైల్ ఇచ్చి, గాడ్జెట్లకు బానిసలుగా మారుస్తూండటం ఆందోళన కలిగిస్తోంది. భవితను నిర్మించే ఆశాసౌధాలు పిల్లలు. కుటుంబానికే కాదు, సమాజాన్ని కూడా ముందుండి నడిపించే భవిష్యత్ తరాలు. వారిని అన్ని అంశాల్లోనూ దృఢంగా తీర్చిదిద్దాలి. అల్లరి వారి సహజ గుణం. ఆ మాత్రానికే మొబైల్ ఇచ్చి, చేతులు దులుపుకొంటే వారి ఆరోగ్యం, భవితపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. స్కూల్‌కు వచ్చి నిద్ర పోతున్న ఎందరో పిల్లల్ని చూస్తూంటాం. ఎందుకని ప్రశ్నిస్తే రాత్రి టీవీనో, ఫోనో చూస్తూండటంతో నిద్రపోవడం ఆలస్యమైందని చెబుతుంటారు. అటువంటి పిల్లల్లో చదువుతో పాటు కొత్త విషయాలు నేర్చుకోవడంపై నిరాసక్తత ఏర్పడుతుంది.

– జయంతి శిరీష,
ఉపాధ్యాయిని,
రాయుడుపాలెం, కాకినాడ

నాలుగు రోజులు.. లక్షా 60 వేల వాహనాలు

- ఇదీ పంతంగి టోల్‌ప్లాజా నుంచి విజయవాడ వైపు వెళ్లిన వాహనాల లెక్క
- మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగనున్న పండుగ ప్రయాణాలు

చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై విజయవాడ మార్గంలో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో నెలకొన్న వాహనాల రద్దీ

చౌటుప్పల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద సంఖ్యలో సొంతూర్లకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది. ఈ నెల 8న మొదలైన ప్రయాణాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం నుంచి సోమవారం వరకు విజయవాడ మార్గంలో దాదాపు లక్షా 60 వేల వాహనాలు వెళ్లాయి. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి బుధవారం ఉదయం వరకు మరో 40 వేల వాహనాలు వెళ్లే అవకాశం ఉన్నట్టు టోల్‌ప్లాజా వర్గాలు పేర్కొన్నాయి.

కాస్త తగ్గిన ట్రాఫిక్: సంక్రాంతి పండుగ రద్దీ గత 3 రోజులతో పోలిస్తే కాస్త తగ్గింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5వరకు విజయవాడ మార్గంలో చాలా తక్కువగా వెళ్లిన వాహనాలు.. ఆ తర్వాత పెరిగాయి. రాత్రి పది గంటల వరకు రద్దీ ఓ మోస్తరుగా కొనసాగింది.

మెడికల్ కౌన్సిల్ ఎన్నికలకు సిద్ధం!

- కసరత్తు చేస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ అధికారులు
- ఆన్‌లైన్ విధానంలో ఓటింగ్ నిర్వహించాలని యోచన
- కౌన్సిల్ కార్యవర్గానికి 13 మంది సభ్యులను ఎన్నుకోనున్న వైద్యులు
- ప్రస్తుతం రాష్ట్రంలో 55 వేల మందికిపైగా రిజిస్టర్డ్ వైద్యులు

సాక్షి, అమరావతి: ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ)లో త్వరలోనే ఎన్నికల నగారా మోగనుంది. కౌన్సిల్ కార్యవర్గానికి 13 మంది సభ్యుల ఎన్నిక కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. సెకండరీ హెల్త్ డైరెక్టర్‌ను ఎన్నికల అధికారిగా ప్రభుత్వం నియమించింది. వైద్యులు ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా సభ్యులను ఎన్నుకునే విధానాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఆరు వారాల్లో కౌన్సిల్ సభ్యుల ఎన్నికలు నిర్వహించాలని గతేడాది నవంబర్‌లో రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కోర్టు నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీఎంసీలో రిజిస్ట్రేషన్ చేసుకుని ఐదేళ్లు పూర్తి చేసుకున్న వైద్యులందరూ పోటీకి అర్హులు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వైద్యులందరికి ఓటు హక్కు ఉంటుంది. ఇప్పటి వరకు కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసుకున్న వైద్యులు 55,502 మంది ఉన్నట్టు సమాచారం. ఈ సంఖ్య ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి పెరిగే అవకాశం ఉంది.

చివరిసారిగా 2007 లో ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంలో ఏపీఎంసీకి 2007లో చివరిసారిగా ఎన్నికలు నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఏపీఎంసీకి ఎన్నికలు జరగలేదు. ఏపీ, తెలంగాణ వైద్యుల ఓటర్ల జాబితాలో సందిగ్ధత నెలకొనడం, ఇతర సమస్యలతో ఎన్నికలు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తున్నాయి. కాగా, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించాలంటూ కొందరు వైద్యులు ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో 2023లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఎన్నికలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఏపీలోనూ ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కొందరు వైద్యులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఇక్కడ కూడా ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. రాష్ట్ర విభజన నాటి నుంచి తాత్కాలిక కార్యవర్గంతోనే కౌన్సిల్ కార్యకలాపాలు కొనసాగుతూ వస్తున్నాయి. కౌన్సిల్ కార్యవర్గంలో 25 మంది సభ్యులు ఉంటారు. వీరిలో ఆరుగురు ప్రభుత్వం నుంచి, ఇద్దరు ఆరోగ్య విశ్వవిద్యాలయం నుంచి నామినేట్ అవుతారు. వీరు గతేడాది నామినేట్ అయ్యారు. రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్నికల్లో 13 మంది సభ్యులను రిజిస్టర్డ్ వైద్యులు ఎన్నుకుంటారు. నలుగురు అధికారులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా వ్యవహరిస్తారు.

జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి అనుమతులు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో రూ.165.33 కోట్లతో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. పిచ్చుకలపాలెం వద్ద జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పించే పనులను రెండేళ్లలో పూర్తి చేయాలనే నిబంధనతో టెండర్లు పిలవాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. టెండర్ నిబంధనల నుంచి ధరల సర్దుబాటును తొలగించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కమలపాడు 'పీఎస్పీ డీపీఆర్'కి ఆమోదం

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లా కమలపాడులో 950 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.7376.74 కోట్లకు పరిపాలనా ఆమోదం ఇచ్చింది. కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) నుంచి టెక్నో ఎకనామిక్ కన్‌కరెన్స్ (టీఈసీ) పొందడానికి వీలుగా ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్లీన్ ఎనర్జీ పాలసీలో మార్పులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ – 2024లో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. మొత్తం 20 అంశాల్లో నిబంధనలను సవరించింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటు హోటళ్లకు భూ కేటాయింపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రైవేటు హోటళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సోమవారం భూములు కేటాయించింది. బాపట్ల జిల్లా సూర్యలంకలో ఐటీసీ బ్రాండ్‌తో ఆర్న కోస్టల్ రిసార్ట్స్‌కు 8.08 ఎకరాలు, హిల్టన్ బ్రాండ్‌పై సైవెన్ హాస్పటాలిటీ గ్రూప్‌నకు అడవి సూర్యలంకలో 6.69 ఎకరాలు, శుభం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అడవి సూర్యలంకలో 2.6 ఎకరాలను 99 ఏళ్లకు లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఇస్కాన్–బెంగళూరుకు పెనుకొండలో 59.75 ఎకరాలు హ్యాండ్ హోల్డింగ్ ప్రాతిపదికపై కట్టబెట్టింది. సబ్ రిజిస్ట్రార్ విలువపై 2.5శాతం అధికంగా రేటు నిర్ణయించింది. దీనికి స్టాంప్ డ్యూటీ, జీఎస్టీ మినహాయింపులు ఇవ్వనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

హెచ్‌సీయూకు కేంద్రం పేటెంట్

సంక్లిష్ట ఆకృతుల్లో సిరామిక్ భాగాల తయారీకిగాను మంజూరు

సాక్షి, హైదరాబాద్: సంక్లిష్ట ఆకృతులతో కూడిన సిరామిక్ భాగాల తయారీలో విప్లవాత్మక సాంకేతికతను అభివృద్ధి చేసిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పరిశోధక బృందానికి కేంద్ర ప్రభుత్వం పేటెంట్ సర్టిఫికెట్ మంజూరు చేసింది. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ వి. శేషు బాయి నేతృత్వంలోని బృందం అభివృద్ధి చేసిన జెల్‌కాస్టింగ్ టెక్నిక్ విధానంలో అల్యూమి సిరామిక్ ఉత్పత్తులు 99 శాతం సమాన సాంద్రత, దృఢంగా ఉన్నాయి. ఈ పద్ధతిని జిర్కోనియా, టంగ్‌స్టన్ కార్బైడ్ వంటి ఇతర సిరామిక్ పదార్థాలకు కూడా వర్తింపజేసే వీలుంది. సిరామిక్ పదార్థాలు అధిక బలం, తుప్పు నిరోధకత వంటి లక్షణాల వల్ల ఆటోమొబైల్, ఏరోస్పేస్ రంగాల్లోనే కాకుండా శస్త్రచికిత్సల్లో ఉపయోగించే ఇంప్లాంట్ల తయారీలోనూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. జెల్‌కాస్టింగ్ టెక్నిక్ ద్వారా తక్కువ ఖర్చుతో, పరిశ్రమలకు అనుకూలంగా, అధిక పనితీరుగల సిరామిక్ భాగాలను తయారు చేయడం సాధ్యమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు.

సంగం డెయిరీకి రూ.58 కోట్ల రాయితీలు

సాక్షి, అమరావతి: తిరుపతి జిల్లాలో సంగం డెయిరీ ఏర్పాటు చేయనున్న మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్‌కు టైలర్‌మేడ్ రాయితీలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024 –29 ఫుడ్‌ప్రాసెసింగ్ విధానం కింద మొత్తం రూ.56.72 కోట్ల రాయితీలు ప్రకటించింది. అలాగే ఇంటిగ్రేటెడ్ ఫుడ్‌పార్కు ఏర్పాటు చేయనున్న నవ ఫుడ్‌సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.20 కోట్ల గ్రాంట్ మంజూరు చేసింది.

పోర్టు పేరు మార్పు

అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ లిమిటెడ్ సొంత అవసరాల కోసం ఏర్పాటు చేస్తున్న పోర్టు కోసం ఏఎంఎన్ఎస్ పోర్ట్స్ రాజయ్యపేట ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేయడానికి అనుమతిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేసింది.

సెట్టిపల్లి ల్యాండ్ పూలింగ్ ప్లాట్లకు మినహాయింపులు

సాక్షి,అమరావతి: తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) పరిధిలోని సెట్టిపల్లి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ప్లాట్లకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీని మినహాయించింది. మొత్తం 286.83 ఎకరాల భూమికి సంబంధించి తుడా జారీ చేసే కన్వేయన్స్ డీడ్స్‌కి రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు స్టాంప్ డ్యూటీ మినహాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు, పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: పలువురు ఐఏఎస్‌లకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొంతమందిని బదిలీ చేసినప్పటికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు.వారికి పోస్టింగ్‌లు ఇస్తూ విడిగా ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం (జేసీ అంటే జాయింట్ కలెక్టర్)	బదిలీ స్థానం
పి.శ్రీనివాసులు	గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్	మార్కాపురం జేసీ
గోపాల కృష్ణ రోణంకి	మార్కాపురం జేసీ	వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ కార్యదర్శి
శ్రీవాస్ నూపూర్ అజయ్‌కుమార్	వెయిటింగ్	పౌరసరఫరాల శాఖ డైరెక్టర్
కల్పనా కుమారి	జీసీసీ ఎండీ	ప్రకాశం జిల్లా జేసీ
కథావటే మయూర్ అశోక్	విశాఖ జేసీ	గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్
ఆర్. గోవిందరావు	పౌరసరఫరాల శాఖ డైరెక్టర్	తుడా వైస్ చైర్మన్, తిరుపతి జేసీగా అదనపు బాధ్యతలు
నిధి మీనా	వెయిటింగ్	వైఎస్సార్ కడప జేసీ
సి. విష్ణు చరణ్	సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ కార్యదర్శి	అనంతపురం జేసీ
మల్లవరపు సూర్యతేజ	ఏపీటీఎస్ ఎండీ	అనకాపల్లి జేసీ
ఆదర్శ్ రాజేంద్రన్	అన్నమయ్య జేసీ	చిత్తూరు జేసీ
శోభిక	వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ కార్యదర్శి	జీసీసీ ఎండీ
జి. విద్యాధరి	అన్నమయ్య జేసీ	విశాఖ జేసీ
శివ నారాయణ్ శర్మ	అనంతపురం జేసీ	అన్నమయ్య జేసీ
సంజన సింహా	తెనాలి సబ్ కలెక్టర్	పల్నాడు జేసీ

హెల్త్

బైపోలార్ డిజార్డర్ బాధితుల్లో ఒక ఎపిసోడ్ అంతా బోల్డంత సంతోషం... మరికొద్ది రోజుల తర్వాత మరో ఎపిసోడ్‌లో కొండంత విచారం. ఆ రెండు భావోద్వేగాలూ దాగుడు మూతలు ఆడుతున్నట్లుగా కొద్దికొద్ది రోజుల వ్యవధుల్లో వస్తూ ఉంటాయి. అయితే సంతోషం... విచారం అనే ఈ రెండు రకాల భావోద్వేగాలూ తప్పనిసరిగా మారుతూనే ఉండక్కర్లేదు. 'మేనిక్ ఫేజ్' అని పిలిచే విపరీత సంతోష సమయమే అదే కొనసాగవచ్చు. తర్వాత తీవ్ర విచార దశ అయిన 'డిప్రెసివ్ స్టేట్' రాకుండా మళ్లీ మళ్లీ వైపరీత్య సంతోషమే కొనసాగవచ్చు. కాకపోతే కొందరిలో తీవ్ర విచారదశ (డిప్రెసివ్ స్టేట్) కూడా రావచ్చు. ఇలా ఎక్స్‌ట్రీమ్ ఎమోషన్స్ కారణంగా బాధితులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. కేవలం వాళ్లు మాత్రమే కాదు... 'వాళ్లు ఇలా ప్రవర్తిస్తున్నానేమంటూ, వాళ్ల తీరుతెన్నులు మాటిమాటికీ మారిపోతూ ఉంటున్నాయి ఎందుకో'నంటూ కుటుంబసభ్యులూ, స్నేహితులూ ఆశ్చర్యపడటమే కాదు... ఆందోళనకూ గురవుతుంటారు. ఈ బైపోలార్ డిజార్డర్‌లో బాధితులు ఎందుకిలా ప్రవర్తిస్తుంటారో, వాళ్లకు తగిన చికిత్స ఏమిటో తెలుసుకునేందుకు ఉపయోగపడేదే ఈ కథనం.

బైపోలార్ డిజార్డర్‌లో విపరీత సంతోషం అంటే మేనిక్ దశ... అలాగే అంతులేని విచారం (డిప్రెసివ్ స్టేట్) దశలు కొనసాగుతాయని చెప్పుకున్నాం కదా. అవి తప్పనిసరిగా ఒకదాని తర్వాత మరొకటి ఫాలో అవుతూ రాకపోవచ్చు. మేనిక్ ఫేజ్ ఒక ఎపిసోడ్ అనుకుని... డిప్రెసివ్ స్టేట్ మరో ఎపిసోడ్ అనుకుంటే ఒక్కోసారి ఒకే దశ (అంటే ఉదాహరణకు మేనిక్ దశ) ఓ నిర్ణీత వ్యవధిలో వచ్చి చాలారోజుల పాటు కొనసాగుతూ ఉండవచ్చు. ఈ దశలో చికిత్స తీసుకోకపోతే... ఆ దశలు పునరావృతం అయ్యే వ్యవధి తగ్గుతూ పోతుండవచ్చు. ఉదాహరణకు మేనిక్ దశ ప్రతి రెండేళ్లకోమారు వస్తూ ఉన్నది కాస్తా.. తొలుత ఏడాదిలోనే... అటు తర్వాత ఆర్నెల్లకే పునరావృతమవుతూ ఉండవచ్చు. అప్పటికీ చికిత్స తీసుకోని సందర్భాల్లో ఆ దశలో వెంటవెంటనే వస్తూ ఉండవచ్చు. ఇలా దశల మధ్య వ్యవధి తగ్గుతూ మళ్లీ మాటిమాటికీ రిపీట్ అవుతుండటాన్ని 'ర్యాపిడ్ సైకిల్స్' అంటారు. ఇక అప్పటికీ చికిత్స తీసుకోనప్పుడు ఒక సంతోష దశ... ఆ వెంటనే మళ్లీ విచార దశ... ఇవి చాలా విపరీతమైన వేగంతో మారిపోయే దశకూడా వస్తుంది. అటు తర్వాత ఒకే ఎపిసోడ్‌లోనే ఒక సంతోష దశ... ఆ వెంటనే విచారదశ చాలా చాలా వేగంగా వస్తూ మారిపోతూ ఉండటాన్ని 'అల్ట్రా ర్యాపిడ్ సైకిల్స్'గా పిలుస్తుంటారు. ఇదీ స్థూలంగా 'బైపోలార్ డిజార్డర్'లో కనిపించే సంతోష – విచారాలు వస్తూ పోతూ ఉండే దశల తీరుతెన్నులు!

ఇక కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఈ తరహా సమస్య ఉన్నప్పుడు అనువంశీకంగానో న్యూరలాజికల్ కారణాలతో కొందరిలో మూడ్స్ పదే పదే మారిపోతుంటాయి. ఇందులో జన్యుపరమైన అంశాలతో అనువంశీకంగా వస్తుండటమే అన్నిటికంటే ముఖ్యమైన కారణంగా చెప్పవచ్చు. ఇలా మాటిమాటికీ మూడ్స్ మారిపోయే ఈ 'బైపోలార్ డిజార్డర్' తాలూకు తీరుతెన్నులెలా ఉంటాయో తెలుసుకుందాం.

★ బైపోలార్ డిజార్డర్

అలలా పొంగి... అలాగే కుంగి...

ఓ కేస్ స్టడీ...

''ఓ ఏడాదిలో కోటి రూపాయలు సంపాదించడం కష్టమేమీ కాదు. మనం తలచుకుంటే పది కోట్లు కూడా సంపాదించగలం. ఉద్యోగంలోనైతే నెలనెలా అదే జీతం... అదే సంపాదన. కానీ మనం బిజినెస్ చేస్తే మార్కెట్లో మిగతావాళ్లంతా కళ్లప్పగించి చూడాల్సిందే. ఇప్పుడు కంప్యూటర్ ర్యామ్‌ల ధరలు పెరుగుతున్నాయి. ఏఐకి డిమాండ్ పెరుగుతుండటంతో ఇలా జరుగుతోంది. ఇక ఫ్యూచర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే కాబట్టి ఈ తరుణంలో ఈ బిజినెస్‌లో ఎంటరయ్యామంటే ఇంక కోట్లల్లో సంపాదన చాలా ఈజీ'' అంటున్నాడు దేవేందర్ చాలా హుషారుగా తన స్నేహితులతో మాట్లాడుతూ.. మళ్లీ కాసేపటి తర్వాత ఆ ఫ్రెండ్స్‌తోనే ఇలా అంటున్నాడు... ''ఎందుకోగానీ చాలా 'లో' గా ఫీలవుతున్నాను. మార్కెట్ చాలా గందరగోళంగా ఉంది. ర్యామ్ ధరలు ఇంతగా ఫ్లక్చువేట్ అవుతున్న ఈ తరుణంలో ఆ బిజినెస్ పెడితే పక్కా మునిగిపోతామనిపిస్తోంది. ఇప్పుడు దివాలా తీస్తామో లేదా ప్రపంచ పరిణామాలు ఎప్పుడెలా మారిపోతాయే తెలియని ఇలాంటి గ్లోబల్ వాతావరణంలో బిజినెస్ చేయడం కంటే... నెల జీతం నిక్కచ్చిగా వచ్చే ఏ చిన్న జాబో చేసుకుని బతకాలనిపిస్తోంది. కనీసం నా చదువుకు ఓ చిన్నజాబైనా... అందునా ఏజ్ బార్ అయ్యాక వస్తుందో రాదో అని బెంగగా ఉంటోంది'' అని వాపోతున్నాడు కాసేపటి ముందు ఫ్రెండ్స్ ముందు గప్పాలు కొట్టిన అదే దేవేందర్. రోలర్‌కోస్టర్ మీదికి ఎక్కిన వారిలాగా అలా పైకిపోతూ... ఇంతలోనే ఇలా కిందికి జారిపోతూ ఉండే వారిలాగే... ఈ బాధితుల మూడ్స్ కూడా పదే పదే రెండు ఎక్స్‌ట్రీమ్ ఎమోషన్స్ మధ్యన ఊగిసలాడుతూ ఉంటాయి. అందుకే రెండు విభిన్నమైన పోల్స్ మధ్య వాళ్ల భావోద్వేగాలు కొనసాగుతుంటాయి కాబట్టే ఈ జబ్బుకు 'బైపోలార్ డిజార్డర్' అని పేరు. ముందుగా చెప్పినట్టుగానే... ఈ మానసిక సమస్యలో చాలా సంతోషంగా, ఉత్సాహంగా, ఉద్విగ్నతకు లోనయ్యే దశను 'మేనిక్' ఫేజ్ అంటారు. అలాగే తీవ్రంగా కుంగిపోయే దశను 'డిప్రెసివ్ స్టేట్ లేదా డిప్రెసివ్ ఎపిసోడ్'గా చెబుతారు.

డాక్టర్ శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్‌వై
హెచ్‌వోడీ ఆఫ్ సైకియాట్రీ &
సీనియర్ సైకియాట్రిస్ట్
ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రి, వరంగల్

డిప్రెసివ్ ఎపిసోడ్‌లో...

★ నీరసంగా, నిస్సత్తువగా, తీవ్రమైన అలసటతో ఉన్నట్టుగా కనపడతారు. ఏమాత్రం ఉత్సాహం లేకుండా చాలా విచారంగా కనిపిస్తుంటారు.
★ తాము చాలా దుర్బలులుగా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటారు.
★ ఏ అంశం మీదా దృష్టికేంద్రీకరించలేరు, ఏకాగ్రత ఉండదు. ఫోకస్డ్‌గా పని చేయపోలేకపోవచ్చు. కొన్నిసార్లు చాలా ముఖ్యమైన విషయాలనూ మరచిపోయే అవకాశముంటుంది.
★ పెసిమిస్టిక్ ధోరణితో చాలా నిరాశాపూరితమైన మాటలు మాట్లాడుతుంటారు.
★ తీవ్రమైన అపరాధభావంతో బాధపడుతూ ఉంటారు. అంతేకాదు... కొన్నిసార్లు భ్రాంతులకు గురవుతుండే అవకాశాలూ ఉంటాయి.
★ ఏమీ మాట్లాడకుండా చడీచప్పుడు లేకుండా ఉండేపోయే అవకాశాలెక్కువ.
★ ఆహారాన్ని తీసుకునే విషయంలో కొన్నిసార్లు చాలా తక్కువగా తింటారు లేదా కొన్నిసార్లు చాలా ఎక్కువగా తినేస్తుంటారు.
★ నిద్ర సమస్యలతో బాధపడుతుంటారు. కొందరిలో ఏమాత్రం నిద్రపట్టక నిద్రలేమి సమస్య ఉండవచ్చు. మరికొందరు చాలాసేపు గాఢనిద్రలో మునిగిపోవచ్చు.
★ అంతకుముందు తమకు ఎంతో సంతోషాన్నిచ్చే వాళ్ల హాబీలు / అభిరుచులు అంతలోనే వాళ్లకు ఏమాత్రం సంతృప్తినీ, ఉత్సాహాన్ని ఇవ్వకపోవచ్చు. వాటి పట్ల విముఖంగా ఉంటారు.
★ మాటిమాటికీ చావు గురించి మాట్లాడుతుంటారు. ఆత్మహత్య ప్రస్తావన తెస్తారు. అంతేకాదు... బైపోలార్ డిజార్డర్‌లో ఆత్మహత్య ధోరణులు పొడసూపడం... ఒక్కోసారి పేషెంట్ ఆత్మహత్యకు పాల్పడటానికి అవకాశాలూ ఉంటాయి.
★ ఈ డిప్రెసివ్ స్టేట్‌లో ఉన్నప్పుడు బాధితులు తమ స్నేహితులూ, బంధువులందరితో సామాజిక సంబంధాలు నెరపలేరు. వీళ్ల రెండు రకాల ఎక్స్‌ట్రీమ్ ప్రవర్తన భరించలేని కారణంగా స్నేహితులు దూరమవుతుండటంతో సామాజిక సంబంధాలు నెరపడం కష్టమవుతుంది.

రకాలు / తీవ్రత...

బైపోలార్ డిజార్డర్‌లో మరికొన్ని ఇతర రకాలతో పాటు ప్రధానంగా 'బైపోలార్ I', 'బైపోలార్ II' అనే రెండూ చాలా ప్రధానమైనవి. ఈ సమస్య బాధితుల్లో కొందరిలో మేనిక్ దశ చాలా తీవ్రంగా ఉంటుంది. కొన్నిసార్లు వాళ్లను హాస్పిటల్‌లో ఇన్‌పేషెంట్స్‌గా ఉంచి చికిత్స అందించాల్సి రావచ్చు. ఇక మరికొందరిలో ఈ మేనిక్ దశ అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. అలా మేనిక్ దశ మైల్డ్‌గా ఉండవచ్చు. అలాంటి కండిషన్‌ను 'హైపోమేనిక్' స్టేజ్‌గా చెబుతారు. ఇలాంటి హైపోమేనిక్ పేషెంట్స్‌ను హాస్పిటల్‌లో ఉంచి చికిత్స చేయించాల్సిన అవసరం లేదు. అయితే... వాళ్ల డిప్రెసివ్ స్టేట్‌లో చాలా నిరాశ, నిస్పృహలతో నిండి ఉంటుంది. భవిష్యత్తు గురించిన దిగులుపడుతూ ఉంటారు.దాంతో తీవ్రమైన కుంగుబాటుకు లోనవుతుంటారు. అందువల్ల ఈ దశలో వారికి తప్పనిసరిగా చికిత్స అందించాలి. లేదంటే వ్యాధి బాగా ముదిరి అది పేషెంట్‌కే కాకుండా... ఇంట్లోని కుటుంబసభ్యులకే కాకుండా, వాళ్ల స్నేహితులకు కూడా సమస్యాత్మకంగా మారే అవకాశాలెక్కువ.

లక్షణాలు...

మేనిక్ ఫేజ్‌లో...

★ బైపోలార్ డిజార్డర్ బాధితులు తమ 'మేనిక్ ఫేజ్'లో చాలా ఉత్సాహంగా, ఎలాంటి ఉపద్రవాలనూ లెక్కచేసేదే లేదన్నంత ధైర్యంగా ఉంటారు.
★ మామూలుగా ఉండాల్సిన హుషారు కంటే వాళ్లల్లో తమ ఉత్సాహం పాలు చాలా రెట్లు ఎక్కువ.
★ తమ సంకల్పం ముందు పెద్ద పెద్ద లక్ష్యాల్ని సాధించడం తమకు చాలా సులువు అనుకుంటారు.
★ డబ్బును ఖర్చుచేయడంలో ఏమాత్రం వెనకాడకపోవచ్చు. లెక్కలేకుండా ఖర్చు చేసేస్తుంటారు.
★ ఒక్కోసారి చిత్రంగా ప్రవర్తిస్తూ, ఇతరులకు చాలా సిల్లీగా అనిపించేలాంటి పనులకు పాల్పడుతుంటారు.
★ వారి మేనిక్ దశలో ఇతరులకు సహాయం చేయాలనే భావన బలంగా కలిగినప్పుడు దాన్ని నెరవేర్చడానికి ఎంతకైనా తెగిస్తారు. ఎలాంటి జంకూగొంకూ లేకుండా సాహసాలకు పాల్పడవచ్చు.
★ ఒక్కోసారి విపరీతమైన ధైర్యం, తెగువ ప్రదర్శిస్తారు. ఇలాంటి సమయాల్లో వీధి పోరాటాలకు దిగే అవకాశాలూ లేకపోలేదు.
★ తీవ్రమైన సంతోషంతో ఊగిపోతున్న ఓ అపరిమితమైన ఉత్సాహపూరిత దశ చాలాసేపు కొనసాగవచ్చు. దీన్ని 'యుఫోరియా' అంటారు.
★ అలాంటి దశలో కొంతమందిలో ఆల్కహాల్ లేదా ఇతర మాదకద్రవ్యాలు తీసుకోవాలన్న కోరికా, ధైర్యం పెరగవచ్చు. తమ సామాజిక భయాలు అణగారిపోవడం వల్ల ఇలాంటి కోరికలు చాలా ఎక్కువగా పెరిగిపోవచ్చు.
★ కొన్ని రకాల ఆలోచనలు ఎడతెరిపి లేకుండా అలలా మాదిరిగా ఆగకుండా వస్తూనే ఉంటాయి.
★ కొందరిలో సెక్స్ పట్ల అపరిమితమైన ఆసక్తి పెరుగుతుంది. ఈ హుషారు తీవ్రతలో సురక్షితం కాని సెక్స్ వ్యవహారాలకూ వెనకాడకపోవచ్చు.

కారణాలు...

'బైపోలార్ డిజార్డర్'కు ఇదమిత్థంగా ఇవీ కారణాలు అని చెప్పడానికి లేదు. పైగా ఈ కారణాలు కూడా నిర్దిష్టంగా ఉండక పేషెంట్ నుంచి పేషెంట్‌కు మారుతుంటాయి. ప్రధానంగా జన్యుపరమైన అంశాలూ, నాడీ సంబంధమైన (న్యూరలాజికల్) కారణాలు ఈ వ్యాధికి కారణమవుతాయని చెప్పవచ్చు. బాహ్య వాతావరణపరమైన కారణాలూ ఉన్నప్పటికీ అవి పెద్దగా ప్రధాన కారణం కాకపోవచ్చు. వాటి భూమిక చాలా తక్కువ.

★ **జన్యుపరమైన కారణాలు...**

బాధితుల కుటుంబంలో తమ కుటుంబ సభ్యుల్లో ప్రధానంగా తల్లిదండ్రులకు ఈ సమస్య ఉన్నప్పుడు మిగతా కుటుంబ సభ్యుల్లో ఈ వ్యాధి వచ్చేందుకు అవకాశాలెక్కువ. 'బైపోలార్ డిజార్డర్'ను ప్రేరేపించే ఓ నిర్దిష్ట జన్యువు కారణంగా ఇది వంశపారంపర్యంగా కనిపించవచ్చని కొన్ని అధ్యయనాల్లో తేలింది. అయితే ఒకవేళ తల్లిదండ్రుల్లోనో లేదా సోదరుల్లోనో ఉన్నంత మాత్రాన ఆ కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా ఇది తప్పక వస్తుందన్న నియమమేదీ లేదు.

★ **న్యూరలాజికల్...**

నాడీపరమైన (అంటే న్యూరలాజికల్) కారణాలతో కొందరిలో బైపోలార్ డిజార్డర్ కనిపించవచ్చు. ఉదాహరణకు పక్షవాతం వచ్చిన కొద్దిమందిలో గానీ; ఏదైనా ప్రమాదంలో మెదడు దెబ్బతినడం జరిగినప్పుడు గానీ, నరాలపై ఉండే మైలిన్‌షీత్ అనే పొర దెబ్బతినడం వంటి పరిణామాలు చోటు చేసుకుని 'మల్టిపుల్ స్క్లిరోసిస్' వంటికేసుల్లో, చాలా అరుదుగా మెదడులోని టెంపోరల్ లోబ్ అనే భాగంలోని లోపం కారణంగా 'మూర్ఛ' (టెంపోరల్ లోబ్ ఎపిలెప్సీ) వ్యాధి ఉన్నవారిలో 'బైపోలార్ డిజార్డర్' కనిపించే అవకాశాలు ఉండవచ్చు. అంతేకాకుండా... మెదడులోని ప్రధానమైన 'న్యూరోట్రాన్స్‌మిటర్' రసాయనమైన డోపమైన్ స్రావాలు బాధితుల్లో తమ మూడ్స్‌లోని మార్పులకు కారణమవుతాయి. వాళ్ల డిప్రెసివ్ దశలో 'సెరటోనిన్' అనే రసాయనానికి సంబంధించిన అనుబంధ రసాయనమైన '5-హైడ్రాక్సీ ఇండోల్ ఎసిటిక్ యాసిడ్' మోతాదులూ తగ్గుతాయి. ఇలాంటప్పుడూ బాధితుల్లో బైపోలార్ డిజార్డర్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి.

★ **పేషెంట్ పెరిగిన సామాజిక వాతావరణం కారణంగా...**

ఇక్కడ వాతావరణం అంటే పూర్తిగా పర్యావరణ కారణాలైన ఏ కాలుష్యమనో లేదా అలాంటి మరో అంశమనో కాదు. సామాజిక వాతావరణమంటే ఉదాహరణకు... బాధితుడు తన చిన్నతనంలో తీవ్రమైన మనోవేదనకు గురికావడం • ఏదైనా ఇతరత్రా వ్యాధికారణంగా చెప్పలేనంత వేదనతో బాధపడాల్సి రావడం • ఏదైనా పెద్ద వినాశనమో చోటు చేసుకున్నప్పుడు రావచ్చు. కానీ ఇది చాలా చాలా తక్కువ.

★ **కొన్ని రకాల మందుల దురుపయోగాల వల్ల...**

ప్రధానంగా ఆల్కహాల్‌తో పాటు నిద్రమాత్రలు వాడుతుండటం, మెదడును ప్రేరేపించడానికి వాడే మందులు (అంటే సెంట్రల్ నర్వస్ సిస్టమ్ స్టిమ్యులెంట్స్, అనబాలిక్ స్టెరాయిడ్స్, కొన్ని రకాల మాదక ద్రవ్యాలు (డ్రగ్స్) వంటివి మేనిక్ దశ వచ్చేలా ప్రేరేపిస్తాయి. అంతేకాదు... జిమ్‌లలో ఇచ్చే ఎనర్జీ డ్రింక్స్ / ఎనర్జీ టానిక్స్‌లో కొన్నిసార్లు మెదడును ప్రేరేపించే స్టిమ్యులెంట్స్ ఉండటం వల్ల... వాటి కారణంగా అవి మేనిక్ దశను ప్రేరేపించే ప్రమాదాలు ఉండవచ్చు. అలాగే కొన్ని సందర్భాల్లో ఆటో ఇమ్యూన్ డిజార్డర్స్‌ను తగ్గించడానికి వచ్చే స్టెరాయిడ్స్ వంటివి కూడా మేనిక్ దశకు కారణం కావచ్చు.

★ **కొన్ని ఇతర వ్యాధులతో కలిసి 'బైపోలార్ డిజార్డర్' కూడా...**

కొన్నిసార్లు బైపోలార్ డిజార్డర్... కొన్ని రకాల ఇతర వ్యాధులతో పాటు కనిపించవచ్చు. అంటే బైపోలార్ డిజార్డర్ ఉన్నవారిలో యాంగ్జైటీ డిజార్డర్, ఈటింగ్ డిజార్డర్ వంటి మానసిక సమస్యలూ ఉండవచ్చు. లేదా ఇక్కడ పేర్కొన్న వ్యాధులతో పాటూ బైపోలార్ డిజార్డర్ కూడా వ్యక్తం కావచ్చు. ఇవి ఉన్నవారిలో థైరాయిడ్ సమస్యలు, మైగ్రేన్ తలనొప్పులు, గుండెజబ్బులు, డయాబెటిస్, ఒబెసిటీ లేదా ఇతర ఆరోగ్య సమస్యలూ కనిపించే అవకాశాలు ఎక్కువ.

అలాగే... తలకు తీవ్రమైన గాయం కావడం (హెడ్ ఇంజ్యూరీ), ఫిట్స్ రావడం (ఎపిలెప్సీ), పక్షవాతం (స్ట్రోక్), మల్టిపుల్ స్క్లిరోసిస్ వంటి సమస్యల వల్ల మెదడు తీవ్రంగా ప్రభావితం కావడం వల్ల కొందరిలో బైపోలార్ డిజార్డర్ తాలూకు లక్షణాలైన మేనిక్, డిప్రెసివ్ స్టేట్ లాంటి లక్షణాలూ కనిపించవచ్చు.

వ్యాధి నిర్ధారణ...

బాధితుల్లో బైపోలార్ లక్షణాలు కనిపించినప్పుడు వాటి ఆధారంగా డాక్టర్లు దీన్ని నిర్ధారణ చేస్తారు. ఈ సమస్య ఉన్నవారిలో పర్సనాలిటీ డిజార్డర్స్, స్కీజోఫ్రీనియా వంటి లక్షణాలేమైనా ఉన్నాయా అని కూడా డాక్టర్లు పరీక్షిస్తారు. అవసరాన్ని బట్టి కొన్నిసార్లు కొన్ని రకాల రక్తపరీక్షలు, బ్రెయిన్ ఎమ్మారై వంటి స్కాన్‌లూ చేయిస్తారు. అలాగే... బాధితులు తమ చిన్నతనంలో ఏవైనా తీవ్రమైన మానసిక వేదనకు గానీ అబ్యూజ్‌కు గానీ గురయ్యారా అని చూస్తారు. కుటుంబ ఆరోగ్య చరిత్రను పరిశీలిస్తారు. నిర్ధారణ (డయాగ్నోజ్) ప్రక్రియలో ఇలాంటి ఎన్నో అంశాలను పరిశీలించి, ఈ వ్యాధి నిర్ధారణ కోసం వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటారు.

నివారణ...

చిన్నారులు తమ చిన్నతనంలో ఏవైనా కారణాల వల్ల అత్యంత తీవ్రమైన మనోవేదనలకు గురైతే... అందుకు కారణమైన అంశాన్ని బట్టి... బాధితులతో నిత్యం మాట్లాడుతూ వారికి తగినంత మానసిక స్థైర్యాన్ని ఇవ్వడం ద్వారా వారు పెరిగి పెద్దయ్యాక వారిలో బైపోలార్ డిజార్డర్ రాకుండా నివారించవచ్చు. మంచి మానవసంబంధాలను కలిగి ఉండటం, అలాగే నలుగురితో కలిసిపోతూ సామాజిక బాంధవ్యాలను పటిష్టం చేసుకోవడం ద్వారా సందర్భాల్లో బైపోలార్ డిజార్డర్ దానంతట అదే అదుపులోకి వస్తుంది. ఇక్కడ పేర్కొన్న అన్ని రకాల చర్యలతో 'బైపోలార్ డిజార్డర్'ను చాలావరకు నివారించవచ్చు. అయితే బైపోలార్ డిజార్డర్‌లో నివారణకు పెద్ద ప్రాధాన్యం ఉండకపోవచ్చు. దానికంటే చికిత్సకే ఎక్కువ ప్రాధాన్యం.

నిర్వహణ: యాసీన్

చికిత్స...

ఇది ప్రధానంగా సైకోటిక్ డిజార్డర్ అయినందున చికిత్సలో భాగంగా కొన్ని ఇతర చికిత్సప్రక్రియలను అవలంబించినప్పటికీ ప్రధానంగా ఈ సమస్యకు మందులే ఎక్కువగా పనిచేస్తాయి. కౌన్సెలింగ్ పనిచేయదు. అందువల్లనే ఈ సమస్య పరిష్కారాలనికి సైకోటిక్ మందులు వాడుతుంటారు. ఆ మందుల్లోనూ ఈ సమస్య కోసం ప్రధానంగా మూడు రకాల మందులు వాడాల్సి వస్తుంది. అవి... 1) మూడ్‌ను బాగు చేసే మూడ్ స్టెబిలైజర్స్. ఈ మూడ్స్‌ను బాగుచేసే 'మూడ్ స్టెబిలైజర్స్‌లో భాగంగా ప్రధానంగా లిథియమ్, సోడియమ్ వాల్‌ప్రొయేట్, కార్బమాజిపైన్ వంటి మందులు వాడుతుంటారు. 2) మానసికసమస్యలకు ఇచ్చే యాంటీ సైకోటిక్ మందులు. ఈ యాంటీసైకోటిక్ మందులను బాధితుల్లో అత్యంత ప్రమాదకరమైన స్థాయికి చేరిన తీవ్రమైన ఎక్సైట్‌మెంట్‌నూ, అతడి తీవ్రమైన ప్రవర్తననూ (అగ్రెషన్‌ను) తగ్గించడానికి డాక్టర్లు ఇస్తుంటారు. . 3) యాంటీడిప్రెసెంట్స్.... వంటివి ఇవ్వాల్సి ఉంటుంది.

లిథియమ్‌తో మంచి ఫలితాలు...

పీరియాడిక్ టేబుల్‌లోని మూడో ఎలిమెంట్ అయిన 'లిథియమ్' మనిషి భావోద్వేగాల హెచ్చుతగ్గులను ఎలా నియంత్రిస్తుందన్నది ఇప్పటికీ ఒక అద్భుతం. ఎందరో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నంత వ్యాధి తీవ్రత ఉన్నవారిలోనూ ఈ లిథియమ్ అద్భుతంగా పనిచేసి, ఎన్నో మరణాలను నివారించిందీ... నివారిస్తూనే ఉంది. అంతేకాదు... మొదట్లో 'ర్యాపిక్ సైకిల్స్'ను తగ్గించడానికి ఇచ్చే ఈ లిథియమ్‌ను (లిథియమ్ మెయింటెనెన్స్ చికిత్సగా)... బాధితుడిలో మేనియా వంటి లక్షణాలు అదుపులోకి వచ్చాక కూడా అతడి అవసరాన్ని బట్టి మరో 2 నుంచి 5 ఏళ్ల పాటు ఇవ్వాల్సి రావచ్చు.

మందులు కేవలం సైకియాట్రిస్ట్‌ల ఆధ్వర్యంలోనే...

సమస్య తాలూకు తీవ్రతను బట్టి బైపోలార్ డిజార్డర్‌కు ఇవ్వాల్సిన మందులను తగిన మోతాదులో కేవలం సైకియాట్రిస్ట్‌ల ఆధ్వర్యంలో మాత్రమే వాడాలి. అంటే... ఒకసారి సైకియాట్రిస్ట్ సూచించిన మందు వాడినవాళ్లు... మరోసారి తామే సొంతంగా అదే మందును వాడటం ఎంతమాత్రమూ సరికాదు. దానివల్ల ఇతరత్రా అనర్థాలు వచ్చే అవకాశాలుంటాయి. ఇక మందులు వాడుతున్నప్పుడు అకస్మాత్తుగా వాటిని ఆపేయడమూ సరికాదు. దానివల్ల బైపోలార్ డిజార్డర్ మళ్లీ తిరగబెట్టడమే కాదు.. ఒక్కోసారి తర్వాత్తర్వాత దాన్ని అదుపు చేయడమూ కష్టమవుతుంది.

ఈ సమస్య పరిష్కారం కోసం కొన్నిసార్లు కరెంట్ షాక్ ఇచ్చే 'ఎలక్ట్రోకన్వల్సివ్ థెరపీ' కూడా అవసరం కావచ్చు. అయితే ఇది ఎంతమాత్రమూ ప్రమాదకరం కాదు.

సవాళ్లకు సిద్ధం



- సుసాకిని దీటుగా ఎదుర్కొంటా
- వినేశ్ పునరాగమనం మంచిదే
- శిబిరాలే కాదు... విదేశీ శిక్షణ కావాలి
- భారత స్టార్ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ వ్యాఖ్య

భారత చాంపియన్ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ గురువారం మొదలయ్యే ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) సవాళ్లకు సిద్ధమని ప్రకటించింది. కొరకరాని విదేశీ రెజ్లర్లపై ఎప్పటి నుంచో దృష్టి సారించినట్లు చెప్పింది. మన రెజ్లర్లకు జాతీయ శిబిరాలు మెలకువలు నేర్పిస్తే... విదేశాల్లో శిక్షణ విదేశీ రెజ్లర్లను దీటుగా ఎదుర్కొనే స్థయిర్యాన్నిస్తుందని చెప్పుకొచ్చింది.

న్యూఢిల్లీ: రోజుల వ్యవధిలోనే మొదలయ్యే పీడబ్ల్యూఎల్ కోసం పక్కా ప్రణాళికలతో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యానని భారత స్టార్ మహిళా రెజ్లర్ అంతిమ్ పంఘాల్ తెలిపింది. 53 కేజీల కేటగిరీలో జూనియర్, సీనియర్ అంతర్జాతీయ స్థాయిల్లో ఇదివరకే నిరూపించుకున్న అంతిమ్ ఇప్పుడు కొత్త తరహా లీగ్ 'పట్టు'కు సై అంటోంది. 17 ఏళ్ల వయసులోనే 2022లో అండర్–20 ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఆమె ఆ మరుసటి ఏడాది టైటిల్ నిలబెట్టుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్యాలు నెగ్గిన ఆమె.. 2022 ఆసియా క్రీడల్లోనూ కాంస్య పతకంతో మెరిసింది. 21 ఏళ్ల ఈ స్టార్ రెజ్లర్ తనకు ఎదురయ్యే మింగుడు పడని విదేశీ రెజ్లర్లపై ఓ కన్నేసినట్లు చెప్పింది. జపాన్ దిగ్గజ రెజ్లర్ యుయ్ సుసాకి పోటీల వీడియోలను ఫోన్‌లో తరచూ చూస్తానని చెప్పుకొచ్చింది. తన కెరీర్‌లోనే ఓటమి ఎరుగని సుసాకిపై పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ వినేశ్ ఫొగాట్ సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇలా మేటి రెజ్లర్లను ఓడించే సత్తా మనకుందని 2023లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'అర్జున అవార్డు' అందుకున్న అంతిమ్ చెప్పుకొచ్చింది. బౌట్‌కు ముందు ఎన్నో ఆలోచనలు చుట్టూ తిరుగుతూనే ఉంటాయని, అయితే బౌట్ కోసం మ్యాట్ మీదిగి దిగగానే మైండ్ ఒక్కసారిగా 'పోరాటం'పైనే పడుతుందని, దీంతో... గెలుపోటముల ఆలోచనేది గుర్తుకు రాదని, వంద శాతం కుస్తీపట్టడం గురించే ఆలోచిస్తానని అంతిమ్ వివరించింది. ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) ఈ నెల 15 నుంచి నోయిడా ఇండోర్ స్టేడియంలో జరుగుతుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన మనోభావాలను ఇలా పంచుకుంది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి 'అర్జున' అవార్డు స్వీకరిస్తూ...

అర కోటి... అస్సలు ఊహించలేదు!

'పీడబ్ల్యూఎల్ వేలంలో ఈ స్థాయి మొత్తం లభిస్తుందని అస్సలు ఊహించనేలేదు. నేనే కాదు... మా కుటుంబసభ్యులెవరూ ఇంత మొత్తం వస్తుందని అనుకోలేదు. నిజానికి నాకు సుమారు రూ. 30 లక్షలకు అటు ఇటుగా వస్తుందనే ఆశించాను. పెరిగినా దీనికి కాస్తే ఎక్కువ రావొచ్చని అనుకున్నా! కానీ ఏకంగా రూ. 50 లక్షలు దక్కుతాయని ఏమాత్రం ఊహించలేదు. వేలం జరుగుతుండగా నేను ఆలయానికి వెళ్లాను. యూపీ డామినేటర్స్ నన్ను అంత మొత్తానికి కొనుగోలు చేసిందని తెలియగానే దేవుడికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపాను. హరియాణాకు చెందిన నేను కెరీర్ అసాంతం ఈ రాష్ట్రానికే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఎందుకనో ఈ లీగ్‌లో మాత్రం యూపీ తరపునే ఆడాలని గట్టిగా అనుకున్నా'.

మరింత పట్టుదలతో...

'సీనియర్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మరింత పట్టుదలతో, రెట్టించిన ఉత్సాహంతో పునరాగమనం చేస్తుంది. ఆమె రిటైర్మెంట్‌ను పక్కనబెట్టడం శుభపరిణామం. నాకంటే ఆమె ఎంతో అనుభవజ్ఞురాలైన రెజ్లర్. ఆమె వస్తుందంటేనే చెమటోడ్చేందుకు సిద్ధమైందని అర్థం. ఏ ప్లేయర్ అయినా సరే పోరాడేతత్వం, మనోధైర్యం బలంగా ఉంటేనే పునరాగమనం చేస్తారు. మన వినేశ్ కూడా అంతే! ఇక నేను పోటీపడే 53 కేజీల కేటగిరీ నాకు మాత్రమే సొంతం కాదు. ఎవరైనా పోటీపడొచ్చు. ఏ కేటగిరీ సరైందో పోటీ పడే అథ్లెట్‌కే బాగా తెలుస్తుంది. అందులో ఎంతగా కష్టపడగలదో, ఏ రకంగా గెలుస్తుందో, దేనివల్ల ఓడిపోతోందో ఆ విభాగానికి చెందిన అథ్లెట్‌కే బాగా తెలుస్తుంది'.

సీనియర్ స్థాయికి ఎదగగానే...

'జూనియర్ నుంచి సీనియర్ స్థాయి పోటీల్లో బరిలోకి దిగుతుంటే మన పరిణతి కూడా పెరుగుతుంది. జూనియర్స్‌లో ఒకట్రెండు పాయింట్లు ఓడితే నిరాశ ఆవహించేది. కానీ ఇప్పుడు పూర్తిగా అర్థం చేసుకోగలుగుతున్నా. ఒకట్రెండు పాయింట్లు కాదు... ఆడాల్సింది ఆరు నిమిషాలు. ఒకటి అర కోల్పోయినా ప్రత్యర్థి పట్టుపట్టేందుకు, పైచేయి సాధించేందుకు మన చేతిలో సమయమైతే ఉంటుంది. ఇప్పుడు నా ట్రెయినింగ్ కూడా మారింది. అంతేకాదు... మళ్లీ నేను కోచ్ సియారామ్ దహియాతో శిక్షణ తీసుకోవడం నన్ను మరింత మెరుగుపరిచింది. దహియా మార్గదర్శకంలో అనవసర ఒత్తిడి తగ్గించుకొని త్వరితగతిన పుంజుకోవడంపై ఎక్కువగా దృష్టి సారించాను. అదేపనిగా లేదంటే మితిమీరిన శిక్షణ కూడా తగదని కోచ్‌లు వారిస్తారు. మ్యాట్‌పై ఎప్పుడు కుస్తీ పట్టాలో... వద్దో మేము, కోచ్, ఫిజియో కలిసి నిర్ణయించుకుంటాం. అనుకూల వాతావరణాన్ని సృష్టించుకుంటాం'.

విదేశీ శిక్షణ కీలకం

'జాతీయ శిబిరాలు రెజ్లర్లను దీటుగా సన్నద్ధపరుస్తున్నాయి. అలాగని విదేశాల్లో శిక్షణ అనవసరం అనుకుంటే పొరపాటు. అది కూడా రెజ్లర్లకు కీలకమైన వేదిక. మేమంతా కూడా సహచరులతో కుస్తీ పట్టడం ద్వారానే నేర్చుకున్నాం. అంటే మా మధ్య ఎలాంటి పోటీ ఉంటుందో, ఎవరి సత్తా ఎంటో మాకు బాగా తెలుసు. జాతీయ శిబిరాల్లో ఇదే జరుగుతుంది. కానీ విదేశీ రెజ్లర్లు మాలానే ఉంటారని అనుకోలేం. వారిలో వేగం ఎక్కువ. అలాంటి వారితో అడపాదడపా విదేశాల్లో శిక్షణ ఏర్పాటు చేస్తే ఈ అనుభవం అంతర్జాతీయ పోటీలకు బాగా ఉపయోగపడుతుంది'.

సెమీఫైనల్లో కర్ణాటక, సౌరాష్ట్ర

క్వార్టర్ ఫైనల్స్‌లో ముంబై, ఉత్తరప్రదేశ్ ఓటమి

హార్విక్ దేశాయ్

దేవ్‌దత్ పడిక్కల్

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ కర్ణాటక జట్టు వరుసగా నాలుగోసారి విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ముంబై జట్టుతో సోమవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక జట్టు వీజేడీ పద్ధతిలో 54 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 254 పరుగులు సాధించింది. షమ్స్ ములానీ (91 బంతుల్లో 86; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ సిద్దేశ్ లాడ్ (58 బంతుల్లో 38; 4 ఫోర్లు), సాయిరాజ్ పాటిల్ (25 బంతుల్లో 33 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ముంబై స్టార్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. కర్ణాటక బౌలర్లలో విద్యాధర్ పాటిల్ (3/42), అభిలాశ్ శెట్టి (2/59), విద్వత్ కావేరప్ప (2/43) రాణించారు. అనంతరం 255 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కర్ణాటక 33 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 187 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (12) తక్కువ స్కోరుకే అవుటవ్వగా... దేవ్‌దత్ పడిక్కల్ (95 బంతుల్లో 81 నాటౌట్; 11 ఫోర్లు), కరుణ్ నాయర్ (80 బంతుల్లో 74 నాటౌట్; 11 ఫోర్లు) రెండో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. కర్ణాటక విజయం దిశగా సాగుతున్న దశలో భారీ వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. వర్షం తగ్గకపోవడంతో వీజేడీ పద్ధతిని అనుసరించి విజేతను నిర్ణయించారు. వీజేడీ పద్ధతి ప్రకారం 33 ఓవర్లకు కర్ణాటక విజయసమీకరణం 132 పరుగులు. కర్ణాటక 55 పరుగులు ముందుండటంతో ఆ జట్టును గెలుపు వరించింది.

హార్విక్ దేశాయ్ అజేయ సెంచరీ

ఉత్తరప్రదేశ్ జట్టుతో జరిగిన రెండో క్వార్టర్ ఫైనల్లో సౌరాష్ట్ర జట్టు వీజేడీ పద్ధతిలో 17 పరుగుల తేడాతో గెలిచి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ముందుగా ఉత్తరప్రదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 310 పరుగులు చేసింది. అభిషేక్ గోస్వామి (82 బంతుల్లో 88; 12 ఫోర్లు), సమీర్ రిజ్వీ (77 బంతుల్లో 88 నాటౌట్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. సౌరాష్ట్ర బౌలర్లలో చేతన్ సకారియా 3 వికెట్లు... అంకుర్ పన్వర్, ప్రేరక్ మన్కడ్ 2 వికెట్లు తీశారు. 311 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సౌరాష్ట్ర 40.1 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు సాధించింది. ఓపెనర్ హార్విక్ దేశాయ్ (116 బంతుల్లో 100 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. ప్రేరక్ మన్కడ్ (66 బంతుల్లో 67; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. చిరాగ్ జానీ (31 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. సౌరాష్ట్ర స్కోరు 238/3 వద్ద భారీ వర్షం రావడం, ఆ తర్వాత తగ్గకపోవడంతో వీజేడీ పద్ధతిని అనుసరించి విజేతను నిర్ణయించారు. ఆట నిలిచిపోయే సమయానికి సౌరాష్ట్ర విజయసమీకరణం కంటే 17 పరుగులు ముందంజలో ఉండటంతో ఆ జట్టుకు విజయం దక్కింది. నేడు జరిగే మరో రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో పంజాబ్‌తో మధ్యప్రదేశ్; ఢిల్లీతో విదర్భ తలపడతాయి.

టెన్నిస్‌కు రావ్‌నిచ్ గుడ్‌బై


వింబుల్డన్ టోర్నీ రన్నరప్ ట్రోఫీతో...

మాంట్రియల్: కెనడా టెన్నిస్ ప్లేయర్ మిలోస్ రావ్‌నిచ్ ఆటకు వీడ్కోలు పలికాడు. 35 ఏళ్ల రావ్‌నిచ్ 2016లో కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌ను అందుకున్నాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో చివరిసారి టెన్నిస్ మ్యాచ్ ఆడిన రావ్‌నిచ్ ఆ తర్వాత బరిలోకి దిగలేదు. 2008లో ప్రొఫెషనల్‌గా మారిన రావ్‌నిచ్ తన కెరీర్‌లో మొత్తం 8 ఏటీపీ సింగిల్స్ టైటిల్స్‌ను సాధించాడు. 'సమయం వచ్చేసింది. నేను టెన్నిస్ నుంచి రిటైర్ అవుతున్నాను. ఏ క్రీడాకారుడైనా ఈ పరిస్థితిని ఎదుర్కొంటాడు. నా జీవితంలో చాలా ఏళ్లు టెన్నిస్ అంతర్భాగంగా ఉంది. ఈ ఆట నాకెంతో ఇచ్చింది' అని రావ్‌నిచ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 2016లో రావ్‌నిచ్ కెరీర్ అత్యుత్తమ దశలో నిలిచాడు. ఆ ఏడాది వింబుల్డన్ సెమీఫైనల్లో స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్‌ను ఓడించి రావ్‌నిచ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అయితే ఫైనల్లో ఆండీ ముర్రే (బ్రిటన్) చేతిలో ఓడిపోయి ఈ కెనడా స్టార్ రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నాడు. అదే ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో, సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో సెమీఫైనల్ చేరిన అతను ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు.

383 ప్రొఫెషనల్ కెరీర్‌లో రావ్‌నిచ్ గెలిచిన మ్యాచ్‌లు.

8 కెరీర్‌లో సాధించిన ఏటీపీ సింగిల్స్ టైటిల్స్. సాన్‌జోస్ ఓపెన్ (2011, 2012, 2013), చెన్నై ఓపెన్ (2012), బ్యాంకాక్ ఓపెన్ (2013), వాషింగ్టన్ ఓపెన్ (2014), సెయింట్ పీటర్స్‌బర్గ్ ఓపెన్ (2015), బ్రిస్బేన్ ఓపెన్ (2016) టోర్నీలలో విజేతగా నిలిచాడు.

3 రావ్‌నిచ్ సాధించిన కెరీర్ బెస్ట్ ర్యాంక్.

2,07,64,512 డాలర్లు (రూ. 187 కోట్లు) కెరీర్‌లో సాధించిన మొత్తం ప్రైజ్‌మనీ

ఐఎస్‌ఎల్‌కు మొత్తం 14 క్లబ్‌లు ఓకే

లిఖిత పూర్వకంగా సంసిద్ధతను వ్యక్తపరిచిన క్లబ్‌లు

న్యూఢిల్లీ: ఇప్పటికే చాలా ఆలస్యమైనప్పటికీ... ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీ మళ్లీ పూర్తిస్థాయిలో ట్రాక్‌లో పడింది. అన్ని అనుకున్నట్లు జరిగితే వచ్చే నెలలోనే ఐఎస్‌ఎల్ మళ్లీ భారత ప్రేక్షకుల్ని అలరిస్తుంది. దీనికి సంబంధించిన కీలకమైన ముందడుగు సోమవారం పడింది. మొత్తం 14 ఫుట్‌బాల్ క్లబ్‌లన్నీ ఈ సీజన్‌లో పాల్గొనేందుకు సిద్ధమని లిఖితపూర్వకంగా అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్)కు తెలిపాయి. కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పినట్లుగా వచ్చే నెల 14 నుంచి లీగ్ పునఃప్రారంభం కాబోతోంది. గత వారం మంత్రి ఐఎస్‌ఎల్ ఎప్పట్లాగే జరుగుతుందని ప్రకటించారు. అయినప్పటికీ కొన్ని క్లబ్‌లు ఆడేందుకు స్పష్టమైన సంకేతాలు ఇవ్వలేదు. వారం తిరిగేసరికి ఈ క్లబ్‌లు తమ మనసు మార్చుకున్నాయి. ఐఎస్‌ఎల్ బరిలో దిగుతామని సమష్టిగా లేఖలో పేర్కొన్నాయి. బహుశా నేడు ఏఐఎఫ్‌ఎఫ్ పెద్దలు, క్లబ్ నిర్వాహకుల మధ్య వర్చువల్ మీటింగ్ జరిగే అవకాశముంది. లీగ్ కోసం కొత్త గవర్నింగ్ కౌన్సిల్ బోర్డుపై అందరూ చర్చిస్తారు. అలాగే వాణిజ్యపరమైన అంశాలు, బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్ తదితర అంశాలు కూడా చర్చకు వస్తాయని ఏఐఎఫ్‌ఎఫ్ వర్గాలు తెలిపాయి. రూ. 24.26 కోట్ల ప్రాథమిక బడ్జెట్‌తో 2025–26 సీజన్‌ను నిర్వహించేందుకు అంగీకారం కుదిరింది. ఇందులో రూ.9.77 కోట్లను ఏఐఎఫ్‌ఎఫ్ సమకూరుస్తుంది. 14 క్లబ్‌లు రూ. 1 కోటి చొప్పున వెచ్చిస్తాయి.

మళ్లీ ఓడిన హైదరాబాద్ తూఫాన్స్

రాంచీ: పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్)లో గత ఏడాది రన్నరప్ హైదరాబాద్ తూఫాన్స్ జట్టు ఖాతాలో మూడో పరాజయం చేరింది. ఎస్‌జీ పైపర్స్ జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ 1–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఎస్‌జీ పైపర్స్ తరపున టొమాస్ డొమెనె (8వ, 29వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... హైదరాబాద్ జట్టుకు అమన్‌దీప్ లాక్రా (41వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఎనిమిది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో హైదరాబాద్ జట్టు నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఒక మ్యాచ్‌లో గెలిచి, మూడింటిలో ఓడి 5 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో హాకీ ఇండియా లీగ్ (హెచ్‌ఐఎల్) గవర్నింగ్ కౌన్సిల్ (జీసీ) జట్టు 4–2 గోల్స్ తేడాతో అకార్డ్ తమిళనాడు డ్రాగన్స్ జట్టును ఓడించింది. హెచ్‌ఐఎల్ జీసీ జట్టు తరపున కేన్ రసెల్ (14వ, 33వ, 47వ నిమిషాల్లో) మూడు గోల్స్, సామ్ వార్డ్ (23వ నిమిషంలో) ఒక గోల్ చేశారు. తమిళనాడు డ్రాగన్స్ జట్టుకు బ్లేక్ గోవర్స్ (32వ నిమిషంలో), ఉత్తమ్ సింగ్ (56వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హెచ్‌ఐఎల్ జీసీ జట్టు 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌లో ష్రాచి బెంగాల్ టైగర్స్ జట్టుతో తమిళనాడు డ్రాగన్స్ జట్టు తలపడుతుంది.

పోలాండ్ తొలిసారి...

యునైటెడ్ కప్ సొంతం • ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై విజయం

సిడ్నీ: గత రెండేళ్లు ఆఖరి మెట్టుపై బోల్తా పడిన పోలాండ్ జట్టు మూడోసారి మాత్రం మెరిసింది. యునైటెడ్ కప్ టెన్నిస్ మిక్స్‌డ్ టీమ్ టోర్నమెంట్‌లో తొలిసారి విజేతగా అవతరించింది. స్విట్జర్లాండ్ జట్టుతో జరిగిన ఫైనల్లో పోలాండ్ 2–1తో గెలుపొందింది. తొలి మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో బెలిండా బెన్‌చిచ్ 3–6, 6–0, 6–3తో ఇగా స్వియాటెక్‌ను ఓడించి స్విట్జర్లాండ్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత రెండో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో హుబెర్ట్ హుర్కాజ్ 6–3, 3–6, 6–3తో స్టానిస్లాస్ వావ్రింకాపై విజయం సాధించి స్కోరును 1–1తో సమం చేశాడు. మూడో మ్యాచ్‌గా జరిగిన నిర్ణాయక మిక్స్‌డ్ డబుల్స్‌లో కాటరీనా కావా–జాన్ జిలెన్స్కీ ద్వయం 6–4, 6–3తో బెలిండా బెన్‌చిచ్–జాకబ్ పాల్ జంటను ఓడించి పోలాండ్‌కు 2–1తో టైటిల్‌ను అందించింది. మొత్తం 18 దేశాలు ఈ టోర్నీలో పాల్గొన్నాయి. 18 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో మూడు జట్లకు చోటు కల్పించారు. లీగ్ దశ తర్వాత ఆరు గ్రూప్ విజేత జట్లతోపాటు రెండో స్థానంలో నిలిచిన రెండు ఉత్తమ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో పోలాండ్ 2–1తో ఆస్ట్రేలియాపై, అమెరికా 2–1తో గ్రీస్‌పై, స్విట్జర్లాండ్ 2–1తో అర్జెంటీనాపై, బెల్జియం 2–1తో చెక్ రిపబ్లిక్‌పై గెలుపొందాయి. సెమీఫైనల్స్‌లో పోలాండ్ 2–1తో అమెరికాపై, స్విట్జర్లాండ్ 2–1తో బెల్జియంపై విజయం సాధించాయి. 2023 నుంచి యునైటెడ్ కప్‌ను నిర్వహిస్తున్నారు. 2023లో, 2025లో అమెరికా జట్టు... 2024లో జర్మనీ జట్టు విజేతగా నిలిచాయి. పోలాండ్ జట్టు 2024 ఫైనల్లో 1–2తో జర్మనీ చేతిలో, 2025 ఫైనల్లో 0–2తో అమెరికా చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. మూడోసారి మాత్రం టైటిల్‌ను సొంతం చేసుకుంది.

కశ్మీర్‌లోని సోనామార్గ్‌లో ఉష్ణోగ్రతలు మైనస్‌కు పడిపోవడంతో గడ్డకట్టిన జలపాతం

భోగాలి బిహు పండుగ సందర్భంగా అస్సాంలోని సోనిత్‌పూర్‌లో గెరెకి సరస్సులో సంప్రదాయ చేపల వేటలో పాల్గొన్న స్థానికులు

ఢిల్లీకి చెందిన ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా సోమవారం బ్లింకిట్ డెలివరీ ఏజెంట్‌గా మారిపోయారు

అందాల కశ్మీరంలో కానరాని మంచు!

ఈ సీజన్‌లో హిమపాతం అత్యంత స్వల్పం
- ఆ ప్రాంతంలో తాగు, సాగునీటికి కటకటలే
- ఈ సీజన్‌లో పర్యాటకానికి ఇప్పటికే దెబ్బ
- పర్యావరణ మార్పుల తాలూకు దుష్ప్రభావం
- పెను ప్రమాద సంకేతాలేనని పర్యావరణవేత్తల హెచ్చరిక

కశ్మీర్. ఈ మాట వినగానే మొదట గుర్తొచ్చేవి మంచు దుప్పటి కప్పుకున్న అందాల హిమ శిఖరాలే. కానీ కొన్నేళ్లుగా ఈ దృశ్యం చెదిరిపోతోంది. కశ్మీర్‌కు మంచు ముఖం చాటేస్తోంది. ఈ ఏడాదైతే చలికాలం రెండొంతులకు పైగా గడిచిపోయినా ఈ భూతల స్వర్గంలో హిమపాతం అత్యంత తక్కువగానే నమోదైంది. ఈ పరిణామం పర్యావరణవేత్తలను ఎంతగానో ఆందోళన పరుస్తోంది. వాతావరణ మార్పుల తాలూకు తీవ్ర విపరిణామాలకు ఇది మరో సూచిక పర్యావరణవేత్త అంటున్నారు. తక్షణం మేలుకోకుంటే పెను ముప్పు తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

ఆర్థిక సంక్షోభమే..

కశ్మీర్ లోయలో ఈ సీజన్‌లో హిమపాతం సాధారణం కంటే కూడా అతి తక్కువగా నమోదైంది. ఏటా ఈసారికల్లా మంచు దుప్పటి కప్పుకుని శ్వేతవర్ణం సంతరించుకునే చాలా ప్రాంతాలు ఈ ఏడాది మాత్రం మంచు జాడే లేక వెలవెలబోతున్నాయి. దాంతో అందాల కశ్మీరం చాలావరకు బోసిపోయి కన్పిస్తోంది. ఇది పర్యావరణపరంగా పెను ప్రమాద సంకేతం మాత్రమే కాదు, ఆర్థికంగా, సాగుపరంగా, పర్యాటకపరంగా ఈ ప్రాంతాన్ని తీవ్రంగా కుంగదీస్తోంది. మైదానాలు, మరీ అంత ఎత్తులో లేని ప్రాంతాల్లో మంచు లేకపోవడంతో అక్కడి రైతులు, వ్యాపారులు, గైడ్లు తదితరులు లబోదిబోమంటున్నారు. ''పశ్చిమ హిమాలయాల్లో క్రమంగా నెలకొంటున్న తీవ్ర పర్యావరణ అసమతుల్యతకు ఈ పరిణామం అద్దం పడుతోంది. ముమ్ముందు కశ్మీర్ ప్రాంతం తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కోక తప్పదని చెప్పకనే చెబుతోంది''అని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్ విశ్లేషించారు. కశ్మీర్, జమ్మూ ఆర్థిక స్థితిగతులపై కొంతకాలంగా ఆయన లోతైన అధ్యయనం చేస్తున్నారు.

అన్నింటికీ మంచే కీలకం..

కశ్మీర్ లోయలో కురిసే మంచు కేవలం అందాలకు ప్రతీక మాత్రమే కాదు. దానికి ఇతరత్రా కీలక ప్రయోజనాలెన్నో ఉన్నాయి. ఈ భారీ మంచు దుప్పట్లు శీతాకాలం అనంతరం సహజ నీటి వనరుగా రూపొందుతాయి. చలికాలంలో గడ్డకట్టి ఉండి, అనంతరం వేసవి వస్తున్న కొద్దీ దిగువ ప్రాంతాలకు క్రమం తప్పకుండా నీటిని విడుదల చేస్తూ కీలక జల వనరులుగా మారతాయి. జీలం వంటి కీలక నదులకు కూడా ఈ నీరు ప్రాణదాయినిగా మారుతుంది. పలు పట్టణాలు, గ్రామాలకు నీరందించే సెలయేళ్లకు ఈ జలమే ఆధారం. కశ్మీర్ లోయలోని వ్యవసాయమంతా ఇలా వేసవిలో కరిగే నీటిపైనే ఆధారపడి నడుస్తుంటుంది. ''ఇప్పుడిలా మంచు ఈ స్థాయిలో తగ్గిపోవడమంటే సాగు నుంచి తాగు నీటి దాకా ఇక్కట్లు తప్పవని అర్థం. నాణ్యతకు దేశమంతటా పెట్టింది పేరైన కశ్మీర్ యాపిల్స్ వంటి వాటి దిగుబడి భారీగా తగ్గిపోవడం ఖాయం. రైతులు విధిలేక భూగర్భ జలాలపై ఆధారపడాల్సి వస్తుంది. కొన్నేళ్లకు దాని లభ్యతా అనుమానంగానే మారుతుంది''అని ప్రకాశ్ హెచ్చరించారు.

వేగంగా వేడెక్కుతున్నాయ్!

ఉత్తర భారతదేశంలో పర్వత ప్రాంతాలు, ముఖ్యంగా హిమాలయాలు ఇతర మైదాన ప్రాంతాలతో పోలిస్తే ఎక్కువగా వేడెక్కుతున్నాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ''ఇది ప్రపంచ సగటు కన్నా కూడా చాలా ఎక్కువగా ఉంది. పైగా ప్రమాదకర ఈ ధోరణి ఏటా వేగం పుంజుకుంటోంది''అని వారు ఆందళన వ్యక్తం చేస్తున్నారు. దేశాలన్నీ మేల్కొని ఈ వినాశకర పర్యావరణ మార్పులకు అడ్డుకట్ట వేసే చర్యలకు తక్షణం పూనుకోని పక్షంలో మిగిలేది వినాశనమేనని వారు హెచ్చరిస్తున్నారు!

ఉష్ణోగ్రతలు సున్నాకు పడిపోయినా...

శీతాకాలం వచ్చిందంటే కశ్మీర్‌లో ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీ సెల్సియస్ కంటే కూడా దిగువకు పడిపోవడం పరిపాటి. ఈసారి కూడా అదే జరిగింది. కానీ జరగనిదల్లా హిమపాతం మాత్రమే. గుల్‌మార్గ్, సోన్‌మార్గ్, పీర్‌పంజల్ శ్రేణి వంటి అత్యున్నత కొండ ప్రాంతాలకే ఈసారి హిమపాతం పరిమితమైంది. మిగతా కశ్మీరమంతా మంచు జాడ లేక వెలవెలబోతున్నాయి. మంచు ఇలా ఈ ప్రాంతానికి ముఖం చాటేయడానికి గ్లోబల్ వార్మింగ్ ప్రధాన కారణమని పర్యావరణవేత్త అనిల్ జోషి స్పష్టం చేస్తున్నారు.

పడకేసిన పర్యాటకం..

శీతాకాలపు మంచు, అనంతరం వేసవిలో సకాలంలో అది కరగడం.. ఈ రెండూ కశ్మీర్‌కు జీవనాడులు అని చెప్పాలి. సాగు మొదలుకుని పర్యాటకం దాకా అన్నీ వీటిపైనే ఆధారపడి సాగుతాయి. ఈసారి మంచు లేకపోవడం పర్యాటకంపై గట్టి ప్రభావమే చూపింది. ఏటా శీతాకాలం ఇక్కడ అతి పెద్ద పర్యాటక సీజన్. అలాంటిది ఈసారి కశ్మీర్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్యలో భారీ తగ్గుదల నమోదవుతోంది. ఏటా స్కీయింగ్ వంటివి జరిగే చోట్ల ఈసారి మంచు కంటికి కనిపించని పరిస్థితి నెలకొనడమే ఇందుకు కారణం. దాంతో తమ జీవనోపాధి దారుణంగా దెబ్బతింటోందని గైడ్ల సమాఖ్య మొదలుకుని హోటల్ వర్గాల దాకా వాపోతున్న పరిస్థితి!

- సాక్షి, నేషనల్ డెస్క్

సభలో 'ఇ-సిగరెట్' వాడకంపై చర్యలు తప్పవు : ఓం బిర్లా

న్యూఢిల్లీ: పార్లమెంటు గౌరవాన్ని కాపాడటంలో రాజీపడే ప్రసక్తేలేదని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. పార్లమెంటు హౌజ్‌లో ఇ–సిగరెట్ తాగిన వారికి కఠిన శిక్ష తప్పదని ఆయన సోమవారం స్పష్టం చేశారు. లోక్‌సభ సమావేశాలు జరుగుతున్న సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ బహిరంగంగా ఇ–సిగరెట్ తాగినట్లు బీజేపీ సభ్యుడు అనురాగ్ ఠాకూర్ ఇటీవల స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. దేశవ్యాప్తంగా ఇ–సిగరెట్లపై నిషేధం ఉండగా ఆయన చేతికి ఇలా వచ్చిందని ప్రశ్నించారు. దీనిపై పెద్ద దుమారమే రేగింది. అయితే ఈ విషయంపై విచారణ జరుగుతోందని, సంబంధిత కమిటీకి ఈ విషయాన్ని చేరవేసి, కమిటీ సిఫార్సుల మేరకు చర్యలు తీసుకుంటామని స్పీకర్ తెలిపారు.

న్యూయార్క్ నగరంలో నర్సుల సమ్మె

న్యూయార్క్: న్యూయార్క్ నగరంలోని మూడు ప్రధాన ఆస్పత్రుల్లో వేలాది మంది నర్సులు సోమవారం సమ్మెకు దిగారు. మౌంట్ సినాయ్, న్యూయార్క్–ప్రెస్బిటేరియన్, మోటెఫియోర్ వంటి ప్రధాన ఆస్పత్రుల్లో ఈ సెమ్మె జరుగుతోంది. దాదాపు 15,000 మంది నర్సులు సమ్మెలో పాల్గొంటున్నట్లు న్యూయార్క్ స్టేట్ నర్సెస్ అసోసియేషన్ తెలిపింది. సిబ్బంది పెంపు, పనిప్రాంతాల్లో భద్రతకోసం నర్సులు సమ్మె చేస్తున్నారు. ప్రస్తుతం తీవ్రమైన ఫ్లూ సీజన్‌లో ఈ సమ్మె జరుగుతుండటంతో ఆస్పత్రులు ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాయి. తాత్కాలిక నర్సులను నియమించుకుంటున్నాయి. నియామకాలు కొనసాగుతున్నాయని, రోగులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని మోంటెఫియోర్ ఒక ప్రకటనలో తెలిపింది.

పోలీస్ స్టేషన్‌లోనే భార్యను కాల్చి చంపాడు

హర్దోయి: భార్య ప్రియుడితో వెళ్లిపోయిందని ఫిర్యాదు చేసిన ఓ వ్యక్తి..పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఆమెను తుపాకీ కాల్చి చంపాడు. ఈ ఘటన యూపీలోని హర్దోయిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌పూర్ అతారియా వాసి అనూప్. ఇతడి భార్య సోనీ(35) వారం క్రితం ప్రియుడితో వెళ్లిపోయింది. నగలతోపాటు రూ.35 వేల నగదును ఆమె పట్టుకెళ్లిందంటూ అనూప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో, పోలీసులు సోనీని ఆదివారం పట్టుకొచ్చి, స్టేషన్‌లో ఉంచారు. సోమవారం అనూప్‌ను పిలిపించారు. సోనీని కోర్టులో హాజరు పర్చే రాత పనులు జరుగుతున్నాయి. పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉన్న క్యాంటిన్‌లోకి సోనీని ఓ మహిళా కానిస్టేబుల్ తీసుకెళ్తుండగా, అనూప్ అడ్డుకున్నాడు. వెంటతెచ్చుకున్న తుపాకీతో సోనీపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన సోనీ అక్కడికక్కడే చనిపోయింది. తప్పించుకునేందుకు ప్రయత్నించిన అనూప్‌ను పోలీసులు పట్టుకుని, తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

కంప్యూటర్ ఆధారిత విధానమే నోటీసులకు కారణం

నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్‌కు ఈసీ వివరణ

పనాజీ: ఎస్ఐఆర్‌లో భాగంగా నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్‌కు జారీ చేసిన నోటీసుపై భారత ఎన్నికల సంఘం సోమవారం వివరణ ఇచ్చింది. ఆ నోటీసుకు వ్యవస్థ ఆధారిత విధానమే కారణమని తెలిపింది. ఆయన గతంలో నమోదు చేసిన ఫామ్‌లో వివరాలు సంపూర్ణంగా లేకపోవడమే ఈ నోటీసుకు కారణమయ్యిందని వెల్లడించింది. పాత గణన ఫామ్‌లో తప్పనిసరి వివరాలైన ఓటరు పేరు, ఎపిక్ నెంబర్, బంధువుపేరు, అసెంబ్లీ నియోజకవర్గం పేరు, నంబర్ వంటివి లేవని ఎన్నికల అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఫామ్‌లో అన్ని వివరాలున్నాయని, ఇప్పుడు ఆయన హాజరు కావాల్సిన అవసరం లేదని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్ మెడోరా ఎర్మోమిల్లా డికోస్టా స్పష్టం చేశారు.

మాజీ అడ్మిరల్ ప్రకాశ్‌కు ఎస్ఐఆర్ నోటీసులు ఇచ్చింది. ఎస్ఐఆర్‌లో అన్ని ఫీల్డులు ఖాళీగా ఉండటంతో అన్‌మ్యాప్‌డ్ కేటగిరీగా పేర్కొంటూ.. ఆయన ఓటరు వివరాలు ధృవీకరించడానికి, తన గుర్తింపును నిర్ధారించడానికి ఎన్నికల అధికారి ముందు హాజరు కావాలని పేర్కొంది. దీనిపై ఎక్స్ వేదికగా ప్రకాశ్ స్పందించారు. '20 ఏళ్ల కిందట నేను పదవీవిరమణ చేసిన నాటినుంచి ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కోరలేదు. గోవా ఎలక్టోరల్ రోల్–2026లో నా భార్య పేరు, నా పేరు చూసి ఆశ్చర్యం వేసింది. ఎన్నికల అధికారుల ముందు హాజరుకావడానికి అభ్యంతరం లేదు. కానీ.. నేనుండే చోటు నుంచి 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి వేర్వేరు తేదీల్లో హాజరు కావాలని కోరారు. కొత్త ఫామ్‌కు, పాత ఫామ్‌కు ఆటోమేటిక్ లింకేజ్ లేకపోతే ఎస్ఐఆర్ విధానాన్ని సవరించాలి. బీఎల్‌ఓ మా ఇంటికి మూడుసార్లు వచ్చారు. ఏవైనా డాక్యుమెంట్స్ లేకపోతే ఆయనైనా అడగాలి.'అని వృద్ధులకు ఉన్న లాజిస్టికల్ అడ్డంకులను ఆయన ఎత్తిచూపారు. ఇది సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. వీర చక్ర అవార్డు గ్రహీత, 1971 భారత్–పాకిస్తాన్ యుద్ధంలో కీలక పాత్ర పోషించిన, నావికాదళానికి అధిపతిగా పని చేసిన అధికారి తన గుర్తింపును నిరూపించుకోవాల్సి రావడం ఏంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భారత సంతతి సైంటిస్టుకు ప్రతిష్టాత్మక ఆర్ఏఎస్ పురస్కారం

వాషింగ్టన్/లండన్: భారత సంతతికి చెందిన ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త శ్రీనివాసన్ కులకర్ణికి బ్రిటన్‌కు చెందిన అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ స్వర్ణ పతకం దక్కింది. అమెరికావాసి అయిన కులకర్ణి అంతరిక్ష రంగంలో కాల విభాగంలో జరిపిన మైలురాళ్ల వంటి పరిశోధనలకు ఈ పురస్కారాన్ని గెలుచుకున్నారు. పలు ఆస్ట్రో ఫిజికల్ పరిశోధనల్లో ఆయన స్టీఫెన్ హాకింగ్, జోస్లిన్ బెల్ బర్నెవెల్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ల సరసన నిలువదగ్గ స్థాయిలో కృషిచేశారు. కులకర్ణి 1985 నుంచి కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. మరుగుజ్జు తారలు, సుదూరాల్లోని గామా కిరణ విస్ఫోటనాలు వంటివాటి గుట్టుమట్లు విప్పడంలో ఆయన ఎనలేని కృషి చేశారు. బర్కిలీ వర్సిటీలో పరిశోధక విద్యార్థిగా ఉండగానే మిల్లీసెకన్ పల్సర్‌పై చేసిన పరిశోధనలతో ఆ రంగంలోని ఉద్దండుల దృష్టిలో పడ్డారు. కులకర్ణి 1997లో చేసిన పరిశోధన గామా కిరణ విస్ఫోటాలు తారా సమూహాలకు ఆవల కూడా సంభవిస్తాయని రుజువు చేసింది. ఇది ఆస్ట్రోఫిజిక్స్ తీరుతెన్నులనే కొత్త మలుపు తిప్పింది. పాలోమర్ ట్రాన్సియెంట్ ఫ్యాక్టరీ (పీటీఎఫ్), జ్వికీ ట్రాన్సియెంట్ ఫెసిలిటీ (జీటీఎఫ్) వంటి కీలక సూత్రాల ఆవిష్కరణలో ఆయనది కీలక పాత్ర.

ఆశ్చర్యం, ఆనందం: కులకర్ణి

ఆర్ఏఎస్ పురస్కారం పట్ల కులకర్ణి హర్షం వెలిబుచ్చారు. గతంలో దాన్ని అందుకున్న హేమాహేమీల సరసన తన పేరు చేరడం ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ ఉందన్నారు. కులకర్ణి 1978లో ఐఐటీ ఢిల్లీలో మాస్టర్స్ చేశారు. అనంతరం 1983లో బర్కిలీ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం నాసా 2030లో ప్రయోగించబోతున్న యూవీఈఎక్స్ అల్ట్రావయోలెట్ స్కై సర్వే మిషన్‌తో పాటు కెక్ అబ్జర్వేటరీ తాలూకు జెడ్‌షూటర్ స్పెక్ట్రోమీటర్ మిషన్‌లోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీకి 200 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఆస్ట్రానమీ మొదలుకుని జియోఫిజిక్స్ దాకా పలు రంగాల్లో అద్భుతమైన కృషి చేసిన శాస్త్రవేత్తలకు ఆర్ఏఎస్ ప్రదానం చేసే గోల్డ్‌మెడల్‌ను వారి సేవలకు అత్యంత విలువైన గుర్తింపుగా భావిస్తుంటారు.

25 ఏళ్లు జైల్లో ఉన్నట్లు ఎలా చెప్పగలిగారు?

గ్యాంగ్‌స్టర్ అబూసలేంను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: జైలులో 25 ఏళ్లు గడిపినందున విడుదల చేయాలంటూ గ్యాంగ్‌స్టర్ అబూసలేం పెట్టుకున్న అర్జీపై సుప్రీంకోర్టు సూటి ప్రశ్నను సంధించింది. వాదనను రుజువు చేసుకున్న పక్షంలో, జైలు నుంచి విముక్తి కల్పిస్తామని అతడికి స్పష్టం చేసింది. 1993 ముంబై పేలుళ్ల కేసులో దోషిగా ఉన్న అబూ సలేం పోర్చుగల్‌కు పారిపోయాడు. సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం భారత ప్రభుత్వం అతడిని 2005 నవంబర్ 11వ తేదీన తిరిగి తీసుకువచ్చింది. అప్పట్లో పోర్చుగల్ కోర్టు అతడి అప్పగింతకు కొన్ని షరతులను విధించింది. అందులో, అబూ సలేంకు మరణశిక్ష విధించరాదు, జైలు శిక్ష 25 ఏళ్లకు మించరాదనేవి కీలకంగా ఉన్నాయి. తన 25 ఏళ్ల జైలు శిక్ష పూర్తయిందని, విడుదల చేయాలంటూ అతడు వేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ చేపట్టింది. 2005 నుంచి జైలులో ఉంటున్నప్పుడు 2026 నాటికి 25 ఏళ్లవుతాయని ఎలా లెక్కగట్టారు? అని ప్రశ్నించింది. పోర్చుగల్‌లో జైలులో ఉన్న రెండేళ్ల కాలాన్ని, సత్ప్రవర్తనకు గాను శిక్ష తగ్గింపులను కలుపుకుంటే 25 ఏళ్లు అవుతాయని సలీం అంటున్నాడని అతడి లాయర్ చెప్పారు. అయితే, టాడా కింద అరెస్టయిన సలేంకు మహారాష్ట్ర చట్టాల ప్రకారం శిక్షాకాలంలో ఎటువంటి తగ్గింపు ఉండదని ధర్మాసనం పేర్కొనగా.. నిబంధనల కాపీని చూపిస్తామని సలేం న్యాయవాది తెలిపారు. సంబంధిత జైలు నిబంధనలతో రెండు వారాల్లోగా పిటిషన్ వేయాలని ఆదేశించిన ధర్మాసనం, తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ముంబైకి చెందిన బిల్డర్ ప్రదీప్ జైన్ హత్య కేసులో ప్రత్యేక టాడా కోర్టు సలేంకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ 2015లో తీర్పు ఇవ్వడం గమనార్హం.

ఏడాదిలో రూ.1,250 కోట్లు

ఢిల్లీలో దోచుకున్న సైబర్ నేరగాళ్లు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఏడాది కాలంలో సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.1,250 కోట్ల డబ్బును అమాయకుల నుంచి దోచుకున్నారు. తాజాగా, ఢిల్లీకి చెందిన వృద్ధ దంపతులను సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి ఏకంగా రూ.15 కోట్ల వరకు దోచుకోవడం తెల్సిందే. చైనా హ్యాండ్లర్ ఆదేశాల మేరకు కాంబోడియా, వియత్నాం, లావోస్‌లు కేంద్రంగా పనిచేస్తున్న నేరగాళ్లు 2024లో ఢిల్లీ వాసుల నుంచి రూ1,100 కోట్ల మేర కొల్లగొట్టారు. 2025కు వచ్చే సరికి ఈ మొత్తం రూ.1,200 కోట్లకు పెరిగిందని ఓ అధికారి తెలిపారు. అయితే, 2024లో రికవరీ 10 శాతం మాత్రమే ఉండగా, 2025కు వచ్చే సరికి ఇది 24 శాతానికి పెరగడం కాస్తంత ఊరట కల్గించే విషయమన్నారు. మోసం విషయం తెల్సిన వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని ఆయన కోరారు.

ప్రస్తుతానికి అమెరికాతో చర్చల్లేవ్..

ట్రంప్ హెచ్చరికలపై క్యూబా అధ్యక్షుడి స్పందన

హవానా: అమెరికా ప్రభుత్వంతో ప్రస్తుతానికి తాము చర్చలు జరపడం లేదని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డాజ్–కనెల్ స్పష్టం చేశారు. వెనెజులా రాజధానిపై అమెరికా బలగాలు దాడి జరిపి అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను బంధించి తీసుకెళ్లడం తెల్సిందే. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియాలో 'క్యూబా...మరింత ఆలస్యం కాకమునుపే మాతో ఒప్పందానికి రావాలి'అని వ్యాఖ్యానించడం తెల్సిందే. వెనెజులా నుంచి చమురు అందకుండా ఆ దేశం ఎంతో కాలం మనుగడ సాగించలేదని కూడా పేర్కొన్నారు. దీనిపై క్యూబా అధ్యక్షుడు ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలను ఆ దేశ విదేశాంగ మంత్రి రిపోస్ట్ చేశారు. 'అమెరికా, క్యూబా మధ్య సంబంధాలు మెరుగుపడాలంటే, అవి బెదిరింపులు, ఆర్థికపరమైన సంఘర్షణల ద్వారా కాకుండా అంతర్జాతీయ చట్టాల మీద ఆధారపడి ఉండాలి'అని అధ్యక్షుడు కనెల్ పేర్కొన్నారు.

ఏఐ ఆధారిత డిజిటైజేషన్.. ఓటర్లకు తీవ్ర ఇబ్బందులు

సర్‌పై ఈసీకి సీఎం మమత లేఖ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియపై సీఎం మమతా బెనర్జీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు మరోమారు లేఖ రాశారు. 2002 నాటి ఓటరు జాబితా ఏఐ ఆధారిత డిజిటైజేషన్ కారణంగా దొర్లిన తప్పులు నిజమైన ఓటర్లను తీవ్రంగా ఇబ్బందిపెడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఓటరు జాబితాలోని పేర్లతో ఎస్ఐఆర్ సందర్భంగా పేర్లు సరిపోలడం లేదని, అనేక తప్పులు కన్పిస్తున్నాయని ఆ లేఖలో తెలిపారు. ఓటర్లు తమ గుర్తింపును ధ్రువీకరించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా కొనసాగుతున్న సర్ కారణంగా ఇప్పటి వరకు 77 మరణాలు, 4 ఆత్మహత్యాయత్నాలు, 17 మంది ఆస్పత్రి పాలైనట్లు రికార్డయిందని చెప్పారు. రెండు దశాబ్దాలుగా అనుసరిస్తూ వస్తున్న నిబంధనలను ఈసీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మమత ఆ లేఖలో తెలిపారు. ఈ అంశాలను ఈసీ పరిగణనలోకి తీసుకుని, సరైన రీతిలో చర్యలు తీసుకోవాలని కోరారు. సర్ జరుగుతున్న తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సీఈసీకి సీఎం మమత పలుమార్లు లేఖలు రాయడం తెల్సిందే.

'బొగ్గు కుంభకోణం'పై ప్రత్యేక జడ్జి నియామకం

న్యూఢిల్లీ: సీబీఐ విచారణ చేపట్టిన బొగ్గు కుంభకోణం కేసుల కోసం ఢిల్లీ హైకోర్టుకు చెందిన సున్నైనా శర్మను సుప్రీంకోర్టు నియమించింది. ఈ కేసుల కోసం స్పెషల్ సీబీఐ జడ్జి సంజయ్ బన్సాల్‌ను ఆరు నెలల కాలానికి గాను అత్యున్నత న్యాయస్థానం 2025 ఏప్రిల్ 8వ తేదీన నియమించిందని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్ఎస్ చీమా సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. కాల పరిమితి ముగిసినందున, తనను ఈ బాధ్యతల నుంచి తప్పించాలని జస్టిస్ బన్సాల్ కోరుతున్నారన్నారు. అయితే, జస్టిస్ బన్సాల్ స్థానంలో మరొకరిని నియమించేందుకు ముగ్గురి పేర్లను ఢిల్లీ హైకోర్టు పంపించిందని ధర్మాసనం తెలిపింది. వీటిలో జస్టిస్ సున్నైనాకు బొగ్గు కుంభకోణం కేసుల విచారణ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈమెతోపాటు జస్టిస్ ధీరజ్ మోర్ ఈ కేసుల విచారణ చేపట్టనున్నారు. బొగ్గు కుంభకోణంపై ఏర్పాటైన రెండు ప్రత్యేక కోర్టులు గతేడాది జూన్ నాటికి 27 కేసులను పరిష్కరించగా మరో 29 అవినీతి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. భారీ అవినీతి ఆరోపణల నేపథ్యంలో 1993–2010 సంవత్సరాల మధ్య కేటాయించిన 214 బొగ్గు బ్లాకులను సుప్రీం కోర్టు 2014లో రద్దు చేసింది.

'మహా ఎన్నికల' పూర్తికి గడువు పెంపు

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు సుప్రీంకోర్టు సోమవారం మరో రెండు వారాలకు పెంచింది. వాస్తవానికి జనవరి 31వ తేదీలోగా ఎన్నికలను నిర్వహించాల్సి ఉంది. అయితే, కొన్ని జిల్లా పరిషత్‌లు, పంచాయతీలకు ఎన్నికలు జరపాల్సి ఉన్నందున గడువు మరో 10 రోజులు పెంచాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది బల్బీర్ సింగ్ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం రెండు వారాలు గడువిస్తున్నట్లు తెలిపింది. అదేసమయంలో, స్థానికంలో రిజర్వేషన్ 50 శాతానికి మించిపోయిందంటూ వేసిన పిటిషన్‌పై స్పందించిన ధర్మాసనం.. ఈ విషయంలో ఎన్నికల కమిషన్‌దే పూర్తి బాధ్యతని స్పష్టం చేసింది. అయితే, ఇందుకు సంబంధించిన పిటిషన్లపై విచారణ చేపట్టేందుకు అంగీకరించింది. ఈ విషయంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వేరే పిటిషన్లను స్వీకరించబోమని తెలిపింది. 2026 జనవరి 31వ తేదీలోగా ఎట్టిపరిస్థితుల్లోనూ స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలంటూ సుప్రీంకోర్టు గతేడాది సెప్టెంబర్ 16న ఈసీకి గడువు విధించడం తెల్సిందే.

జడ్జి అసభ్య ప్రవర్తనను తప్పుబట్టిన సుప్రీం

న్యూఢిల్లీ: రైలు బోగీలో అసభ్యంగా ప్రవర్తించిన సివిల్ జడ్జిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీనిపై సమాధానం ఇవ్వాల్సిందిగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయాధికారితోపాటు మధ్యప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్‌కి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటన దిగ్భ్రాంతి కలిగిస్తోందని, అసహ్యంగా ప్రవర్తించిన ఆ న్యాయాధికారిని డిస్మిస్ చేయాల్సిందేనని సోమవారం విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. మధ్యప్రదేశ్‌లో 2011లో నియమితులైన కాటేస్–2 సివిల్ జడ్జి ఒకరు 2018లో రైలులో ప్రయాణిస్తూ మద్యం మత్తులో తన బోగీలో ఉన్న ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించారు. తోటి ప్రయాణికురాలిని బెదిరించి ఎదురుగా మూత్ర విసర్జన చేశారు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. టీటీ, ప్రయాణికులు చైన్‌లాగి రైలును ఆపేశారు. ఆయన కారణంగా రైలు ఆలస్యమైంది. ఆ జడ్జిని అరెస్ట్ చేసిన రైల్వే పోలీసులు, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. విచారణ జరిపిన జబల్‌పూర్‌లోని స్పెషల్ రైల్వే మేజిస్ట్రేట్ ఆ జడ్జిపై కేసు కొట్టేశారు. విచారణాధికారి ఆరోపణలు నిజమని తేల్చడంతో హైకోర్టు ఫుల్ బెంచ్ ఆ జడ్జిని విధుల నుంచి తొలగించింది. అనంతరం జడ్జి పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. ఫుల్ బెంచ్ తీర్పుపై స్టే విధించింది. ఆ జడ్జిని 15 రోజుల్లోగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఈ తీర్పును హైకోర్టు పరిపాలనా విభాగం సుప్రీంలో సవాల్ చేసింది. విచారణ చేపట్టిన ధర్మాసనం నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని, సంబంధిత న్యాయాధికారితోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

సర్‌లో అవకతవకలపై సమాధానమివ్వండి

టీఎంసీ తాజా ఆరోపణలపై ఈసీకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ఏకపక్షంగా, అవకతవకలమయంగా మారిందంటూ టీఎంసీకి చెందిన ఎంపీలు సుప్రీంలో పిటిషన్ వేశారు. సర్ విషయంలో రాష్ట్ర ఈసీ తీసుకుంటున్న చర్యలను ఎంపీలు డెరెక్ ఒబ్రియాన్, దోలా సేనలు సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలోని బూత్ లెవెల్ అధికారు(బీఎల్‌వో)లకు ఈసీ అధికారిక ఆదేశాలు ఇవ్వడం లేదని, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ఆదేశాలను జారీ చేస్తోందన్నారు. స్పందించిన ధర్మాసనం ఈ వారం రోజుల్లోగా సమాధానమివ్వాలని ఈసీ తరఫున హాజరైన న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది.

సింగపూర్‌లో భారత హైకమిషన్ పొంగల్ వేడుకలు

సింగపూర్: భారతీయ వలస కార్మికుల కోసం సింగపూర్‌లోని భారత హైకమిషన్ పొంగల్ వేడుకలు నిర్వహించింది. పారిశ్రామిక జిల్లా సెంబావాంగ్‌లో జరిగిన ఈ వేడుకల్లో దాదాపు 1,500 మంది భారతీయ వలస కార్మికులు పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఉత్సవంలో లైవ్ మ్యూజిక్, సాంప్రదాయ ప్రదర్శనలు, యోగా, ధ్యానం సెషన్లు నిర్వహించారు. 50 మందికి పైగా స్థానిక కళాకారులు, వలస కార్మికులతో కలిసి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. భారత హై కమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులే కార్మికులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాన్సులర్ అవుట్‌రీచ్ కార్యకలాపాలు, ముఖ్యంగా పాస్‌పోర్ట్ పునరుద్ధరణ శిబిరాల గురించి వివరించారు.

ఇండిగో విమానాన్ని ఢీకొన్న పక్షి

వారణాసిలో అత్యవసర ల్యాండింగ్, ప్రయాణికులు సురక్షితం

వారణాసి: గోరఖ్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. 216 మంది ప్రయాణికులతో ఆదివారం సాయంత్రం 6.25 నిమిషాలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన 15 నిమిషాలకే జౌన్‌పూర్ సమీపంలో 16వేల అడుగుల ఎత్తులో విమానం ప్రయాణిస్తుండగా ఒక పక్షి దానిని ఢీకొట్టింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా, పైలట్ వెంటనే వారణాసి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించారు. దారి మళ్లించి సాయంత్రం 7 గంటలకు లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా విమానం దింపారు. అనంతరం విమానంలోని 216 మంది ప్రయాణికులను సురక్షితంగా దించి.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పక్షి ఢీకొనడంతో 6ఈ–437 విమానం ముందు భాగం దెబ్బతిన్నది.

ఎయిమ్స్‌లో చేరిన మాజీ ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎయిమ్స్‌లో చేరారు. ఆయన జనవరి 10న రెండుసార్లు స్పృహ కోల్పోవడంతో సోమవారం ఆస్పత్రిలో చేరినట్లు అధికారులు తెలిపారు. ధన్‌ఖడ్ జనవరి 10 తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో పడిపోయారు. దీంతో చెకప్‌కోసం ఆయన సోమవారం ఎయిమ్స్‌కు వెళ్లారు. అడ్మిట్ కావాలని డాక్టర్లు సూచించడంతో ఆస్పత్రిలో ఉండిపోవాల్సి వచ్చింది. ఎంఆర్ఐ చేశామని, నేడు మరికొన్ని పరీక్షలు చేస్తామని వైద్యాధికారులు వెల్లడించారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా ఉండగానే బహిరంగ కార్యక్రమాలకు హాజరైనపుడు పలుమార్లు స్పృహ కోల్పోయారు. గత సంవత్సరం గుండె సంబంధిత వ్యాధితో ఆయన ఎయిమ్స్‌లో చేరారు. ఆరోగ్య కారణాల రీత్యా ఆయన జూలై 21న ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఆయన ఆకస్మిక రాజీనామాపై అనేక ఊహాగానాలొచ్చాయి.

ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?

సామాజిక జీవనంలో వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన, నమ్మకం, గౌరవం లాంటి వాటిని ఉదాత్తమైన మానవీయ పరిపక్వతా లక్షణాలుగా పేర్కొంటారు. సమాజం ద్వారానే వ్యక్తి అన్ని లక్షణాలను, స్వభావాలను అలవర్చుకుంటాడు. అదేవిధంగా సమాజం నుంచి అనేక ప్రయోజనాలు పొందుతాడు. దీనికి ప్రతిగా సమాజానికి సేవలను, సహాయాన్ని అందించాల్సిన కనీస బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రాథమిక విధులు

విధి అంటే ఒక వ్యక్తి ఇతరుల కోసం నిర్వర్తించాల్సిన పని లేదా బాధ్యత అని అర్థం. విధులు సమాజ వికాసానికి, దేశాభివృద్ధికి, సామాజిక స్పృహ కల్పించడానికి దోహదం చేస్తాయి. ఇవి దేశ ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి. ప్రాథమిక హక్కులనే ఫలాలు విధులుగా పరిపక్వం చెందినప్పుడే సమాజ జీవనం సాఫల్యం అవుతుంది.

విధులు – రకాలు: సాధారణంగా విధులను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

ఎ) నైతిక విధులు
బి) చట్టబద్ధమైన విధులు

నైతిక విధులు అనేవి ప్రజల నైతిక విలువలు, సామాజిక స్పృహపై ఆధారపడి ఉంటాయి. **ఉదా:** పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం; అభాగ్యులను, విధివంచితులను ఆదుకోవడం.

చట్టబద్ధమైన విధులు సమాజంతో ఆమోదం పొంది, ప్రభుత్వం గుర్తించిన బాధ్యతలు. వీటిని ఉల్లంఘిస్తే శిక్షార్హులవుతారు.

ఉదా: ట్రాఫిక్ నియమాలు పాటించడం, పన్నులు సక్రమంగా చెల్లించడం.

భారత రాజ్యాంగం – ప్రాథమిక విధులు

ప్రతి పౌరుడు దేశం పట్ల, తన తోటి పౌరుల పట్ల కొన్ని కనీస బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అందువల్ల వీటిని ప్రాథమిక విధులు అంటారు. వీటిని రష్యా రాజ్యాంగం నుంచి గ్రహించారు. మౌలిక రాజ్యాంగంలో ప్రాథమిక విధుల ప్రస్తావన లేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సర్దార్ స్వరణ్ సింగ్ కమిటీ సిఫారసుల మేరకు ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో పొందుపర్చారు. ప్రారంభంలో పది ప్రాథమిక విధులు ఉండేవి. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక విధిని రాజ్యాంగంలో చేర్చడంతో వీటి సంఖ్య పదకొండుకు పెరిగింది. ప్రాథమిక విధులు 1977 జనవరి 3 నుంచి అమల్లోకి వచ్చాయి. అందువల్ల ఈ రోజును ప్రాథమిక విధుల దినోత్సవంగా పరిగణిస్తారు.

ప్రాథమిక విధులు – లక్షణాలు:

ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. అవి..

- ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి నేరుగా అమల్లోకి రావు. వీటి అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక చట్టాలు చేయాలి.
- ప్రాథమిక విధులు కేవలం పౌరులకు మాత్రమే వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక విధులు నైతికపరమైన బాధ్యతలు, మరికొన్ని పౌర బాధ్యతలు.
- కొన్ని ప్రాథమిక విధులను భారత సనాతన సంప్రదాయాలు, మత విలువలు, పురాణాల ఆధారంగా తీసుకున్నారు.

ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలోని 4–ఎ భాగంలో నిబంధన 51–ఎలో పొందుపర్చారు.

51–ఎ:

ఎ) రాజ్యాంగానికి కట్టుబడి ఉండి దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించాలి.
బి) జాతీయ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో ఉన్నత ఆదర్శాలను పాటించాలి.
సి) భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను, సమగ్రతను పరిరక్షించాలి.
డి) దేశ రక్షణకు, జాతీయ సేవకు సదా సన్నద్ధంగా ఉండాలి.
ఇ) భారత ప్రజల మధ్య మత, భాష ప్రాంతీయ, వర్గ వైవిధ్యాలకు అతీతంగా సోదర భావాన్ని, స్ఫూర్తిని పెంపొందించాలి. స్త్రీల గౌరవాన్ని భంగపరిచేవాటిని త్యజించాలి.
ఎఫ్) భారత మిశ్రమ సంస్కృతి, ఔన్నత్యం, సంప్రదాయాలను గౌరవించి, పరిరక్షించాలి.
జి) అడవులు, సరస్సులు, నదులు, వన్య ప్రాణులు సహా ప్రకృతిలోని పరిసరాలను కాపాడాలి, అభివృద్ధి చేయాలి, జీవులపట్ల కారుణ్యాన్ని కలిగి ఉండాలి.
హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలి.
ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించాలి, హింసను ప్రేరేపించే చర్యల్లో పాల్గొనకూడదు.
జె) వ్యక్తిగత, సమష్టి చర్యల ద్వారా ప్రతి కార్యరంగంలోనూ అత్యున్నత స్థానాన్ని పొందడానికి కృషి చేయాలి. తద్వారా దేశ అత్యున్నత అభ్యుదయానికి తోడ్పడాలి.
కె) 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు విద్యావకాశాలను కల్పించే బాధ్యతను తల్లి/ తండ్రి లేదా సంరక్షకుడు నిర్వర్తించాలి.

ప్రాథమిక విధులు – సుప్రీంకోర్టు తీర్పులు

శ్యాం నారాయణ్ చౌక్సీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా
ఈ కేసులో జాతీయ పతాకాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రచారం కోసం వినియోగించరాదని సుప్రీం కోర్టు పేర్కొంది.

బిజో మాన్యువల్ Vs కేరళ (1986)
ఈ కేసులో సుప్రీం కోర్టు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జాతీయ గీతాలాపన అనేది మత విశ్వాసాలకు విరుద్ధమైతే ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. జాతీయ గీతాన్ని ఆలపించినప్పుడు మాత్రం అందరూ గౌరవ సూచకంగా నిలబడాలని పేర్కొంది.

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ Vs స్టూడెంట్ యూనియన్ (2002)
ప్రాథమిక విధులను విస్మరించరాదని, అవి దేశ సమగ్రతకు, సామాజిక జీవనానికి ఆదర్శంగా ఉంటాయని ఈ కేసులో సుప్రీం కోర్టు పేర్కొంది.

డాక్టర్ దాశరథి Vs ఆంధ్రప్రదేశ్
ఈ కేసులో ఆస్థాన కవుల హోదా చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

గ్రామీణ వ్యాజ్యాల హక్కుల కేంద్రం Vs ఉత్తరప్రదేశ్ (1986)
పర్యావరణ పరిరక్షణలో ప్రాథమిక విధులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది.

నవీన్ జిందాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (2004) జాతీయ జెండాను ఎగురవేయడం భావ వ్యక్తీకరణ కిందకి వస్తుందని, పౌరులకు స్వేచ్ఛగా జెండా ఎగురవేసే హక్కు ఉంటుందని పేర్కొంది.

ప్రాథమిక విధులు – జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ సూచనలు

1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధులకు సంబంధించి కొన్ని సిఫారసులు చేసింది. అవి..

- జాతీయ పతాకం, జాతీయ గీతం, భారత రాజ్యాంగ పరిరక్షణకు, గౌరవానికి సంబంధించి 1971లో చేసిన చట్టం సరిపోతుందని పేర్కొంది. అదేవిధంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న చట్టాల ద్వారా కొన్ని విధులను అమలు చేయవచ్చని చెప్పింది. ఉదాహరణకు..
పౌర హక్కుల పరిరక్షణ చట్టం – 1955,
ప్రజాప్రాతినిధ్య చట్టం – 1951,
చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం–1967,
వన్యప్రాణి సంరక్షక చట్టం – 1972,
అడవుల పరిరక్షణ చట్టం – 1980,
- ఏటా జనవరి 3ను ప్రాథమిక విధుల దినోత్సవంగా పాటించాలి.
- అన్ని విద్యా ప్రణాళికల్లో ప్రాథమిక విధులను పాఠ్యాంశంగా చేర్చాలి.
- అన్ని విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలను తప్పక ప్రవేశ పెట్టాలి.
- ప్రసార మాధ్యమాల ద్వారా ప్రాథమిక విధుల గురించి విస్తృత ప్రచారం కల్పించాలి.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

ఆదేశిక సూత్రాల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధిపై ఆధారపడి ఉన్న విధంగానే ప్రాథమిక విధుల అమలు అనేది వ్యక్తుల చిత్తశుద్ధిపై ఆధారపడి ఉంటుంది – **దుర్గాదాస్ బసు**

ప్రాథమిక విధులు కేవలం అలంకార పూర్వకమైనవి – **జస్టిస్ కె.పి. ముఖర్జీ**

హక్కులు, విధులనేవి ఒకే నాణేనికి ఉన్న పార్శ్వాలు (Two sides of a same coin) – **హెచ్.జె. లాస్కే**

ప్రాథమిక విధులు అసంబద్ధంగా, గందరగోళంగా ఉన్నాయి – **నానీ పాల్కీవాలా**

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులెన్ని?
   1) 8   2) 9   3) 10   4) 11
2. ఏ కమిటీ సూచనల మేరకు ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చారు?
   1) రాజమన్నార్   2) సర్కారియా
   3) స్వరణ్ సింగ్ కమిటీ
   4) బల్వంత్ రాయ్ కమిటీ
3. ప్రాథమిక విధులకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   1) ప్రాథమిక హక్కులతోపాటే వీటిని ప్రవేశ పెట్టారు
   2) ఆదేశిక సూత్రాల స్థానంలో వీటిని ప్రవేశ పెట్టారు
   3) వీటిని ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు
   4) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో కలిపి ప్రవేశ పెట్టారు
4. కిందివాటిలో ప్రాథమిక విధులేవి?
   1) జాతీయ గీతాన్ని గౌరవించడం
   2) మన సుసంపన్న సంస్కృతి, వారసత్వాన్ని గౌరవించడం, పరిరక్షించడం
   3) వన్యప్రాణులను కాపాడటం
   4) పైవన్నీ
5. ప్రాథమిక విధులను రాజ్యాంగంలో గుర్తించిన మరో ప్రజాస్వామిక దేశం?
   1) అమెరికా   2) ఆస్ట్రేలియా
   3) కెనడా   4) జపాన్

సమాధానాలు:
1) 4   2) 3   3) 3   4) 4   5) 4

విమర్శనాత్మక పరిశీలన

ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చడంపై అనేక విమర్శలున్నాయి.

- దేశంలో భారత పౌరులు సహజంగా చట్ట విధేయులు, క్రమశిక్షణ ఉన్నవారు అయినప్పుడు వారి బాధ్యతలను ప్రత్యేకంగా గుర్తు చేయడం సమంజసం కాదని కొంతమంది అభిప్రాయం.
- అత్యంత ముఖ్యమైన విధులైన సక్రమంగా పన్నులు చెల్లించడం, కుటుంబ నియంత్రణ, ఎన్నికల్లో ఓటు వేయడం లాంటి వాటిని ప్రాథమిక విధుల్లో పొందుపరచలేదు.
- ఈ విధులు కేవలం నైతికపరమైన నియమావళిపైనే ఆధారపడి ఉన్నాయి. వీటిని పాటించకపోతే శిక్షించే ఆస్కారం లేదు.
- ప్రాథమిక విధుల్లో పేర్కొన్న కొన్ని పదాలకు స్పష్టత లేదు. **ఉదా:** శాస్త్రీయ దృక్పథం, మిశ్రమ సంస్కృతి, పరిశోధనా స్ఫూర్తి అనే పదాలకు నిర్దిష్ట అర్థాలు లేవు. వీటిని నాలుగో భాగంలో కాకుండా మూడో భాగంలోనే చేర్చి ఉండాల్సింది.
- సాధారణంగా ప్రాథమిక విధులు ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అంతర్భాగంగా ఉండవు. నియంతృత్వ దేశాల రాజ్యాంగంలో మాత్రమే ఇవి ఉంటాయి.
- ఇవి చట్ట నిర్దేశానికి, ఆత్మ ప్రబోధానికి మధ్య వైవిధ్యాన్ని కలిగించవచ్చు.

ప్రాథమిక విధుల ప్రయోజనాలు

- ప్రాథమిక విధులకు న్యాయసంరక్షణ లేకపోయినా, కొన్ని లోపాలున్నా.. వీటిని రాజ్యాంగంలో చేర్చడం సమంజసమే. ఎందుకంటే విధులు లేకుండా హక్కులను మాత్రమే గుర్తిస్తే అది బాధ్యతారాహిత్యానికి దారితీస్తుంది. అదే విధంగా హక్కులు లేని బాధ్యతలు బానిసత్వానికి ప్రతీక అవుతాయి. కాబట్టి హక్కులు, విధులు, పరస్పర పోషకాలు. అవి ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాల లాంటివి.
- ప్రాథమిక విధులు కూడా ఆదేశిక సూత్రాల్లా ప్రభుత్వ విధానాలు, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి.
- ఆచరణాత్మకమైనవి కాకపోయినా నిరంతరం పౌరుల నైతిక బాధ్యతలను గుర్తు చేస్తాయి.
- అనేక వైవిధ్యాలున్న భారతదేశంలో పౌరులు చిత్తశుద్ధితో విశాల దృక్పథంతో బాధ్యతాయుత పౌరులుగా దేశ ఐక్యతకు, సమగ్రతకు, కృషి చేసేలా దోహదపడతాయి.
- ప్రాథమిక విధులను, ప్రాథమిక హక్కులపై ఉన్న హేతుబద్ధమైన పరిమితులుగా పరిగణించవచ్చని 1992లో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?

కావ్య స్వరూపం - ప్రయోజనాలు - శైలి

కావ్య స్వరూపం

- 'కవిః కర్మమ్ కావ్యమ్' – కవి కలం నుంచి జాలువారిన అపూర్వ సృష్టి కావ్యం. కవి ఆత్మీయతలు కావ్యంలో ప్రతిఫలిస్తాయి. ప్రాచీనుల దృష్టిలో కవిత్వం అంటే కేవలం ఛందోబద్ధ రచనగా రూఢమైంది. పద్యం, గద్యం, పద్య గద్యాత్మక చంపూ కావ్యమైనా కావ్యమే.

కాంతా సమ్మితమైన కావ్యానికి భారతీయ ఆలంకారికులు, పాశ్చాత్య విమర్శకులు ఇచ్చిన నిర్వచనాల ద్వారా కావ్య స్వరూపాన్ని నిర్ధారించొచ్చు.

భారతీయ ఆలంకారికుల కావ్య నిర్వచనాలు

- **భరతుడు:** 'ఇతివృత్తంతు కావ్య శరీరమ్'.. నాట్యశాస్త్రంలో ఇతివృత్తమే కావ్య శరీరమని చెప్పారు.
- **దండి:** 'కావ్యాదర్శం'లో 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యమ్'.. మనోహరమైన అర్థంతో కూడిన పదాల సమూహమే కావ్యమన్నారు.
- **భామహుడు:** 'కావ్యాలంకారం'లో 'శబ్దార్థౌ సహితౌ కావ్యమ్'.. హితంతో కూడిన శబ్దార్థాల సమూహమే కావ్యమని చెప్పారు.
- **రుద్రటుడు:** శబ్దార్థాల సమాహారమే కావ్యమన్నారు.
- **భోజుడు:** సరస్వతీ కంఠాభరణంలో 'నిర్దోషం గుణవత్కావ్యమలంకృతై రలంకృతమ్ రసాన్వితం కవిః కుర్వన్ కీర్తిం ప్రీతించవిదంతి'.. దోషరహితంగా, గుణసహితంగా, అలంకార యుక్తంగా రసాన్వితమైన కావ్యాన్ని రచించిన కవి యశాన్ని, ఆహ్లాదాన్ని పొందగలడు.
- **మమ్మటుడు:** 'తదదోషౌశబ్దార్థౌ సగుణావనలంకృతే పునఃక్వాపికావ్యమ్'.. దోష రహితంగా, గుణ సహితంగా ఉన్న శబ్దార్థాలే కావ్యమని, ఒక్కొక్కసారి అలంకార రహితమైనా దాన్ని కావ్యంగా పరిగణించవచ్చని చెప్పారు.
- **హేమచంద్రుడు:** మమ్మటుడిలా మరింత స్పష్టంగా 'అదోషౌసగుణౌ సాలంకారౌచ శబ్దార్థౌ కావ్యమ్'.. దోష రహితమైన, గుణసహితమైన, సాలంకారమైన శబ్దార్థాలే కావ్యమని చెప్పారు.
- **విశ్వనాథుడు:** సాహిత్య దర్పణంలో మమ్మటుడు, హేమచంద్రుడు చెప్పిన నిర్వచనాలను ఖండించారు. ఆయన అభిప్రాయంలో రస సంబంధ దోషమే దోషమని, శాబ్దిక దోషాలున్నా కావ్యత్వ హాని జరగదని రస ప్రాధాన్యంలో 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నారు. రస ప్రాధాన్య దృష్టితో రసవత్తరమైన ఒక మహావాక్యమే కావ్యమన్నారు.
- **జగన్నాథ పండిత రాయలు:** విశ్వనాథుడి నిర్వచనంలో అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలున్నాయని జగన్నాథ పండిత రాయలు విమర్శించారు. రసం లేకున్నా లోకోత్తర చమత్కార జనకాలైన వ్యంగ్య రచనలు లోకంలో కావ్యాలుగా గొప్పగా విలసిల్లుతున్నాయన్నారు. ఆయన 'రమణీయార్థక ప్రతిపాదక శబ్దఃకావ్యమ్'.. రమణీయమైన అర్థాన్ని ప్రతిపాదించే శబ్దాల సమూహమే కావ్యమన్నారు.

రమణీయమైంది రసవత్తరం కాకపోదని, విశ్వనాథుడి రస ప్రాధాన్యం కూడా ఇందులో ఉన్నందువల్ల దీన్ని నిర్దుష్టమైన నిర్వచనంగా ఆలంకారికులు నిర్ధారించారు.

- వామనుడు 'రీతి'ని కావ్యాత్మగా నిర్వచించారు. ఆనంద వర్ధనుడు 'ధ్వని' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పీయూష వర్ధనుడు పండిత రాయల అభిప్రాయానికి అనుగుణంగా కావ్యాన్ని నిర్వచించారు. శౌద్ధోదని.. విశ్వనాథుడి రస సిద్ధాంతానికి అనుగుణంగా కావ్యాన్ని ప్రతిపాదించారు. కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని వ్యక్తీకరించారు. క్షేమేంద్రుడు ఔచిత్య సిద్ధాంతాన్ని నిర్వచించారు.
- భారతీయ ఆలంకారికుల అభిప్రాయాలను అనుసరించి దోష రహితమైన, గుణ సహితమైన, రసవత్తరమైన రమణీయ శబ్దార్థాల సముదాయాన్ని కావ్యంగా పరిగణించడం సమంజసంగా ఉంటుంది.

పాశ్చాత్య విమర్శకులు - కావ్య నిర్వచనాలు

- **శామ్యూల్ జాన్సన్:** కవిత్వమంటే ఛందోబద్ధమైన రచన అన్నారు. బుద్ధి భావనలతో ఆనంద సత్యాలను సమైక్యంగా సంఘటించే కళగా పేర్కొన్నారు.
- **వర్డ్స్‌వర్త్:** ప్రశాంత మానసిక స్థితిలో ఉద్రిక్తత నుంచి ఆవిర్భవించే తీవ్ర అనుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వమని చెప్పారు.
- **షెల్లీ:** సాధారణంగా భావానుగుణమైన వ్యక్తీకరణమే కవిత్వం అన్నారు.
- **హాజ్లిట్:** షెల్లీ అభిప్రాయాన్ని మరికొంత స్పష్టంగా వివరిస్తూ భావనాశక్తికి అనుకూలమైన శబ్ద సముదాయమే కవిత్వం అని చెప్పారు.
- **కార్లయిల్:** సంగీత లయాత్మక భావనే కవిత్వం అన్నారు.
- **మాథ్యూ ఆర్నాల్డ్:** 'సత్య నిబంధనలతో కూడిన జీవిత విమర్శనమే కవిత్వం' అన్నారు.
- **కోల్‌రిడ్జ్:** ఉత్తమ పదాలను సముచిత రీతిలో అమర్చడమే కవిత్వం అని చెప్పారు.
- **ఎడ్గార్ ఎలెన్ పో:** లయాత్మక సౌందర్య సృష్టి కవిత్వం అని చెప్పారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

పాశ్చాత్య విమర్శకుల్లో ఎడ్గార్ ఎలెన్ పో నిర్వచనాన్ని ఉత్తమమైందిగా విమర్శకులు పరిగణించారు.

కావ్య ప్రయోజనాలు

- ఆలంకారికుల్లో మమ్మటుడు, అభినవ గుప్తుడు, ఆనంద వర్ధనుడు, భామహుడు, జగన్నాథ పండిత రాయలు వంటివారు కావ్య ప్రయోజనాలను సవివరంగా చర్చించారు. పాశ్చాత్య విమర్శకులు లోవెల్, జాన్ డ్రైడెన్, స్కాలిజర్ వంటి వారు కావ్య ప్రయోజనాలను వివరించారు. వాటిని పరిశీలిద్దాం.
- **మమ్మటుడు:**
  1) యశస్సు, అర్థం లభిస్తుంది.
  2) వ్యవహార జ్ఞానం సిద్ధిస్తుంది.
  3) అమంగళ పరిహారం కలుగుతుంది.
  4) జీవన్ముక్తి ప్రదాయకాలైన ఆహ్లాద తన్మయత్వాలు కలుగుతాయి.
- **అభినవ గుప్తుడు:** కావ్యం కాంతా సమ్మితంగా ఉపదేశం చేస్తుంది.
- **భామహుడు:**
  1) సత్కావ్యం ధర్మార్థ కామమోక్షాదులైన చతుర్విధ పురుషార్థాలను కలిగిస్తుంది.
  2) లలిత కళా పరిజ్ఞానాన్ని అందిస్తుంది.
  3) సత్కీర్తిని, నిరంతర ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.
- **జగన్నాథ పండిత రాయలు:** సాహితీవ్రతుడైన కవికి ఎనలేని గౌరవం కలుగుతుందని చెప్పారు. సాహితీవ్రతుడు కానివాడు వ్యాసుడైనా, గౌతముడైనా, పతంజలైనా కానిమ్ము వానికి తిరస్కారం, పురస్కారం చూపక నా శిరస్సు ఉదాసీనతను ప్రకటిస్తుందన్నారు.
- **లోవెల్:** కావ్యంలో తత్వబోధ ఉండాలన్నారు. తత్వబోధ లేని కావ్యం తనకు పాథేయం కాదన్నారు.
- **జాన్ డ్రైడెన్:** కావ్యానికి ముఖ్య ప్రయోజనం ఆనందం అని, అనుషంగిక ప్రయోజనం ఉపదేశమని చెప్పారు.
- **స్కాలిజర్:** 'ఆనందకరమైన బోధనే' కావ్య ప్రయోజనం అన్నారు.

పాశ్చాత్య విమర్శకులు ఆనందం, ఉపదేశం, తాత్వికత, బోధనలను కావ్య ప్రయోజనాలుగా భావించారు.

కావ్య శైలి

- ఆలంకారికులు కావ్య శైలికి సంబంధించి గుణాలు, రీతులు, పాకాలను పేర్కొన్నారు. ప్రాచీన, ఆధునిక పద్య కావ్యాల శైలికి సంబంధించి ఇవి ప్రామాణికాలు. ఆధునిక సృజనాత్మక వచన ప్రక్రియలైన కథానిక, నవల, నాటకం వంటి వాటిలో శైలికి సంబంధించి కథన చాతుర్యం, పాత్రలు, సంభాషణలు వంటివి ప్రధానమైనవి. ఆంగ్లంలో 'స్టైల్' అనే పదానికి సమానార్థకంగా 'శైలి' పదాన్ని విమర్శకులు పరిగణిస్తున్నారు.
- ఆలంకారికుల్లో భామహుడు మూడు కావ్య గుణాలను పేర్కొన్నారు.

1) ప్రసాదం 2) ఓజస్సు 3) మాధుర్యం.

1. **ప్రసాదం:** ప్రసిద్ధ పదాల ప్రయోగంతో, సులువుగా అర్థాన్ని స్ఫురింపజేసే రచన ప్రసాద గుణం. **ఉదా:** మొల్ల, వేమన, కరుణశ్రీ వంటి వారి పద్య రచనలు ప్రసాద గుణభరితాలు.
2. **ఓజస్సు:** క్లిష్టమైన అక్షరాల కూర్పుతో, దీర్ఘ సమాస భూయిష్టమైన రచన ఓజో గుణం. **ఉదా:** శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు, భట్టుమూర్తి వంటి వారి పద్య రచనలు ఓజో గుణ ప్రధానాలు.
3. **మాధుర్య గుణం:** స్పష్టంగా అర్థమయ్యే విడివిడి పదాలతో కూడిన రచన మాధుర్య గుణం. తిక్కన, పోతన, కరుణశ్రీ వంటి వారి రచనలు మాధుర్య గుణభరితాలు.

- **రీతులు:** వామనుడు కావ్యాత్మగా రీతిని ప్రతిపాదించాడు. విశిష్ట పద రచనతో కూడిన కావ్యం రీతి ప్రధానం. రీతులు మూడు విధాలు. అవి..

1) వైదర్భీ రీతి 2) గౌఢీ రీతి
3) పాంచాలి రీతి

1. **వైదర్భీ రీతి:** సమాస రహితమైన, సరళమైన అక్షరాల కూర్పుతో కూడిన రచన వైదర్భీ రీతి. **ఉదా:** మొల్ల రామాయణం, వేమన పద్యాలు.
2. **గౌఢీ రీతి:** పరుషమైన అక్షరాల కూర్పుతో, మహా ప్రాణాక్షరాల బంధంగా, దీర్ఘ సమాస భూయిష్టమైన రచన గౌఢీ రీతి. కాశీఖండం, భీమ ఖండం, ఆముక్తమాల్యద, వసు చరిత్ర, పాండురంగ మహాత్మ్యం, శ్రీమద్రామాయణ కల్పవృక్షం వంటి కావ్యాలు ఈ రీతికి ఉదాహరణలు.
3. **పాంచాలి రీతి:** కొంత సరళంగా, కొంత కఠినంగా, పై రెండు రీతులు కలయికగా ఉండే రచన 'పాంచాలి రీతి'. తిక్కన భారతం, పోతన భాగవతం, శివ భారతం వంటి కావ్యాలు ఉదాహరణలు.

- **వృత్తులు:** ఆలంకారికులు మూడు వృత్తులను పేర్కొన్నారు. కావ్య శైలికి సంబంధించిన రచనా విధానాలు వృత్తులు.

1) కైశికీ వృత్తి 2) సాత్వతీ వృత్తి
3) ఆరభటీ వృత్తి

1. **కైశికీ వృత్తి:** సరళమైన విడి పదాలతో కూడిన రచనా శైలి కైశికీ వృత్తి. శృంగార రస శైలికి అనువైంది.
2. **సాత్వతీ వృత్తి:** మరీ క్లిష్టంగా, మరీ సరళంగా కాకుండా మధ్యస్థంగా ఉండే శైలీ విధానానికి సంబంధించింది.. సాత్వతీ వృత్తి. వీర రస ప్రధానమైన రచనలకు అనువైంది.
3. **ఆరభటీ వృత్తి:** ప్రౌఢమైన సమాస భూయిష్టమైన రచనా శైలికి సంబంధించింది.. ఆరభటీ వృత్తి. బీభత్స, భయానక రసాలకు అనువైంది.

- **పాకాలు:** రసోచిత శబ్దార్థాల సమ్మేళనాలే కావ్య శైలికి సంబంధించిన పాకాలు. కావ్య గుణాలు, కావ్య రీతులు, వృత్తులు కలిపి పాకాలుగా ఏర్పడతాయి. ఆలంకారికులు మూడు పాకాలను పేర్కొన్నారు.

1) ద్రాక్షాపాకం 2) కదళీపాకం
3) నారికేళపాకం

1. **ద్రాక్షాపాకం:** సులువుగా అర్థమయ్యే రచనా శైలి ద్రాక్షాపాకం. మాధుర్య గుణం + వైదర్భీ రీతి + కైశికీ వృత్తుల సమ్మేళనమే ద్రాక్షాపాకం. శృంగార రసానికి అనువైన శైలి ద్రాక్షాపాకం.

గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. విశ్వనాథుడి కావ్య నిర్వచనం?
   1) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   2) రమణీయార్థక ప్రతిపాదక శబ్దం కావ్యం
   3) శబ్దార్థౌ సహితౌ కావ్యం
   4) వాక్యం రసాత్మకం కావ్యం
2. వేద పురాణ కావ్యాలు వరుసగా?
   1) ప్రభు కాంతా మిత్ర సమ్మితాలు
   2) కాంతా ప్రభు మిత్ర సమ్మితాలు
   3) మిత్ర కాంతా ప్రభు సమ్మితాలు
   4) ప్రభు మిత్ర కాంతా సమ్మితాలు
3. జగన్నాథ పండితరాయల కావ్య నిర్వచనం?
   1) నను శబ్దార్దేః కావ్యం
   2) నిర్దోష లక్షణ వతీస కావ్య శబ్దభాక్
   3) ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం
   4) రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం

సమాధానాలు
1) 4; 2) 4; 3) 4.

మాదిరి ప్రశ్నలు

1. 'ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళీ కావ్యం' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విశ్వనాథుడు   2) దండి
   3) భోజుడు   4) భామహుడు
2. 'శబ్దార్థౌ సహితౌ కావ్యం' అని నిర్వచించిన ఆలంకారికుడు?
   1) అభినవ గుప్తుడు 2) దండి
   3) భామహుడు   4) భరతుడు
3. 'నిర్దోషం గుణ వత్కావ్య మలంకారై రలంకృతమ్' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) రుద్రటుడు   2) భోజుడు
   3) వామనుడు   4) మమ్మటుడు
4. 'అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతిః' అని చెప్పిన ఆలంకారికుడు?
   1) విద్యాధరుడు   2) భట్టతౌతుడు
   3) ఆనంద వర్ధనుడు 4) వామనుడు
5. శృంగార రసానికి అనువైన కవిత్వ పాకం?
   1) నారికేళ పాకం   2) కదళీ పాకం
   3) ద్రాక్షాపాకం   4) కైశికి పాకం

సమాధానాలు
1) 2; 2) 3; 3) 2; 4) 3; 5) 3.

వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

అర్థశాస్త్రం - పరిధి

- అర్థశాస్త్రం అనే పదం గ్రీకు భాషలోని 'OIKOS', 'NEMEIN' అనే రెండు పదాల నుంచి ఆవిర్భవించింది. OIKOS అంటే ఇల్లు, NEMEIN' అంటే నిర్వహణ. గృహ, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో నైపుణ్యమని అర్థం. అర్థశాస్త్ర పితామహుడు 'ఆడమ్‌స్మిత్' అర్థశాస్త్రాన్ని సంపదకు సంబంధించిన శాస్త్రంగా నిర్వచించారు. ఆయనకు ముందు అర్థశాస్త్రాన్ని రాజనీతి ఆర్థిక వ్యవస్థగా పిలిచేవారు. ఆడమ్ స్మిత్ రచించిన 'దేశాల సంపద, స్వభావం, కారణాల పరిశోధన' 1776లో ప్రచురితమైన తర్వాత అర్థశాస్త్రం ప్రత్యేక శాస్త్రంగా రూపొందింది. 'సామాజిక శాస్త్రాల్లో అర్థశాస్త్రం రాణి వంటిది' అని పాల్ శామ్యూల్‌సన్ పేర్కొన్నారు.
- మానవుడు, అతని శ్రేయస్సును గురించి అధ్యయనం చేసే శాస్త్రం.. అర్థశాస్త్రమని ఆల్‌ఫ్రెడ్ మార్షల్ నిర్వచించారు.
- అమర్త్యసేన్ – సంక్షేమ ఆర్థిక శాస్త్రం గురించి వివరించారు. ఆడమ్ స్మిత్‌తో సహా సంప్రదాయ ఆర్థికవేత్తలందరూ అర్థశాస్త్రం సంపదకు సంబంధించిన శాస్త్రమని అభిప్రాయపడ్డారు. అర్థశాస్త్రానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇచ్చిన మొదటి వ్యక్తి ఆడమ్‌స్మిత్. సంపద నిర్వచనాన్ని బలపర్చినవారు జె.బి.సే, జె.ఎస్.మిల్, వాకర్ మొదలైన ఆర్థికవేత్తలు. ఆడమ్ స్మిత్ సంపదకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వగా మార్షల్ శ్రేయస్సుకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారు. కార్లే, రస్కిల్‌లు సంపద నిర్వచనాన్ని విమర్శిస్తూ కేవలం సంపద అనే ఒకే విషయాన్ని గురించి చర్చించే శాస్త్రం శాస్త్రమే కాదని అది ఒక శూన్య శాస్త్రమని పేర్కొన్నారు. లయోనెల్ రాబిన్స్ 1932లో ప్రచురించిన ప్రఖ్యాత పుస్తకం 'యాన్ ఎస్సే ఆన్ ది నేచర్ అండ్ సిగ్నిఫికెన్స్ ఆఫ్ ఎకనామిక్ సైన్స్' లో వనరుల కొరతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.
- **పరిధి:** అర్థశాస్త్రం ముఖ్యంగా సంపదకు సంబంధించిన శాస్త్రం. మానవుడు కోర్కెలను సంతృప్తి పర్చుకోవడానికి ధనాన్ని ఏ విధంగా ఉపయోగిస్తాడో తెలియచేస్తుంది. మానవుల కోర్కెలు తీర్చే వస్తు సేవల ఉత్పత్తి ఎలా జరుగుతుంది? తయారైన వస్తువులు మార్కెట్ల ద్వారా వ్యక్తులకు ఎలా చేరతాయి? వాటి ధరలను ఎలా నిర్ణయిస్తారు వంటి విషయాలను అర్థశాస్త్రం తెలుపుతోంది. ఉద్యోగిత, ఆదాయ పంపిణీ, ధరల పెరుగుదల, వస్తుమార్పిడి మొదలైన అంశాల్లో వ్యక్తులు, ప్రభుత్వ ప్రవర్తనను అర్థశాస్త్రం వివరిస్తుంది. ఆధునిక కాలంలో అర్థశాస్త్ర ప్రాముఖ్యత పరిధి పెరిగింది.



ప్రాముఖ్యత, ఆవశ్యకత

- అర్థశాస్త్రం ఒక సామాజిక, మానవీయ శాస్త్రం. ఇది శాస్త్రరూపం దాల్చి 200 ఏళ్లే అయినప్పటికీ దీన్ని 'సామాజిక శాస్త్రాల రాణి'గా పరిగణిస్తున్నారు. ఈ శాస్త్రంలో విశేషమైన ప్రతిభ కనబర్చిన వారికి 1969 నుంచి అత్యున్నత పురస్కారమైన నోబెల్ బహుమతి ఇస్తున్నారు. మనదేశానికి చెందిన భారతరత్న అవార్డ్ గ్రహీత అమర్త్యసేన్‌కు 1998లో నోబెల్ బహుమతి లభించింది. ప్రస్తుత ప్రణాళికా యుగంలో ఆర్థికాభివృద్ధికి ఈ శాస్త్ర అధ్యయనం ఎంతో ఉపయోగకరం. భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి, వనరుల సమతౌల్య వినియోగానికి అర్థశాస్త్రం ఉపయోగపడుతుంది. దేశ ఆర్థిక వనరులు పరిమితంగా ఉంటాయి. కాబట్టి ఆర్థిక వనరులను వినియోగ వస్తువుల తయారీకి ఎక్కువగా ఖర్చు చేస్తే ఆర్థికాభివృద్ధికి అవసరమైన వస్తువుల తయారీకి కావాల్సిన వనరుల కొరత ఏర్పడుతుంది. అందువల్ల వనరుల వాడకంలో సమతూకాన్ని పాటించాల్సి ఉంది.
- వస్తువుకు ఉండే కోరికలను తీర్చగలిగే శక్తిని ఉపయోగ విలువ అంటారు. ఉదాహరణకు గాలి, నీరు, ఆహారం, వస్త్రం, ఇల్లు, కారు వీటన్నింటికీ ఉపయోగ విలువ ఉంటుంది.
- ఒక వస్తువు కొనుగోలు శక్తిని వినిమయ విలువ అంటారు. ఇది ఆ వస్తువు మారక విలువకు సంబంధించింది. అర్థశాస్త్రంలో మారక విలువ ఉన్న వస్తువులను అధిక వస్తువులు అంటారు. ఉత్పత్తి అయిన వస్తుసేవలు వాటి ఉత్పత్తికి కారణమైన కారకాల మధ్య ఎలా సరఫరా అవుతాయో పంపిణీ తెలుపుతుంది. భూమికి, శ్రమకు, మూలధనాలకు చెల్లించే ప్రతిఫలాలు వరుసగా భాటకం, వేతనం, వడ్డీ. వ్యవస్థాపనకు చెల్లించే ప్రతిఫలం లాభాలు.
- వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తులకు ఆదాయం వస్తుంది. ద్రవ్య రూపంలో వచ్చే ఆదాయాన్ని 'ద్రవ్య ఆదాయం' అంటారు. ద్రవ్య ఆదాయాన్ని అది కొనుగోలు చేయగల వస్తు సేవల రూపంలో చెప్పినట్లయితే దాన్ని 'నిజ ఆదాయం' అంటారు.
- ఆర్థిక వ్యవస్థలో అమలులో ఉన్న వేతనస్థాయి వద్ద పనిలో చేరడానికి ఇష్టపడిన వారందరికీ పని కలిగించగలిగే స్థితిని 'సంపూర్ణ ఉద్యోగిత' స్థితి అంటారు.
- నార్వేలోని ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రాగ్నర్ ఫ్రిష్ 1933లో మొదటిసారిగా సూక్ష్మ, స్థూల అర్థశాస్త్రాలు అనే భావనలను అభివృద్ధి చేశారు. అర్థ శాస్త్రంలో నోబెల్ బహుమతిని 1969 నుంచి ఇస్తున్నారు. మొదటి విజేత రాగ్నర్ ఫ్రిష్.
- సూక్ష్మ అర్థశాస్త్రం అనేది 'మైక్రాస్' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. మైక్రో అంటే చిన్న అని అర్థం. సూక్ష్మ అర్థశాస్త్రం వైయక్తిక ఆర్థిక యూనిట్లను అధ్యయనం చేస్తుంది. దీనికి ఎక్కువ ప్రాచుర్యం కల్పించిన వారు మార్షల్. ఆయన రచించిన గ్రంథం 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్'. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని ధరల సిద్ధాంతం అని కూడా అంటారు.
- స్థూల అర్థశాస్త్రం మాక్రోస్ అనే గ్రీకు పదం నుంచి ఆవిర్భవించింది. మాక్రో అంటే పెద్ద అని అర్థం. స్థూల అర్థశాస్త్రం మొత్తం ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తుంది. ఉదా: జాతీయాదాయం, మొత్తం వినియోగం, మొత్తం రాబడి, మొత్తం ఉద్యోగిత మొదలైన సమష్టి అంశాలను స్థూల అర్థశాస్త్రం వివరిస్తుంది. జె.ఎం. కీన్స్ స్థూల అర్థశాస్త్రానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని కల్పించారు. సూక్ష్మ అర్థశాస్త్రాన్ని మార్షల్, స్థూల అర్థశాస్త్రాన్ని కీన్స్ వివరించారు. ధరల సిద్ధాంతాన్ని సూక్ష్మ అర్థశాస్త్రం అని, ఆదాయ ఉద్యోగిత సిద్ధాంతాన్ని స్థూల అర్థశాస్త్రం అని పిలుస్తారు.
- ప్రజల కోరికలను సంతృప్తి పర్చగలిగే దృశ్యరూప పదార్థాలన్నింటినీ వస్తువులుగా పరిగణించొచ్చు. ప్రకృతి పరంగా అందరికీ అందేవాటిని ఉచిత వస్తువులని అంటారు. వీటి విషయంలో డిమాండ్ కంటే సప్లయ్ ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. వీటికి ఉపయోగితా విలువ ఉంటుంది. వినిమయ విలువ ఉండదు. **ఉదా:** సూర్యరశ్మి, నదిలో నీరు, గాలి. పెద్ద నగరాల్లో నీటిని ఉచిత వస్తువుగా చెప్పలేం.
- కొరతగా ఉన్న వస్తువులన్నీ ఆర్థిక వస్తువులే. డిమాండ్‌తో పోల్చి చూసినప్పుడు సప్లయ్ ఎప్పుడూ తక్కువగా ఉండి ధర చెల్లించాల్సిన వస్తువులను ఆర్థిక వస్తువులని అంటారు. పబ్లిక్, ప్రైవేట్ వస్తువులు అన్నీ ఆర్థిక వస్తువులే. ప్రజలు కోరే వస్తువులను ఉత్పత్తి చేసేందుకు వనరులను అత్యుత్తమ పద్ధతిలో వాడుకోవడాన్ని ఆర్థిక సామర్థ్యం అంటారు. ప్రస్తుతం ఉపయోగించుకోవడానికి ఉత్పత్తి చేసే వస్తువులను వినియోగ వస్తువులంటారు. ఇతర వస్తువుల ఉత్పత్తిలో ఉపయోగపడుతూ మానవుని కోర్కెలను పరోక్షంగా తీర్చగలిగే వస్తువులను ఉత్పాదక వస్తువులు లేదా మూలధన వస్తువులు అని అంటారు. **ఉదా:** యంత్రాలు, పరికరాలు. పూర్తిగా తయారు కాకుండా ఉత్పత్తి ప్రక్రియలో వివిధ దశల్లో ఉన్న వస్తువులను మాధ్యమిక వస్తువులు అంటారు.
- **ఉదా:** సిమెంట్, ఇటుకలు, ఉక్కు.
- అర్థశాస్త్రంలో ఆర్థిక వస్తువులన్నింటినీ సంపదగా పరిగణిస్తారు. ఒక వినియోగదారుడు లేదా సంస్థ కలిగి ఉన్న ఆదాయాన్ని ఆర్జించడానికి అవకాశం ఉన్న ఆస్తుల నిల్వ.. సంపద. ఆదాయానికి మూలం సంపద. సంపద ఒక విలువ. దీని ద్వారా ఆదాయం ప్రవాహం రూపంలో వస్తుంది. ప్రతి ఆర్థిక వ్యవస్థలో ఆదాయం కుటుంబాల నుంచి వ్యాపార సంస్థలకు, వ్యాపార సంస్థల నుంచి కుటుంబాలకు ప్రవహిస్తుంది. మానవుని కోరికలను సంతృప్తి పర్చగలిగే వస్తు, సేవల శక్తిని ప్రయోజనం అంటారు. ఒక వస్తువు ఆకారం, రంగు, పరిమాణం మొదలైనవి మార్చడం ద్వారా ఆ వస్తువుకు మానవుని కోరికను తీర్చగలిగే శక్తి పెరిగినట్లయితే దాన్ని రూప ప్రయోజనం అంటారు. **ఉదా:** చెక్కతో కుర్చీ లేదా టేబుల్ తయారు చేసినప్పుడు దాన్ని రూప ప్రయోజనం అంటారు. అదేవిధంగా స్థల, కాల, సేవల ప్రయోజనం కూడా ఉంటుంది.
- వ్యక్తులు తమ ప్రస్తుత కోరికలను తీర్చుకోవడానికి వస్తు సేవలను ఉపయోగించడాన్నే వినియోగం అంటారు. వస్తువులు ఉపయోగించే వ్యక్తిని వినియోగదారుడంటారు.
- అర్థశాస్త్రంలో ఉత్పత్తి అంటే ముడి పదార్థాలకు ప్రయోజనం చేకూర్చి అంతిమ వస్తువులుగా మార్చే ప్రక్రియ. వస్తువులను ఉత్పత్తి చేసేవారు ఉత్పత్తిదారులు.
- ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించే ప్రతి వ్యక్తి ఆర్థిక ప్రతినిధి. ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనే వారందరూ ఉత్పత్తిదారులే. సేవలను ఉత్పత్తి చేసే వర్తకుడు కూడా ఉత్పత్తిదారుడే. ప్రత్యక్ష వినియోగానికి తోడ్పడే ఉత్పత్తులను అంతిమ ఉత్పత్తులు అంటారు. వస్తువు లేదా సేవలను ఉపయోగించుకొనే ప్రతి వ్యక్తి వినియోగదారుడే. వస్తు ఉత్పత్తికి ఉపయోగపడే వస్తువులను ఉత్పాదక వస్తువులు అంటారు. చిల్లర వర్తకులు విక్రయించే ధరను చిల్లర ధర అంటారు.
- వ్యాపారానికి కావాల్సిన పెట్టుబడిని వాటాలుగా (షేర్స్)గా విభజించి వాటిని ఎంపిక చేసిన కొంతమందికి, ప్రజలకు అమ్మి ఆ ధనంతో వ్యాపార వ్యవస్థను నిర్వహించడాన్ని 'జాయింట్ స్టాక్ కంపెనీ' అంటారు. ఈ కంపెనీలను 'లిమిటెడ్' అనడానికి కారణం వాటాదారు బాధ్యత పెట్టిన పెట్టుబడి మేరకే పరిమితంగా ఉంటుందని అర్థం.
- ప్రతి ధరకు, డిమాండ్‌కు సంబంధాన్ని డిమాండ్ ఫలం అంటారు. అంటే 'డిమాండ్ పరిమాణానికి ఆధారం ధర. కాబట్టి ధర తగ్గినప్పుడు డిమాండ్ పెరుగుతుంది. ధర పెరిగినప్పుడు డిమాండ్ తగ్గుతుంది. ధరకు డిమాండ్‌కు మధ్య విలోమ సంబంధం ఉంటుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఏ నిర్వచనం వల్ల అర్థశాస్త్రానికి సార్వజనీనత లభిస్తుంది?
   1) కొరత 2) శ్రేయస్సు
   3) సంపద 4) అన్నీ
2. సూక్ష్మ అర్థశాస్త్రానికి మరొక పేరు?
   1) క్షీణోపాంత ప్రయోజన సూత్రం
   2) ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతం
   3) ధరల సిద్ధాంతం 4) ఏదీకాదు
3. 'Wealth of Nations' గ్రంథాన్ని ఎవ రు రాశారు?
   1) పిగూ 2) వాల్రస్
   3) మార్షల్ 4) ఆడం స్మిత్
4. 1970లో అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత?
   1) రాబిన్స్ 2) అమర్త్యసేన్
   3) మార్షల్ 4) పాల్ శామ్యూల్‌సన్
5. వనరుల కొరత వల్ల ఏర్పడే సమస్య?
   1) ఎంపిక 2) కొరత
   3) ఆర్థిక 4) శ్రేయస్సు
6. పూర్తిగా తయారుకాకుండా ఇంకా తయారీలో ఉన్న వస్తువులను ఏమంటారు?
   1) వినియోగ వస్తువులు
   2) మాధ్యమిక వస్తువులు
   3) ఆర్థిక వస్తువులు
   4) ఉచిత వస్తువులు
7. 'ఉద్యోగిత, వడ్డీ, ద్రవ్య సాధారణ సిద్ధాంతం' అనే పుస్తకాన్ని ఎవరు రాశారు?
   1) కె.ఇ. బోల్డింగ్ 2) రాగ్నర్ ఫ్రిష్
   3) జె.ఎం. కీన్స్ 4) స్టిగ్లర్
8. అర్థశాస్త్రంలో 'సూక్ష్మ అర్థశాస్త్రం', 'స్థూల అర్థశాస్త్రం' భావనలను 1933లో అభివృద్ధి చేసినవారు?
   1) కీన్స్ 2) ఆడమ్ స్మిత్
   3) రాగ్నర్ ఫ్రిష్ 4) రాబిన్స్
9. ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనామిక్స్ అనే గ్రంథాన్ని రచించింది?
   1) మార్షల్ 2) కీన్స్
   3) ఆడమ్ స్మిత్ 4) రాబిన్స్
10. చెక్కతో కుర్చీ తయారు చేసినప్పుడు దానికి ఏ ప్రయోజనం చేకూరుతుంది?
   1) రూప ప్రయోజనం
   2) స్థల ప్రయోజనం
   3) సేవల ప్రయోజనం
   4) కాల ప్రయోజనం
11. అర్థశాస్త్రాన్ని 'సామాజిక శాస్త్రాల్లో రాణి' వంటిదని చెప్పినవారు?
   1) జాకోబ్ వైనర్ 2) మార్షల్
   2) ఆడమ్ స్మిత్ 4) పాల్ శామ్యూల్ సన్
12. అర్థశాస్త్రానికి కొరత నిర్వచనాన్ని ఇచ్చిన ఆర్థికవేత్త?
   1) రాబిన్స్ 2) ఆడమ్ స్మిత్
   3) మార్షల్ 4) జాకోబ్ వైనర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 4;
5) 1; 6) 2; 7) 3; 8) 3;
9) 1; 10) 1; 11) 4; 12) 1;

Audit adopted by banking company is?

Model Questions

1. Which of the following is most important contributing factor affecting the profitability of banks?
a) Deteriorating productivity
b) Heavy establishment expenses
c) Huge "dead credit" in sick industries and the mounting NPAs
d) Heavy losses on investment port-folio
e) None of these

2. No license from RBI is required for:
a) Opening a new bank branch in India
b) Opening a new bank branch outside India
c) Shifting an existing branch outside the city , village or town
d) Shifting an existing branch within the same city, village or town
e) None of these

3. "Pure Banking Nothing Else" is a slogan raised by:
a) ICICI Bank
b) HDFC Bank
c) SBI
d) Axis Bank
e) None of these

4. How much bad loans was accumulated with the public sector banks by 31st March 2015, as disclosed by the Finance Ministry on 21st July 2015?
a) Rs.4.50 lakh crores
b) Rs.1.50 lakh crores
c) Rs.2.67 lakh crores
d) Rs.3.57 lakh crores
e) Rs.5.50 lakh crores

5. What are the RBI guidelines for the development of interest rate swaps (IRS):
a) Banks can use IRS for hedging and trading both
b) MIFOR is a benchmark for IRS
c) Under ISDA agreement Banks can opt for dual jurisdction i.e; Indian as well as common law
d) All of the above
e) None of these

6. Which bank has become the first to launch Watch Banking in India?
a) ICICI b) HDFC c) Axis
d) SBI e) None of these

7. Which of the following countries are top three largest shareholders in Asian Infrastructure Investment Bank (AIIB)?
a) China, India and Australia
b) China, Australia and Canada
c) China, India and Russia
d) China, Russia and India
e) None of these

8. Which of the following is NOT a banking related term?
a) SME finance
b) Overdraft
c) Drawing power
d) Term Loan
e) None of these

9. Which of the following agencies is associated with business of Insurance sector as a regulator?
a) NPCI b) IRDA c) SEBI
d) AMFI e) None of these

10. Which of the following is the major function of an ATM installed by banks:
a) To determine cash by way of withdrawl from one's account
b) To transfer money from one place to another place
c) To detect fake currency notes
d) To arrange currency notes in serial order and count them
e) None of these

11. Khandelwal Committee relates to study of _____ issues in public sector banks:
a) Capital Adequacy Ratio
b) Human Resources
c) Branch Expansion
d) Foreign Exchange
e) None of these

12. Which among the following country has least contribution in the capital of the New Development Bank (NDB)?
a) Brazil b) India
c) South Africa d) Russia
e) None of these

13. Liquidty ratio is fixed by Reserve Bank of India under the powers conferred on it by:
a) Reserve bank of India Act, 1934
b) Companies Act, 1956
c) Bank Regulation Act, 1949
d) Special Powers given by the Union Ministry of Finance
e) None of these

BANK EXAMS
BANKING AWARENESS

14. Which of the following is not a member of the World Bank Group:
a) International Bank for Reconstruction and Development
b) International Development Association
c) Bank of International Settlement
d) International Finance Corporation
e) None of these

15. The growth of commercial banks advances has proportionately been less than that in deposits. This is because:
a) The commercial banks follow a conservative credit policy
b) The reserve Bank of India always apply a restrictive credit policy
c) There has been a progressive increase in the statutory liquidity ratio which banks are required to maintain
d) The demand for bank credit has not increased correspondingly
e) None of these

16. Audit adopted by banking company is:
a) Regular Audit & Concurrent Audit
b) Periodical Audit
c) Internal Audit
d) Balance Sheet Audit
e) None of these

17. Financial literacy is a serious issue for RBI because:
a) It would enable better understanding of banking business
b) With better understanding more and more people can utilize the banking services
c) It would mean banks can do more business
d) It would mean the maximum number of people
e) None of these

18. The function of back office are:
a) It verifies and settles the deals
b) It maintains proper record if Book keeping
c) It submits financial returns of RBI
d) All of the above
e) None of these

19. "Brown projects" means:
a) Projects envisaged in metropolitan cities
b) Projects where capital infusion is of a very high order
c) Any project other than those for Agricultural activities
d) Projects aimed at modernization, diversification and expansion
e) None of these

20. The government of India has signed a USD 300 million loan pact to support the National Urban Health Mission (NUHM) with which of the following?
a) World Bank
b) Asian Development Bank
c) New Development Bank
d) All of the above
e) None of these

21. For a foreigner temporarily residing in India, type of account to be opened is:
a) Resident account
b) NRO Account
c) NRE Account
d) All of these
e) None of these

22. Medium-term loan will be granted:
a) To meet working capital deficit
b) For acquisition of fixed assets
c) To clear short-term debts
d) To pay public depositors
e) None of these

23. RBI is the apex Bank of India, similarly the apex Bank of USA is called:
a) Federal Reserve
b) The Central Bank of USA
c) Bank of America
d) All of these e) None of these

24. To commemorate the International Day of Yoga, the Reserve Bank of India (RBI) recently announced to issue coins of which denominations?
a) Rs. 2 b) Rs. 5 c) Rs. 10
d) Rs. 50 e) Rs. 25

25. What is the government equity in the proposed Rs. 20,000 crore National Investment and Infrastructure Fund (NIIF)?
a) 26% b) 49% c) 51%
d) 75% e) 85%

26. Exports in India get insurance cover and risk cover from which of the following organizations?
a) SIDBI
b) NABARD
c) ECGC
d) RBI
e) None of these

27. Which of the following banks have launched 'Dhanchayat', an educational film to raise awareness on the dangers of borrowing money from unorganised sources?
a) State bank of India
b) Bhartiya Mahila Bank
c) HDFC Bank
d) Axis Bank
e) None of these

28. Which of the following is NOT the name of multinational bank?
a) BNP Paribas
b) British bank of Middle East
c) Standard Charted Bank
d) Cathay Pacific
e) None of these

29. How much capital would be infused in Public Sector Banks by Union Government over a period of four years to improve capital ratio and fight with rising bad loans?
a) Rs. 1,00,000 crore
b) Rs. 1,75,000 crore
c) Rs. 70,000 crore
d) Rs. 54,000 crore
e) Rs. 10,000 crore

30. Which of the following cannot be called as a Debt Instrument as referred in financial transactions?
a) Certificate of Deposits
b) Bonds
c) Stocks
d) Commercial Papers
e) None of these

31. The bank which has launched 'PayZapp' app with a complete payment solution?
a) IDBI
b) HDFC
c) Laxmi vilas Bank
d) AXIS e) ICICI

Answers

1) c; 2) d; 3) c; 4) c; 5) d; 6) b; 7) a; 8) e; 9) c; 10) a; 11) b; 12) c; 13) c; 14) c; 15) c; 16) a; 17) b; 18) d; 19) d; 20) b; 21) b; 22) b; 23) a; 24) c; 25) b; 26) c; 27) c; 28) d; 29) c; 30) c; 31) b.